ఈనాడు

విజయవాడ 15-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 156
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి శుభాకాంక్షలు
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్
సోనోవిజన్ సంక్రాంతి సేల్
LG 195 Cm (77") OLED Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") 4K QLED Flexi EMI : 2990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart Flexi EMI : 2995/-
LG 164 Cm (65") LED 4K UHD Flexi EMI : 2999/-
Haier 139 Cm (55") LED 4K HD Smart Flexi EMI : 1994/-
TCL 139 Cm (55") Mini LED EMI : 3500/-
LLOYD 108 Cm (43") LED 4K UHD EMI : 2059/-
vivo 5G X - 300 Pro 8/0, 12/0,24/0 Schemes Available 10% Cash Back EMI : 4666/-
oppo F-31, F-31 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available EMI : 2500/-
iPhone 17, 17 Pro 4000/- Cash Back 12/0, 24/0 & 24/8 Schemes Available
Selected Bank Cards (Exchange Bonus 8000/-)
iPhone 16 EMI : 3454/- iPhone 16+ EMI : 3745/-
SAMSUNG S-25 Ultra Mobile 12000/- Cash Back 24/0 Scheme Available EMI : 4875/-
ONEPLUS 15 5G Ram Expandable Instant Cash Back ICICI Credit Card 12/4 Scheme Available EMI : 3750/-
realme 15 - 5G 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models EMI : 3700/-
mi Redmi 5G Note 15 Series 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Smart Watch Ear Buds Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola
hp 12/4 Scheme Available EMI : 4333/-
Lenovo 12/4 Scheme Available EMI : 4166/-
DELL 15/5 Scheme Available EMI : 4583/-
ASUS 12/4 Scheme Available EMI : 3960/-
MacBook 24/0 Scheme Available EMI : 4166/-
boAt JBL Sound Bar
LG 5 & 3Star Inverter A.C Starting EMI : 2709/-
LLOYD 5 & 3Star Inverter A.C Starting EMI : 2625/-
BLUE STAR 5 & 3Star Inverter A.C Starting EMI : 2792/-
VOLTAS 5 & 3Star Inverter A.C Starting EMI : 2584/-
DAIKIN 5 & 3Star Inverter A.C Starting EMI : 2750/-
Godrej 5 & 3Star Inverter A.C Starting EMI : 2417/-
HITACHI 5 & 3Star Inverter A.C Starting EMI : 2667/-
Haier 5 & 3Star Inverter A.C Starting EMI : 2625/-
LG FL W/M 12/7 Kg 100% Dryer EMI : 4709/-
LG FL W/M 9-Kg EMI : 2692/-
SAMSUNG FL W/M 12-Kg EMI : 2900/-
BOSCH FL W/M 7-Kg EMI : 2742/-
LG TL W/M 7-Kg EMI : 1435/-
Whirlpool TL W/M 7-Kg EMI : 1267/-
IFB TL W/M 7-Kg EMI : 1617/-
LG Semi W/M 7-Kg EMI : 884/-
LLOYD Semi W/M 7-Kg EMI : 850/-
LG RF SBS 635 Ltrs EMI : 4999/-
SAMSUNG RF SBS 650 Ltrs EMI : 5750/-
LG RF FF 466 Ltrs EMI : 2555/-
LG RF FF 272 Ltrs EMI : 1833/-
Godrej RF FF 270 Ltrs EMI : 1791/-
LG RF FF 246 Ltrs EMI : 1833/-
Haier RF FF 240 Ltrs EMI : 1899/-
Whirlpool RF FF 235 Ltrs EMI : 1800/-
LG RF DC 210 Ltrs EMI : 1708/-
VOLTAS beko RF DC 175 Ltrs EMI : 1250/-
LLOYD RF DC 188 Ltrs EMI : 1160/-
Water Dispenser Starting Price Rs: 9500/-
Water Purifier RO Starting Price Rs:13000/-
Water Geyser 10 Litres Starting Price Rs: 6700/-
Microwave Oven Starting Price Rs: 7500/-
KITCHEN SMALL APPLIANCES
Air Chimney Starting Price Rs: 8100/-
3 Burner Glass Cooktop Starting Price Rs: 5000/-
Wet Grinder Starting Price Rs: 3100/-
Rice Cooker Starting Price Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Starting Price Rs: 2900/-
Juicer Air Fryer Kettle Iron Box Blender
T & C Apply
BAJAJ BUILT FOR LIFE Preethi Prestige HAVELLS morphy richards KENT Mineral RO Water Purifiers EUREKA FORBES FABER pureit Livpure V-GUARD Sunflame Crompton AO Smith Butterfly Vidiem
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్-1, ద్వారకా నగర్, వైజాగ్. - 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
3వ కొత్త షోరూం : ద్వారకానగర్, పోలక్స్‌స్కూల్ ఎదురు, డైమండ్‌పార్క్ వైజాగ్ - 8712635857, 858, 859.
దువ్వాడ స్టేషన్ రోడ్, కుర్మన్నపాలెం. 8712416261, 62, 63.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్. రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
ఇన్నస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రాజమండ్రి - 4. కోటిపల్లి బస్టాండ్ వి.టి.కాలేజ్ రోడ్ - 9246666212.
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాముల జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21
ఒంగోలు, బాపూజి మార్కెట్, 9246666329, 9154279911
పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్. భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంబికాదేవి టెంపుల్, సత్రంపాడు. ఏలూరు - 8712635838, 839
పైడిపర్రు రోడ్. తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం, గొల్లగూడెం సెంటర్, 8712635854, 55, 56
అమలాపురం, కె.యన్.ఎఫ్. రోడ్, 8712416257, 58, 59.
విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9154281239
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం, రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్. - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
దుర్గా ప్లాజా, యం.జి.రోడ్, పటమట, విజయవాడ. 8712417841, 42, 43.
రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
పాయకాపురం, విజయవాడ. 8712648704, 05, 06.
గుడివాడ, ఏలూరు రోడ్. 9100991708, 9154281178, 79
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు - 1, విజయవాడ. 9100991703, 9154281626
ఎనికేపాడు - 2, ఏలూరు రోడ్, విజయవాడ. 8712416250, 51, 52.
గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు, 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్. గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం. మెయిన్ రోడ్. గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
బాపట్ల మెయిన్ రోడ్, బాపట్ల. 9246666207.
నరసరావుపేట
రైల్వేస్టేషన్ రోడ్, అరండల్‌పేట. 8712648710, 11, 12.
రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43,
అమ్మా హాస్పిటల్ సెంటర్. సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
అంబేద్కర్ నగర్ స్ట్రీట్, ఆదోని. 8712416853, 54, 55.
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
సూర్యాపేట, కుడకుడ రోడ్. 8712648761, 62, 63
నల్గొండ, ప్రకాశం బజార్. 8712648715, 16, 17.
వరంగల్
అదాలత్ సర్కిల్, హనుమకొండ. 8712648718, 19, 20.
కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్. 8712648707, 708, 709
ప్యారడైస్ కాలని, షాద్‌నగర్. 8712648701, 02, 03.
మహబూబ్‌నగర్, మెట్టుగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, 8712635851, 52, 53
నిజామాబాద్, వినాయక్ నగర్. 8712648766, 67, 68.
మిర్యాలగూడ, ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర - 8712635848



ఈనాడు

విజయవాడ 15-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 156

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru







అభివృద్ధి కోసమే పీపీపీ

- 20% వరకు వీజీఎఫ్ ప్రకటించిన కేంద్రం
- వేగంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.1.15 లక్షల కోట్ల విలువైన 270 ప్రాజెక్టులు ప్రతిపాదన
- కేంద్ర పైప్‌లైన్‌లో నమోదైన ప్రాజెక్టుల్లో 30% మనవే
- దరిదాపుల్లో లేని మిగతా రాష్ట్రాలు



ఈనాడు - అమరావతి

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం (పీపీపీ).. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ పఠిస్తున్న తారకమంత్రం! కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా దీనికి అగ్రతాంబూలం ఇస్తోంది. భారత్‌ను 2047కు అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) మార్చాలంటే దేశంలో భారీ ఎత్తున మౌలిక వసతుల కల్పనకు పీపీపీ విధానం తప్ప మరో మార్గం లేదని భావిస్తోంది. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం దగ్గర తగినన్ని ఆర్థిక వనరుల్లేనప్పుడు ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టడం తప్పనిసరి అవసరంగా మారింది. విమానాశ్రయాలు, ఓడరేవులు, జాతీయ రహదారులు వంటి రూ. లక్షల కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టుల్ని కేంద్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో చేపట్టడమే కాకుండా, రాష్ట్రాలు కూడా ఆ బాటలో నడిచేలా ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పీపీపీ ప్రాజెక్టులకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద 20 శాతం వరకు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించింది. రాష్ట్ర విభజన మిగిల్చిన సమస్యలు, ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని మౌలిక వసతుల సమస్య వేధిస్తోంది. ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమే. దెబ్బతిన్న రహదారుల పునర్నిర్మాణానికే నిధుల కోసం వెతుక్కుంటున్న పరిస్థితుల్లో పోర్టులు, విమానాశ్రయాల వంటి భారీ మౌలిక వసతుల్ని అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలపడం పీపీపీ విధానంతోనే సాధ్యం. కేంద్రం కూడా దీన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. కేంద్ర పథకాలు, నిధులు రాబట్టడంలో ముందుండే ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ విధానం నుంచీ రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనాలు సాధించేందుకు వేగంగా అడుగులు వేశారు. దీంతో 2026-27 నుంచి 2028-29 వరకు మూడేళ్ల కాలానికి కేంద్ర ఆర్థికశాఖ రూపొందించిన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో 30 శాతం ప్రాజెక్టులతో (మిగతా 2లో)

కేంద్ర ఆర్థిక శాఖ పీపీపీ పైప్‌లైన్‌లో అత్యధిక ప్రాజెక్టులు నమోదు చేసిన రాష్ట్రాలు

స్థానం	రాష్ట్రం	ప్రాజెక్టుల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
1.	ఆంధ్రప్రదేశ్	270	1,15,578.81
2.	తమిళనాడు	70	87,639.00
3.	మధ్యప్రదేశ్	21	65,496.00
4.	రాజస్థాన్	12	22,741.00
5.	జమ్మూ కశ్మీర్	57	21,374.00
10.	తెలంగాణ	18	7,792.90

పీపీపీతో పేదల చెంతకు వైద్యం

- సేవల డిమాండ్, లభ్యత మధ్య అంతరాన్ని తగ్గించొచ్చు
- కేంద్రం స్పష్టీకరణ.. రాష్ట్రానికి మరో లేఖ

ఈనాడు, అమరావతి: ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. పీపీపీపై పలు సూచనలు చేస్తూ కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్‌కు సోమవారం 27 పేజీల లేఖ రాశారు. వైద్య విద్యను విస్తరించడానికి పీపీపీ అత్యంత అనుకూల సాధనమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఇటీవలే రాష్ట్రానికి లేఖ రాశారు. దానికి అనుబంధంగానే ఈ లేఖ రాస్తున్నట్లు నెహ్రా తన లేఖలో ప్రస్తావించారు. వైద్య సేవల (మిగతా 2లో)

24 గంటల్లో ఇరాన్‌పై సైనిక చర్య?

- అమెరికా దాడులకు దిగొచ్చని కథనాలు
- పశ్చిమాసియాలో పలు సైనిక స్థావరాల నుంచి ఆ దేశ సిబ్బంది వెనక్కి..
- సర్వ సన్నద్ధంగా ఇరాన్ సైన్యం
- అరెస్టయిన ఆందోళనకారులను కఠినంగా శిక్షించేందుకు టెహ్రాన్ సన్నాహాలు
- 2,571కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇరాన్‌ను వీడాలని భారతీయులకు విదేశీ వ్యవహారాల శాఖ సూచన

2లో





వేడుకలో ఆవుకు ఆహారం పెడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై

ఈ పండగ అన్నదాతలది

- తెలుగు ప్రజలకు ప్రధాని సంక్రాంతి సందేశం
- దిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకల్లో పాల్గొన్న మోదీ

2లో

ప్రతి కుటుంబానికీ రూ.40వేల ఆదాయమే లక్ష్యం

- నారావారిపల్లె క్లస్టర్‌లో దీన్ని సాధించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సందడి



భోగి సందర్భంగా నారావారిపల్లెలో గంగిరెద్దుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి

5లో



75 దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ నిలిపివేత

- అమెరికా కీలక నిర్ణయం
- జాబితాలో పాక్, రష్యా, బంగ్లాదేశ్, నేపాల్, బ్రెజిల్, ఇరాన్

లోపలి పేజీల్లో



'కట్టలు' తెంచిన కోళ్లు

- తొలిరోజే రూ.కోట్లలో పందేలు
- ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో యథేచ్ఛగా నిర్వహణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి కోడిపందేల్లో ఆస్ట్రేలియన్ల సందడి

ఉదయానికే ఉద్యోగుల ఖాతాల్లో సొమ్ములు

- 6 సంవత్సరాల తర్వాత 60 నెలల బకాయిలు
- లక్షల మంది ఉద్యోగుల ఇళ్లలో సంక్రాంతి సంబరాలు
- పోలీసులకూ సరెండర్ లీవు మొత్తాలు



ఈనాడు - అమరావతి

ఈ సంక్రాంతి రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల ఇళ్లలో కొత్త కాంతి తీసుకొచ్చింది. భోగి పండగ నాడు.. ఉదయం తెల్లారేసరికి లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, పింఛనుదారుల ఖాతాల్లోకి వేల రూపాయలు వచ్చి చేరాయి. ఎప్పుడో జగన్ హయాంలో ఇవ్వాల్సిన కరవు భత్యం బకాయిలు ఆరేళ్లుగా పెండింగులో ఉన్నాయి. అలాంటి 60 నెలల బకాయిలను ఒకేసారి ఎన్డీయే ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించింది. ఒక్కో ఉద్యోగి ఖాతాలో రూ. 30వేల నుంచి రూ. 60వేల వరకు జమ య్యాయి. తెలుగు లోగిళ్లలో ఎంతో ముఖ్యమైన సంక్రాంతి పండగ సమయానికి ఈ డబ్బులు రావడంతో అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ 'ఈనాడు'తో మాట్లాడుతూ 2018, 2019 సంవత్సరాల కరవుభత్యం బకాయిలను ప్రభుత్వం చెల్లించడంతో హర్షం వ్యక్తం చేశారు. 'రెగ్యులర్ ఉద్యోగులకు ఈ కరవుభత్యం బకాయిలు జీపీఎఫ్ ఖాతాలకు జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులు, పింఛనుదారులకు నగదు రూపంలో వారి ఖాతాలకు జమచేశారు. ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులతో ఈ సొమ్ములు చెల్లించేందుకు అంగీకరించారు. సంక్రాంతి సందర్భంగా దాదాపు రూ1,100 కోట్లు భోగి పండగ రోజే జమయ్యాయి. మంగళవారం కూడా ఆర్థిక శాఖ కార్యదర్శులు వినయ్‌చంద్, అల్లాడ గౌతమ్‌లతోపాటు ఆర్థిక మంత్రితోనూ మాట్లాడాం. సంక్రాంతికి ఇస్తే ఉద్యోగులకు ఆనందంగా ఉంటుందన్న మా విన్నపానికి ఎన్డీయే ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 2018 కరవుభత్యం 30 నెలల బకాయిలు, 2019 కరవుభత్యం 30 నెలల బకాయిలు వచ్చాయి' అని వివరించారు.

అప్పటి మూల వేతనంపై...

'కొందరు ఉద్యోగులు కరవు భత్యం బకాయిలను ప్రస్తుత మూలవేతనంపై లెక్కించుకుంటున్నారు. కానీ 2018, 2019 (మిగతా 2లో)

ఈ పండగ అన్నదాతలది



కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ నివాసంలో పొంగల్ తయారీ ముందు పూజ చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఎల్.మురుగన్

ఈనాడు, దిల్లీ: ఈ పండగ అన్నదాతలది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణిస్తూ. . తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. "మంగళకరమైన సంక్రాంతి శుభవేళ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. సూర్యుడి గమనంలో వచ్చే మార్పు కొత్త వెలుగులకు ఎలా నాంది పలుకుతుందో అలాగే ఈ సంక్రాంతి మీ జీవితాల్లో సరికొత్త ఆశయాలను, ఉన్నతమైన లక్ష్యాలను సాధించే బలమివ్వాలని కోరుకుంటున్నా. ఈ పండగ దేశవ్యాప్తంగా వివిధ పేర్లు, రకరకాల సంప్రదాయాలతో జరుపుకొంటున్నా.. మనందరినీ కలిపి ఉంచే ఆత్మీయత, ఆనందం మాత్రం ఒక్కటే. భారతీయ సంస్కృతిలోని గొప్పతనం, ఏకత్వ స్ఫూర్తిని ఈ సంబరాలు చాటిచెబుతాయి. ముఖ్యంగా ఈ పండగ మన అన్నదాతలది. రైతు సోదరులకు కృతజ్ఞతలు తెలుపుకొనే పవిత్ర సమయమిది. మకర సంక్రాంతి మీ జీవితంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాలని, మీ భవిష్యత్తు ఎల్లప్పుడూ సానుకూలతతో, ప్రకాశవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా. మీ ప్రతి ప్రయత్నం విజయవంతమై సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని మనసారా కోరుకుంటున్నా" అని తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా ఇచ్చిన పండగ సందేశంలో ప్రధాని పేర్కొన్నారు.



వేడుకలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని ఆత్మీయంగా పలకరిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కిషన్‌రెడ్డి

జాతి నిర్మాణంలో రైతులది ప్రధాన పాత్ర

జాతి నిర్మాణంలో రైతులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా దిల్లీలోని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ నివాసంలో పొంగల్ ఉత్సవంలో ప్రసంగించారు. "ఈ దేశ రైతులు జాతి నిర్మాణంలో బలమైన పాత్ర పోషిస్తున్నారు. వారి కష్టం వల్ల ఆత్మనిర్భర్ భారత్ ఉద్యమానికి కొండంత బలం లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వమూ రైతులను శక్తిమంతంగా మార్చడానికి కంకణబద్ధమై పనిచేస్తోంది. ప్రకృతిపై మన కృతజ్ఞతాభావం మాటలకే పరిమితం కాకుండా జీవనశైలిలో భాగంగా మార్చుకోవాలని సంక్రాంతి మనకు చెబుతోంది. భవిష్యత్తు తరాల కోసం మట్టిని ఆరోగ్యంగా ఉంచాలి. నీళ్లను కాపాడాలి. వనరులను సమతౌల్యంగా ఉపయోగించాలి. అమ్మ పేరుతో ఒక చెట్టు, అమృత్ సరోవర్ లాంటి కార్యక్రమాలు ఇదే భావనను ముందుకు తీసుకెళ్తున్నాయి. రాబోయే రోజుల్లో సుస్థిర, సహజ వ్యవసాయం, అగ్రిటెక్, వాల్యూ ఎడిషన్ ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ రంగాల్లో మన యువత కొత్త ఆలోచనలతో ముందుకెళ్తోంది. మన పళ్లెం, జేబు నిండటంతోపాటు, మన నేల తల్లి సురక్షితంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మనదే" అని ప్రధాని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, కె.రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, అర్జున్ రామ్ మేఘ్‌వాల్, వి.సోమన్నతోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అర్వింద్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ ఆర్.మహాదేవన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్, సినీనటులు శివకార్తికేయన్, మీనా తదితరులు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ ప్రత్యేక సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ గోమాతకు ఆహారం అందించారు. తమిళ సంప్రదాయ వంటకం పొంగల్ తయారీలో పాల్గొన్నారు.

ఉదయానికే ఉద్యోగుల ఖాతాల్లో సొమ్ములు

(మొదటి పేజీ తరువాయి)

కరవు భత్యం కాబట్టి అప్పటి మూలవేతనంపై లెక్కించి సొమ్ములు చెల్లించింది' అని పింఛనుదారుల చర్చావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య 'ఈనాడు'కు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.వేణుమాధవరావు కూడా ప్రభుత్వ స్పందనకు సంతోషం వ్యక్తం చేశారు. క్రమేణా పెండింగ్ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 2.25 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు, 2.70 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరింది.

పోలీసు ఉద్యోగులకు సరెండర్ లీవు సొమ్ములు

రాష్ట్రంలో దాదాపు 55వేల మంది పోలీసు ఉద్యోగులకూ సరెండర్ లీవు బకాయిల సొమ్ము బుధవారమే వారి ఖాతాలకు చేరింది. ఈ సందర్భంగా ఏపీ పోలీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. 'ఈ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మాట్లాడాము. అప్పుడే ఈ బకాయిలు విడుదల చేస్తామని చెప్పారు. హామీ ఇచ్చినట్లే నిధులు విడుదల చేశారు' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుత్తేదారులకూ కాస్త ఊరట

కొందరు గుత్తేదారులకు నాబార్డు, విదేశీ ఆర్థిక సాయం కింద చేపట్టిన పనులు, ఇతర పనులకు రూ.1,243 కోట్ల బకాయిలు చెల్లించారు. మొత్తం గుత్తేదారుల్లో 10% మందికి ప్రయోజనం కలిగిందని ఆ సంఘ ప్రతినిధులు తెలియజేశారు. ఈ చెల్లింపుల వల్ల ప్రభుత్వానికి రీయింబర్స్‌మెంట్ రూపంలోను, నాలుగోవిడతగా రావాల్సిన నిధులూ తిరిగి రాబట్టుకుని మరిన్ని అభివృద్ధి పనులు చేసే ఆస్కారమూ కలగనుంది.

24 గంటల్లో ఇరాన్‌పై సైనిక చర్య?



టెహ్రాన్‌లో చెలరేగిన నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన పౌరుల అంతిమ యాత్రలో పాల్గొన్న స్థానికులు

దుబాయ్, వాషింగ్టన్: దాదాపు రెండు వారాలుగా హింసాత్మక నిరసనలతో అట్టుడుకుతున్న ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం దాదాపు అనివార్యంగా కనిపిస్తోంది! ఆ దేశంపై వచ్చే 24 గంటల్లోనే సైనిక చర్యకు ఉపక్రమించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించినట్లు తెలుస్తోందని 'రాయిటర్స్' సహా పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. దాడుల తీవ్రత ఎంతవరకు ఉండొచ్చన్నదానిపై మాత్రం స్పష్టత రావడం లేదని తెలిపాయి. ఇరాన్‌కు దగ్గరలో ఖతార్‌లో ఉన్న తమ కీలక అల్-ఉదెయిద్ వైమానిక స్థావరంతో పాటు పశ్చిమాసియా వ్యాప్తంగా పలు సైనిక స్థావరాల నుంచి కొంత మంది సిబ్బందిని అమెరికా ఇప్పటికే ఖాళీ చేయిస్తోంది. అమెరికా, దాని ప్రాంతీయ మిత్రపక్షాలు అల్-ఉదెయిద్ వైమానిక స్థావరంలో తాజాగా గగనతల రక్షణ కార్యకలాపాల సెల్‌ను ప్రారంభించాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో ఖతార్‌లోని ఓ మిలిటరీ స్థావరం నుంచి బ్రిటన్ కూడా సిబ్బందిని ఉపసంహరించుకుంటోంది. ఈ నేపథ్యంలో దాడుల్ని ఎదుర్కొనడానికి ఇరాన్ సైన్యం పూర్తిగా సమాయత్తమయింది. మరోవైపు- ఇరాన్‌లో ఆందోళనల సందర్భంగా మృతిచెందినవారి సంఖ్య 2,571కు పెరిగింది. ఏ క్షణంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయోనని దేశవ్యాప్తంగా చాలాచోట్ల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

నిరసనకారులపై మానవత్వం చూపండి: ట్రంప్

నిరసనకారులపై ఇరాన్ ఉక్కుపాదం మోపుతుండటం పట్ల ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారి విషయంలో మానవత్వంతో వ్యవహరించాలని టెహ్రాన్‌కు తాజాగా సూచించారు. లేకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదన్నట్లు హెచ్చరించారు. ఇరాన్ విషయంలో భవిష్యత్ ప్రణాళికలపై అమెరికా జాతీయ భద్రతా బృందంతో ఆయన మంగళవారం విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపారు. ఆందోళనల్లో మృతిచెందినవారి సంఖ్య ఎక్కువగా ఉందని.. అందుకు తగ్గట్టే టెహ్రాన్‌పై తమ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఆలస్యం చేయొద్దు: ఘొలామ్‌హుసేన్

అయితే ట్రంప్ హెచ్చరికను బేఖాతరు చేస్తూ.. అరెస్టయిన ఆందోళనకారులపై విచారణను త్వరితగతిన పూర్తిచేసి, కఠినంగా శిక్షించేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. నిరసనకారులకు సంబంధించి ఏ చర్యలు తీసుకోవాలన్నా వెంటనే తీసుకోవాలని.. ఆలస్యమైతే తీవ్రత తగ్గిపోయి, పెద్ద ప్రభావం ఉండదని ఇరాన్ జ్యుడీషియరీ చీఫ్ ఘొలామ్‌హుసేన్ మొహెసనీ-ఎజీ బుధవారం అభిప్రాయపడ్డారు. ఆందోళనకారులకు మరణశిక్ష విధించాలని టెహ్రాన్ భావిస్తున్న సంగతి గమనార్హం. ఇప్పటివరకూ 97 మంది నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల విషయంలో తమ తప్పును అంగీకరించి, పశ్చాత్తాపం వ్యక్తం చేశారని ఇరాన్ ప్రభుత్వరంగ మీడియా తెలిపింది.

సామూహిక అంత్యక్రియలు

ఇరాన్‌వ్యాప్తంగా ఆందోళనల్లో మృతిచెందినవారి సంఖ్య 2,571కి పెరిగినట్లు అమెరికాకు చెందిన మానవహక్కుల ఉద్యమకారుల వార్తాసంస్థ తాజాగా వెల్లడించింది. ఇందులో 2,403 మంది నిరసనకారులని.. 147 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వ సంబంధిత ఇతర వ్యక్తులని పేర్కొంది. నిరసనల్లో పాల్గొనని 9 మంది పౌరులు, 12 మంది చిన్నారులు కూడా ఆందోళనల్లో మృతిచెందారని తెలిపింది. మొత్తంగా 18,100 మందిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. మరోవైపు- ఆందోళనల సందర్భంగా మృతిచెందిన భద్రతాసిబ్బందిలో దాదాపు 100 మందికి ఇరాన్ బుధవారం సామూహిక అంత్యక్రియలు నిర్వహించింది. వేలమంది ఇరాన్ పతాకాలు, ఆ దేశ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ ఫొటోలను చేతబూని వచ్చి మృతులకు నివాళులు అర్పించారు.

★ ఆందోళనలతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉచితంగా ఇంటర్నెట్ సేవలు అందిస్తోంది. ఆందోళనలను నిలువరించేందుకు అంతర్జాలంపై టెహ్రాన్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో- ఉపగ్రహాల సాయంతో అంతర్జాల సేవలు అందించే స్టార్‌లింక్ ద్వారానే ఇరాన్ పౌరులు బాహ్య ప్రపంచంతో అనుసంధానం అవుతున్నారు.

ఇరాన్‌కు వెళ్లొద్దు: భారత్

నిరసనలతో ఇరాన్‌లో పరిస్థితులు క్షీణించడంతో పాటు ఆ దేశంపై అమెరికా సైనిక చర్యలకు దిగే అవకాశాలు ఉండటంతో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులంతా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచించింది. విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు.. ఇలా అందరికీ ఈ సూచన వర్తిస్తుందని పేర్కొంది. భారతీయులెవరూ ఇరాన్‌కు వెళ్లొద్దని కూడా విదేశీ వ్యవహారాల శాఖ గట్టిగా సూచించింది. ఇరాన్‌లో ప్రస్తుతం 10 వేలమందికిపైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా.

మారిటైం రంగంలో రూ.15,601 కోట్ల పెట్టుబడులు

- ఆసక్తి చూపుతున్న హిందుస్థాన్ షిప్‌యార్డ్, జేఎం బాక్సీ, యునైటెడ్ పెట్రో తదితర సంస్థలు
- మచిలీపట్నంలో రూ.1,500 కోట్లతో నౌకా నిర్మాణం, మరమ్మతుల సదుపాయం
- ముందుకు వచ్చిన గోవా షిప్‌యార్డు లిమిటెడ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తీర ప్రాంతం వెంట నౌకా నిర్మాణ ప్రాజెక్టులు రానున్నాయి. మారిటైం రంగంలో రూ.15,601 కోట్ల పెట్టుబడులలో ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు దిగ్గజ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నం పోర్టు పరిధిలో నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్రానికి ఉన్న 1,054 కి.మీల తీర ప్రాంతం ఆధారంగా మారిటైం రంగంలో భారీగా పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు ఈ రంగంలోని వివిధ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఎంఓయూలు కుదుర్చుకుంటోంది.

దుగరాజపట్నంలో..

■ హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ దుగరాజపట్నం/మూలపేటలో షిప్ బిల్డింగ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఇందుకు రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. దీని కోసం ఫీజిబిలిటీ స్టడీని ఇప్పటికే చేపట్టింది.

■ ఇక్కడ జెఎం బాక్సీ రూ.3,000 కోట్లతో నౌకా నిర్మాణం, మారిటైం ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ఇందుకు దుగరాజపట్నంలో రెండు దశల్లో ప్రాజెక్టు ఏర్పాటుకు 500 ఎకరాలు కేటాయించాలని ఆ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ప్రాజెక్టు ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు సంస్థ ప్రతినిధుల బృందం ఈ నెలలో పరిశీలనకు రానుంది.

మచిలీపట్నంలో..

■ గోవా షిప్‌యార్డు లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో మచిలీపట్నం పోర్టు పరిధిలో నౌక నిర్మాణం, మరమ్మతుల సదుపాయాలు కల్పించేందుకు ముందుకువచ్చి ప్రతిపాదనలు సమర్పించింది. సంస్థ అభ్యర్థన మేరకు ఇక్కడ 200 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ సంస్థకు నామినేషన్ పద్ధతిలో ప్రాజెక్టును కేటాయించాలా? ఆర్‌ఎఫ్‌పీ ద్వారా అనుమతించాలా అన్న విషయంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది.

■ యునైటెడ్ పెట్రో గ్రూప్ రూ.7,600 కోట్లతో షిప్ బిల్డింగ్, మరమ్మతుల కేంద్రాన్ని మచిలీపట్నంలో ఏర్పాటు చేసేందుకు ఆర్‌ఎఫ్‌పీ దాఖలు చేసింది. ప్రాజెక్టు అమలుకు 1,185 ఎకరాలు కేటాయించాలని కోరింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

మూలపేటలో..

■ సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీకాకుళంలోని మూలపేట పోర్టులో రెండు దశల్లో నావల్ షిప్ బిల్డింగ్, మరమ్మతుల కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించింది. రూ.501 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. మొదటి దశ ప్రాజెక్టుకు 50 ఎకరాలు, రెండో దశకు 150 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించింది. మత్స్యశాఖ భూములను ఏపీ మారిటైం బోర్డుకు బదిలీ చేయాలని ఆదేశించింది.

అత్యుత్తమ విధానాలతో క్లస్టర్ల అభివృద్ధి

రాష్ట్రంలో షిప్ బిల్డింగ్, మరమ్మతుల కేంద్రాల ఏర్పాటుకుఅనుసరించాల్సిన విధానాలపై ప్రపంచవ్యాప్తంగా వివిధ పోర్టుల్లో అమలులో ఉన్న విధానాలను రాష్ట్ర అధికారులు పరిశీలించారు. అక్కడి అత్యుత్తమ విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు ప్రణాళికను సిద్ధంచేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది.

■ నౌకల మరమ్మతు సదుపాయాలు, విడిభాగాల తయారీ, సరఫరాదారులు, వాటిని పరీక్షించే సదుపాయాలు ఒకేచోట ఉండేలా క్లస్టర్లను అభివృద్ధి చేస్తారు. నౌకా నిర్మాణంలో వచ్చే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం. పోర్టుల ఆటోమేషన్‌పై శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు మరమ్మతుల వంటి అంశాలకు ప్రాధాన్యత.

శంషాబాద్ రన్‌వేపై మొరాయించిన దిల్లీ విమానం

శంషాబాద్, న్యూస్‌టుడే: రన్‌వే మీదకు వెళ్లిన ఓ విమానం ఇంజిన్ మొరాయించిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం చోటుచేసుకుంది. ఆకాశ ఎయిర్‌లైన్స్ విమానం 173 మంది ప్రయాణికులను ఎక్కించుకుని దిల్లీకి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరింది. రన్‌వే మీదకు వెళ్లిన వెంటనే ఇంజిన్‌లో సాంకేతిక లోపాన్ని గమనించిన పైలట్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వెనక్కి వచ్చిన ఆ విమానాన్ని నిపుణులు పరిశీలించి సమస్య సరిచేయడంతో రాత్రి 8 గంటలకు బయలుదేరింది.

★ గోవా నుంచి 211 మంది ప్రయాణికులతో ఇండిగో విమాన సర్వీస్ హైదరాబాద్‌కు బయలుదేరింది. శంషాబాద్‌లో ల్యాండ్ అవుతుండగా ఆ విమానం పక్షిని ఢీకొన్నట్లు పైలట్ గమనించి ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందించారు. విమానం ల్యాండ్ అవగానే ఎయిర్‌సైడ్ బృందం తనిఖీలు చేసింది. రన్‌వే మీద పక్షి ఆనవాళ్లు దొరకలేదు.

★ అబుధాబి నుంచి 182 మంది ప్రయాణికులతో టేకాఫ్ తీసుకున్న ఇండిగో విమాన సర్వీస్ ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్‌కు విశాఖ ఏటీసీ అధికారులు అనుమతించలేదు. అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని దారి మళ్లించి ఉదయం 9.50 గంటలకు శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

మేడారం జాతర లాంఛన పూజలు ప్రారంభం



సమ్మక్కకి పూజలు చేస్తున్న పూజారులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర గుడిమెలిగే తొలి పూజలతో బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. పూజారులు కుటుంబ సమేతంగా అమ్మవార్ల పూజా మందిరాలకు డోలు వాయిద్యాలతో తరలివచ్చారు. ఆడపడుచులు అమ్మవారి శక్తిపీఠం ప్రదేశంలో, గుడి ప్రాంగణంలోని ప్రకృతి దేవతల ప్రదేశాలను ఎర్రమట్టితో అలికి ముగ్గులు వేశారు. వడ్డెలు అడవికి వెళ్లి గుట్టగడ్డిని తీసుకువచ్చి పూజా మందిరంపై పరిచారు. తర్వాత పూజారులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల వద్దకు వెళ్లి సమ్మక్క, సారలమ్మలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు.

పీపీపీతో పేదల చెంతకు వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్, వాటి లభ్యత మధ్య అంతరాన్ని పూరించేందుకు పీపీపీ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. లేఖలో చేసిన సూచనలివీ..

క్యాన్సర్ డేకేర్ సెంటర్ల ఏర్పాటు

■ క్యాన్సర్ స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ కోసం డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు పీపీపీ అనువైన విధానం. 2027-28లోగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నదే కేంద్రం లక్ష్యం. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు 14 సెంటర్లు మంజూరు చేశాం. క్యాన్సర్ వ్యాధి అత్యంత వేగంగా విస్తరిస్తున్నందున సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలి. పెట్ సీటీ, స్పెక్ట్ ఇమేజింగ్, రేడియో థెరపీ సేవల్ని గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

■ క్యాన్సర్‌తోపాటు కార్డియో వాస్కులర్, నరాల వ్యాధులకు అవసరమైన న్యూక్లియర్ మెడిసిన్ సేవల లభ్యత మధ్య, చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో తక్కువగా ఉంది. ■ 60 నుంచి 90 శాతం మంది దంత సమస్యలతో బాధపడుతున్నా అవసరాల మేరకు వైద్య సేవలు లభించడం లేదు. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్య సేవలు పటిష్ఠంగా లేవు. ■ న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్యశాలలు, దంత వైద్యశాలలు, రేడియాలజీ సేవలు, క్యాన్సర్ డే కేర్ సెంటర్లను విస్తరించడానికి, వ్యాధి నిర్ధారణలో ఉపకరించే ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్ఐ యంత్రాల లభ్యతను విస్తృతపరచడానికి పీపీపీ విధానాన్ని అవలంబించాలి.

చెల్లింపులపైనా మార్గదర్శకాలు

ఎక్విప్- ఆపరేట్- మెయింటైన్ (ఈఓఎం), ఆపరేట్ అండ్ మెయింటైన్ (ఓఅండ్ఎం) పద్ధతిలో పీపీపీ విధానంలో న్యూక్లియర్ మెడిసిన్ సేవల లభ్యతను పెంచాలని కేంద్రం సూచించింది. ఈ విధానంలో ప్రైవేట్ భాగస్వామికి చెల్లింపులపైనా లేఖలో మార్గదర్శకాలు జారీ చేసింది. కాంట్రాక్టును ఈఓఎంలో అయితే 7-10 ఏళ్లకు ఇవ్వాలి. ఓఅండ్ఎంలో మొదట ఐదేళ్లకు ఇవ్వాలి, తర్వాత మరో ఐదేళ్లకు పొడిగించవచ్చు. వారు అందించే సేవలకు ప్రతి నెలా ఒక స్థిరమైన గ్రాంట్ ఇవ్వడం లేదా ప్రతి స్కాన్‌వారీగా లేదా రెవెన్యూ షేరింగ్ విధానంలో చెల్లించవచ్చని సూచించింది.

అభివృద్ధి కోసమే పీపీపీ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ మొదటిస్థానంలో నిలిచింది. దేశంలోని పెద్ద రాష్ట్రాలు కూడా ప్రాజెక్టుల సంఖ్య, విలువ పరంగా ఏపీకి దరిదాపుల్లో లేవు. రెండో స్థానంలో నిలిచిన తమిళనాడు 70 ప్రాజెక్టులే నమోదు చేసింది. పశ్చిమబెంగాల్ కేవలం ఒక్క ప్రాజెక్టునే చేర్చింది.

కేంద్ర స్ఫూర్తిని వేగంగా అందిపుచ్చుకుని..

వీజీఎఫ్ కింద సాయం అవసరమని భావిస్తున్న ప్రాజెక్టుల్ని పైప్‌లైన్‌లో నమోదు చేయాలన్న కేంద్ర సూచనపై ఏపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. గడువులోగా 270 ప్రాజెక్టుల్ని నమోదు చేసింది. మరికొన్ని ప్రాజెక్టుల్ని కూడా గుర్తించామని.. వాటిని కూడా త్వరలో నమోదు చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఎక్కువ ప్రాజెక్టుల్ని కేంద్ర పైప్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

ముందస్తు కసరత్తుతోనే సాధ్యమైంది!

■ రాష్ట్రం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలంటే విమానాశ్రయాలు, పోర్టులు, రోడ్లు, పారిశ్రామిక మౌలిక వసతులు భారీ ఎత్తున అభివృద్ధి చేయాలని, పీపీపీ విధానంలోనే అది సాధ్యమని కూటమి ప్రభుత్వం ఎప్పుడో గుర్తించింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆ దిశగా విస్తృత కసరత్తు చేస్తోంది. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా వీజీఎఫ్ ప్రకటించింది. గత బడ్జెట్‌లోనే రూ.2,000 కోట్లు కేటాయించింది.

■ పీపీపీ ప్రాజెక్టుల కోసం ఆర్థిక శాఖలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసింది. కేంద్ర ఆర్థిక శాఖకు ప్రాజెక్టుల ప్రతిపాదనలు సమర్పించడం, పీపీపీలో చేపట్టదగ్గ మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రభుత్వ శాఖలకు సలహాలు, సూచనలు చేయడం, ఐఐపీడీఎఫ్, వీజీఎఫ్ గ్రాంట్ తెచ్చుకోవడంలో మార్గదర్శనం వంటి బాధ్యతల్ని ఈ సెల్ నిర్వహిస్తోంది.

■ కేంద్రం తరహాలోనే రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా పీపీపీ ప్రాజెక్టు పైప్‌లైన్ సిద్ధం చేసింది.

■ పీపీపీ పాలసీ, వీజీఎఫ్ పథకం ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ ప్రాజెక్టుల అనుమతికి ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేసింది. ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించింది.

రూ.25 లక్షల నుంచి రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల వరకు..

ఏలూరులో రూ.25 లక్షలతో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు నుంచి రూ.1000 కోట్లతో అమరావతిలో విమానాశ్రయం నిర్మాణం వరకు పీపీపీ విధానంలో కేంద్రం నుంచి ఆర్థికసాయం వస్తుందని భావిస్తున్న ఏ ప్రాజెక్టునూ వదలకుండా కేంద్ర ఆర్థికశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. విమానాశ్రయాలు, పోర్టులు, పీపీపీ విధానంలో నిర్మిస్తున్న పలు ఆసుపత్రులతో పాటు, వివిధ జిల్లాల్లో రహదారుల పునర్నిర్మాణం, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వంటి అనేక ప్రాజెక్టుల్ని ఈ పైప్‌లైన్‌లో చేర్చింది. కోనసీమ, కాకినాడ, రుషికొండ, లంబసింగి, అరకుల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల వంటి పర్యాటక ప్రాజెక్టులు, కాంప్లెక్స్‌ల నిర్మాణం, పారిశ్రామిక వాడల అభివృద్ధి వంటి అనేక ప్రాజెక్టులనూ నమోదు చేసింది.

ప్రత్యామ్నాయం కాదు.. తప్పనిసరి అవసరం

■ మౌలిక వసతుల అభివృద్ధికి గతంలో పీపీపీ విధానాన్ని ఒక ప్రత్యామ్నాయంగా భావించేవారు. ఇప్పుడది తప్పనిసరి అవసరంగా మారింది.

■ 2025-26 బడ్జెట్ నుంచి కేంద్ర ప్రభుత్వం పీపీపీ ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశంలో 2030 నాటికి మౌలిక వసతుల ప్రాజెక్టులపై 4.5 నుంచి 5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని అంచనా. ప్రభుత్వ బడ్జెట్ నుంచే ఇన్ని నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టులు చేపట్టడం అసాధ్యం.

■ కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.11-12 లక్షల కోట్ల మూలధన వ్యయం చేస్తున్నా ఏ మూలకూ చాలడం లేదు.

■ పీపీపీ విధానంలో ప్రైవేటు పెట్టుబడిదారులు ప్రాజెక్టు నమూనాను బట్టి 50-70 శాతం వరకు పెట్టుబడి పెడతారు. దాంతో ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి తగ్గుతుంది. ఏ మాత్రం రాజీ లేకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన సాధ్యపడుతుంది.

■ ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఆధునిక టెక్నాలజీ, సాధనసంపత్తిని ఉపయోగించి, ప్రాజెక్టుల్ని వేగంగా, నాణ్యంగా పూర్తిచేయడం సాధ్యమవుతుంది. గడువు ముగిసే వరకు వాటి నిర్వహణ కూడా ప్రైవేటు సంస్థలే చూసుకుంటాయి.

■ భారీగా ఉపాధి కల్పన, సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ప్రాంతీయ అనుసంధానం ఏర్పడుతుంది. లాజిస్టిక్స్ వంటి సదుపాయాలు మెరుగుపడతాయి. ఆర్థికాభివృద్ధీ వేగవంతమవుతుంది.

కేంద్ర పీపీపీ పైప్‌లైన్‌లో రాష్ట్రం నమోదు చేసిన కీలక ప్రాజెక్టులు

ప్రాజెక్టు	ప్రతిపాదిత వ్యయం (రూ.కోట్లలో)
మూలపేట పోర్టు	2,949.70
రామాయపట్నం పోర్టు	2,634
తాడేపల్లిగూడెం, ఒంగోలు, తుని, నాగార్జునసాగర్ ఎయిర్‌పోర్టులు/ఎయిర్‌స్ట్రిప్‌లు	2,600
అప్పర్ సీలేరు రిజర్వాయర్ సెగ్మెంట్‌కు తాగునీటి సరఫరా ప్రాజెక్టు	1,406.23
కుప్పం విమానాశ్రయం	1,142
అమరావతి విమానాశ్రయం	1,000
డొంకరాయి నీటి సరఫరా పథకం	984.19
అమరావతిలో ప్రపంచస్థాయి క్రీడా నగరం	850
తిరుపతిలో ప్రపంచస్థాయి క్రీడానగరం	500
తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ అభివృద్ధి	495
దొనకొండ మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం డీశాలినేషన్ ప్లాంట్	300
ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఏరియాలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్క్	187.50
విజయవాడ ఆటోనగర్ బస్టాండ్ అభివృద్ధి	154

కేంద్ర ప్రాజెక్టులకు ఇవి అదనం

కేంద్ర ఆర్థిక శాఖ పీపీపీ పైప్‌లైన్‌లో మొత్తం రూ.17 లక్షల కోట్ల విలువైన 852 ప్రాజెక్టులు నమోదు చేసింది. వాటిలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రాజెక్టులు 620 (వీటిలో ఏపీవే 270). వాటి విలువ రూ.3,84,799 కోట్లు మాత్రమే. మిగతావన్నీ వివిధ రాష్ట్రాల్లో ఆయా కేంద్ర ప్రభుత్వ శాఖలు అమలు చేసే ప్రాజెక్టులు.

ఏపీ ప్రభుత్వ పైప్‌లైన్‌లో ప్రాజెక్టులు 296

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 296 ప్రాజెక్టుల్ని పీపీపీ విధానంలో చేపట్టేందుకు ఎంపిక చేసింది. వాటి ప్రతిపాదిత వ్యయం రూ.1,22,053.71 కోట్లు. రాష్ట్ర ఆర్థికశాఖ పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో నమోదు చేసిన వాటి వివరాలు విభాగాల వారీగా..

విభాగం	ప్రాజెక్టుల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
మౌలిక వసతులు, పెట్టుబడులు	18	29,583.5
పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధి	62	67,117.57
పురపాలక, పట్టణాభివృద్ధి	34	3,859
యువజన వ్యవహారాలు, క్రీడలు	74	9,154.66
పరిశ్రమలు	23	4,190.2
రవాణా, రోడ్లు భవనాలు	60	6,724.78
వైద్య, ఆరోగ్యశాఖ	15	1,424
మొత్తం	296	1,22,053.71

గ్రహం అనుగ్రహం
15-1-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
ద్వాదశి: రా. 8-13 తదుపరి త్రయోదశి
జ్యేష్ఠ: తె. 6-13 తదుపరి మూల
వర్జ్యం: ఉ. 9-50 నుంచి 11-37 వరకు
అమృత ఘడియలు: రా. 8-28 నుంచి 10-14 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-18 నుంచి 11-03 వరకు తిరిగి మ. 2-44 నుంచి 3-28 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.41
సంక్రాంతి పండగ, ఉత్తరాయణం ప్రారంభం

గ్రహం అనుగ్రహం
16-1-2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
త్రయోదశి: రా. 10-15 తదుపరి చతుర్దశి
మూల: పూర్తి
వర్జ్యం: మ. 3-02 నుంచి 4-48 వరకు
అమృత ఘడియలు: రా. 1-36 నుంచి 3-22 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-51 నుంచి 9-35 వరకు తిరిగి మ. 12-32 నుంచి 1-16 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.39; సూర్యాస్తమయం: సా.5.42
కనుమ పండగ

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	14.0	28.0
శ్రీకాకుళం	17.0	29.0
విశాఖపట్నం	17.4	28.2
తాడేపల్లిగూడెం	19.0	32.0
రాజమహేంద్రవరం	19.0	34.0
విజయవాడ	19.2	30.5
కడప	20.0	32.0
కర్నూలు	20.3	33.6
నరసాపురం	20.6	32.0
గుంటూరు	21.0	31.0
అనంతపురం	21.3	34.0
ఒంగోలు	22.3	30.6

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సులపై రవాణాశాఖ చర్యలు తీసుకుంది. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 50 బస్సుల్లో ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినట్లు గుర్తించి రూ.4.61 లక్షల మేర జరిమానా విధించింది.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొలిక్కి!

- మంత్రిమండలి ముందుకు త్వరలో నివేదిక

ఈనాడు, అమరావతి: గత ఎన్నికల్లో సమయంలో బీసీలకు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీనిచ్చారు. అధికారంలోకి రాగానే ఆ హామీ అమలుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై బీసీ సంక్షేమశాఖ అధికారులు, మంత్రులు విస్తృతంగా చర్చించి నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలు ప్రక్రియను కొలిక్కి తెచ్చారు. ఇప్పటివరకు నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు మించరాదంటూ వైకాపా ప్రభుత్వ హయాంలో జీవోను తీసుకొచ్చారు. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు మించరాదని సుప్రీంకోర్టు పేర్కొనగా దాన్ని నామినేటెడ్ పోస్టులకు కూడా వైకాపా ప్రభుత్వం వర్తింపజేసి బీసీలకు అన్యాయం చేసింది. దీనిపై బీసీ సంక్షేమశాఖ అధికారులు న్యాయనిపుణుల నుంచి సలహా తీసుకున్న తరవాత నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన దస్త్రాన్ని సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. దీనికి న్యాయశాఖ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అడ్వొకేట్ జనరల్ సలహా కూడా తీసుకుంది. ప్రస్తుతం సంబంధిత దస్త్రం తిరిగి ప్రభుత్వానికి చేరింది. దీన్ని త్వరలో మంత్రివర్గం ముందు పెట్టనున్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కమిషన్?

స్థానిక సంస్థల్లో 34% బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు అక్కడి ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని ఇప్పటికే రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ అధికారులు పరిశీలించారు. రిజర్వేషన్ల శాతంపై సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చిస్తున్నారు. కులగణన చేపట్టకపోతే బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కష్టమనే అభిప్రాయం అధికార వర్గాల్లో ఉంది. అందువల్ల తెలంగాణ తరహాలో కమిషన్ వేయాలని ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది.

ఇద్దరి ప్రాణాలు తీసిన 'మాంజా'

- సంగారెడ్డిలో వలస కూలీ మృతి
- కర్ణాటకలో మరో వ్యక్తి దుర్మరణం

సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణం, బీదర్, న్యూస్‌టుడే: వరినాట్ల కోసం వచ్చిన వలస కూలీని.. హాస్టల్ నుంచి బిడ్డను ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని చైనా మాంజా బలి తీసుకుంది. ఈ ఘటనలు తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా, బీదర్‌లలో జరిగాయి. సంగారెడ్డి గ్రామీణ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అవదేశ్ కుమార్(38), మరో 10 మంది వరినాట్లు వేసేందుకు బుధవారం ఫసల్‌వాదికి వచ్చారు. అదే గ్రామానికి చెందిన దశరథ్ పొలంలో నాట్లు వేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. అవదేశ్ కుమార్ చికెన్ తీసుకు రావడానికి ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి పట్టణానికి వెళ్లారు. చికెన్ తీసుకొని తిరిగి ఫసల్‌వాదికి వస్తుండగా.. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద చైనా మాంజా మెడకు చుట్టుకొని గొంతు కోసుకుపోయింది. తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

ద్విచక్రవాహనదారుడి మృతి

సంక్రాంతి పండుగకు హాస్టల్‌లో ఉన్న కుమార్తెను ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడి మెడకు చైనా మాంజా చుట్టుకోవడంతో ఆయన కిందపడి మృతి చెందిన విషాద ఘటన కర్ణాటకలో చోటుచేసుకొంది. బీదర్‌లోని బొంబళగి గ్రామానికి చెందిన సంజీవకుమార(48) లారీ క్లీనర్. బుధవారం ఉదయం 65వ నంబరు జాతీయ రహదారిలో వెళ్తుండగా. . నిర్ణా చౌరస్తా వద్ద అటుగా ఎగిరివచ్చిన చైనా మాంజా ఆయన మెడకు చుట్టుకుంది. ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి సంజీవకుమార కిందపడి మరణించారు.

'చెక్క' చెదరని కళాకృతి



సుమారు 150 ఏళ్ల కిందట అప్పటి బర్మా దేశం నుంచి టేకు కర్రలను తెప్పించి, అందంగా చెక్కించి తీర్చిదిద్దిన ఇల్లు ఇది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం దొరిగల్లులో ఉన్న ఈ ఇల్లు.. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. అందుకే ఈ గ్రామం మీదుగా వెళ్లే వారు ఎంతో ఆసక్తిగా తిలకిస్తుంటారు.

– ఈనాడు అనంతపురం; న్యూస్‌టుడే, ముదిగుబ్బ

16న శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి పార్వేట ఉత్సవం ఈనెల 16న కనుమ రోజు వైభవంగా జరగనుంది. అదే రోజున గోదా పరిణయోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5.30 నుంచి 6.30 గంటల మధ్య ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్దజీయర్ మఠం నుంచి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మలయప్ప, శ్రీకృష్ణ స్వామివార్లు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఆస్థానం, పార్వేట పూర్తయ్యాక స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.

అంటు వ్యాధుల గుర్తింపునకు 'ఐహెచ్‌ఐపీ'

ఈనాడు, అమరావతి: అంటు వ్యాధుల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ కింద ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం(ఐహెచ్‌ఐపీ) తీసుకొచ్చినట్టు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. https://ihip.mohfw.gov.in/cbs/#/?campaign-id=202511 లింక్‌లో అన్ని జిల్లాల ప్రజలు తమ ప్రాంతాల్లో ప్రబలుతున్న వ్యాధుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆ సమాచారం క్షేత్రస్థాయిలో ఉండే ఏఎన్ఎం నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు అందరికీ చేరుతుందని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు.

తెలంగాణలో 600కు పైగా వీధి శునకాల హతం

మాచారెడ్డి, న్యూస్‌టుడే: తెలంగాణలోని కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలకేంద్రంతో పాటు ఫరిద్‌పేట, వాడి, బండరామేశ్వర్‌పల్లి, భవానీపేట గ్రామాల్లో వీధి కుక్కలను హతమార్చి పూడ్చిపెట్టిన ఘటనలు కలకలం రేపాయి. ఈ ఘటనలపై జంతు హక్కుల కార్యకర్తలు ఇటీవల మాచారెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 600కు పైగా కుక్కలకు విష గుళికలు, ఇంజక్షన్లు ఇచ్చి హతమార్చారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన ఎస్సై అనిల్ మంగళ, బుధవారాల్లో శునకాలను పాతిపెట్టిన ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు చేపట్టి కొన్ని కళేబరాలను వెలికితీసి వాటికి పోస్టుమార్టం చేయించారు. పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగానే వీధి కుక్కలను చంపినట్లు ఆరోపణలు రావడంతో ఆ ఐదు గ్రామాల సర్పంచులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

ఈనాడు

...ఆ వెలుగుల పేరు సంక్రాంతి

చిరుచిరుగాలులకు వరిచేలు ఒయ్యారంగా ఊగుతుంటే 'అచ్చొచ్చేటి వెన్నెలలో పచ్చందాలు నవ్వగనే గుచ్చెత్తేటి' ముచ్చటైన ఆకుపచ్చని కులుకు సిరిని ఆస్వాదించడం- ఓ తీయని అనుభూతి. అంతలోనే కంకులలో పాలు చేరి, గింజ ముదిరి, వెన్ను బరువై 'మోయలేని ఈ హాయిని మోయనీ' అంటూ ఒరిగిపోయే నిండుగర్భిణి లాంటి బంగరు రంగుల సస్యలక్ష్మిని తిలకించడం ఓ లోకోత్తర అనుభవం. 'హేమంతవేళ నూతన సీమంతపు వధువువోలె సింగారముగా భూమిపయి కుల్కు సస్యశ్యామల' అన్నారామెను- ఏటుకూరి వేంకట నర్సయ్య. తమ ఆరుగాలం శ్రమకు- కలిమి ఫలమై పంటకళ్లాలలో దిగుబడి కళకళ్లాడుతుంటే- భూమాతకు కృతజ్ఞతగా రైతన్నల కళ్లల్లో మెరిసే అపురూపమైన తడి వెలుగులను తిలకించడం ఓ రసార్ద్ర గుండె సవ్వడి. ఆ ధాన్యరాశులనే 'కనక గర్భమునందలి అనురాగ సంపత్తి' అన్నారు కవులు. 'బంతిపూవుల కాంతి గంతులిడగ... ధాన్యరాశుల బంగారుదారులందు కదలి వచ్చెను చూడు సంక్రాంతి లక్ష్మి!' అంటూ వర్ణించారు. సజీవమైన, సహజ సుందరమైన ఆ సౌందర్య ఆస్వాదన కోసమే పట్టణాలు ఆత్రంగా పల్లెల దిశగా పరుగులు తీస్తాయి.

సంక్రాంతి- పంటలపండుగ(భోగి), పెద్దల పండుగ(సంక్రాంతి), పశువుల పండుగ(కనుమ) అనడం సర్వసామాన్యం. 'ముచ్చెన్నెల పండుగ' అనడం కవి సమయం. హేమంతాల చలిచలి పొద్దుల్లో 'మంచు బిందువు ముత్యమై మహి తనర్చు' తెల్లని తెలుపు మొదటిది. తమ పుట్టింటి వారింతవారు అంతవారని ఊరించగా, సరేనంటూ తొలిపండక్కి వేంచేసిన పెనిమిటికి- తాము అనుకున్నదానికన్నా ఎక్కువగా ఆదరణ దక్కడంతో సంతోషపడతారు ఆడపడుచులు. భర్తల ఆనందం స్పర్శలో తెలిసిపోతుంది వారికి. దాంతో, సిగ్గుల మొగ్గలై, వారి బుగ్గలు ఎరుపెక్కుతాయి. దారిద్ర్య ప్రతీకలైన విరిగిన పాత వస్తువులు, చీపుర్లు, ఎండుకొమ్మల్ని.. దహించే ఎర్రెర్రని అగ్ని కీలల భోగి మంటలు సరేసరి! కళ్లాల్లోని ధాన్యరాశుల పసిడి మిసమిసలది 'కొసరి నూరిన పచ్చి పసుపు' రంగు. పసుపు, ఎరుపు రంగుల మిశ్రమాన్ని 'మాంజిష్ఠవర్ణం' అంటారు. ఎంకి నాయుడు బావల ప్రణయానురాగాన్ని 'మాంజిష్ఠరాగం' అన్నారు సినారె. శుభ కార్యాలన్నింటా వాడే పసుపు కుంకుమలది అదే రంగు. వాటిది మంగళకరమైన సమ్మేళనం. మన గుండెల్లోకి క్రాంతిని ప్రసరింపచేస్తూ, భారతీయ సంస్కృతిని జ్యోతిర్మయం చేస్తున్న మకర సంక్రమణానిది అచ్చమైన అత్యంత శుభప్రదమైన మాంజిష్ఠవర్ణం.

ధాన్యాన్ని గాదెల్లోకి ఎత్తిపోసేముందే పనలతోసహా వడ్లకంకుల్ని కిరీటాల ఆకారంలో గుచ్చి గుమ్మంముందు కుచ్చులుగా వేలాడదీస్తారు రైతులు. దానికోసం మందలు మందలుగా చేరి పిచుకలు, పిట్టలు నానా హంగామా చేస్తూ ఇంటింటినీ చిలుకలువాలిన చెట్లలా మార్చేస్తాయి. ఇంటికి పండుగ వాతావరణాన్ని తెచ్చే ముచ్చటైన సందడి అది. నిశ్శబ్దంగా ఉసూరుమంటూ ఉంటే- పండగేకాదు. పిట్టలు, పిల్లలు అల్లరి చేస్తేనే అది పండుగ. అవీ చాలవంటున్నారు బేతవోలుకవి... గుమ్మంముందు ముద్దుగుమ్మలు ముగ్గులు వేస్తుంటారా... గడపలకు పసుపులు పూస్తుంటారా... మరి ఆ సమయంలో మొహంమీదపడే సిగపాయను పైకి ఎగదోస్తుంటారు కదా... కీల్జెడ అంచుల్లోని జడగంటలను వెనక్కి విసిరేందుకు తలలెగరేస్తారు కదా... అలా చేతులను, 'శిరంబును ఎగుర్చువేళ మ్రోవెడు మణి భూషణ ధ్వనులు' ఉన్నాయే- అవే 'పిల్పులు క్రాంతిలక్ష్మికిన్' అన్నారాయన. ఇన్ని హంగామాలతో హుందాగా, సపరివారసమేతంగా తరలివస్తుంది సంక్రాంతి. అందుకే శ్రీనాథుడు దాన్ని పెద్దపండుగ అన్నాడు. తెనుగులెంక తుమ్మల మాటల్లో సంక్రాంతి 'కదలి వస్తుంది- భాగ్యాలకడలివోలె'. దాని అసలైన ఉనికి బోసిపోయే నగరవీధుల్లోకాదు- వాసికెక్కిన గ్రామసీమల్లో!



భాషలన్నిటిలోకీ మధురమైందీ,
అందరికీ అర్థమయ్యేదీ... చిరునవ్వు. దాన్ని ఎంత ఎక్కువగా వినియోగిస్తే లోకం అంత ప్రశాంతంగా ఉంటుంది.

– విష్ణు సఖారామ్ ఖాండేకర్
జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత

కొత్తదనానికి స్వాగతం

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే పుణ్యకాలం ఎన్నో ప్రత్యేకతలతో మహాపర్వంగా వెలుగొందుతోంది. వ్యవసాయపరంగా, ధార్మిక- ఆధ్యాత్మిక విశేషంగా సంక్రాంతిని దేశ వ్యాప్తంగా జరుపుకొంటారు.

ఈ రోజు నుంచి ఉత్తరాయణ ఆరంభం. స్నానం, దానం, అర్చన, జపం - వంటి ధార్మిక సాధనలకు పుణ్యసమయమిది. ఇవాళ చేసే దానాదులు అక్షయ ఫలాన్ని ప్రసాదిస్తాయని ధర్మశాస్త్రవచనం. సూర్యుణ్ని భగవంతుడిగా, సర్వ దేవతాత్మకునిగా సంభావించే వైదిక విజ్ఞానాన్ని అనుసరించి ప్రతి సంక్రమణం ఎన్నో దివ్యకర్మలకు ముఖ్యకాలం. అందుకే దానికి ముందు వెనక రోజులను కలుపుకొని వైభవంగా వేడుకలు నిర్వహించుకుంటాం.

దేశమంతటా ఈ పండుగ జరుపుకొనే తీరును పరిశీలిస్తే స్పష్టంగా కనిపించే అంశం- కొత్తదనాన్ని స్వాగతించడం. చలిమంటలతో వెచ్చదనాన్ని పొందుతూనే 'భోగి భోగం'... కాంతినీ, నూతనత్వాన్నీ ఆహ్వానిస్తూ ఉత్తరాయణ భానుడికి శుభస్వాగతం పలుకుతుంది. ఈ రోజున సూర్యుణ్ని ఆరాధించడం, పాలతో బియ్యాన్ని, బెల్లాన్ని కలిపి పరమాన్నం వండి నివేదించడం ప్రధానాచారం. సర్వజీవులకు ప్రాణప్రదాత, సస్యకారకుడు అయిన సూర్యుడికి ప్రీతిగా దేవతార్చనలు, పుణ్యస్నానాలు ఆచరించడం ముఖ్యవిధులు. నువ్వులను నీళ్లలో కలిపి స్నానం చేయడం, నువ్వులూ బెల్లం కలిపిన లడ్డూలను దేవతలకు నివేదించడంవల్ల దీన్ని 'తిల సంక్రాంతి' అనీ వ్యవహరిస్తారు. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో ఫలసాయం చేతికందడంతో- దానధర్మాలతో పంచుకోవడం, విందువినోదాలతో అనుబంధాలు పెంచుకోవడం కనిపిస్తుంది. సౌరమానం ప్రకారం 'మకరమాసం' ప్రారంభమయ్యే ఈ రోజున పితృతర్పణలను ఆచరిస్తారు. సంక్రాంతి ముగ్గులశోభ మనదేశానికే ప్రత్యేకం. దేవతాశక్తులను ఆహ్వానించే ప్రభావం ముగ్గులకు ఉందని నమ్మకం. సంక్రమణం నాడు లక్ష్మీదేవిని అర్చించడం మంచిదని పురాణ గ్రంథాలు చెబుతున్నాయి. శివకేశవుల అర్చనలకూ ప్రాధాన్యముంది. శివుణ్ని నేతితో అభిషేకించి, నువ్వులు- బియ్యం కలిపి పూజిస్తారు. సంకర- కింకర అనే రాక్షసులను విష్ణువు సంహరించిన సందర్భంగా ఈ పండుగ జరుపుకొంటారని కొందరి నమ్మకం.



అంతర్యామి

ప్రతి రాష్ట్రంలోనూ సంక్రాంతికి విధిగా చేయాల్సిన వంటకాలున్నాయి. 'పొంగలి' ఒక చోట ప్రత్యేకమైతే, నువ్వుల వంటలు మరోచోట విశేషం. 'అన్నం ఆదిత్యమయం' అనే రుషివాక్కును అనుసరించి కొత్తపంటల వంటలను రవిప్రసాదంగా స్వీకరిస్తారు, పరస్పరం పంచుకుంటారు. ప్రకృతిని దైవంగా భావించి, మానవాతీత దివ్యత్వాన్ని భూమిలో, సూర్యుడిలో, నీటిలో దర్శించే భారతీయ సంస్కారానికి అద్దంపట్టేవే ఈ ఆచారాలన్నీ.

కాంతిని జ్ఞానానికీ ఆనందానికీ సంకేతంగా భావిస్తూ వెలుతురు, వెచ్చదనం పెరిగే సమయానికి ప్రారంభంగా ఈ పండుగను పేర్కొంటోంది ఆర్షసంస్కృతి. మకరసంక్రాంతి నుంచి ఒక విశిష్ట దివ్యత్వం మొదలవుతున్నందున శాస్త్రోక్తులను విశ్వసిస్తూ అన్నీ శుభాలే జరుగుతాయని ఆకాంక్షిద్దాం.

– సామవేదం షణ్ముఖశర్మ

ఆదాయాలు పెరగాలి...
ఆనందాలు విరియాలి!

భారతదేశ సాగు రంగాన్ని తీవ్రమైన సవాళ్లు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. డిజిటల్ సేద్య విధానాలు, సరికొత్త పథకాలు, కనీస మద్దతు ధరల బలోపేతానికి ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ధరల పతనం, వాతావరణ మార్పులు, సరఫరా గొలుసుల సమస్యలు రైతుల ఆదాయానికి భారీగా గండి కొడుతున్నాయి. మరోవైపు, గిరాకీ-సరఫరాల మధ్య అంతరాలను పూడ్చడంలో సర్కారీ యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. పంటలతో పాటే స్థిరమైన ఆదాయాలూ చేతికందినప్పుడే అన్నదాతకు నిజమైన సంక్రాంతి!

ఇవాళ సేద్యానికి సంబంధించిన సమస్త సమాచారం డిజిటల్ రూపంలో నేరుగా రైతుల చేతుల్లోకే వస్తోంది. ఎప్పటికప్పుడు సాగులో వస్తున్న సాంకేతిక విధానాలు, అవి అమలవుతున్న తీరు... విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యత వంటి వివరాలన్నీ సెల్‌ఫోన్లలోనే చూసుకోవచ్చు. అయితే, వీటిని వ్యవస్థీకృతం చేసి పొలాల వరకూ తీసుకెళ్లాల్సిన



యంత్రాంగం తన బాధ్యతలను విస్మరిస్తోంది. గిరాకీ, సరఫరాలకు సంబంధించిన డేటా ముందుగానే అందుబాటులోకి వస్తోంది. అయినా సరే, ఈ రెండింటి మధ్య అంతరాన్ని పూడ్చేలా సరఫరా వ్యవస్థలను పరిపుష్టం చేయడంలో మాత్రం సర్కారీ యంత్రాంగం విఫలమవుతోంది.

దశాబ్దాలుగా మారని పరిస్థితులు...

గత అయిదేళ్లలో వ్యవసాయ సాంకేతికతల్లో అనేక మార్పులు వచ్చాయి. సాగులో యాంత్రీకరణ జోరందుకుంది. రైతుల అనుభవాలు, కొత్త మార్కెట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలకు సంబంధించి సమాచారం విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. చాలామంది ఉపగ్రహ డేటా ఆధారంగా డిజిటల్ సాగు చేపడుతున్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సేంద్రియ వ్యవసాయం, జల సంరక్షణ, పంటల వైవిధ్యం క్రమంగా పెరుగుతున్నాయి. ఉత్పాదకాల విషయంలో మాత్రం ఇలాంటి జోరు కనిపించడంలేదు. ఉత్పత్తుల విక్రయానికి అవసరమైనంతగా మార్కెట్లు విస్తరించలేదు. రైతులకు సబ్సిడీలు ఇస్తున్నామనీ, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు వేస్తున్నామనీ ప్రభుత్వాలు చెబుతున్నాయేగానీ- అసలు సగటు రైతు సజావుగా వ్యవసాయం చేసుకునే పరిస్థితులు ఉన్నాయా? అన్నది మాత్రం చూడటంలేదు. అందుకే మరి, మూడు దశాబ్దాల క్రితం కనిపించిన 'విత్తనాల కోసం బారులు తీరిన రైతులు... యూరియా కోసం ఉద్యమిస్తున్న రైతులు...' వంటి వార్తలనే నేటి డిజిటల్ యుగంలోనూ చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితులకు దారితీస్తున్న ప్రణాళికా లోపాలను సరిదిద్దకపోవడం ఎవరి తప్పు?

సాగు విధానాల అమలుకూ, క్షేత్రస్థాయి పరిస్థితులకూ మధ్యనున్న వ్యత్యాసాలను తక్షణమే సరిదిద్దాల్సి ఉంది. రైతులు ఏయే పంటలను ఎంతమేర వేస్తారు, వాటికి ఎంతమేర ఉత్పాదకాలు అవసరమనే ముందస్తు అంచనాలు సీజన్‌కు ముందే యంత్రాంగం దగ్గర సిద్ధంగా ఉంటాయి. దీనికితోడు వాతావరణ పరిస్థితులు, పంటల నష్టం వంటి అంశాలకు సంబంధించి ఉపగ్రహ సమాచారం ఎప్పటికప్పుడు చేతికి అందుతోంది. అయినాసరే, పరిహారాల చెల్లింపులో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. సర్కారీ యంత్రాంగం ఉత్పాదకాలను పంపిణీ చేసి, చేతులు దులిపేసుకోవడం రైతుల్ని నష్టపరుస్తోంది. రెండేళ్లుగా పంటలు సరిగ్గా పండక, ధరలు గిట్టుబాటు కాక ఎంతోమంది వరి, మిరప, పత్తి రైతులు లబోదిబోమంటున్నారు.

దేశంలో అధిక దిగుబడులనిచ్చే కొత్త వంగడాలు, అధునాతన సేద్య విధానాలు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్నాయి. అక్కడక్కడా కొందరు రైతులు ఆధునికతను అందిపుచ్చుకుని అద్భుతాలు సృష్టిస్తున్నారు. కానీ, ఎక్కువమంది అన్నదాతలు మాత్రం ఇప్పటికీ ఏటికి ఎదురీదుతూనే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ దుస్థితికి దారితీస్తున్న కారణాలను ప్రభుత్వాలు అన్వేషించకుండా, తమ ప్రాథమ్యాల ప్రకారం నడుచుకుంటూ అన్నదాతల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయి. నేటికీ జనాభాలో సగం మందికి వ్యవసాయమే జీవనాధారం. 'నాబార్డు' సర్వే-2024 ప్రకారం, ఒక రైతు కుటుంబ వార్షికాదాయం సుమారు రూ.1.63లక్షలు. అంటే, నెలకు సుమారు రూ.13,600. ఇదంతా పరిస్థితులు అనుకూలిస్తేనే! అయితే, ఇందులో పంటల సాగు ద్వారా వచ్చే వార్షికాదాయం కేవలం రూ.54వేలే. ఎగుమతికి అవకాశమున్న ఏవో కొన్ని వాణిజ్య పంటల్లో మినహా, మరే పంటలోనూ అన్నదాతలకు ధరలు గిట్టుబాటు కావడంలేదని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కనీస మద్దతు ధరలు దక్కుతున్నది కేవలం ఆరు శాతం మంది రైతులకే. మరి మిగతావారి సంగతేంటి?

విలువ జోడింపుతో అధిక రాబడి....

చాలా కుటుంబాల్లోని పిల్లలు వివాహం చేసుకుని, బతకడం కోసమని నగరాలకు వలస పోతున్నారు. దాంతో గ్రామాల్లోని రైతులు ఒంటరివాళ్లవుతున్నారు. పిల్లలు పట్టించుకోనివారి పరిస్థితి మరీ దుర్భరంగా ఉంటోంది. వ్యవసాయం తప్ప మరో పని చేతకానివారు తమ దురదృష్టానికి చింతిస్తూ మళ్లీ కర్రు కదిలిస్తూనే ఉన్నారు. రైతుల కంటే, పంట ఉత్పాదకాలనూ ఉత్పత్తులనూ విక్రయించే వ్యాపారులే అంతిమంగా లాభపడుతున్నారు. అందుకే మరి, గత రెండు దశాబ్దాలలో సుమారు 38శాతం మంది రైతులు కాడి వదిలేసినట్లు గణాంకశాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వాలు వ్యవసాయ చట్టాలను రూపొందించేటప్పుడు... వాటిని రైతుల దృష్టికోణం నుంచి చూడటం లేదు సరికదా, ఆయా కంపెనీల వాణిజ్య ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కడికక్కడ అంచనా వేసి, స్థానిక అవసరాలతో పాటు ఎగుమతి మార్కెట్లకు తరలించేలా రైతుల్ని జాగృతం చేయాల్సి ఉంది. ఆధునిక సాంకేతికత సాయంతో ధరల విషయంలో పారదర్శకతను తీసుకొచ్చి, దళారుల పాత్రను తగ్గించవచ్చు. పంటల నిల్వకు గ్రామాల్లోనే తగిన వసతులు కల్పించాలి. వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి, తమ ఉత్పత్తులను తామే మార్కెట్ చేసుకునేలా రైతుల్ని ప్రోత్సహించాలి. తద్వారా వారి రాబడి అధికమవుతుంది. ఈ విషయంలో వ్యవసాయ నిపుణులు, విశ్రాంత ఉద్యోగుల సేవలు అక్కరకొస్తాయి. ఇలాంటి బహుముఖ చర్యలతోనే రైతులకు స్థిరమైన ఆదాయాలు ఒనగూడి, వారి ఇళ్ల ముంగిటకు నిజమైన సంక్రాంతులు వస్తాయి.

– అమిర్నేని హరికృష్ణ



ఊరు... జ్ఞాపకాల ఊటబావి!

ఊరు... అచ్చ తెలుగు పదం. ప్రతి మనిషికీ ఆత్మీయమైన మాట. చదువు, ఉద్యోగం, ఉపాధి... కారణమేదైనా సొంత ఊరు విడిచిపెట్టి వెళ్లకతప్పని రోజులివి. అందుకే ఎప్పుడు పండగొస్తుందా అని ఎదురుచూస్తాం, ఆ వంకన ఊరికి వెళ్లొచ్చని. ఎంత పెద్ద నగరంలో ఉంటున్నా ఊరిని తలచుకుంటే చాలు సంతోషంతో ఒళ్లు పులకరిస్తుంది. ఊరి మనుషులు కనిపిస్తే గుండెకు హత్తుకుని మాట్లాడాలనిపిస్తుంది. పుట్టి పెరిగిన ఊరి చుట్టూ ఉన్న కొండలు, తోటలు, పొలాలు, చెరువు... అన్నీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. ఊరి వాళ్లెవరైనా ప్రముఖ స్థానాల్లో ఉంటే మా ఊరివాడే అంటూ అడిగినవారికీ అడగనివారికీ గర్వంగా చెప్పుకొంటాం.

సొంత ఊరి ముచ్చట్లు ప్రస్తావించకపోతే ఎవరి జీవిత కథా సమగ్రం కాదు. చదువుకున్న బడి, పాఠాలు చెప్పిన గురువులు, తోటి పిల్లలతో చేసిన అల్లరి పనులు, ఆడిన ఆటలు, తోటల్లో చొరబడి చేసిన చిలిపి దొంగతనాలు, పట్టుబడినప్పుడు తిన్న దెబ్బలు, ఇరుగుపొరుగు అండతో గట్టెక్కిన ఇబ్బందులు... గుర్తొస్తే పెదాలమీద చిరునవ్వులు విరబూస్తాయి. సాయంకాలమైతే పురాణ విషయాలనుంచి ప్రపంచ రాజకీయాల వరకూ చర్చించేందుకు పెద్దలు కూర్చునే రచ్చబండ, కోడి కూయగానే పొలాల్లోకి బయలుదేరే రైతులు, వాకిళ్లలో కళ్లాపి జల్లి ముగ్గులేస్తూ ఇరుగుపొరుగూ వారిని పలకరించే గృహిణులు, రైతుల తగాదాలు తీరుస్తూ గ్రామాధికారులు కొలువైన కచేరి, ఇందుమూలంగా యావన్మంది ప్రజలకూ తెలియజేయునదేమనగా... అంటూ సర్కారు వారి ఉత్తర్వును చాటింపువేసే పంచాయతీ సిబ్బంది... ఊరిని తలచుకోగానే కళ్లముందు రీలులాగా తిరిగే దృశ్యాలివి.

ఇక, పండుగలకు తరలివచ్చేవారితో ఊళ్లకు వచ్చే శోభ అంతాఇంతా కాదు. తెలుగు వారందరివీ అవే పండుగలైనా వాటిని జరుపుకొనే విధానాల్లో మాత్రం దాదాపుగా ప్రతి జిల్లాకూ ప్రత్యేకత ఉంటుంది. ముఖ్యంగా సంక్రాంతి అయితే చెప్పనక్కరలేదు. అందుకే ఏ పండక్కి వెళ్లినా వెళ్లకపోయినా ఈ పెద్ద పండుగకు మాత్రం పెట్టేబేడా సర్దుకుని నగరాలన్నీ పల్లెబాట పడతాయి. బాగున్నారా, ఇదేనా రావడం... అంటూ బస్సు దిగినప్పటినుంచీ పలకరింపులు మొదలవుతాయి. అన్నా, వదినా, అక్కా, బావా... అంటూ ఆప్యాయంగా పిలిచే పిలుపులు వీనులవిందు చేస్తాయి. అసలు కన్నా వడ్డీ ముద్దన్నట్లు మనవళ్లనీ మనవరాళ్లనీ చూసుకుని, ఊరివాళ్లకు చూపించుకుని, మురిసిపోయే తాతయ్యల సంబరమైతే చెప్పక్కరలేదు. పిల్లలకు మన మూలాలను పరిచయం చేయడానికి, సామాజిక సంబంధాల విలువ తెలియజేయడానికి పండుగను మించిన సందర్భం ఏముంటుంది? అరిసెలు, జంతికలు, సకినాల ఘుమఘుమలే కాదు, అరమరికల్లేని బంధుత్వాల గుబాళింపుల్నీ పిల్లలు ఆస్వాదించేలా చేయాలి. ఉరుకుపరుగుల యాంత్రికజీవనం నుంచి, తెరల చాటునుంచి బయటికి వచ్చిన చిన్నారులకు కుటుంబ జీవన మాధుర్యాన్ని రుచి చూపించాలి. వారికీ ఊరు... తియ్యని జ్ఞాపకాల ఊటబావి... అనిపించేలా ఈ పండుగ రోజుల్ని గడపాలి అందరూ!

– సూర్య

పదవిలో ఉంటే... ప్రతిరోజూ పండుగే!

'ఎవ్వనిచే జనించు' అని ప్రశ్నిస్తే పోతన భాగవతం చదివిన వాళ్లంతా 'అట్టివాడు..' అని ఠక్కున జవాబిస్తారు. అయితే దీనితో విభేదించే హేతువాదులు, నాస్తికులు కొంతమంది ఉంటారు. మరి భాగోతాలు 'ఎవ్వనిచే జనించె' అంటే మాత్రం రాజకీయ నాయకులు అని జనాలందరూ ఏకగ్రీవంగా ఠక్కున సమాధానమిస్తారు. పర్వం ప్రకృతి, పబ్బం వికృతే కావొచ్చు కానీ, నిఘంటుకర్తలు పూనుకుని పబ్బమనే మాటకు విడిగా 'సంక్రాంతి లోనగునది' అనే అర్థమిచ్చారు. అందుకే కాబోలు సంక్రాంతి సంబరాల స్ఫూర్తితో ఎన్నికల రాజకీయాల్లో పబ్బం గడుపుకోవాలని నేతలు ఉవ్విళ్లూరుతుంటారు.

పోలింగ్ డేట్ల లాగానే సంక్రాంతి డేట్లు కూడా ఒక్క రోజు అటూ- ఇటూ తప్ప ఇంద్రుడు దివి నుంచి భువికి దిగి వచ్చినా మారవు గాక మారవు. ఎన్నికలు అయిదేళ్లకోసారి కాకుండా సంక్రాంతి వచ్చినట్టు ఏడాదికోసారి వస్తే బాగుంటుందని ఛోటామోటా నేతలు, పెద్దనాయకుల అనుచర నిశాచరులు కలలు కంటుంటారు. ఏటా ఎన్నికలొస్తే కృష్ణా, గోదావరి లాంటి అన్ని నదుల్లో నీళ్లు కాకుండా నిధులు పారతాయన్నది వారి ఆశ. నిధుల నదులకు పిల్ల కాలువలుగా మద్యం కెనాల్స్ పుట్టుకొస్తాయని ఎదురుచూసే మందుబాబులకూ లోటులేదు. లోటాలకొద్దీ తాగినా వారి దాహం తీరదు!

సంక్రాంతి అంటే పంటల పండుగ. జన'వరి'లో వరి ఉందన్నంత కచ్చితంగా పంటలు పండి ఇళ్లలో గాదెలు నిండుతాయి. అచ్చం అలాగే నల్లధనంతో సొంతింటి భోషాణాలు నిండిపోవాలన్నది నాయకుల లక్ష్యం. అందుకోసం జనాన్ని ఎన్ని కష్టాల పాల్జేయడానికైనా వారు 'సిద్ధం'! సంక్రాంతి అంటే మూడు రోజుల పండుగ. ముందుగా వచ్చేది భోగి. ఆ రోజున పిల్లకాయల నెత్తి మీద భోగి పళ్లు అలియాస్ రేగి పళ్లు పోసి పండుగ చేసుకోవడం ఆనవాయితీ. ఇది పిల్లల హెల్త్‌కు మంచిదంటారు. రాజకీయాల విషయానికి వస్తే నాయకుడి కన్నా భోగి ఎవరుంటారు? అతగాడు తాను వెనకేసు



కున్న రాశ్లలో కొన్ని జనం మొహం మీద సారీ జేబుల్లో వేస్తాడు. ఇది వాళ్ల వెల్త్‌కు మంచిదని చెవికొరికి మరీ చెబుతాడు. అలా పైసలు పంచి పదవులు పట్టి అంతకంతా వడ్డీతో సహా జనం నుంచే లాగేసుకోవాలని లెక్కలేసుకుంటూ ఉంటాడు. సంక్రాంతి అనగానే దక్షిణాయనం, ఉత్తరాయణం అనే మాటలు వినిపిస్తుంటాయి అక్కడక్కడ. కానీ, రాజకీయాల్లో ఎక్కడైనా ఎల్లవేళలా 'దక్షిణా'యనం (ముడుపులు), 'ఉత్తరా'యణం (సిఫార్సులు) తప్పనిసరి!

సంక్రాంతి అంటే గుర్తొచ్చేవి ముగ్గులు కూడా. ముగ్గుల పోటీలూ పెడుతుంటారు. అయితే జగన్మాయలో ఆరితేరిన నాయకుడు ఒకరు మళ్లీ ముఖ్యమంత్రి కావడంకోసం జనంమీద తెగ రాజకీయ ప్రేమ ఒలకబోసి ఎన్నిక ప్రచారాన్ని 'ముద్దుల పోటీ'లా మార్చేశాడు. అలా అందరినీ తనకు అనుకూలంగా పోలింగ్ ముగ్గులోకి దించడామని ప్రయత్నించినా ప్రజాస్వామ్యానికి అతగాడు ముద్దు రాలేదు. పంచభూతాల సాక్షిగా ఉన్న 151లో పంచ అంకె ఊడిపోయి... అటొకటి ఇటొకటి దిక్కుతెలియక బిక్కుబిక్కుమంటూ మిగిలిపోయాయి. అయితే చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టు ఆ జగత్ జంత్రీలో మైకుపోతు గాంభీర్యం మాత్రం అలాగే ఉంది. తనకు జై కొట్టకపోతే జైలుకు పంపిస్తానన్న బెదిరింపులను సంగ్రామ'ఫోను రికార్డుల లెవల్లో వినిపిస్తున్నాడు. ఇక ఈ రోజుల్లో చట్టం ఒప్పుకోకపోయినా దాని కళ్లుగప్పి కనిపించేవి కోడి పందేలూ... కోడికత్తులూ! వాటిలోంచి అరువుతెచ్చుకున్న ఓ మాంచి కోడికత్తిని పట్టుకుని ఎన్నికల బరిలోకి దిగి బొక్కబోర్లాపడిన నాయకుడి వేషాలు ఇంకా ఆగలేదు!

సంక్రాంతి రాగానే వినిపించేవి హరిదాసుల హరిలో రంగ హరీ కీర్తనలు. రాజకీయ నాయకులు అయిదేళ్ల పాటు అయిపూ అజా లేకపోయినా ఎన్నికల వేళ వస్తే చాలు ప్రతి గుమ్మంలో తారల్లాగా తారసపడి 'సిరిలో రంగ సిరీ' అంటూ 'ఓటు మా లక్ష్మికి కోటి దండాలు' పెడతారు. తమ పాపాల మూటను మరిచిపోయి తాము విప్పిన డబ్బు మూటలను జూసి మైమరచిపొమ్మంటారు. మీ ఇంట్లో వంటపని మొదలుకుని ఏం చేయమన్నా చేయడానికి మేము రెడీ అంటారు. అవసరమైతే 'చెత్త శుద్ధి'తో చేస్తారు. ఓటర్ చేయితడపడమే కాకుండా చాటుమాటున చాట్ చేసి ఇంటాయన నాలుక తడపడానికి మందు బాటిల్ ముందు పెట్టడానికి ముందుకొస్తారు. మీ సకల బలహీనతలను తీర్చే బలం, బలగం మాకు ఉన్నాయని వాగ్దానాన్ని దానం చేస్తారు. ఓరప్పా అని దగ్గరికి పిలిచి రప్పా రప్పా హామీలు ఇస్తారు. అప్పాలు కావాలన్న కోరిక మొదలుకుని ఏమి కోరినా తీరుస్తామని గొప్ప గొప్పగా గప్పాలు కొడతారు. ఓట్ల పండుగ అయిపోగానే చప్పున మాయమైపోతారు.


సంక్రాంతి గొబ్బెమ్మల సంగతి బొమ్మలకు తెలిసినట్టు రాజకీయులకు తెలియదు గానీ గిట్టని పార్టీల ఫ్లెక్సీల మీద కసికసిగా పేడ కొట్టడం మాత్రం బ్రహ్మాండంగా తెలుసు. 'నాకు మేడ... ప్రత్యర్థుల మీద పేడ' అనేది అనేక మంది రాజకీయ నాయకుల అప్రకటిత విధానం.. కొంతమందికి అది ప్రకటిత నినాదం. సీలింగ్ ఫ్యాన్‌ను ఫుల్ స్పీడ్‌లో పెట్టి తన గాలిపటం సూపర్‌గా ఎగిరిందని సంబరపడిన పార్టీని ఇక చాల్లే 'సంబడం' అని పాతాళంలో పడేసి జనం ఘనంగా గుణపాఠం నేర్పడం విశేషం. వీటన్నిటినీ పక్కనపెట్టినా, తొక్కిపెట్టినా రాజకీయాలమీద సంక్రాంతి బలమైన ప్రభావం చూపించిందనడానికి తిరుగులేని సాక్ష్యం గంగిరెద్దులే. ప్రతి పార్టీలోనూ అనేక మంది నాయకులు తాము తానా అంటే తందానా అనే అనుచరులను తయారు చేసుకుంటున్నారు. గంగిరెద్దులను మరపించే డూడూ బసవన్నల లాంటి వాళ్లు పోటీపడి తయారవుతున్నారు. 'నాయకులు చెప్పిందే విను, నాయకులు చెప్పిందే చెప్పు, నాయకులు చెప్పిందే చెయ్యి' అన్నదే వీళ్లు నేర్చుకుంటున్న ఏకైక పాఠం!

– శంకర నారాయణ

కలిసి ఎగరేద్దాం..!

హాయ్! బుజ్జీ!!

బొమ్మలు: శ్రీనివాస్ కథ: ఎ.నవనీత్



దిల్లీలో ఘనంగా సంక్రాంతి వేడుకలు


ఏపీ భవన్‌లో పందెంకోళ్లను వదిలి సంబరాలను ప్రారంభించిన రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్

దేశరాజధానిలో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లోని తెలుగువారికోసం ఏపీ ప్రభుత్వం ఏపీభవన్‌లో పండుగ ఏర్పాట్లు చేసింది. బుధవారం భోగి సందర్భంగా భవన్ ప్రాంగణంలో రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి తెలుగు ప్రజలతో కలిసి భోగి మంట వెలిగించి సంబరాలను ప్రారంభించారు. మూడురోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి ప్రాధాన్యాన్ని, సంప్రదాయ విశిష్టతను దిల్లీలోని రెండు, మూడోతరం తెలుగువారికి తెలియజేయడమే కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. – ఈనాడు, దిల్లీ



ఏపీ భవన్ ప్రాంగణంలో భోగిమంట కార్యక్రమంలో పాల్గొన్న తెలుగువారు ★ సాంస్కృతిక కార్యక్రమాలు

స్నేహం, సోదరభావం పెంపొందించే సంక్రాంతి

– గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: 'సంక్రాంతి వేడుకలు యుగాల నాటి సంప్రదాయాలను, అన్ని వర్గాలను కలిపి ఉంచే జ్ఞాపకాలను వెలికితీస్తాయి. ఈ శుభ సందర్భం మనందరిలో ప్రేమ, ఆప్యాయత, స్నేహం, సోదరభావం పెంపొందిస్తుంది' అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పండగ సౌభాగ్యాన్ని అందించాలి

– ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

తెలుగు ప్రజలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి తెలుగువారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభ మంగళాలు ప్రసాదించాలని ఈశ్వరుణ్ణి కోరుకుంటున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రం అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేదు. శాంతి, సామరస్యం ఉన్నచోటే పండగ. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ పండగ నాడు ప్రతి ఇల్లు సౌభాగ్యంతో వెల్లివిరియాలి' అని పేర్కొన్నారు.

సంతోషానికి స్వాగతం పలికే సంక్రాంతి

– మాజీ సీఎం జగన్

'చెడును దహనం చేస్తూ భోగి.., సంతోషానికి, వృద్ధికి స్వాగతం పలుకుతూ సంక్రాంతి.., పశు సంపదను ప్రేమిస్తూ నిర్వహించుకునే కనుమ.. పర్వదినాల సందర్భంగా తెలుగు వారందరికీ శుభాకాంక్షలు. పర్వదినం ప్రజలకు ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని మాజీ సీఎం జగన్ బుధవారం 'ఎక్స్'లో చేసిన పోస్ట్ చేశారు.

మాది మరకట సంక్రాంతి



భోగి పండగను పురస్కరించుకుని ప్రతి ఇంటి ముందు మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. తెలంగాణలోని జనగామ పట్టణంలో బుధవారం ఓ ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దాక.. ఓ వానరం వచ్చి కూర్చుని ఇలా ముగ్గు వేస్తున్నట్లు సందడి చేసింది.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్

ప్రతి కుటుంబానికీ రూ. 40 వేల ఆదాయమే లక్ష్యం

అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు డిజిటల్, తిరుపతి: నారావారిపల్లె క్లస్టర్‌లోని ప్రతి కుటుంబానికీ నెలకు రూ.30-40 వేల ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రచించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సంక్రాంతి వేళ తిరుపతి జిల్లా నారావారిపల్లెలో ఓవైపు నారా, నందమూరి కుటుంబాల ఆత్మీయ కలయికతో పండగ వాతావరణం నెలకొనగా.. మరోవైపు ముఖ్యమంత్రి అభివృద్ధి మంత్రం పఠించారు. పర్యటనలో రెండో రోజైన బుధవారం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతూనే సుమారు 3 గంటలు అధికారులతో సమీక్షించారు. రాబోయే ఏడాదిలో నారావారిపల్లె క్లస్టర్‌ను ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై అధికారులకు స్పష్టమైన విజన్‌ను, వినూత్న ఆలోచనలను అందించారు.

గ్రామీణ ఒడిలో టెక్ సొగసులు

ముఖ్యమంత్రి వెల్లడించిన కీలక ఆలోచనల్లో 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఫెసిలిటీ సెంటర్ ప్రధానమైనది. సొంతూళ్లకు వచ్చి ఇంటినుంచే పనిచేసుకునే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కోసం కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించాలని సూచించారు. ఇంట్లో ఇంటర్నెట్, ఇతర సౌకర్యాలు లేనివారి కోసం.. బ్రాడ్‌బ్యాండ్, క్యాబిన్లు, క్యాంటీన్ (టీ, స్నాక్స్) సదుపాయాలతో కూడిన 'కో-వర్కింగ్ స్పేస్' ఏర్పాటుచేయాలని ఆదేశించారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం వాకింగ్‌ట్రాక్‌లు, యోగా, నేచురోపతి వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

పర్యాటకానికి పెద్దపీట.. సఫారీ అనుభూతి

తిరుపతి పరిధిలో పర్యాటకరంగానికి ఊతమిచ్చేలా దిశానిర్దేశం చేశారు. అవిలాల చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ తరహాలో సుందరీకరించాలని, చుట్టూ పచ్చదనం, వాకింగ్‌ట్రాక్‌లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. తిరుపతి జూపార్క్ పరిధిని విస్తరించి.. కల్యాణి డ్యామ్ వరకు అటవీలో సఫారీని తలపించేలా అభివృద్ధి చేయాలన్నారు.

> 'నారావారిపల్లెలో కేవలం పండగ జరుపుకోవడమే కాదు.. వచ్చే ఏడాదిలో ఇక్కడ కనిపిస్తున్న ప్రతి ప్రతిపాదననూ సాకారం చేయాలి. ప్రజలూ భాగస్వాములు కావాలి'
> – అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు


హరిదాసుకు ధనధాన్యాలు అందజేస్తున్న చంద్రబాబు దంపతులు, దేవాంశ్. చిత్రంలో బ్రాహ్మణి

సాగుపై ప్రత్యేక దృష్టి

సాగునీటి సరఫరాలో జాప్యాన్ని నివారించేందుకు కాలువల తవ్వకాలకు స్వస్తి పలకాలని సీఎం స్పష్టం చేశారు. నేరుగా పైప్‌లైన్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి చెరువులు నింపాలని ఆదేశించారు. మూలపల్లి చెరువు నుంచి కల్యాణి డ్యామ్, కొటాల చెరువు వరకు అనుసంధానం చేయాలన్నారు. కపిలతీర్థం నుంచి వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టి తిరుపతి అవసరాలకు మళ్లించేలా ప్రాజెక్ట్ రూపొందించాలన్నారు. ఇక్కడి మామిడి రైతులు ఎగుమతి నాణ్యతతో పంటలు పండించాలని, వారికి సర్టిఫికేషన్ ద్వారా మార్కెట్లో అధిక ధర (రూ.10 అదనంగా) దక్కేలా చూడాలన్నారు. తద్వారా ప్రతి ఇంటికీ నెలకు రూ.30-40 వేల ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రచించాలని ఆదేశించారు. పుల్లయ్యగారిపల్లెలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు అమలు చేయాలని సూచించారు.

లోగిళ్లలో వెలుగులు విరియాలి: సీఎం

ఈనాడు డిజిటల్, తిరుపతి: సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే పవిత్ర పుణ్యకాలం 'మకర సంక్రాంతి' పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విశిష్టమైన పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను, సరికొత్త వెలుగులను నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం ఎంత ఆధునికతను సంతరించుకున్నా, మన మూలాలు, ఆ గొప్ప సంప్రదాయాలను మర్చిపోకుండా పండగలను జరుపుకోవాలని కోరారు. మన పల్లెసీమలు పాడిపంటలతో ఎప్పుడూ కళకళలాడుతుండాలని, గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టం కావాలి' అని ఆకాంక్షించారు. 'రైతన్నలు ఆనందంగా ఉండాలి. అందుకు అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుంది'' అని సీఎం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పల్లె భవితకు ఉద్యోగుల కంకణం!


ముద్దులగూడెంలో భోగి వేడుకల్లో విద్యార్థులు, ఉద్యోగులు

చిన్న ఆదివాసీ గిరిజన గ్రామమది. అందులో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి.. ఇప్పుడు గ్రామం నుంచి మత్తు పదార్థాలు, జూదం పారదోలేందుకు కంకణం కట్టుకున్నారు. పోలవరం జిల్లా వరరామచంద్రాపురం మండలంలోని ముద్దులగూడెం(తోటపల్లి)లో 22 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సంక్రాంతి అంటే కేవలం కోడిపందేలు, మద్యం మత్తు, జూదం కాదంటూ.. తలా కొంత డబ్బు వేసుకొని 3 రోజులపాటు వేడుకలకు ప్రణాళిక వేశారు. గ్రామ యువత కోసం వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, కుర్చీలాట, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మా ఊరి విద్యార్థుల్ని ఉద్యోగులుగా చూడాలనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ముల్లి శేఖర్, కిరణ్, నాగేశ్వరరావు, వినోద్, తరుణ్, నవీన్ తెలిపారు. – న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం

కృత్రిమ మేధ.. యోధ!

- ఏఐ సాంకేతికతతో తీరు మారుతున్న పోలీసింగ్
- ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో విస్తృత వినియోగం
- ఏడాదిన్నరలో కీలక అంశాల్లో సత్ఫలితాలు



పోలీసింగ్‌లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాంకేతికతలను వినియోగించుకుంటూ ఎన్టీఆర్ (విజయవాడ) కమిషనరేట్ మంచి ఫలితాలు సాధిస్తోంది. నేర నియంత్రణ, పరిశోధన, ఛేదన, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సహా అనేక అంశాల్లో ఈ సాంకేతికతను పోలీసులు ఏడాదిన్నరగా విస్తృతంగా వినియోగిస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు వీటిని ప్రవేశపెట్టారు.



1. అస్త్రం (యాక్షన్‌బుల్ ఇంటెలిజెన్స్ ఫర్ సస్టెన్‌బుల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)

నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, నిర్వహణకు 'అస్త్రం' పేరిట కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఏ సమయంలో ఏయే ప్రాంతాల్లో ఎంత ట్రాఫిక్ రద్దీ ఉందో, కారణాలేమిటో రియల్‌టైంలో గుర్తిస్తారు. ఆ మేరకు ట్రాఫిక్ సిబ్బందికి అప్రమత్తత సందేశాలు వెళ్తుంటాయి. వాటి ఆధారంగా రద్దీని నియంత్రిస్తున్నారు.

- **ఫలితం:** 2024 అక్టోబరు నుంచి 'అస్త్రం'ను వాడుతున్నారు. అప్పట్లో నగరంలోని 83 ట్రాఫిక్ కూడళ్ల పరిధిలో సగటు ట్రాఫిక్ కంజెషన్ పొడవు రోజుకు 97 కి.మీ. మేర ఉండేది. గతేడాది నవంబరుకు అది 48 కి.మీ.కి తగ్గింది.
- **భవిష్యత్తు ప్రణాళిక:** హిస్టారికల్ డేటా, ఈవెంట్స్, వీఐపీ పర్యటనలు, వాతావరణ వివరాల ఆధారంగా రాబోయే వారం రోజుల్లో ట్రాఫిక్ ఎలా ఉండబోతోందో అంచనా వేసి.. అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. 'ఫై ఐయామ్ స్టక్' పేరిట ప్రజలకు యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏ కారణంతో వారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారో, క్లియర్ అవడానికి ఎంత సమయం పడుతుందో యాప్‌లో తెలుసుకోవచ్చు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు రిజిస్టర్ చేసుకుంటే.. 'ఈ-పాథ్ ఎమర్జెన్సీ వెహికల్ ప్రయారిటీ' పేరిట గ్రీన్ ఛానెల్ ఇస్తారు.

2. సురక్ష 360 డిగ్రీలు


10 వేల సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించే డ్యాష్‌బోర్డు

ప్రజా భాగస్వామ్యంతో కమిషనరేట్ పరిధిలో 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు.

- **ఫలితం:** చోరీలు, దోపిడీలు తదితర నేరాల ఛేదనలో ఇవి కీలకమయ్యాయి. గతేడాది 816 కేసులు నమోదు కాగా, 596(73 శాతం) ఛేదించారు. ఈ కేసుల్లో బాధితులు రూ.13.89 కోట్లు పోగొట్టుకోగా, రూ.11.21 కోట్లు(80.70 శాతం) రికవరీ చేయగలిగారు. దేశంలో ఏ యూనిట్‌లోనూ ఇంత రికవరీ లేదని, ఇది రికార్డని అధికారులు చెబుతున్నారు. ఎక్కడ నేరం జరిగినా నిందితుల ఉనికి కనీసం నాలుగైదు కెమెరాల్లో చిక్కుతోంది. దీనివల్ల నేరాల ఛేదన, రికవరీ మెరుగుపడింది.

3. డివైన్ సురక్ష



రద్దీ నియంత్రణలో భాగంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఓ దేవాలయం వద్దకు వచ్చిన వాహనాలు, భక్తుల లెక్కలను తీస్తూ..

ఆలయాలు, ప్రార్థన మందిరాల్లో తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా సమూహ నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్) కోసం రియల్‌టైం మౌంటింగ్ కెమెరాల్ని వినియోగిస్తున్నారు. పర్వదినాలు, జాతరలు, ఉత్సవాల్లో ఆలయాలు, ప్రార్థన మందిరాలకు వచ్చే వాహనాలు, మనుషుల్ని ఈ కెమెరాలు ఏఐ సాయంతో రియల్‌టైంలో లెక్కిస్తాయి. దాని ఆధారంగా అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

- **ఫలితం:** గతేడాది దుర్గగుడి దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల విరమణ సమయాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేశారు. అవాంఛనీయ ఘటనలు లేకుండా, ఒకేసారి రద్దీ పెరగకుండా చూశారు. ఆలయం వద్ద ఏ సమయంలో భక్తుల రద్దీ ఎంత ఉంది? అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుంది? క్యూలైన్లలో ఇంకా ఎంతమంది ఉన్నారు? తదితర వివరాల్ని కచ్చితంగా అంచనా వేయగలిగారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగానూ దీన్ని వినియోగించారు. నగరంలోని 200కు పైగా ఆలయాల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు.


ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, కెమెరాల ద్వారా పలువురు పాత నేరగాళ్ల గుర్తింపు

4. ఫేషియల్ రికగ్నిషన్ సెంటర్

బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు సహా ఇతర కీలక ప్రాంతాల్లో 126 ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు(ముఖాలను గుర్తించగలిగే కెమెరాలు) ఏర్పాటు చేశారు. సీసీటీఎన్ఎస్ డేటాబేస్‌లోని 1.30 లక్షల మంది పాత నేరగాళ్ల చిత్రాలు, వారి వివరాలను వాటితో అనుసంధానించారు. నగరంలో పాత నేరగాళ్లు తిరుగుతూ కెమెరాల్లో చిక్కితే... ఫేషియల్ రికగ్నిషన్ సెంటర్‌కు అప్రమత్తత సందేశం వస్తోంది. దాని ఆధారంగా వారిపై నిఘా పెడుతున్నారు.

- **ఫలితం:** గతేడాది అక్టోబరు నుంచి దీనిని అమలు చేస్తున్నారు. దసరా ఉత్సవాల సమయంలో పాత నేరగాళ్ల కదలికల్ని గుర్తించి వారిని పట్టుకున్నారు. పలు కీలక కేసుల ఛేదనలో ఈ వ్యవస్థ ఉపయోగపడింది. అదృశ్యమైన(మిస్సింగ్) వారి ఫొటోలను ఈ డేటాబేస్‌కు అనుసంధానించి, ఆచూకీ కనిపెడుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

– ఎస్వీ రాజశేఖర్‌బాబు, పోలీసు కమిషనర్, విజయవాడ



పోలీసింగ్‌లో కృత్రిమ మేధను మరింత విస్తృతంగా వినియోగిస్తాం. దాని ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలనేదే లక్ష్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో 'విజిబుల్ పోలీసింగ్.. ఇన్‌విజిబుల్ పోలీస్'గా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే అమలవుతున్న వాటికి ఈ ఏడాది మరిన్ని అదనపు అంశాలు జోడించి సేవలు విస్తరిస్తాం.

● ఈ-డిప్లాయ్‌మెంట్

బందోబస్తు ప్రణాళిక రూపకల్పన, సిబ్బందికి విధుల కేటాయింపు గతంలో మ్యాన్యువల్‌గా చేసేవారు. దీనికి కనీసం 2-3 రోజుల సమయం పట్టేది. ఈ-డిప్లాయ్‌మెంట్ వల్ల ఇప్పుడు 6 గంటల్లోపే ప్రక్రియ పూర్తవుతోంది. సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్లకు వెళ్లిన వెంటనే క్యూఆర్, జియో ఫెన్సింగ్ ఆధారిత హాజరు పడిపోతోంది.

● డ్రోన్ కమాండ్ కంట్రోల్ సెంటర్

డ్రోన్ పోలీసింగ్‌లో భాగంగా స్టేషన్‌కు ఒకటి చొప్పున 42 డ్రోన్లు ఇచ్చారు. వీటి ద్వారా తీసే దృశ్యాల విశ్లేషణ పర్యవేక్షణకు డ్రోన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పేరిట డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేశారు.

● డిజిటల్ డివైజెస్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం

కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన 10 వేల కెమెరాల్ని డ్యాష్‌బోర్డుకు అనుసంధానించారు. దీనిద్వారా అవి సరిగ్గా పనిచేస్తున్నాయా, లేదా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా కెమెరా పనిచేయకపోతే వెంటనే అప్రమత్తత సందేశం వస్తుంది. అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. ట్రయల్ రన్ చేసి ప్రాజెక్టును సిద్ధం చేశారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నారు.

– ఈనాడు, అమరావతి

డప్పు కొట్టి.. ముగ్గులు వేసి

హోంమంత్రి అనిత సంక్రాంతి సంబరాలు


ఎద్దుల బండిపై హోంమంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన నివాసం వద్ద హోంమంత్రి అనిత కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత భోగి మంటల్లో పిడకలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత కేరళ డప్పు వాయిద్యాలను కొట్టి అందరినీ ఉత్సాహపరిచారు. ఎద్దుల బండి ఎక్కి చెర్నాకోల తిప్పారు. రంగవల్లుల పోటీలను వీక్షించి కుమార్తె రేష్మితతో కలిసి ముగ్గులు వేశారు.

అమెరికా అతిథులకు సంక్రాంతి విడిది

రాష్ట్ర ప్రభుత్వ హోంస్టే పర్యాటకానికి స్పందన


తూర్పుపాలెం హోంస్టే(మండువా లోగిలి)లో శివగణేశ్ కుటుంబ సభ్యులు

మలికిపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హోంస్టే పర్యాటకానికి విశేష స్పందన లభిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని అమెరికా నుంచి వచ్చిన యానాం వాసి రాయుడు శివగణేశ్, డాక్టర్ నళిని దంపతులు తమ బంధువులతో తూర్పుపాలెంలోని పర్యాటక శాఖ హోంస్టేలో బస చేశారు. గ్రామీణ పర్యాటకంలో భాగంగా ఇక్కడి మండువా లోగిలిని హోంస్టేగా మార్చి గతేడాది నవంబరులో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది ఇప్పుడు అమెరికా నుంచి వచ్చిన కుటుంబ సభ్యుల సంక్రాంతి సంబరాలకు వేదికగా మారింది. యానాంకు చెందిన శివగణేశ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆన్‌లైన్‌లో చూసి తూర్పుపాలెం హోంస్టేను(మండువా లోగిలి) ఎంపిక చేసుకుని తన సతీమణి, కుమారుడితో పాటు హైదరాబాద్‌లో ఉంటున్న తల్లి, తండ్రి, అత్తమామల కుటుంబాలతో కలిసి పండగ జరుపుకోవాలని ఇక్కడికి వచ్చారు. నాలుగు రోజులపాటు ఉండి ఇక్కడి ఆలయాలను సందర్శించనున్నారు.

పరదేశీ పరవశం




గుంటూరు జిల్లా తాడేపల్లి కరకట్ట మీద విజయవాడ క్లబ్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో జపాన్‌కు చెందిన టయో, నెదర్లాండ్స్‌కు చెందిన ద్యన్, మెర్తె పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో మెరుస్తూ రోజంతా సందడిగా గడిపారు. యూకేలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న విజయవాడకు చెందిన హరినిత్ సంక్రాంతికి ఇంటికి వస్తూ వీరిని తీసుకొచ్చారు. – మంగళగిరి అర్బన్, న్యూస్‌టుడే

అత్యద్భుతం.. ఆనందభరితం

రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించి తన్మయం చెందిన జపాన్ బృందం





సితార హోటల్‌లో జపాన్‌కు చెందిన మీడియా బృందంతో కలిసి రామోజీ గ్రూపు సంస్థలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకిస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్ ఎండీ శైలజాకిరణ్, రామోజీ గ్రూపు సంస్థల డైరెక్టర్ జి.సాంబశివరావు తదితరులు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ ప్రమాణాలతో రామోజీ ఫిల్మ్ సిటీ అద్భుతంగా ఉందని జపాన్‌కు చెందిన మీడియా బృందం ప్రతినిధులు పేర్కొన్నారు. భారత్‌లో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో వినోద, ప్రచురణ, మీడియా రంగాల తీరును పరిశీలించేందుకు వారు ప్రత్యేకంగా బుధవారం ఫిల్మ్ సిటీకి వచ్చారు. జపాన్‌లోని కొడాన్షా సంస్థ ప్రతినిధులు హిరోవాకీ మినామీ, యోషియాకీ కోగా సహా 30 మంది ప్రతినిధులు రామోజీ గ్రూప్ అనుబంధ విభాగాల పనితీరును, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను తెలుసుకున్నారు. హవామహల్, మాయాలోక్, జపనీస్ గార్డెన్‌లో అందాలు, వింతలు, విశేషాలను తిలకించి అబ్బురపడ్డారు. ఈటీవీ భారత్, ఈటీవీ ఛానల్ కార్యాలయాలను సందర్శించారు. ఫిల్మ్ సిటీలో అందమైన దృశ్యాలను తమ కెమెరాలు, వీడియోల్లో బంధించారు. మార్గదర్శి చిట్ ఫండ్ ఎండీ శైలజాకిరణ్, రామోజీ గ్రూపు సంస్థల డైరెక్టర్ జి.సాంబశివరావు, రామోజీ ఫిల్మ్ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎ.వి.రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిల్మ్ సిటీ ప్రస్థానం.. భవిష్యత్ ప్రాజెక్టుల పవర్ పాయింట్ ప్రజంటేషన్లు చూశాక.. రామోజీ దార్శనికత మహోన్నతమని కొరియా-జపాన్ మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ హిరోవాకీ మినామీ కొనియాడారు. ఒక్కొక్క రంగం గురించి వివరిస్తున్నప్పుడు ప్రతినిధులు చప్పట్లతో అభినందనలు తెలిపారు. రామోజీ గ్రూపు సంస్థల పురోగతి, ఈనాడు దినపత్రిక ప్రాచుర్యం తెలుసుకున్నాక పాతికేళ్ల తమ పత్రిక ప్రస్థానంలో సాధించింది చాలా స్వల్పమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో రామోజీ గ్రూపు సంస్థల సహకారాన్ని కోరుకుంటున్నామని యోషియాకీ కోగా తెలిపారు.



హవామహల్ నుంచి ఫిల్మ్‌సిటీని వీక్షిస్తున్న జపాన్ ప్రతినిధులు

కొంనిచ్చివా... ఒహాయో గోయ్జైమస్...

సందర్శనకు వచ్చిన మీడియా ప్రతినిధుల బృందానికి ఎ.వి.రావు బృందం జపాన్ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికింది. 30 మంది అతిథులకు నుదుటున బొట్టుపెట్టి కొంనిచ్చివా.. (నమస్తే)... ఒహాయో గోయ్జైమస్ (శుభోదయం) అంటూ ఆత్మీయంగా ఆహ్వానించింది. హవామహల్ వద్ద రాజస్థానీ సంప్రదాయ నృత్యాలతో జపాన్ ప్రతినిధులను అలరించగా... కళాకారుల నృత్యాలకు ముగ్ధులై వారు కూడా నృత్యం చేశారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్న జపనీస్ గార్డెన్‌లో విహరించారు. మాయాలోక్‌లో ప్రదర్శించిన చిత్రాలను చూసి చిన్నపిల్లల్లా కేరింతలు కొట్టారు.

సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యా

రామోజీ ఫిల్మ్ సిటీలో అడుగుపెట్టాక ఇక్కడి వాతావరణం, నిర్మాణాలు, వింతలు, విశేషాలు చూసి ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యా. జపాన్ నుంచి చాలామంది ప్రతినిధుల బృందం భారత్‌కు వచ్చి.. వేర్వేరు ప్రాంతాలను సందర్శించి మాకు వివరాలు చెప్పేవారు. రామోజీ ఫిల్మ్ సిటీ చూశాక వారు చెప్పిన ప్రాంతాల కన్నా మిన్నగా అనిపించింది. – మినామీ, కొడాన్షా ప్రతినిధి

సువిశాల ప్రపంచాన్ని సృష్టించిన రామోజీరావు

ప్రపంచవ్యాప్త పర్యాటకుల కోసం రామోజీరావు సువిశాల ప్రపంచాన్ని సృష్టించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఉన్నన్ని ఆకర్షణలు నాకు ఎక్కడా కనిపించలేదు. అద్భుతాలు అన్నీ ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడంలో రామోజీ కృషి ఎంతో గొప్పది. నాకు మాత్రం ఫిల్మ్ సిటీ సందర్శన పది విజ్ఞాన గ్రంథాలు చదివినట్టుగా ఉంది. – అయికో చికాబా, విజువల్ కంటెంట్ ప్రొడ్యూసర్

నారావారిపల్లెలో కిటకిటలాడిన 'ప్రజాదర్బార్'

మంత్రి లోకేశ్ వినతుల స్వీకరణ



దివ్యాంగుడి వినతిని పరిశీలిస్తున్న లోకేశ్

ఈనాడు డిజిటల్, తిరుపతి: భోగి పండగను పురస్కరించుకుని తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని తన నివాసంలో మంత్రి నారా లోకేశ్ బుధవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. పండగకోసం సొంతూరికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కలిసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, తెదేపా కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించిన లోకేశ్.. వారినుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలు విన్నారు. భూ సమస్యలు, ఉద్యోగ భద్రత, స్థలాల కేటాయింపు లాంటి అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'వైకుంఠ' విజయంపై సీఎంకు నివేదిక

ఈనాడు డిజిటల్, తిరుపతి: నారావారిపల్లె పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబును తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు కలిశారు. ఇటీవల ముగిసిన వైకుంఠ ఏకాదశి పదిరోజుల దర్శన ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అదనపు ఈవో సమర్పించారు. గతంలో వైకుంఠ ఏకాదశి అంటే కిలోమీటర్ల మేర క్యూలైన్లు, రోజుల తరబడి నిరీక్షణ ఉండేది. ఈసారి ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా అత్యంత పారదర్శకంగా, సులభంగా దర్శనాలు కల్పించామని అదనపు ఈవో సీఎంకు వివరించారు. పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో భాగంగా రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించినట్లు తెలిపారు. స్లాట్ విధానం పక్కాగా అమలు చేయడంతో భక్తులు ఎక్కడా నాలుగు గంటలకు మించి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం రాలేదని, మెజారిటీ భక్తులు రెండు గంటల్లోనే దర్శనం పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. తిరుమలలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి వాడిన అత్యాధునిక సాంకేతికత గురించి సీఎం ప్రత్యేకంగా వారిని అడిగి తెలుసుకున్నారు. 300కు పైగా సీసీ కెమెరాలు, 42 ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా ప్రతి భక్తుని కదలికను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించినట్లు అదనపు ఈవో వివరించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సామాన్య భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని అధికారులను ఆదేశించారు.

'ఎగుమతుల సన్నద్ధత సూచిక' ర్యాంకుల్లో ఏపీకి 5వ స్థానం

2024లో రూ.1.65 లక్షల కోట్లుగా నమోదు

ఈనాడు, దిల్లీ: నీతి ఆయోగ్ బుధవారం విడుదల చేసిన 'ఎగుమతుల సన్నద్ధత సూచీ-2024 (ఎక్స్‌పోర్ట్ ప్రిపేర్‌నెస్ ఇండెక్స్)'లో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఐదో స్థానంలో నిలిచింది. 2020లో 20, 2021లో 9, 2022లో 8వ స్థానంలో నిలిచిన రాష్ట్రం పరిస్థితిని కొంత మెరుగుపరుచుకొని 5వ స్థానానికి చేరింది. వికసిత్‌భారత్ విజన్- 2047లో భాగంగా 2030 నాటికి భారతీయ ఎగుమతులను 1 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకొన్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా రాష్ట్రాలు ఎంతవరకు సన్నద్ధమయ్యాయన్న కోణంలో అధ్యయనంచేసి ఈ నివేదికను ప్రచురించింది. ఎగుమతులకు అనువైన మౌలికవసతుల కల్పన (20%), వ్యాపార వాతావరణం (40%), విధాన నిర్ణయాలు-పరిపాలన (20%), ఎగుమతుల పనితీరు (20%) అన్న నాలుగు ప్రధానాంశాలను ఆధారంగా చేసుకొని రాష్ట్రాల పనితీరును మదింపు చేసినట్లు నీతి ఆయోగ్ పేర్కొంది. ఇందులో మహారాష్ట్ర (68.01), తమిళనాడు (64.41), గుజరాత్ (64.02), ఉత్తర్‌ప్రదేశ్ (62.09), ఆంధ్రప్రదేశ్ (60.65 మార్కులు)లు పెద్దరాష్ట్రాల విభాగంలో తొలి ఐదు స్థానాలను ఆక్రమించాయి. తెలంగాణ (57.14) 8వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 2024లో మొత్తం రూ.1.65 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు చేసింది. రాష్ట్రం నుంచి వెళ్లిన ఎగుమతుల్లో 21.96% యూఏఈ, 6.95% చైనా, 5.56% సింగపూర్, 4.35% ఇండోనేసియా, 3.07% సౌదీ అరేబియాకు చేరాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 2024లో రూ.24,679 కోట్ల సముద్ర ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో ప్రధాన భూమిక శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలదేనని నివేదిక పేర్కొంది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60% వాటాతో ఆంధ్రప్రదేశ్ దేశంలో తొలిస్థానంలో నిలిచింది. రూ.18,410 కోట్ల విలువైన ఫార్మాసూటికల్ ఎగుమతులతో ఐదో స్థానం సాధించింది.

18 నుంచి ఖమ్మం గుమ్మంలో 'సీపీఐ' వందేళ్ల పండగ

ఈనాడు, ఖమ్మం: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) వందేళ్ల పండగకు తెలంగాణలోని ఖమ్మం వేదికకానుంది. ఈ నెల 18 నుంచి నాలుగు రోజులపాటు సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు జరగనున్నాయి. తొలిరోజు జరిగే బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై ఆ పార్టీతో ఉన్న అనుబంధాన్ని పంచుకోనున్నారు. సీపీఐ శ్రేణులకు ప్రధాన కార్యదర్శి డి.రాజా మార్గనిర్దేశనం చేయనున్నారు.

18న భారీ సభ: తొలిరోజు ఆదివారం ఖమ్మంలో పార్టీ శ్రేణుల భారీ కవాతు, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఉంటాయి. సభలో సీఎం రేవంత్‌రెడ్డి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు ప్రసంగిస్తారు. చైనా, క్యూబా, వెనెజువెలా, వియత్నాం తదితర దేశాల ప్రతినిధులు హాజరవుతారు. 19న జాతీయ సమితి సమావేశం, 20న సవాళ్లపై సదస్సును నిర్వహిస్తారు. 21న ముగింపు ఉత్సవాలు ఉంటాయి.

అరుదైన మొక్కలతో ఔషధ వనం

ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అందమైన ఔషధ వనాన్ని ఏర్పాటు చేశారు. కుండీలతో పాటు ప్రత్యేకంగా రింగులను ఏర్పాటు చేసి 350కి పైగా మొక్కలను పెంచుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన అరిస్టోలిఫియా లిక్టోరాలిస్ (బాతు పువ్వు), యాస్పరాగస్ లియోసెస్, సర్పాక్షి, బ్రహ్మమల్లిక వంటి అరుదైన మొక్కలు, తులసి, బిల్వాలలో వివిధ రకాలను, విటమిన్ ప్లాంట్, నాగమల్లి, స్టీవియా, వట్టివేళ్లు లాంటి ఔషధ మొక్కలతో ఈ వనాన్ని ప్రత్యేకంగా రూపొందించామని హెర్బల్ గార్డెన్ కోఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. – ఈనాడు, అమరావతి



హెర్బల్ గార్డెన్



తీగ మొక్కలను ప్రత్యేకంగా పెంచుతూ..



చెట్టుపై పెరిగే అరుదైన యాస్పరాగస్ లియోసెస్ మొక్క



కేరళ నుంచి తెచ్చిన సర్పాక్షి



కోల్‌కతా నుంచి తెప్పించిన బాతు పువ్వు మొక్క

45 ఏళ్ల తర్వాత నిజమైన సంక్రాంతి!

- 2,111 కుటుంబాల్లో వెలుగులు
- రూ.2 వేల కోట్లకుపైగా విలువైన భూ సమస్యకు చంద్రబాబు చొరవతో పరిష్కారం
- తిరుపతి జిల్లాలో సమసిన శెట్టిపల్లె వివాదం
- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాటరీ.. లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు





శెట్టిపల్లెలో చదును చేసిన భూమి ★ నారావారిపల్లెలో సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతూ బుధవారం ప్లకార్డులు ప్రదర్శిస్తున్న శెట్టిపల్లె భూముల లబ్ధిదారులు

ఈనాడు, తిరుపతి: ఒకటా రెండా.. 380.42 ఎకరాల భూ వివాదం.. 45 ఏళ్లుగా నలుగుతున్న వ్యవహారం.. 2,111 మందికి సంబంధించిన సమస్య.. అదీ ఏ మారుమూల ప్రాంతంలోనో కాదు, తిరుపతి నగరాన్ని ఆనుకుని ఉన్న శెట్టిపల్లెలో. ఇక్కడ 1945 ఎస్టేట్ ఎబాలిషన్ చట్టం ప్రకారం సెటిల్‌మెంట్ జరగలేదంటూ అనుభవంలోని వ్యక్తులకు భూమిపై చట్టబద్ధ హక్కులు కల్పించలేదు. ఈ కారణంగా వారు.. తమ పిల్లల చదువులు, వివాహాలు, కుటుంబ అవసరాలకు భూములు అమ్ముకోవాలన్నా కుదరని పరిస్థితి. భూమి విలువ రూ.2 వేల కోట్ల పైమాటే. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం చొరవ తీసుకుని.. యజమానుల అభ్యర్థన మేరకు భూ సమీకరణకు శ్రీకారం చుట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా మాటలతో మభ్యపెట్టింది. సమస్యను పరిష్కరించకుండా చేతులు దులిపేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దాదాపు 30 సార్లు లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం చూపారు. సంక్రాంతి రోజు లాటరీ తీసి లబ్ధిదారులకు పారదర్శక విధానంలో ప్లాట్లు కేటాయించనున్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుంది. తర్వాత వారికి పట్టాలు మంజూరు చేస్తారు. భూముల యజమానులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేకుండా.. ప్రభుత్వం స్టాంపు రుసుము మినహాయింపు ఇచ్చింది. లబ్ధిదారులపై రూ.16 కోట్ల ఆర్థిక భారాన్ని తప్పించింది.

సాగుదారులు... నివాస స్థలాల వారికి న్యాయం చేసేలా

శెట్టిపల్లె రెవెన్యూలో మొత్తం 636.38 ఎకరాలు ఉన్నాయి. 1979 మేలో ఇనామ్ చట్టం రద్దు కావడం, ఆలోపు ఎస్టేట్ ఎబాలిషన్ యాక్టు 1945 ప్రకారం సెటిల్‌మెంట్ జరగకపోవడంతో సమస్య మొదలైంది. అప్పటివరకు భూములు సాగు చేసుకుంటున్న, నివాస స్థలాలున్న వ్యక్తులకు చిక్కులు మొదలయ్యాయి. శాశ్వత పరిష్కారం చూపాలని చేసిన విన్నపాలు బుట్టదాఖలయ్యాయి. ఇందులోనే రైల్వేశాఖ, చెరువు, తదితరాల కింద కోల్పోయిన భూమిని మినహాయిస్తే 380.42 ఎకరాలు ప్రస్తుతం ఉంది. దీన్ని 22ఎ జాబితాలో పెట్టడంతో రిజిస్ట్రేషన్లు నిలిచాయి. అధికశాతం భూమి ఖాళీగానే ఉంది. సమస్య పరిష్కారంలో భాగంగా.. గత 18 నెలలూ వారితో ప్రభుత్వం సమావేశాలు నిర్వహించింది. అనుభవంలోని విస్తీర్ణంలో వ్యవసాయం చేసుకునే వారైతే 30%, ఇంటి స్థలాలైతే 50% చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. మిగిలింది ప్రభుత్వం, తుడాకు చెందుతుంది. అయితే ఇంటి స్థలాల విస్తీర్ణం రెండు సెంట్లకు తగ్గకుండా చూడాలని నిర్ణయించారు. ఈ మేరకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు.

★ భూమిపై ఉన్న వారిలో సాగుదారులు, నివాసం ఉండేవారు కలిపితే 2,111 మందిగా తేలింది. దామాషా పద్ధతిలో 225.42 ఎకరాలను యజమానులకు, 90 ఎకరాలను ప్రభుత్వానికి, 65 ఎకరాలను తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు కేటాయించారు. దాదాపు 900 మందికి 2 సెంట్లలోపే స్థలం వచ్చింది. మంత్రివర్గ నిర్ణయం మేరకు వారికి కూడా 2 సెంట్ల చొప్పున కేటాయించారు. దీంతో 2,111 మందికీ న్యాయం జరిగింది.

తుడా నిధులతో మౌలిక సౌకర్యాల కల్పన

నివాస గృహాల వారు, రైతులకు ఇచ్చిన 225.42 ఎకరాల్లో రోడ్లు, పార్కులు, దేవాలయాలు, శ్మశాన వాటిక, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్తు, తదితర సౌకర్యాల్ని తుడా నిధులతో ప్రభుత్వమే కల్పించనుంది. 65 ఎకరాలను ఇప్పటికే తుడాకు కేటాయించిన నేపథ్యంలో మౌలిక వసతులకు మినహాయించిన స్థలం పోనూ 39 ఎకరాల్లో ఆ సంస్థ ప్లాట్లు వేయనుంది. వాటిని విక్రయించగా వచ్చిన సొమ్ముతోనే లబ్ధిదారుల లేఅవుట్‌లో సదుపాయాలు కల్పిస్తారు. తద్వారా లబ్ధిదారులపై రూ.100 కోట్ల భారం తప్పించినట్లవుతుంది. ప్రభుత్వానికి దక్కిన 90 ఎకరాల్లో అత్యాధునిక టౌన్‌షిప్, వెడ్డింగ్ డెస్టినేషన్ సెంటర్, తదితర నిర్మాణాలు చేయనున్నారు.

త్వరలోనే పట్టాల అందజేత

శెట్టిపల్లె సమస్యను సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పరిష్కరించాం. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి లేఖలు రాయగా సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు పట్టాలను త్వరలోనే అందిస్తాం. – వెంకటేశ్వర్, కలెక్టర్

రైళ్లలో 'కొత్తగా' టీ, కాఫీ విక్రయాలు



సిబ్బందితో వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోహ్రా

విశాఖపట్నం(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైళ్లలో టీ, కాఫీ విక్రయాలకు నూతన విధానాన్ని తీసుకొచ్చామని వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోహ్రా బుధవారం తెలిపారు. ఇన్నాళ్లూ స్టీల్ ఫ్లాస్కుల్లో తీసుకొచ్చి, కప్పుల్లో పోసే విధానం ఇబ్బందిగా ఉండడంతో పాటు, అపరిశుభ్రంగా ఉంటుందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా సిబ్బందికి ప్రత్యేకంగా తయారు చేసిన డ్రెస్‌లో థర్మో కంటెయినర్లు అమర్చామన్నారు. వాటిల్లో ఫ్లాస్కు, కప్పులు ఉంచి.. టీ, కాఫీ విక్రయించేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని.. పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత, మిగిలిన రైళ్లలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఐదు లీటర్ల ఫ్లాస్కుతో ఒకసారికి 35 మందికి టీ, కాఫీ ఇచ్చే వీలుంటుందని వెల్లడించారు.

భూగర్భ జలశాఖ సంచాలకుడిగా సుబ్బరాయశాస్త్రి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ భూగర్భ జలవనరుల శాఖ సంచాలకుడిగా కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ ఆయకట్టు అభివృద్ధి సంస్థలో సంయుక్త సంచాలకుడిగా ఉన్న ఆయనకు భూగర్భజల సంచాలకుడిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు.

17న కాకినాడలో సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 17న కాకినాడలో పర్యటించనున్నారు. కాకినాడ గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పిన ఏఎం గ్రీన్ అమ్మోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. శనివారం ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీరి పర్యటన సాగనుంది.

రోశయ్య కుమారుడు శివకు సీఎం పరామర్శ

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం తెల్లవారుజామున రోశయ్య సతీమణి శివలక్ష్మి కన్నుమూశారు. ఆమె కుమారుడు కొణిజేటి శివతో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. రోశయ్య కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

శ్రీవాణి ట్రస్టుకు విరాళం ఇచ్చేలోపే టికెట్లు ఖాళీ

- ఆన్‌లైన్ దర్శన టికెట్ల జారీలో సాంకేతిక ఇబ్బందులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి దర్శన టికెట్ల జారీలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ కింద తితిదే వాటిని జారీ చేస్తోంది. రోజుకు 800 టికెట్లను అందుబాటులో ఉంచుతుండగా నిమిషాల్లోనే భక్తులు కొనుగోలు చేస్తున్నారు. తితిదే వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.in/#/user లోకి వెళ్లి శ్రీవాణి కరెంట్ డొనేషన్ విభాగం కింద ఈ టికెట్లు పొందాల్సి ఉంటుంది. ముందుగా శ్రీవాణి ట్రస్టుకు రూ.10,000 చొప్పున (గరిష్ఠంగా నలుగురికి) విరాళం అందించాలి. భక్తుల వివరాలు నమోదు చేశాక పేమెంట్ గేట్‌వే వస్తుంది. ఇది పూర్తయ్యాక విరాళం ఇచ్చినట్లు సంక్షిప్త సమాచారం అందుతుంది. అనంతరం కరెంట్ బుకింగ్‌లో 800 శ్రీవాణి టికెట్లు అందుబాటులో ఉన్నాయా? లేదా? పరిశీలించుకుని డోనర్ ప్రివిలేజెస్/దర్శన్ రిడెంప్షన్ కింద బుకింగ్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఎంతమంది భక్తులకు శ్రీవాణి దర్శన టికెట్లు కావాలో వారందరికీ రూ.500 చొప్పున నగదు చెల్లించి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది.

తప్పని నిరీక్షణ: భక్తులు శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించేందుకు సమయం పడుతోంది. ఆ సమయంలో అప్పటికే గతంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల చొప్పున విరాళం అందించిన భక్తులు కొందరు రూ.500 చెల్లించి దర్శన టికెట్లను తీసుకుంటున్నారు. వీరికి ఏడాదిలోపు దర్శనం టికెట్ పొందే వీలుంటుంది. దీంతో ఏరోజుకారోజు కరెంట్ బుకింగ్‌లో శ్రీవాణి టికెట్లు పొందాలని ఆశించే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో నేరుగా తిరుమల వచ్చిన భక్తులకు నిరాశ మిగులుతోంది. సదరు భక్తులు మరో రోజు కరెంట్ బుకింగ్ పొందాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకు ఆధ్వర్యంలో శ్రీవాణి టికెట్ల కోసం ఒకేసారి రూ.10,500 చెల్లించే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఓ ప్రైవేటు బ్యాంకు తీసుకొచ్చిన నూతన విధానంలో ముందుగా రూ.10 వేలు విరాళం ఇచ్చి ఆ తర్వాతే రూ.500 టికెట్ కొనాల్సి వస్తోంది. పలు ఫిర్యాదుల నేపథ్యంలో తితిదే ఐటీ విభాగం సదరు లోపాలు సరిదిద్దే ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఒకేసారి శ్రీవాణి విరాళం, టికెట్ కొనుగోలు ఆప్షన్ తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. నూతన విధానాన్ని నెలరోజులపాటు పరిశీలించనున్నట్లు తితిదే తెలిపిన నేపథ్యంలో ఈ సమస్య వెలుగులోకి వచ్చింది.

మావోయిస్టు నారాయణ కుటుంబసభ్యుల విచారణ

వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం పంచాయతీ పరిధి పెదవంక గ్రామానికి చెందిన ఏవోబీ కమిటీ సభ్యుడు, మావోయిస్టు చెల్లూరు నారాయణ కుటుంబసభ్యులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని.. నారాయణ ఆచూకీ కోసం విచారిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఒడిశాలోని కొంధమాల్ జిల్లా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్గొండ జిల్లాకు చెందిన మావోయిస్టు పార్టీ కీలక నేత గణేశ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ఎన్‌కౌంటర్‌లో చెల్లూరు నారాయణ గాయాలతో తప్పించుకున్నట్లు పోలీసు నిఘా వర్గాలు చెబుతున్నాయి. వీరు తెలిపిన సమాచారం మేరకు.. భువనేశ్వర్‌కు చెందిన ఇంటెలిజెన్స్ పోలీసులు నారాయణ ఆచూకీకోసం గాలిస్తున్నారు. ఆయన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం అందడంతో బాతుపురం పంచాయతీతోపాటు బంధువులుంటున్న రాజాం పంచాయతీ పరిధిలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నారాయణ తమ్ముడు సింహాచలం, అల్లుళ్లు ఆనందరావు, శంకర్‌లను అదుపులోకి తీసుకుని భువనేశ్వర్‌లోని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం ఇంటి దగ్గర నుంచి సింహాచలాన్ని, చిన్న కుమార్తె వాణిని పోలీసులు తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.



మీ పిల్లల బాల్యాన్ని మధుర జ్ఞాపకంగా మార్చండి

ఆఫీసులో మీ అదనపు పని గంటలు, ఒత్తిళ్ల గురించి మీ పిల్లలు పట్టించుకోరు. వాటిని అర్థం చేసుకొనే వయసు కూడా కాదు. తల్లిదండ్రులు తమతో సరదాగా గడపాలని మాత్రమే వారు కోరుకుంటారు. వారు బాల్యంలో ఉన్నప్పుడే అందుకు సమయం కేటాయించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అప్పుడే పిల్లలకూ, మీకూ జీవితాంతం ఆ క్షణాలు మధుర జ్ఞాపకాలుగా మిగులుతాయి.

– అమీ, పేరెంటింగ్ కోచ్



విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీ కేశినేని శివనాథ్, తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ పాల్గొన్నారు. - ఈనాడు, అమరావతి

సంక్రాంతి సందళ్లు.. ఆనందాల లోగిళ్లు..



గొల్లపూడి తెదేపా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని సందడి చేశారు.

- గొల్లపూడి, న్యూస్‌టుడే

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ☀ రైలు నంబరు 07484 విజయవాడ-గుంతకల్ ఈ నెల 16వ తేదీ రాత్రి 7 గంటలకు విజయవాడలో బయలుదేరి 17వతేదీ ఉదయం 4.30 గంటలకు గుంతకల్ చేరుకుంటుంది. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కంభం, నంద్యాల, డోన్ స్టేషన్లలో ఆగుతుంది. ★ 07485 మచిలీపట్నం-ధర్మవరం 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి 17వ తేదీ ఉదయం 6.30 గంటలకు ధర్మవరం చేరుతుంది. ఈ రైలు గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, మదనపల్లి, కదిరి స్టేషన్లలో ఆగుతుంది.

పందేలకు.. పగ్గాల్లేవ్!

హైటెక్ బరుల్లో రూ. కోట్లలో జూదం ★ పత్తాలేని పోలీసులు, అధికారులు



పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలో..

ఈనాడు, అమరావతి

హైటెక్ బరుల్లో.. రూ.కోట్లలో పందేలు బుధవారం యథేచ్ఛగా జరిగాయి. కోడిపందేలు, గుండాట, మూడు ముక్కలాట, లోపల.. బయట.. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. జూదానికి సంబంధించిన అన్ని ఆటలూ ఇక్కడ ఏర్పాటు చేశారు. కోడి పందేల బరిని ఆనుకుని గ్యాలరీలు, వాటి చుట్టూ.. భారీ షెడ్లు.. టెంట్‌హౌస్‌లు వేసి.. జూద క్రీడలు ఆడిస్తున్నారు. మంగళవారం వరకు హడావుడి చేసిన పోలీసులు, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం బుధవారం ఉదయం నుంచి పత్తాలేకుండా పోయారు.



రామవరప్పాడు: జూద టేబుల్స్ వద్ద రద్దీ

విజయవాడను ఆనుకుని ఈ ఏడాది నుంచి కొత్తగా.. గుణదల-రామవరప్పాడు మధ్యలో ఒకటి, అది దాటిన వెంటనే నున్న పవర్‌గ్రిడ్ వెళ్లే మార్గంలో మరొకటి.. ఇద్దరు ఎమ్మెల్యేలు పోటాపోటీగా రెండు బరులు ఏర్పాటు చేశారు. ఈ రెండు దాటి కొద్దిదూరం వెళితే.. అంబాపురం అగ్రిగోల్డ్ భూముల పక్కనే మరో హైటెక్ బరి ఏర్పాటైంది. హైదరాబాద్ వైపు వెళ్లే దారిలోనూ విజయవాడ శివారులో పాముల కాల్వ వద్ద కూడా మరో కొత్త బరి ఈ ఏడాది వెలిసింది. ఇవన్నీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో వారి అనుచరుల ఆధ్వర్యంలో నెలకొల్పినవే కావడంతో అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా ఇటువైపు చూడడం లేదు.





రామవరప్పాడు సమీపంలో ఏర్పాటు చేసిన బరి వద్ద జనం

భారీ హంగులు.. బౌన్సర్లతో కాపలా..

విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని విస్సన్నపేట మండలం తాతకుంట్ల, తిరువూరు, కంచికచర్ల మండలం గండేపల్లి, రెడ్డిగూడెం పరిధిలోని రంగాపురం, పెనుగంచిప్రోలు, లింగాల.. ఇవన్నీ హైటెక్ బరులే. వీటిల్లో బుధవారం రూ.కోట్లలో పందేలు సాగాయి. జూదం ఆడేవారి స్థాయిని బట్టి ఇక్కడ ఏర్పాట్లు చేశారు. సామాన్యులు ఆడుకునేందుకు.. కోడి పందేల బరుల చుట్టూ పెద్ద సంఖ్యలో టెంట్లు వేసి వాటిలో టేబుళ్లు ఏర్పాటు చేసి జూద క్రీడలు పెట్టారు.

కాయిన్స్ తీసుకుంటే.. చేతికి బ్యాండ్

☛ రూ.లక్షల్లో పందేలు కాసేవారి కోసం.. ప్రత్యేకంగా హైటెక్ టెంట్‌లను వేశారు. వీటిలోనే డిజిటల్ తెరలు, ఏసీలు బిగించారు. వీటి ప్రవేశ మార్గాల్లో బౌన్సర్లను నిలబెట్టారు. ప్రవేశ మార్గం పక్కనే కౌంటర్లో ప్రవేశరుసుం కట్టి అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత అక్కడే డబ్బులు చెల్లించి.. కాయిన్స్ తీసుకుంటే.. వారి చేతికి ఓ బ్యాండ్ వేస్తున్నారు. ఆ బ్యాండ్ ఉన్న వాళ్లనే బౌన్సర్లు లోపలికి పంపిస్తున్నారు. ఈ హైటెక్ టెంట్‌లలో క్యాసినో తరహా ఏర్పాట్లు చేశారు.

పార్కింగ్ పేరుతో.. భారీగా దోపిడీ

బైక్‌కు రూ.50, కారుకు రూ.100 వసూళ్లు

ఈనాడు, అమరావతి

సంక్రాంతి సంబరాల పేరుతో అనుమతులు తీసుకుని ఏర్పాటు చేసిన బరుల్లో సామాన్యులను కూడా వదిలిపెట్టకుండా దోపిడీ చేస్తున్నారు. చిన్నారులతో సహా కుటుంబాలను తీసుకుని చూసేందుకు వెళ్లే వారికి ప్రవేశ మార్గంలోనే చుక్కెదురవుతోంది. ద్విచక్ర వాహనానికి రూ.50, కారుకు రూ.100 పార్కింగ్ రుసుం పేరుతో వసూలు చేస్తున్నారు. విజయవాడ శివారులో ఏర్పాటు చేసిన మూడు బరుల్లోనూ పార్కింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారు. హైటెక్ బరులకు చుట్టూ ఉన్న పొలాలను కొద్దిగా చదును చేసి.. బైక్‌లు, కార్లను వేలాదిగా నిలిపేందుకు వినియోగిస్తున్నారు. వీటికే ప్రతి మూడు గంటల సమయానికి రుసుం కింద టోకెన్లను ముద్రించి మరీ వసూళ్లు చేస్తున్నారు. ఏ సమయంలో చూసినా.. కనీసం 500 నుంచి వెయ్యి కార్లు, వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంటున్నాయి. ఈ లెక్కన పార్కింగ్ పేరుతోనే.. ప్రతి మూడు గంటలకు కనీసం రూ.లక్ష నుంచి రూ.లక్షన్నరకు పైగా దోపిడీ చేస్తున్నారు.





రామవరప్పాడు: కార్ల పార్కింగ్

ట్రాఫిక్ స్తంభించినా పట్టించుకునేవారేరి..

విజయవాడ శివార్లలో ప్రధాన రహదారులకు పక్కనే హైటెక్ బరులు ఏర్పాటు చేయడంతో.. కిలోమీటర్ల మేర బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. రామవరప్పాడు చౌరస్తా వద్ద ఉన్న పైవంతెన నుంచి వాహనాలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. పార్కింగ్ రుసుం వసూలు చేసేందుకు.. బరుల వద్ద ప్రవేశ మార్గంలో వాహనాలను లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటుండడమే ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణం. వచ్చిన వాహనాలు వచ్చినట్టే లోపలికి వెళ్లిపోతే ఇబ్బంది ఉండదు. కానీ ప్రవేశ ద్వారం వద్ద ఆపడంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలు కూడా నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతంలో కిలోమీటరు దాటడానికి కనీసం గంటకు పైగా సమయం పడుతోంది. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఈ ప్రాంతంలో పోలీసులు లేకపోవడం దారుణం.

మద్యం ఏరులై పారుతోంది..

బరుల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఏకంగా మద్యం విక్రయించే కేంద్రాలు వెలిశాయి. వీటిలో రెట్టింపు ధరకు మద్యం విక్రయిస్తున్నారు. కొంత మంది ఏకంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో మద్యం పెట్టుకుని.. అక్కడే గ్లాసుల్లో పోసి.. మందుబాబులకు ఇస్తున్నారు. ఆ పక్కనే బిర్యానీ సెంటర్లు, మాంసం దుకాణాలను ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్‌లో 'హెల్ప్ డెస్క్' ఏదీ?

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు ఎవరిని ఎక్కడ కలవాలో తెలియని పరిస్థితి. ఇక్కడ ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క్' వంటి సౌకర్యం లేదు. దీంతో చెట్ల కింద కూర్చున్న వారిని, అటుగా వెళ్లే వారిని ప్రాధేయపడాల్సి వస్తోంది. ముఖ్యంగా కార్యాలయ పరిపాలన అధికారి (ఏవో) విభాగాన్ని ముందు వైపునకు తరలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఏవో కార్యాలయం వెనుక వైపు ఉండడంతో అంతగా తెలియడం లేదు.

నగరంలో మూడు కలెక్టరేట్ల తికమక: ప్రతి జిల్లాలో ఒక కలెక్టరేట్ మాత్రమే ఉంటుంది. విజయవాడలో మాత్రం కలెక్టరేట్, కలెక్టర్ విడిది కార్యాలయం, సబ్ కలెక్టరేట్ ఇలా మూడు కలెక్టరేట్‌లుగా ఉండి తికమక పరిస్థితులు నెలకొన్నాయి. సర్వశిక్షా అభియాన్ వారు ఇటీవల పలు ఖాళీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ కార్యాలయం ఎంజీ (బందరు) రోడ్డులోని ఆకాశవాణి ఎదురుగా ఉన్న మాంటిస్సోరి కళాశాల ప్రాంగణంలోని సబ్ కలెక్టరేట్ ఆవరణలో ఉంది. చాలా మంది దరఖాస్తుదారులు నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి అడుగుతున్నారు. ఇక్కడ కాదు అక్కడ అని చెప్పే వారు లేని పరిస్థితి ఏర్పడింది. కలెక్టర్, జేసీలు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లిన సందర్భాల్లో కలెక్టరేట్‌లో వారు ఎప్పుడు అందుబాటులో ఉంటారో చెప్పే వారు లేక.. ప్రజలు పదేపదే తిరగాల్సి వస్తోంది. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడమో లేదా ఏవో విభాగాన్ని అందుబాటులో ఉండేలా చూడడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలకు 5,057 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి బుధవారం 5,057 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 2,713, పశ్చిమ ప్రధాన కాలువకు 2,258, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్‌కు 1501, ఏలూరు 708, కేఈబీ 403, బందరు కాలువకు 101 క్యూసెక్కుల చొప్పున వదిలారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ ద్వారా కృష్ణా, ఏలూరు జిల్లాలకు ప్రస్తుతం సాగు, తాగు అవసరాలకు నీటిని ఇస్తున్నారు. తాగునీటి చెరువులు నిండిన తర్వాత నిలిపివేసే యోచనలో ఉన్నారు.

మంచు ముసిరే.. ప్రమాదం కనరే..





విజయవాడలో బుధవారం ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు వీడలేదు. బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ పై నుంచి చూస్తే కనుచూపు మేర మంచు తెరలు కమ్ముకుని ఉండడంతో వాహనాలకు దారి కూడా కనిపించకుండాపోయింది. ఇలాంటి సమయంలోనూ ఓ వ్యక్తి వాహనం నడుపుతున్నామనే స్పృహ మరిచి ఒక చేత్తో సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ.. మరో చేత్తో వాహనం నడుపుతూ తాడిగడప వంద అడుగుల రోడ్డులో కనిపించారు. -ఈనాడు, అమరావతి


భోగి మంటలు వెలిగిస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ


రాజగోపురం ప్రాంగణంలో గంగిరెద్దు విన్యాసాలు

ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి వేడుకలను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ బుధవారం ప్రారంభించారు. వేకువ జామున మహాగణపతి స్వామి ఆలయం వద్ద పూజ చేసిన అనంతరం భోగి మంటలు వెలిగించారు. గోమాతకు పూజలు చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయంగా హరిదాసుల సంకీర్తన, గంగిరెద్దుల విన్యాసాలు, గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించే పశుసంపద, పూరిపాకలు, రంగవల్లుల లోగిళ్లు, ఎడ్లబండ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థానం పాలకమండలి సభ్యులు, ఈవో, అధికారులు వాటి ముందు ఫొటోలు దిగారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈలు రాంబాబు, కోటేశ్వరరావు పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, గుడిపాటి వెంకట సరోజనీ దేవి, పద్మావతి, సరిత పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

నగరాభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి


ఎన్టీఆర్ భవన్‌లో భోగి మంట వద్ద హరిదాసు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన విజయవాడ అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతం చేస్తున్నామని, సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపీ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగి సంబరాలకు తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత వైకాపా ప్రభుత్వ విధానాలకు నిరసనగా.. జగన్ చిత్రంతో ఉన్న పాస్ పుస్తకాల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ప్రజల ఆస్తులపైనా జగన్ బొమ్మ ముద్రించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు తెలిపారు. విజయవాడలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మౌలిక వసతులతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎంపీ శివనాథ్ సతీమణి జానకిలక్ష్మి, కుమారుడు వెంకట్, కుమార్తె స్నిగ్ధ, నాయకులు బొప్పన భవకుమార్, జంపాల సీతారామయ్య, షేక్ ఆశ, చెన్నుపాటి ఉషారాణి, చలసాని రమణ, రాజేష్, సొంగా సంజయ్ వర్మ, గన్నె ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో దుర్గగుడి స్టాల్


స్టాల్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా దిల్లీ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గగుడి స్టాల్‌ను ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ ప్రతిరూప ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం స్టాల్‌ను మూడు రోజుల పాటు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ స్టాల్లో అమ్మవారి ప్రసాదాలతోపాటు దుర్గగుడి క్యాలెండర్లు, డైరీలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ప్రవాసాంధ్రులు, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుర్గగుడి సూపరింటెండెంట్ జగదీష్ పాల్గొన్నారు.

ఆకాశవాణిలో కవి సమ్మేళనం


హాజరైన కవులు రంగారావు, వెంకట కృష్ణారావు, జాన్, కలిమిశ్రీ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆకాశవాణి విజయవాడ కేంద్రం గురువారం 'సంక్రాంతి శోభ' కవి సమ్మేళనాన్ని ప్రసారం చేస్తుందని డీడీజీ, ఛానల్ రీజనల్ మేనేజర్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవులు రావి రంగారావు, పింగళి వెంకట కృష్ణారావు, ఎంపీ జాన్, చలపాక ప్రకాష్, ఆంజనేయ కుమార్, కలిమిశ్రీ పాల్గొని పద్య, వచన కవితలు చదివారు. ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డాక్టర్ చుండూరు మాణిక్యరావు పర్యవేక్షణలో జరిగిన సమ్మేళనాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ ఎఫ్ఎంలో, మధ్యాహ్నం 3 గంటలకు ఆకాశవాణి ప్రైమరీ ఛానల్‌లో ప్రసారం చేయనున్నట్లు సోమేశ్వరరావు వెల్లడించారు.

'రాజ్యాంగ సవరణతోనే బీసీలకు రిజర్వేషన్లు'


ఐక్యత చాటుతున్న శంకరరావు, నాగమల్లేశ్వరరావు, మూర్తి, అప్పారావు తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణే ఏకైక పరిష్కారమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. దీనికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు దేశంలోని 11 రాష్ట్రాల్లో తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి బీసీలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్రాల చేతుల్లో లేకుండా పోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రిజర్వేషన్లపై త్వరలో ప్రధాని మోదీని కలుస్తామని తెలిపారు. రిజర్వేషన్ల పెంపు, బీసీ రక్షణ చట్టంపై విజయవాడలో మేధోమథన సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్.వి.రావు, నమ్మి అప్పారావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, సుబ్బారావు, బాబయ్య, రాంబాబు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ వైజంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం


సర్వీస్ రోడ్డుపై బారులు తీరిన వాహనాలు

నందిగామ, న్యూస్‌టుడే: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ వై జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మిస్తున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే సర్వీసు రోడ్డు గుంతలు పడి స్వరూపం కోల్పోయింది. దీనివల్ల వాహనాలు ముందుకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో సర్వీస్ రోడ్డు బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నారు. ఈపనులతో బుధవారం వాహనాలు వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వాహనాలు బారులు తీరుతున్నప్పుడు ఫ్లైఓవర్ పైనుంచి హైదరాబాద్‌కు కార్లు, ఇతర వాహనాలను అనుమతించారు. దీంతో కొంతవరకు సమస్య తగ్గింది. సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి వచ్చే వారి వాహనాలతో ఈ మార్గంలో రద్దీ నెలకొంది. వై జంక్షన్ వద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పండగ అనంతరం తిరిగి హైదరాబాద్ వైపు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా రహదారిని అభివృద్ధి చేస్తున్నారు.

18న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నూజివీడులోని ధర్మ అప్పారావు (డీఏఆర్) కళాశాలలో ఈ నెల 18వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ (స్త్రీ, పురుషులు అండర్-23) బాస్కెట్‌బాల్ త్రీ-ఎ-సైడ్ (3×3) జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22, 23వ తేదీల్లో రామచంద్రాపురంలో జరిగే 2వ రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా సంఘానికి అనుబంధంగా ఉన్న క్లబ్బుల్లో సభ్యులైన వారు మాత్రమే ఎంపిక పోటీలో తలపడేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు నకలు, ఒరిజినల్ పుట్టినతేదీ ధ్రువపత్రంతో 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నూజివీడులోని కళాశాల మైదానంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల వ్యాయామోపాధ్యాయుడు మన్నే స్వామి తెలిపారు. జె.వాసు (బీబీఏ, ద్వితీయ), కె.సాయిచందు (బీఏ, తృతీయ), పి.చెన్నకేశవ (బీఎస్సీ, ప్రథమ), ఎస్కే.బాషా (బీబీఏ, ప్రథమ) సంవత్సర విద్యార్థులు కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ప్రిన్సిపల్ పి.రంగారావు, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

తిరువూరు


• తిరువూరు • మైలవరం

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 541 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కరి 60, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 60 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: వెల్లటూరు ఎస్సీ ఏరియాలో వీధి దీపాలు వెలగక అవస్థలు పడుతున్నామని స్థానికులు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి మురళీకి తెలిపారు. స్పందించిన కార్యదర్శి సిబ్బందితో దీపాలు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

★ జి.కొండూరులో దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావుకు తెలిపారు. ఆయన స్పందించి సిబ్బందితో దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్ చేయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

పెరిగిన ధరలు.. దుకాణాల్లో కొనుగోళ్లు

పిండి వంటలకు దూరమవుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

సంక్రాంతి వంటకాల్లో ఆరోగ్య పోషకాలు ఉన్నాయి. అందుకే అరిసెలు, సకినాలు, కారంపూస, చెక్కలు, లడ్డూలు తదితర పిండి వంటల తయారీకి ప్రాధాన్యం ఇస్తారు. పక్షం రోజుల పాటు నిల్వ చేసుకుని ఇష్టంగా ఆరగిస్తారు. ప్రస్తుతం వీటి తయారీకి కావాల్సిన ముడి పదార్థాల ధరలు విపణిలో మండుతున్నాయి. దీంతో ఇళ్ల వద్ద తయారీకి విరామం ఇచ్చి దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు.

సరకులు(కిలో)	2014-19లో	2019-24	2026 జనవరిలో
శనగనూనె	130	170	170
రిఫైండ్ ఆయిల్	90	120	156
బెల్లం	40	55	60
శనగపిండి	50	85	80
బియ్యం పిండి	35	50	50

ఊసెత్తడం లేదు: పండగ సంప్రదాయ పిండి వంటలకు పేద, మధ్య తరగతి ప్రజలు క్రమేణా దూరమవుతున్నారు. దీనికి కారణం వైకాపా పాలనలో సరకుల ధరలు అమాంతం పెరగడమే. ఒకప్పుడు ఇరుగు పొరుగు మహిళలు సమష్టిగా పిండి వంటలు సిద్ధం చేసుకునే వారు. ఇప్పుడు నూనె, బియ్యం, పిండి, బెల్లం, నువ్వులు తదితర సరకుల ధరలు భరించలేక వాటి ఊసెత్తడం లేదు. మిఠాయి దుకాణాల వద్ద కొనుగోలు చేసి సరిపుచ్చుకుంటున్నారు. వంట చెరకు ధరలు సైతం పెరిగాయి. వస్తు విక్రయాలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. తెదేపా ప్రభుత్వ హయాంలో పండగకు సంక్రాంతి కానుకలు అందించి పేదలకు చేయూత ఇచ్చారు. వైకాపా పాలనలో వాటిని రద్దు చేయడంతో ధరాభారంతో ప్రజలు పిండి వంటలకు దూరమయ్యారు.

పల్లెల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ చిన్ని

గంపలగూడెం: పల్లెల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మించేందుకు రూ.41 లక్షలు మంజూరవ్వగా నిర్మాణ పనులకు ఆయన బుధవారం భూమిపూజ చేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. తదుపరి పెదకొమిర తదితర గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను సందర్శించి ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు



పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏవో పద్మ

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని అన్ని సొసైటీల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏవో పద్మ మాట్లాడుతూ మునుకుళ్ల, తిరువూరు, లక్ష్మీపురం, వావిలాల సొసైటీల్లోని రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన 2,275 యూరియా బస్తాలను బుధవారం పంపిణీ చేశామని తెలిపారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తిరువూరు : కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



వెల్లటూరులో వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



గొల్లపూడిలో కోలాటం ఆడుతున్న మహిళలు

భోగి పండగ.. ఆనందం నిండుగ

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు తెదేపా కార్యాలయంలో భోగి పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి భోగి మంటలు వేశారు.

మైలవరం : మైలవరం పట్టణంలో స్థానికులు భోగి మంటలు వేసి, అందులో కాచిన నీటితో తలస్నానాలు చేశారు. పలు దేవాలయాలను పూలతో అలంకరించగా, ప్రజలు దర్శించుకున్నారు.

జి.కొండూరు: వెల్లటూరులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో భోగి సంబరాలు జరిగాయి. భక్తులు బుధవారం ఉదయాన్నే స్వామి వారికి పూజలు నిర్వహించారు.

గంపలగూడెం, ఎ.కొండూరు : గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. ఇళ్లలో బొమ్మలు కొలువులు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం: కాచవరం గ్రామంలో పారిశ్రామికవేత్త బొడేపూడి అప్పారావు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు రూ.5.52 లక్షల విలువైన ఆధునిక వంట సామగ్రితో పాటు గృహోపకరణాలు అందజేశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం : కొటికలపూడి గ్రామంలో రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు, కార్మికులకు నష్టం చేసే విత్తన, విద్యుత్తు, జీరామ్‌జీ ఉపాధి హామీ చట్టం నకలను భోగి మంటలో వేసి దగ్ధం చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. యల్లమందరావు, నాయకులు కోటేశ్వరరావు, గోవిందరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి గ్రామ తెదేపా ఆధ్వర్యంలో నిర్వహించిన గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం నృత్యం ఆకట్టుకున్నాయి. అనంతరం భోగి మంటలు వేశారు.



కాచవరం : ముగ్గులు పరిశీలిస్తున్న అప్పారావు తదితరులు



గంపలగూడెం: పెళ్లి తంతు ఉదహరించే బొమ్మల కొలువు



మైలవరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

వైభవంగా గోదాదేవి కల్యాణం



తిరువూరు : వెంకటాచల స్వామి

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని పలు దేవాలయాల్లో గోదారంగనాయకుల కల్యాణం బుధవారం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. – న్యూస్‌టుడే, బృందం



గంపలగూడెం రామాలయంలో..



నెమలి కృష్ణాలయంలో..

అయ్యప్ప స్వామి ఆలయాల్లో మకర జ్యోతి దర్శనం



కంభంపాడు గుడిలో స్వామి వారు



మేడూరులో..



గొల్లపూడిలో..

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా ఎ.కొండూరు, మండలం కంభంపాడు, గంపలగూడెం మండలం పెనుగొలను, మేడూరు అయ్యప్ప స్వామి ఆలయాల్లో భక్తులకు బుధవారం రాత్రి మకర జ్యోతి దర్శనం కల్పించారు. 18 మెట్లకు కర్పూర జ్యోతిని వెలిగించారు.

గొల్లపూడి : గొల్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం బుధవారం కనుల పండువగా జరిగింది. జ్యోతిని తిలకించేందుకు వందలాది మంది ప్రజలు తరలివచ్చారు.

సరఫరా చేశారు.. కనెక్షన్లు మరిచారు



రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శుద్ధి చేసిన తాగునీరు ఇచ్చేందుకు వాటర్ ఫిల్టర్లను సరఫరా చేసింది. అయితే క్షేత్ర స్థాయిలోని అధికారులు వాటికి కల్పించాల్సిన విద్యుత్తు, వాటర్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన వాటర్ ఫిల్టర్‌కు కూడా విద్యుత్తు, వాటర్ కనెక్షన్లు లేకపోవడంతో అలంకారంగా ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

కబడ్డీ పోటీలు ప్రారంభం

జగ్గయ్యపేట గ్రామీణం : స్థానిక షేర్‌మహమ్మద్ పేటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చిల్లకల్లు ఎస్సై మణికంఠ, న్యాయవాది కాసరగడ్డ నాగేశ్వరరావు కబడ్డీ పోటీలను బుధవారం ప్రారంభించారు. 42 ఏళ్లుగా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత కోడి పందేలు, జూదం వైపు వెళ్లకుండా ఉండేందుకు ఈ పోటీలు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో నాగమణి, కృష్ణ, వెంకటేశ్వర్లు, లింగారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన కోళ్లు.. జేబులన్నీ ఖాళీ



మైలవరంలో నలుపు, ఎరుపు రంగు జూదం

మైలవరం, న్యూస్‌టుడే : నియోజకవర్గ వ్యాప్తంగా పదుల సంఖ్యలో భారీ బరులు ఏర్పాటు చేసి కోడి పందేలను నిర్వహించగా వందలాది కోళ్లు నేలకొరిగాయి. వేలాది మంది ప్రజల జేబులు ఖాళీ అయ్యాయి. పందేల్లోనే పెద్ద ఎత్తున జూదంతో పాటు ఈ ఏడాది నలుపు, తెలుపు, ఎరుపు రంగులాటలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో ఏర్పాటు చేసిన రెండు బరుల్లో భారీ ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. వీటితో పాటు కోసు(జూదం), గుండాట జరిగాయి.

జి.కొండూరు: మండలంలో కోడి పందేలు విచ్చలవిడిగా సాగాయి. వీటికి తోడు కోత ముక్క, శరబొప్పాయి, చిన్న బజార్, పెద్ద బజార్ ఏర్పాటు చేశారు. అవసరమైన తినుబండారాలు, మద్యం విక్రయాలు కూడా జోరుగా కొనసాగాయి.



రెడ్డిగూడెం: మామిడి తోటలో కోడి పందేలు



జి.కొండూరులో బహిరంగ మద్యం దుకాణం

'అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్'



గొల్లపూడిలో భోగి మంటలు వెలిగిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, తెదేపా నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం విషం చిమ్ముతున్నారని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. గొల్లపూడి తెదేపా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజధానిని నదిలో కడుతున్నారంటూ జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని, దుబాయ్ వంటి దేశాల్లో భవనాలను సముద్రంలో నిర్మిస్తున్నారని చెప్పారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన అనేక సంస్థలు నిర్మాణాలు చేపడుతున్నారని, నదిలో నిర్మిస్తే పెట్టుబడులు పెడతారా? అని ప్రశ్నించారు. అమరావతే రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాటమార్చారని, ఆనాడు వ్యతిరేకించిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నోరునొక్కారని తెలిపారు. వైకాపా హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ఇప్పుడిప్పుడే రాష్ట్రం కోలుకుంటుందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పీపీపీ విధానంలో ఏపీ విద్యార్థులకు నూటికి 50 శాతం సీట్లు వస్తాయని చెప్పారు. మైలవరం శాసన సభ్యుడు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి ఉజ్వల భవితను దృష్టిలో పెట్టుకుని పరిపాలన జరుగుతుందన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వంలో జగన్ బొమ్మతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేశారు. తెదేపా రాష్ట్ర ప్రచార కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, నాయకులు పాల్గొన్నారు.

మంచుపూల సౌందర్యం..



చోడవరం సమీపంలో మొక్కకు అల్లుకున్న సాలీడు గూళ్లపై మంచు బిందువులు

బుధవారం విజయవాడ నగరాన్ని మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు వీడలేదు. నగరానికి సమీపంలో ఉన్న యనమలకుదురు కొండపై నుంచి చూస్తే నగరం మొత్తం మంచుతో కనిపించింది. మొక్కలకు సాలీడు కట్టుకున్న గూళ్లపై మంచు బిందువులుగా ఏర్పడి సరికొత్త అందాలు సంతరించుకున్నాయి. - ఈనాడు, అమరావతి

కోడి పందేల బరి వద్ద ఘర్షణ

పటమట, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో రామలింగేశ్వర నగర్‌లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి వద్ద బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. రాత్రి కూడా జూద శిబిరాలు నిర్వహించారు. మద్యం మత్తులో కొంతమంది యువకులు నిర్వాహకులపై దాడి చేశారు. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పటమట సీఐ పవన్ కిషోర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. కొంతమందిని స్టేషన్‌కు తరలించి బరిని ఆపించారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించిన బ్రదర్ జోసఫ్ తంబి



దివ్య పూజాబలి సమర్పిస్తున్న నెల్లూరు పీఠాధిపతులు ఎం.డి.ప్రకాశం డీడీ, కథోలిక గురువులు.. కార్యక్రమంలో విశ్వాసులు

గన్నవరం (గ్రామీణం, న్యూస్‌టుడే): మానవ మనుగడలో ఆధ్యాత్మికత కీలకపాత్ర పోషిస్తుందని నెల్లూరు కథోలిక మేత్రాసన గురుపీఠాధిపతి ఎమ్.డి.ప్రకాశం డీడీ అన్నారు. ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలో ప్రసిద్ధ బ్రదర్ జోసఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆయన పాల్గొన్నారు. మేరీమాత కపూచిన్ (ప్రావిన్స్) ప్రొవిన్షియల్ ఫా.కరుణాకర్‌రావు, రెక్టర్ సుధాకర్ లారెన్స్, ఫాదర్ మరియన్న, ఇతర మత గురువులతో కలిసి ఉదయం ప్రత్యేక దివ్యపూజాబలి అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ.. విశ్వాసుల కోర్కెలను తన మధ్యస్థ ప్రార్థన ద్వారా తీర్చే తంబి ప్రతి ఒక్క దైవ సేవకుడికి ఆదర్శమన్నారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించి ఆయన ధన్యులయ్యారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరి జీవితానికి అవసరమన్నారు. అందుకు క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. సాయంత్రం కడప మేత్రాసన గురుపీఠాధిపతి సగినా పౌలుప్రకాశ్ డీడీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దివ్యపూజాబలిలో పెద్ద సంఖ్యలో తంబి భక్తులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వాసులు, మేత్రాసన గురువులు, మఠకన్యలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ కెనోయ్ స్లాలమ్‌లో పతకాలు



పతకాలతో చేతన భగవతి, పార్థలక్ష్మీశ్రీనివాస్

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సాత్‌ధారా ఘాట్‌లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరుగుతున్న 12వ జాతీయ కెనోయ్ స్లాలమ్ జూనియర్, సబ్ జూనియర్ పురుషుల ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర అథ్లెట్లు రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరామ నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డి.పార్థలక్ష్మీశ్రీనివాస్ జూనియర్ పురుషుల విభాగంలో, డి.చేతన భగవతి జూనియర్ మహిళల విభాగంలో కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ముంగిట ముగ్గులు...
లోగిళ్ల నిండా ధాన్యరాశులు...
హరిదాసు కీర్తనలు... రివ్వురివ్వున ఎగిరే గాలిపటాలు...
మేళాలు, ప్రభల కాంతులతో రంగరంగ వైభవంగా చేసుకుంటాం మకర సంక్రాంతిని. మనమే కాదు భారతావనిలోని భిన్నప్రాంతాల్లో ఈ పండుగను అంతే ఆనందంగా జరుపుకొంటారు. అయితే దాన్ని చేసుకొనే పద్ధతులే విభిన్నం. అలా సంక్రాంతి రోజున కొన్ని రాష్ట్రాల్లో మహిళలు ఆచరించే సంప్రదాయాలు ఇవి.

పండుగ ఒకటే... పద్ధతులే వేరు!

ముగ్గులు అందుకే...



ధనుర్మాసం మొదలైనప్పటి నుంచి సంక్రాంతి పూర్తయ్యే దాకా తెలుగు రాష్ట్రాల్లో ముగ్గు లేని ముంగిలి ఉండదేమో. ఎంత పెద్ద ముగ్గు పెడితే వాకిలికి అంత అందం అనుకుంటాం. అయితే, ఇలా పెద్ద పెద్ద ముగ్గులు పెట్టడం వెనక ఓ శాస్త్రీయ కారణం దాగి ఉంది. సంవత్సరం పొడవునా తూర్పున ఉదయించే సూర్యుడు... ధనుర్మాసంలో మాత్రం కాస్త దిశ మార్చి ఆగ్నేయంలో ఉదయిస్తాడట. భూమి, సూర్యుడికి కాస్త దగ్గరగా వచ్చే నెల కూడానట. దాంతో ఉదయపు సూర్యరశ్మిలో విటమిన్-డి ఎక్కువగా దొరుకుతుందట. అందుకే వెచ్చదనం, శారీరక ఆరోగ్యాల దృష్ట్యా ఈ ఎండలో ఎంతసేపు ఉంటే అంత మంచిదని చెబుతున్నారు నిపుణులు. లేచింది మొదలు పనుల వెనక పరుగెత్తే మహిళలు ఈవిధంగానైనా ఎండలో సమయం గడిపే అవకాశం ఉంటుందని పెద్ద ముగ్గులను ఆచారంగా పెట్టారట. ఇప్పుడంటే చుక్కలు లేని, థీమ్ ఆధారిత ముగ్గులు వచ్చాయి కానీ, ఇదివరకూ ధనుర్మాసంలో బ్రహ్మముడి ముగ్గులే ఎక్కువగా వేసేవారు. వంద చుక్కల వరకూ ఉంటాయివి. ముగ్గు ఎక్కడ మొదలైతే... అక్కడే వచ్చి చివర కూడా కలుస్తుంది. ఆది, అంతాల్ని చెప్పడం కష్టమే.

కుండలకు నల్లదారం కట్టి...



గోవాలో కొన్ని ప్రాంతాల్లో... కొత్తగా పెళ్లయిన వధువులు కుండల్ని(సుఘట్) దేవుడికి సమర్పిస్తారు. ఐదు చిన్న చిన్న కుండలకు నల్లపూసలు గుచ్చిన దారాన్ని కడతారు. ధాన్యం, అరికెలు, తమలపాకులు, ఖర్జూరం తదితరాలతో కుండను నింపి దేవుడికి నివేదిస్తారట. ఐదోతనానికీ సంతాన ప్రాప్తికీ ప్రతీకగా వీటిని భావిస్తారు. ఇలా చేయడం వల్ల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుందనీ నమ్ముతారు.

పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకుని...



మహారాష్ట్రలో సంక్రాంతి రోజున... మహిళలంతా ఓ చోట సమావేశాలు ఏర్పాటుచేసుకుంటారు. సాయంత్రం అవ్వగానే అక్కడకు చేరి ఒకరికొకరు పసుపు పూసి, బొట్టు పెట్టుకుంటారు. పసుపు, కుంకుమ, తమలపాకులు, బెల్లం కలిపిన నువ్వుల్ని పళ్లెంలో పెట్టి ఇచ్చిపుచ్చుకుంటారు. వీటితోపాటు మేకప్ సామగ్రి, ఇంటికి కావాల్సిన వస్తువులు, నగలు కానుకగా ఇస్తారట. దీన్ని 'వాన్'గా పిలుచుకుంటారు. సుమంగళిగా, సుఖ సంతోషాలు, భోగభాగ్యాలతో ఏడాదంతా మంచిగా గడవాలన్న దానికి సూచికగా దీన్ని భావిస్తారు.

అరటిపండ్ల తాంబూలం...



అరటిపండ్లని సమృద్ధి, అదృష్టానికి ప్రతీకలుగా భావిస్తారు కర్ణాటక వాసులు. అందుకే కొత్తగా పెళ్లయిన అమ్మాయిలు సంక్రాంతి రోజున తాంబూలంగా వివాహితలకు ఐదు అరటిపండ్లు అందిస్తారు. పెళ్లయిన ఐదేళ్లపాటు ఇలా ఇప్పిస్తారు. అరటిపండ్ల సంఖ్య మాత్రం ప్రతి ఏడాదికి పెరుగుతూ ఉంటుంది. పది, పదిహేను... ఇలా పెంచుకుంటూ పోతారు. ఇది కుటుంబ శ్రేయస్సుకి, సంతానోత్పత్తికి మేలుచేస్తుందని నమ్ముతారట.

పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ...



హరియాణాలో సంక్రాంతి రోజున... పూజలన్నీ ముగించుకుని మహిళలంతా స్థానిక హవేళీలకి వెళతారట. అక్కడ పండుగకు సంబంధించిన జానపద గీతాలు పాడుతూ నృత్యాలు చేస్తారట. తర్వాత అత్తమామల ఆశీర్వాదం తీసుకుని దుస్తులు కానుకగా ఇస్తారు. వాళ్లనుంచి బహుమతులు పొందుతారు. వీటిని 'మనానా'గా పిలుచుకుంటారు.



ఆ ప్రభాతం... నీకు నేపథ్యమై..!

ఇంకా చీకటే! సూర్యుని జాడైనా కనిపించదు... తెల్లారింది లెమ్మంటూ మేల్కొలుపులు. ఆ పొగమంచులో ఒళ్లు విరుస్తూ చలికి ముడుచుకుపోతుంటే వెచ్చగా ఆహ్వానిస్తాయి చలిమంటలు. కాసేపు వాటి దగ్గర సేదతీరేసరికి 'ముగ్గులు వేద్దాం... రారమ్మంటూ పిలుపులు. భోగి కుండలు, రథాల ముగ్గులు... వాటిల్లో రంగులద్దేసరికి ఆకాశం తెల్లబడుతుంది. పెద్దాళ్ల పోరుతో తలస్నానాలు ముగించుకొస్తామా! అప్పుడు మెల్లగా మబ్బుల చాటు నుంచి వస్తాడమ్మా... సూరీడు. లంగాఓణీలో లేలేత సూర్య కిరణాలు మనల్ని ముద్దాడుతోంటే... ఆరుబయట నిల్చొని కురుల నీళ్లు తుడుస్తోంటే చూపులన్నీ మన చుట్టూనే. కావ్యంలో నుంచి నడిచొచ్చిన నాయికలా కనిపిస్తోంటే ఆకర్షణ మామూలే కదా!



రాళ్లు పెట్టి, పొయ్యి వెలిగించి... పాలు పొంగించడం. తలా పిడికెడు బియ్యం అంటూ పాలల్లో బియ్యం వేయించడం. పొంగలి చేసేదంతా అమ్మా బామ్మలే! కానీ 'కాస్త గరిటెతో కలుపమ్మా... దంచిన బెల్లం వేయమ్మా. సూర్యుడికి నమస్కరించి కుండను దింపు...' అంటూ మనమే చేశామన్న సంతృప్తినిస్తారు. ఆ వేడి వేడి ప్రసాదాన్ని అరిటాకులో పెట్టుకుని తింటోంటే... 'మా బంగారు తల్లి ఎంత బాగా చేసిందో'నన్న ప్రశంసలు వింటోంటే ఎంత బాగుంటుంది?



స్ట్రీట్, రెస్టరంట్, కాంటినెంటల్... మనం తినని రుచులా? అయినా పోటీపడి ఏరుకున్న రేగుపళ్లు, తవ్వితీసుకున్న వేరుశనగలు, కోసుకున్న కందికాయలు, పొలంలో విరిచిన చెరకు గడలకు మించిన తాయిలాలు కనిపించవు. అరిటాకుల్లో అయినవాళ్ల మధ్య ఇంకొక్క ముద్ద అంటూ కొసరి కొసరి వడ్డిస్తోంటే... కబుర్ల మధ్య తెలుగు వంటలన్నీ జిహ్వాచాపల్యాన్ని తీర్చేస్తాయి. ఇక ఆ తరవాత సందడే సందడి. మిద్దెలు, పంటపొలాలు అన్నీ మైదానాలే. లంగానీ, పైట కొంగునీ దోపి... గాలిపటాల పోరులో నువ్వా నేనా అంటూ సాగే యుద్ధంలో చిరు అలకలు, చిన్నపాటి విజయాలు, నిట్టూర్పులు... ఎన్నెన్ని భావోద్వేగాలు!

అమ్మ ఊగిన ఊయల, నాన్న చదివిన స్కూలు, వందల ఏళ్లనాటి గుడి, బాబాయికి ఇష్టమైన కాలువ... ఊరెళితే ఎన్నెన్ని కథలు. 'ఫలానా వాళ్లమ్మాయి', 'నీకు వరుసకు పిన్నినవుతా... గుర్తుపట్టావా?' అంటూ ఎన్నెన్ని పలకరింపులు. బోలెడు జ్ఞాపకాలు... మోయలేనంత ఆనందం, మనసుదోచే ప్రకృతి... ఎన్నెన్ని దాగుంటాయనీ ఆ పల్లె ఒడిలో! చెట్టు, పుట్ట, పారే సెలయేరు... ప్రతిదానికో కథ!

ఏడాదిలో ఎన్నడు మరిచినా సంక్రాంతికి మాత్రం ఆలోచనలన్నీ గ్రామం కేసే! మనిషి కంటే ముందు మనసు ప్రయాణం కట్టి అక్కడ కూర్చుంటుంది. దాంతోపాటే మనమూ బండనకా బస్సనకా బయల్దేరతాం. ఆ జ్ఞాపకాలన్నీ తిరిగి మూట కట్టుకుంటాం. రాలేక రాలేక... మనసంతా బాధగా మూలుగుతుండగా తిరిగి పట్టణం దారి పడతాం.

పట్టణాల్లో ఏనాడూ కానరాని ఉదయాలు... కనుచూపు మేరలోనూ కనపడని అందాలవి. ఆ సరదాలు, జ్ఞాపకాలన్నీ గుండెలో, మనసు మూలలో దాచేది ఒకప్పుడు. ఒంటరిగా ఉన్నప్పుడో, ఏ మూలన కూర్చొనో గుర్తు చేసుకునే రోజులూ కావు. ఇప్పుడు వాటిని బంధించే సాధనం మన అరచేతి దూరమే. ఇంకేం క్లిక్‌మనిపించేయండి. ఆ సుప్రభాత వేళలు, ఆనాటి గుడి మెట్లు, కోడెదూడలు, పచ్చని పొలాలు... ఒకటా రెండా ఎన్నెన్నో అందమైన నేపథ్యాలు. పట్టు లంగా ఓణీ, లేదంటే చీర... మోడరన్ అమ్మాయిలా కనిపించాలనుకున్నా... అచ్చ తెలుగమ్మాయిలా అలరించాలన్నా సరే! నచ్చిన చోట ఇలా ఫొటోలు ప్రయత్నించేయండి. జ్ఞాపకాల ఆల్బమ్ సిద్ధం చేసుకోండి. ఎక్కడ ఎలా అనేది చూసుకుంటే సరి. సిద్ధమేనా మరి?

సంక్రాంతి ముచ్చట్లు

అరిసెలు తింటూ... కోడి పందాలు చూస్తూ!



మాది కాకినాడ. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పెద్ద పండుగ. అందుకే ఇది మాకు ఓ గొప్ప ఎమోషన్. అమ్మమ్మవాళ్ళు పిండి వంటలు చేయడం మొదలు పెట్టడంతోనే మా ఇంట్లో సంక్రాంతి సంబరాలు మొదలైన భావన వచ్చేసేది. ఇక భోగి రోజు తెల్లవారుజామున లేచి అమ్మా నేనూ... ఎక్కడెక్కడ రంగురంగుల ముగ్గులు, పెద్ద భోగి మంటలు వేశారో చూడటానికి వెళ్లేవాళ్లం. అలా చాలా దూరం వెళ్లి పోయేవాళ్లం. అరిసెలు, పాకుండలు తింటూ అక్క, కజిన్స్‌తో బాగా ఎంజాయ్ చేసేవాళ్లం. నాకు కోడిపందాలు అంటే భలే సరదా. ఓ కోడిని ఎంచుకొని అది గెలుస్తుందా లేదా అని ఎంతో ఎదురు చూసేదాన్ని. ఓడిపోతే తెగ బాధపడిపోయేదాన్ని. ఈ సంవత్సరం కూడా వెళ్తాను. కోర్టు మూవీ విజయం తర్వాత ఎక్కడికి వెళ్లినా నన్ను గుర్తు పడుతున్నారు. ఇవన్నీ కొత్తగా ఆస్వాదిస్తున్నా. తమిళంలో ఓ చిత్రం చేస్తున్నా... దాని విడుదల కోసం ఎదురుచూస్తున్నా.

– శ్రీదేవి, నటి

పొలాలకు వెళ్లి... నవధాన్యాలు తెచ్చి...



నేను పుట్టిపెరిగింది ఖమ్మం జిల్లాలోని కందుకూరు. ఉదయం 5 అవ్వడం ఆలస్యం... పక్కనున్న గుడిలో భక్తిగీతాలు మొదలయ్యేవి. సంక్రాంతి సమయంలో పాతిక మంది వరకూ హరిదాసులు ఉదయాన్నే గుడి నుంచి బయల్దేరేవారు. కీర్తనలు, అక్షయపాత్రలతో వాళ్లు అలా వెళ్తోంటే చూడటానికి ఎంత బాగుండేదో. అది మా ఊరికే ప్రత్యేకం. పండుగ నెలరోజులూ వాళ్లొచ్చే సమయానికి అందరూ బియ్యం పట్టుకుని ఇంటి ముందు నిలబడేవాళ్లం. ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మలను పూలు, కూరగాయలు, నవధాన్యాలతో అలంకరించేవాళ్లం. ఆ నవధాన్యాలను పొలాలకు వెళ్లి మరీ స్వయంగా తెచ్చేవాళ్లం. పండుగ రోజు ఇంటికి వచ్చేవారికి బియ్యం ఇచ్చేవాళ్లం. అలా ఇచ్చాక వాళ్ల ఆశీర్వాదం తీసుకోవడం చాలా ఆనందంగా ఉండేది.

– కాసర లక్ష్మీ సరోజా రెడ్డి, జంగారెడ్డి గూడెం

ఊరంతా పసుపే!



సంక్రాంతి వేళలో మా చుట్టుపక్కల ఊళ్లల్లో గుండాల శివాలయం, శిరసనగండ్ల రామాలయం, ఊరుకొండ పేటలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో జాతరలు జరుగుతాయి. జనాలతో ఊళ్లంతా కిటకిటలాడతాయి. గోదా దేవి కల్యాణానికి అందరూ పసుపు దుస్తులు ధరిస్తారు. అది చూసినప్పుడు ఊరంతా పసుపారబోసినట్లు కనిపిస్తుంది.


– సంబరాజు శ్వేత, వెల్దండ

ముగ్గులు, మీ జ్ఞాపకాలు పంచుకోమంటూ కోరిన ఆహ్వానానికి స్పందించిన పాఠకులందరికీ కృతజ్ఞతలు. అన్నింటినీ ప్రచురించాలనున్నా... స్థలాభావంతో కొందరివే ఇవ్వగలిగాం. మరికొందరివి... ఈ-పేపర్, వసుంధర.నెట్‌లో చూడొచ్చు.

రంగవల్లిక




ఉన్నవ హసిత, హైదరాబాద్



ఉత్తరాఖండ్ గ్రామాలకు
నేపాల్ టెలికాం సిగ్నళ్లు

ఉత్తరాఖండ్ సరిహద్దు గ్రామాలకు పొరుగు దేశమైన నేపాల్ నుంచి మొబైల్ సిగ్నల్స్ వస్తున్నాయి. పిథౌరాగఢ్ జిల్లా నేపాల్ సరిహద్దు వెంబడి ఉంటుంది. ఈ జిల్లాలోని పలు గ్రామాలకు భారతీయ టెలికాం కంపెనీల నుంచి కాకుండా నేపాలీ టెలికాం కంపెనీల సిగ్నల్స్ వస్తున్నాయి. జిల్లా కేంద్రమైన పిథౌరాగఢ్ నుంచి కేవలం 18-20 కి.మీ.ల దూరంలో ఉన్న కొన్ని గ్రామాల్లో భారతీయ టెలికాం కంపెనీల టవర్లు ఎక్కువగా లేవు. దీంతో సరైన సిగ్నల్ రాక ఆ గ్రామాల మొబైల్ యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీడియో కాల్స్, వంటగ్యాస్ బుక్ చేయడం వంటి సేవల కోసం నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల ఆన్‌లైను చదువులకు ఆటంకంగా ఉందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మొబైల్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని పిథౌరాగఢ్ జిల్లా కలెక్టర్ ఆశిష్ తెలిపారు.





బామ్మ అంత్యక్రియలకు వచ్చి..
పుట్టినరోజు కేకు తిని వెళ్లారు!



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్రలోని నాగపుర్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. నగరానికి చెందిన 103 ఏళ్ల గంగాబాయి గత కొన్నిరోజులుగా అస్వస్థతతో ఉన్నారు. సోమవారం ఉదయం ఆమె కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. గంగాబాయి కాలివేలు కదలడాన్ని మనవడు రాకేశ్ గమనించాడు. వెంటనే వృద్ధురాలి ముక్కులో ఉన్న దూదిని తొలగించగా ఆమె శ్వాస తీసుకోవడం ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేశారు. చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులంతా సంతోషించారు. మరో విశేషం ఏమిటంటే.. ఇదే రోజు గంగాబాయి 103వ పుట్టినరోజు కూడా కావడంతో ఆ వేడుకలను బంధువులంతా కలిసి ఘనంగా జరిపారు. బాధతో వచ్చినవారంతా పుట్టినరోజు కేకు తిని ఆనందంగా ఇళ్లకు వెళ్లారు.



వజ్ర విమానం.. సిల్కు పతంగి
జర్మనీ ఛాన్సలర్‌కు భారత్ బహుమతులు

దిల్లీ: భారత్‌లో పర్యటనను చిరకాలం గుర్తుంచుకునేలా చేసే అరుదైన, విలువైన బహుమతులను జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అందుకున్నారు. గోడకు అమర్చుకునేందుకు వీలైన పటోలా సిల్కుతో చేసిన పతంగి, నాణ్యమైన తోలుతో చేసిన పైలట్ లాగ్‌బుక్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్ హస్తకళాకారులు రూపొందించిన వజ్రాల విమానం తదితరాలు వీటిలో ఉన్నాయి. వజ్రాల విమానం జర్మనీ-భారత్‌ల దృఢమైన స్నేహబంధాన్ని ప్రతిబింబించేలా ఉందని, విమానాల తయారీలో జర్మనీ సాంకేతిక నైపుణ్యానికీ ఇది ప్రతీకగా నిలుస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ నెల 12, 13 తేదీల్లో ఫ్రెడ్రిక్ మెర్జ్ భారత్‌లో పర్యటించారు.



గతాన్ని మార్చలేం కానీ..

మీరు గతంలోకి వెళ్లి మీ జీవిత ప్రస్థానాన్ని కొత్తగా మొదలుపెట్టాలనుకుంటే అది సాధ్యం కాదు. కానీ ఇప్పుడున్న చోటు నుంచి మీ ప్రయాణం ఎలా కొనసాగాలి, ముగింపు ఎలా ఉండాలన్నది మాత్రం మీ చేతుల్లోనే ఉంది. అది అద్భుతంగా ఉండాలంటే గతం గురించి పశ్చాత్తాపం చెందడం మాని, తదుపరి అడుగులపై శ్రద్ధపెట్టండి.

– సుశీలా దేవి, టెకీ

మరోమాటకు తావులేదు
గ్రీన్‌లాండ్ మాకే కావాలి

- ట్రంప్ స్పష్టీకరణ



నూక్ (గ్రీన్‌లాండ్): మరో మాటకు తావు లేకుండా గ్రీన్‌లాండ్ తమకే దక్కాలని కోరుకుంటున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం స్పష్టంచేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల నేతలు సంప్రదింపులు ప్రారంభించడానికి పూర్వం ఆయన ఈ ప్రకటన చేశారు. "అమెరికా జాతీయ భద్రత దృష్ట్యా గ్రీన్‌లాండ్ మాకు కావాలి" అని ఆయన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఆ దీవిని తమకే ఇప్పించేందుకు నాటో సభ్యదేశాలు చొరవ చూపాలని, లేకుంటే దాన్ని రష్యా, చైనాలు వశపరచుకుంటాయని ట్రంప్ పునరుద్ఘాటించారు.

అంతకుముందు డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల నేతలు ట్రంప్ సామ్రాజ్యవాద వైఖరిని ఖండించారు. డెన్మార్క్ అంతర్భాగంగా గ్రీన్‌లాండ్ ఎప్పటికీ నాటో పరిధిలోనే ఉంటుందని వారు స్పష్టంచేశారు. వనరుల పరంగా ఎంతో కీలక ఆర్కిటిక్ దీవి అయిన గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకుంటామంటూ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలకు స్పందిస్తూ వారు తమ నిశ్చయాన్ని స్పష్టంచేశారు. గ్రీన్‌లాండ్‌ను వశపరచుకోడానికి లేదా దానిపై సైనిక చర్యకు అమెరికా సాహసిస్తే అది నాటో కూటమిని విచ్ఛిన్నం చేసే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టే డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సన్, గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్‌లు పరస్పర సంఘీభావం చాటుకున్నారు. శ్వేతసౌధంలో అమెరికాతో చర్చలకు ముందు డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల విదేశాంగ మంత్రులు సంయుక్త ప్రకటన చేశారు. "ప్రియమైన గ్రీన్‌లాండ్ వాసులారా, మేం ఈరోజు కలిసివున్నాం. రేపూ కలిసివుంటాం" అని డెన్మార్క్ ప్రధాని ఫ్రెడెరిక్సన్ కోపెన్‌హెగెన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. "అమెరికా, డెన్మార్క్‌ల మధ్య ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తే డెన్మార్క్, యూరోపియన్ యూనియన్‌లను, నాటో కూటమిని, డెన్మార్క్ రాజ్యాన్ని ఎంచుకుంటాం" అని గ్రీన్‌లాండ్ ప్రధాని నీల్సన్ స్పష్టం చేశారు.

డెన్మార్క్‌తో ఉంటే గ్రీన్‌లాండ్‌కే సమస్య

అగ్రరాజ్యంలోకి చేరబోమంటూ గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ప్రకటించడంపై ట్రంప్ స్పందిస్తూ.. "అది అతడి సమస్య. నీల్సన్ అభిప్రాయంతో ఏకీభవించట్లేదు. అతడి గురించి నాకు సరిగా తెలియదు. కానీ డెన్మార్క్‌లోనే కొనసాగాలనుకుంటే అది గ్రీన్‌లాండ్‌కే పెను సమస్యగా మారుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. "గ్రీన్‌లాండ్ తప్పకుండా అమెరికా భూభాగంలో చేరాలి. లేదంటే ఆ ప్రాంతాన్ని రష్యా, చైనాలు ఆక్రమిస్తాయి. ఇప్పటికే ఆ దేశాల రక్షణ బలగాలు అక్కడ పాగా వేశాయి. నేను తలుచుకుంటే అక్కడ అధిక సంఖ్యలో అమెరికా సైన్యాన్ని మోహరించగలను" అని ట్రంప్ అన్నారు.

ఎన్ఐఏ డీజీగా రాకేశ్ అగర్వాల్

- ఐటీబీపీ, బీఎస్ఎఫ్‌లకూ కొత్త బాస్‌లు

దిల్లీ: కేంద్రం బుధవారం ఎన్ఐఏ, బీఎస్ఎఫ్, ఐటీబీపీలకు కొత్త డైరెక్టర్ జనరళ్లను నియమించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి రాకేశ్ అగర్వాల్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. హిమాచల్ క్యాడర్‌కు చెందిన అగర్వాల్ 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఎన్ఐఏలో ప్రత్యేక డీజీగా పని చేస్తున్నారు. మరో సీనియర్ ఐపీఎస్ శత్రుజీత్ సింగ్ కపూర్‌ను కేంద్రం ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీజీగా నియమించింది. ప్రస్తుతం ఐటీబీపీకి నేతృత్వం వహిస్తున్న ప్రవీణ్ కుమార్‌ను బీఎస్ఎఫ్ కొత్త చీఫ్‌గా నియమించారు.



శబరిమలలో మకరజ్యోతి దర్శనం

శబరిమల: హరిహరక్షేత్రం శబరిమల 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ స్వామివారి నామస్మరణతో మార్మోగింది. మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఈశాన్య దిశలో పర్వతశ్రేణుల నుంచి వెలుగులీనుతున్న జ్యోతి దర్శనమివ్వగా వేల మంది భక్తులు పులకించిపోయారు. కాంతమాల కొండలపై దేవతలు, రుషులు కలిసి భగవంతునికి హారతి ఇస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

కలకత్తా హైకోర్టులో టీఎంసీకి దక్కని ఊరట
ఈడీ జప్తు చేసిన డేటాను సంరక్షించాలన్న పిటిషన్‌పై విచారణను ముగించిన జడ్జి

కోల్‌కతా: ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ కార్యాలయం, నివాసం నుంచి ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిన తమ పార్టీకి చెందిన రాజకీయ డేటాను తొలగించకుండా సంరక్షించేలా ఆదేశించాలన్న టీఎంసీ పిటిషన్‌పై కలకత్తా హైకోర్టు బుధవారం విచారణను ముగించింది. టీఎంసీ కోరినట్లుగా ఎలాంటి ఆదేశాలను న్యాయమూర్తి జస్టిస్ సువ్రా ఘోష్ వెలువరించలేదు. ఈ నెల 8న ప్రతీక్ జైన్ కార్యాలయం, ఇంటి నుంచి తాము ఏమీ స్వాధీనం చేసుకోలేదని, ఏమైనా ఉంటే దానిని సీఎం మమతా బెనర్జీ పట్టుకెళ్లారని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు తెలిపారు. ఈడీ సమాధానాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ ఘోష్...టీఎంసీ పిటిషన్‌పై విచారణ జరపాల్సింది ఏమీ లేదని తెలిపారు.

కదులుతున్న రైలుపై పడిన భారీ క్రేన్

- థాయ్‌లాండ్‌లో 30 మంది మృతి



బ్యాంకాక్‌లో క్రేన్‌కూలి ధ్వంసమైన రైలు బోగీలు

బ్యాంకాక్: నిర్మాణ పనుల్లో వాడుతున్న క్రేన్. కదులుతున్న రైలుపై పడటంతో కనీసం 30 మంది మృతిచెందిన ఘోర దుర్ఘటన థాయ్‌లాండ్‌లో చోటుచేసుకుంది. హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో భాగంగా రైలు మార్గంపై క్రేనుతో వంతెన పనులు చేస్తుండగా బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. ఆ సమయంలో బ్యాంకాక్ నుంచి ఉబన్ రచథానీ ప్రావిన్సుకు ఆ వంతెన కింది నుంచి ప్యాసింజర్ రైలు వెళ్తోంది. ఆ రైల్లో 171 మంది ఉన్నారు. ఒక్కసారిగా భారీ క్రేను పడటంతో ఆ రైలు పట్టాలు తప్పి బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. పలువురు ప్రాణాలు కోల్పోగా అనేకమంది గాయాలపాలయ్యారు. నలుగురు గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే రైలులో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులకు దిక్కుతోచని పరిస్థితి తలెత్తింది. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కాంక్రీటు స్తంభాల మధ్య నిర్మాణ సామగ్రి వేలాడుతూ కనిపించింది. పోలీసులు, వివిధ విభాగాల సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకువచ్చారు. బోల్తా కొట్టిన బోగీల కింద చిక్కుకున్నవారిలో పలువురిని కాపాడారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉంది. "సుమారు 9 గంటల సమయంలో పైనుంచి ఏదో కిందపడి పేలినట్లుగా భారీ శబ్దం వచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లి చూశాను. ప్యాసింజర్ రైలులోని మూడు బోగీలపై భారీ క్రేన్ పడిపోయి కనిపించింది. ముఖ్యంగా రెండో బోగికి మధ్యలో క్రేన్ చొచ్చుకుపోయింది" అని స్థానికులు తెలిపారు.

75 దేశాల పౌరులకు
వీసా ప్రాసెసింగ్ నిలిపివేత

- అమెరికా కీలక నిర్ణయం

న్యూయార్క్, వాషింగ్టన్: వలసదారుల విషయంలో కొన్నాళ్లుగా అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. అమెరికా ప్రభుత్వ పథకాలపైనే వారు ఎక్కువగా ఆధారపడి జీవించే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఈ చర్యకు ఉపక్రమించామని తెలిపింది. "75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది" అని అమెరికా విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పేర్కొంది. 75 దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ నిలిపివేత ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుందని ఓ వార్తాసంస్థ పేర్కొంది. అఫ్గానిస్థాన్, బ్రెజిల్, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.



ఛాంపియన్


డరిల్ మిచెల్ 131 నాటౌట్

రాజ్‌కోట్‌లోనే సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న టీమ్‌ఇండియా ఆశ నెరవేరలేదు. మందకొడి పిచ్‌పై మన కన్నా మెరుగ్గా బ్యాటింగ్, బౌలింగ్ చేసిన కివీస్.. రెండో వన్డేలో పైచేయి సాధించింది. బంతితో భారత్‌కు కళ్లెం వేసిన కివీస్.. మిచెల్ అద్భుత శతకంతో తడబాటు లేకుండా లక్ష్యాన్ని ఛేదించేసింది. రాహుల్ శతకం వృథా అయింది.

మిచెల్ ముంచేశాడు

రెండో వన్డేలో కివీస్ చేతిలో భారత్ ఓటమి

రాహుల్ శతకం వృథా


రాహుల్ 112 నాటౌట్

రాజ్‌కోట్

భారత్‌కు భంగపాటు. డరిల్ మిచెల్ (131 నాటౌట్; 117 బంతుల్లో 11×4, 2×6) అదిరే శతకం సాధించడంతో రెండో వన్డేలో 7 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించిన కివీస్.. 1-1తో సిరీస్‌ను సమం చేసింది. కేఎల్ రాహుల్ (112 నాటౌట్; 92 బంతుల్లో 11×4, 1×6) శతకం బాదడంతో బుధవారం మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9×4, 1×6) రాణించాడు. ఆ తర్వాత భారత బౌలర్లు రాణించలేకపోయారు. మిచెల్‌తో పాటు విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7×4) సత్తా చాటడంతో లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. భారత్‌లో కివీస్‌కు ఇది అత్యధిక లక్ష్యఛేదన. నిర్ణయాత్మక మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.

నిలిచిన ఆ ఇద్దరు..: ఛేదనలో సూపర్ శతకం సాధించిన మిచెల్.. విల్ యంగ్‌తో అద్భుత భాగస్వామ్యంతో కివీస్‌ను విజయపథంలో నడిపించాడు. ఆరంభంలో మెరుగ్గానే బౌలింగ్ చేసిన భారత బౌలర్లు ఆ తర్వాత ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా మధ్య ఓవర్లలో వికెట్లు తీసే విషయంలో విఫలం కావడం భారత్‌ను దెబ్బతీసింది. అయితే భారత్ లాగే ఆరంభంలో కివీస్ కూడా తడబడింది. సిరాజ్, హర్షిత్ రాణా అత్యంత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టును కట్టడి చేశారు. ఆరో ఓవర్లో కాన్వే (16, 21 బంతుల్లో 3×4)ను హర్షిత్ బౌల్డ్ చేసేటప్పటికి స్కోరు 22 పరుగులు. పరుగుల కోసం చెమటోడ్చిన నికోల్స్ (24 బంతుల్లో 10) 13వ ఓవర్లో.. జట్టు స్కోరు 46 వద్ద వెనుదిరిగాడు. ఆ తర్వాత మిచెల్, యంగ్ చక్కని బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నిర్మించారు. స్ట్రైక్‌రొటేట్ చేస్తూ.. వీలైనప్పుడు బంతిని బౌండరీకి తరలించారు. భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ భాగస్వామ్యాన్ని విడదీయలేకపోయారు. ఇద్దరిలో మిచెల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. మంచి స్వీప్ షాట్లు ఆడాడు. అతడు 52 బంతుల్లో, యంగ్ 68 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. 36వ ఓవర్లో స్కోరు 200ను చేరుకుంది. కాసేపటికే యంగ్‌ను ఔట్ చేయడం ద్వారా 162 పరుగుల భాగస్వామ్యాన్ని కుల్‌దీప్ విడదీసినా భారత్‌కు పెద్దగా ఉపయోగం లేకపోయింది. చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన మిచెల్.. ఫిలిప్స్ (32 నాటౌట్; 25 బంతుల్లో 2×4, 1×6) తోడుగా అలవోకగా బ్యాటింగ్ చేయడంతో ఎలాంటి నాటకీయతకు అవకాశం లేకుండా కివీస్ లక్ష్యాన్ని అందుకుంది. వన్డేల్లో ఏడో శతకం సాధించిన మిచెల్.. ఫిలిప్స్‌తో అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 57 బంతుల్లో 78 పరుగులు జోడించాడు. భారత స్పిన్నర్లు జడేజా, కుల్‌దీప్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచారు.

నిలిచిన రాహుల్: మందకొడి పిచ్‌పై భారత్ 284 పరుగులు చేసిందంటే కారణం కేఎల్ రాహుల్ పోరాటమే. రోహిత్ (24), కోహ్లి (23) పెద్ద స్కోర్లు చేయకున్నా, శ్రేయస్ విఫలమైనా.. అతడు అద్భుత శతకంతో జట్టును నిలబెట్టాడు. టాస్ ఓడి భారత్ బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు రోహిత్, శుభ్‌మన్ గిల్ ఆరంభంలో అతి జాగ్రత్తగా ఆడారు. 5 ఓవర్లకు స్కోరు 10 పరుగులే. రోహిత్ శర్మ తాను ఎదుర్కొన్న 11వ బంతికి కానీ తొలి పరుగు చేయలేదు. కానీ ఆరో ఓవర్ నుంచి పరిస్థితి మారిపోయింది. రోహిత్, గిల్ జోరు పెంచి స్వేచ్ఛగా బ్యాట్ ఝళిపించడంతో భారత్ 12 ఓవర్లలో 70/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ అనూహ్యంగా తడబడింది. కొద్ది వ్యవధిలోనే నాలుగు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. క్లార్క్ బౌలింగ్‌లో కవర్ మీదుగా భారీ షాట్ ఆడబోయిన రోహిత్.. యంగ్‌కు చిక్కాడు. ఆ తర్వాత కాసేపటికే గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (17 బంతుల్లో 8) మిస్ హిట్లతో వెనుదిరిగారు. బౌండరీతో ఖాతా తెరిచిన కోహ్లి.. కుదురుకుంటున్న దశలో పెవిలియన్ బాటపట్టాడు. క్లార్క్ బౌలింగ్‌లో ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో అతడు బౌల్డ్ కావడంతో టీమ్‌ఇండియా 118/4తో ఇబ్బందుల్లో పడింది. ఆ దశలో రాహుల్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. జడేజా (27)తో అయిదో వికెట్‌కు 73, నితీశ్ (20)తో ఆరో వికెట్‌కు 57 పరుగులు జోడించాడు. 47వ ఓవర్లో నితీశ్ ఔటయ్యేటప్పటికి భారత్ స్కోరు 248. హర్షిత్ రాణా (2) వెంటనే ఔటైనా.. రాహుల్ చెలరేగడంతో ఆఖరి రెండు ఓవర్లలో భారత్ 26 పరుగులు రాబట్టింది. చివరి 10 ఓవర్లలో టీమ్‌ఇండియా 85 పరుగులు సాధించింది.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) యంగ్ (బి) క్లార్క్ 24; గిల్ (సి) మిచెల్ (బి) జేమీసన్ 56; కోహ్లి (బి) క్లార్క్ 23; శ్రేయస్ అయ్యర్ (సి) బ్రాస్‌వెల్ (బి) క్లార్క్ 8; రాహుల్ నాటౌట్ 112; జడేజా (సి) అండ్ (బి) బ్రాస్‌వెల్ 27; నితీశ్‌కుమార్ రెడ్డి (సి) ఫిలిప్స్ (బి) ఫౌక్స్ 20; హర్షిత్ రాణా (సి) బ్రాస్‌వెల్ (బి) లెనాక్స్ 2; సిరాజ్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **284; వికెట్ల పతనం:** 1-70, 2-99, 3-115, 4-118, 5-191, 6-248, 7-256; **బౌలింగ్:** జేమీసన్ 10-2-70-1; ఫౌక్స్ 9-0-67-1; క్రిస్టియన్ క్లార్క్ 8-0-56-3; జేడెన్ లెనాక్స్ 10-0-42-1; బ్రాస్‌వెల్ 10-1-34-1; గ్లెన్ ఫిలిప్స్ 3-0-13-0

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (బి) హర్షిత్ రాణా 16; నికోల్స్ (బి) ప్రసిద్ధ్‌కృష్ణ 10; విల్ యంగ్ (సి) నితీశ్ (బి) కుల్‌దీప్ 87; మిచెల్ నాటౌట్ 131; ఫిలిప్స్ నాటౌట్ 32; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (47.3 ఓవర్లలో 3 వికెట్లకు) **286**; **వికెట్ల పతనం:** 1-22, 2-46, 3-208; **బౌలింగ్:** సిరాజ్ 9-0-41-0; హర్షిత్ రాణా 9.3-1-52-1; ప్రసిద్ధ్‌కృష్ణ 9-0-49-1; నితీశ్‌కుమార్ రెడ్డి 2-0-13-0; జడేజా 8-0-44-0; కుల్‌దీప్ 10-0-82-1

ఫేవరెట్‌గా భారత్

● అమెరికాతో మ్యాచ్‌తో టైటిల్ వేట షురూ

● నేటి నుంచే అండర్-19 ప్రపంచకప్

మ॥ 1 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



బులవాయో: కుర్రాళ్ల సమరానికి వేళైంది. నేటి నుంచే అండర్-19 ప్రపంచకప్. ఈ టోర్నీలో అదిరే రికార్డు భారత్ సొంతం. అయిదుసార్లు టైటిల్ చేజిక్కించుకుంది. ఇప్పుడు భారీ అంచనాలతో మరో పోరుకు సిద్ధమైంది. గురువారం అమెరికాతో మ్యాచ్‌తో మన కుర్రాళ్లు టైటిల్ వేటను ఆరంభించనున్నారు. మరి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోన్న భారత జట్టు అంచనాలను నిలబెట్టుకుంటుందా.. దేశానికి ఆరో కప్పును అందిస్తుందా? ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత జట్టులో కుర్ర సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఉన్నాడు. మొదటి రోజు మరో రెండు మ్యాచ్‌లు కూడా జరగనున్నాయి. గ్రూప్‌-సిలో స్కాట్లాండ్‌ను జింబాబ్వే, గ్రూప్‌-డిలో టాంజానియాను వెస్టిండీస్ ఢీకొంటాయి.

16 జట్లు.. 4 గ్రూపులు..: జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ ప్రపంచకప్‌లో 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్‌కు అర్హత సాధిస్తాయి. అక్కడి నుంచి ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అమెరికాతో మ్యాచ్ తర్వాత భారత్.. జనవరి 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

గ్రూప్‌-ఎ: ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక
గ్రూప్‌-బి: భారత్, అమెరికా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్
గ్రూప్‌-సి: ఇంగ్లాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, జింబాబ్వే
గ్రూప్‌-డి: అఫ్గానిస్థాన్, దక్షిణాఫ్రికా, టాంజానియా, వెస్టిండీస్

కోహ్లి నం.1

మూడో స్థానానికి పడిన రోహిత్

దుబాయ్: అద్భుత ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సుదీర్ఘ విరామం తర్వాత నంబర్ వన్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో అదరగొట్టిన అతడు రోహిత్‌ను వెనక్కి నెట్టి వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత సాధించడం అయిదేళ్లలో అతడికి ఇదే తొలిసారి. చివరిగా కోహ్లి 2021 జులైలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాడు. మొత్తంగా ఈ స్థానంలో అతడు 825 రోజులు పూర్తి చేసుకున్నాడు. కెరీర్లో అగ్రస్థానం చేరుకోవడం అతడికి ఇది పదకొండోసారి. తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-3 బ్యాటర్ల మధ్య అంతరం పెద్దగా లేదు. కోహ్లి (785), రెండో స్థానంలోని డరిల్ మిచెల్ (784) మధ్య తేడా ఒక పాయింటే. రోహిత్ (775) టాప్ నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (5వ స్థానం) ర్యాంకులో ఎలాంటి మార్పు లేదు. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (10) టాప్-10లో చోటు దక్కించుకున్నాడు.

సింధు ఔట్


సింధు

దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధుకు చుక్కెదురైంది. భారీ అంచనాలతో బరిలో దిగిన తెలుగమ్మాయి తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. బుధవారం మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో సింధు 22-20, 12-21, 15-21తో నుయెన్ లిన్ (వియత్నాం) చేతిలో పరాజయం చవిచూసింది. తన్వి శర్మ 20-22, 21-18, 13-21తో వాంగ్ యి (చైనా) చేతిలో పోరాడి ఓడింది. మాళవిక బాన్సోద్ 21-18, 21-19తో పాయ్ యు (చైనీస్ తైపీ)పై గెలిచి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అగ్రశ్రేణి ఆటగాళ్లు కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్ శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీకాంత్ 15-21, 21-6, 21-19తో తరుణ్ మన్నెపల్లిపై, ప్రణయ్ 22-20, 21-18తో లీ చుక్ (హాంకాంగ్)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకున్నారు.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

ముంబయి × యూపీ
వేదిక: ముంబయి, రా॥ 7.30

శుక్రవారం
వేదిక: ముంబయి, రా॥ 7.30
బెంగళూరు × గుజరాత్

దిల్లీ బోణీ

యూపీపై విజయం


షెఫాలి

ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్‌లో దిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లిజెలీ లీ, షెఫాలి.. చెలరేగిన వేళ బుధవారం యూపీ వారియర్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. మరిజేన్ కాప్ (2/24), షెఫాలి వర్మ (2/16) విజృంభించడంతో తొలుత యూపీని 154/8కు పరిమితం చేసిన దిల్లీ.. సరిగ్గా 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. లిజెలీ లీ (67; 44 బంతుల్లో 8×4, 3×6), షెఫాలి వర్మ (36; 32 బంతుల్లో 6×4) మెరుపు బ్యాటింగ్‌తో ఆ జట్టు త్వరగా గెలిచేలా కనిపించింది. కానీ వారిద్దరు ఔటవడంతో విజయం కాస్త ఆలస్యమైంది.

ధనాధన్: ఛేదనలో ఓపెనర్లు లిజెలీ లీ, షెఫాలీ బౌలర్లను అసలు లెక్కే చేయలేదు. 6.1 ఓవర్లలో దిల్లీ స్కోరు 50 దాటింది. లిజెలీ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించింది. ఓపెనర్ల జోరు చూస్తే ఆ జట్టు 15 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేలా కనిపించింది. కానీ.. మూడు ఓవర్ల వ్యవధిలో షెఫాలి, లిజెలీ నిష్క్రమించడంతో పరుగుల వేగం తగ్గింది. త్వరగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో జెమీమా (21) ఔటైనా.. వోల్వార్ట్ (25 నాటౌట్) ఎలాంటి నాటకీయతకు చోటివ్వలేదు.

హర్లీన్ రిటైర్డ్ ఔట్: అంతకుముందు పరుగుల కోసం యూపీ తీవ్రంగా శ్రమించింది. ఓపెనర్ కిరణ్ (0) విఫలమైంది. లిచ్‌ఫీల్డ్ (27) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన హర్లీన్ డియోల్ (47; 36 బంతుల్లో 7×4) కెప్టెన్ మెగ్ లానింగ్ (54; 38 బంతుల్లో 9×4, 1×6)కు చక్కటి తోడ్పాటు అందించింది. మూడో వికెట్‌కు ఈ జోడీ 85 పరుగులు జోడించింది. అయితే మెగ్‌లానింగ్ నిష్క్రమించాక పరుగుల వేగం పెంచాలన్న ఉద్దేశంతో ఆ తర్వాతి ఓవర్లో హర్లీన్‌ను యూపీ రిటైర్డ్ ఔట్ చేసింది. అప్పటికి జట్టు స్కోరు 17 ఓవర్లలో 141/4. కానీ యూపీ వ్యూహం బెడిసికొట్టింది. చివరి మూడు ఓవర్లలో మరో నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 13 పరుగులే చేయగలిగింది.


ప్రొ రెజ్లింగ్ లీగ్ నేటి నుంచే

నోయిడా: ప్రొ రెజ్లింగ్ లీగ్ పునరాగమనానికి వేళైంది. అయిదో సీజన్ గురువారం ఆరంభం కానుంది. 2015లో మొదలైన ఈ లీగ్ 2019లో చివరగా జరిగింది. కరోనా కారణంగా ఆగిన లీగ్‌ను.. ఆరేళ్ల విరామం తర్వాత నిర్వహించనున్నారు. ఎప్పట్లానే ఆరు జట్లు టైటిల్ వేటలో నిలిచాయి. తొలి పోరులో యూపీ డామినేటర్స్, పంజాబ్ రాయల్స్ జట్లు తలపడనున్నాయి. 53 కేజీల విభాగంలో రెండుసార్లు అండర్-20 ప్రపంచ ఛాంప్ అంతిమ్ పంఘాల్, మీనాక్షిల మధ్య పోరు ఆసక్తి రేపుతోంది.

ఈనాడు సినిమా

ముగ్గుల పండగ ముచ్చట్లెన్నో..

పొగ మంచుల్లో అలరారే పల్లెటూరి అందాలు.. ఇంద్రధనుస్సులా రంగులద్దుకొని రా రమ్మని ఆహ్వానించే అందాల లోగిళ్లు.. నట్టింట బంధుమిత్రుల కోలాహలం.. వంటింట పిండి వంటల ఘుమఘుమలు.. ఆకాశాన రెపరెపలాడుతూ పతంగులు పంచే వినోదం.. ఊరి చివరన పందెం కోళ్ల వీరోచిత విన్యాసాలు.. తెలుగింటి సంక్రాంతి అంటే ఈ సందడంతా కనిపించాల్సిందే. ఇక ఈ సంబరమంతా ఒకెత్తైతే.. పండగ రోజు థియేటర్లలో కొత్త సినిమాలు పంచే వినోదం మరొకెత్తు. అందుకే ముగ్గుల పండగ అనగానే కొత్త సినిమాలన్నీ పోటాపోటీగా ముస్తాబై బాక్సాఫీస్ బరిలో వాలిపోతుంటాయి. ఈసారి పండక్కి ఏకంగా ఐదు చిత్రాలు థియేటర్లలోకి రావడం సినీప్రియుల ఆనందాన్ని రెట్టింపు చేసింది. మరి ఈ పండగ బరిలో వినోదాలు పంచుతున్న కొందరు కథానాయికలు చెప్పిన సంక్రాంతి ముచ్చట్లపై ఓ లుక్కేద్దాం..



కోడి పందేల్ని చూడాలనుంది

"తెలుగు నాట సంక్రాంతికి సినిమాలకు ఉన్న అనుబంధం ఎంత ప్రత్యేకమన్నది ఈ ఇండస్ట్రీకి వచ్చాకే నాకర్థమైంది. తెలుగులోకి అడుగు పెట్టిన ప్రతి కథానాయిక తమకంటూ ఓ సంక్రాంతి రిలీజ్ ఉండాలని ఆశ పడుతుంటారు. నేనూ అలా కోరుకున్న దాన్నే. అలాంటి నాకు మహేశ్‌బాబు 'గుంటూరు కారం'తో తొలిసారి పండగ బరిలో నిలిచే అవకాశం రావడం.. ఆ మరుసటి ఏడాది వెంకటేశ్‌తో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకోవడం.. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి 'అనగనగా ఒక రాజు'తో మళ్లీ ముగ్గుల పండగ బరిలో నిలవడం చాలా సంతోషాన్నిస్తోంది. వీటివల్లే ఈ పండగ సంస్కృతిని బాగా తెలుసుకోగలిగా. అయితే సంక్రాంతికి గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేల్ని చూడాలన్న కోరిక ఒక్కటి అలాగే ఉండిపోయింది".

- మీనాక్షి చౌదరి

ఆ లోటు తీరింది

"మకర సంక్రాంతిని మా కర్ణాటకలో సుగ్గి హబ్బ అనే మరో పేరుతోనూ పిలుస్తారు. సుగ్గి అంటే కోత అని అర్థం. కోతల తర్వాత వచ్చే వ్యవసాయ పండగ కాబట్టి పల్లెటూరి ప్రజలు, రైతులు ఆ పేరుతో పిలుస్తారు. ఈ పండగ రోజు నువ్వులు, బెల్లం, కొబ్బరి, కొన్ని రకాల డ్రైఫ్రూట్స్‌తో ఎళ్లు బెల్ల అనే ప్రత్యేక వంటకాన్ని చేస్తాం. అది మాకు చాలా స్పెషల్. దాన్ని బంధుమిత్రులతో పంచుకుంటూ 'ఎళ్లు బెల్ల తిందు ఒళ్లె మాతాడోణ' ('నువ్వుల బెల్లం తిని మంచి మాటలు మాట్లాడదాం' అని తెలుగులో అర్థం) అని శుభాకాంక్షలు చెప్పుకుంటాం. ఇక పండగ రోజు ఇంట్లో ముగ్గులు వేసే డ్యూటీ పూర్తిగా అమ్మదే. ఈసారి సంక్రాంతి మాత్రం నాకు మరింత ప్రత్యేకం. సినిమాల పరంగా నాకిప్పటి వరకు ఒక్క సంక్రాంతి చిత్రం పడలేదన్న లోటును 'కానిస్టేబుల్ కనకం 2' తీర్చింది. ఇది థియేటర్లలో విడుదల కాకున్నా.. ఈటీవీ విన్ ఓటీటీ వేదికగా ఈ పండక్కి వినోదాలు పంచుతుండటం ఆనందాన్నిస్తోంది".

- వర్ష బొల్లమ్మ

తెలిసింది ప్రభల తీర్థం ప్రత్యేకత

"సంక్రాంతిని మా ఇంట్లో చాలా సింపుల్‌గానే చేసుకుంటాం. తెలుగు చిత్రసీమలోకి వచ్చాకే ఇక్కడ ఈ పండగని ఇంతలా వేడుకగా చేసుకుంటారన్నది నాకర్థమైంది. తెలుగులో తొలి అడుగులోనే 'నా సామి రంగ' లాంటి మంచి సంక్రాంతి సినిమాలో భాగమవ్వడం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. దాని వల్లే సంక్రాంతి సినిమాని ప్రేక్షకులు ఎలా ఆస్వాదిస్తారన్నది తొలిసారి నా అనుభవంలోకి వచ్చింది. అలాగే ఇక్కడి ప్రజలు ఈ పండగని ఎలా చేసుకుంటారు.. గోదావరి జిల్లాల్లో జరిగే ప్రభల తీర్థం ప్రత్యేకతని తెలుసుకోగలిగా".

- ఆషికా రంగనాథ్

పతంగులతో అల్లరి..

"నేను చదువుకున్నదంతా చెన్నైలోనే. చిన్నప్పుడు మా తాతయ్య వాళ్లతో కలిసి అక్కడే పొంగల్ వేడుకలు చేసుకునేదాన్ని. మట్టికుండలో పరమాన్నం చేయడం.. కనుమరోజు రకరకాల వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా కలిసి తినడం.. పిల్లలందరం కలిసి పతంగులు ఎగరేస్తూ అల్లరి చేయడం.. ఇలా పండగ ఇచ్చిన జ్ఞాపకాలు బోలెడన్ని".

- డింపుల్ హయాతి

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

కొత్త ప్రయాణం


పవన్‌కల్యాణ్

ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ తన సొంత నిర్మాణ సంస్థ పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై వరుసగా సినిమాలు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అందు కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో చేతులు కలిపారు. ఈ రెండు సంస్థలు కలిసి చేయబోయే సినిమాలకు సంబంధించిన కథా చర్చల కోసం ఇటీవల పవన్‌కల్యాణ్‌ని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కలిశారు. త్వరలోనే ఆ ప్రాజెక్టుల్ని అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ... భోగి సందర్భంగా కొత్త ప్రారంభాలకు సంకేతాలిస్తూ రాబోయే ప్రాజెక్టులపై పవన్‌కల్యాణ్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కలిసి విస్తృతంగా చర్చలు జరిపారని పేర్కొంది. టి.జి. విశ్వప్రసాద్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "కథలపై చర్చించడానికి అవకాశం కల్పించినందుకు పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు. ప్రేక్షకులకు బలమైన అర్థవంతమైన కంటెంట్‌ని అందించేందుకు పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అంటూ వ్యాఖ్యలు చేశారు.

నేడు ఈటీవీలో 'హిట్ 3'


నాని

"జనాల మధ్యలో ఉంటే అర్జున్.. మృగాల మధ్య ఉంటే సర్కార్.." అంటూ గతేడాది 'హిట్:ది థర్డ్ కేస్' సినిమాతో తెరపై అదరగొట్టారు హీరో నాని. ఆయన ప్రధాన పాత్రలో శైలేశ్ కొలను తెరకెక్కించిన చిత్రమిది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఇందులో అర్జున్ సర్కార్ అనే పోలీసు అధికారి పాత్రలో తన నటనతో అలరించారు నాని. యాక్షన్ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం ఇప్పుడు మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈరోజు మధ్యాహ్నం ఒంటిగంటకి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఈటీవీలో ప్రసారం కానుంది చిత్రం. మరి ఇంకెందుకు ఆలస్యం అర్జున్ సర్కార్ యాక్షన్ హంగామాపై ఓ లుక్కేయ్యండి.

ప్రేమ మలుపు


ఆకాశ్, భైరవి

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'కొత్త మలుపు'. భైరవి అర్థ్యా కథానాయిక. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహిస్తున్నారు. తాటి బాలకృష్ణ నిర్మాత. సంక్రాంతి పండగని పురస్కరించుకుని ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని బుధవారం విడుదల చేసింది చిత్రబృందం. గ్రామీణ నేపథ్యంలో ప్రేమ, ఉత్కంఠ భరితమైన అంశాల మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిదని చెప్పారు దర్శకుడు.

సంస్కృతి గొప్పదనం చాటేలా వేదవ్యాస్


కె.అచ్చిరెడ్డి, సాయికుమార్, విశ్వనాథ్, ఎస్వీ కృష్ణారెడ్డి

భారతీయ సంస్కృతి... సంప్రదాయాల గొప్పదనం చాటే కథతో రూపొందిస్తున్న సినిమానే 'వేదవ్యాస్' అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ఆయన తెరకెక్కిస్తున్న 43వ చిత్రమిది. ప్రముఖ నిర్మాత కె.అచ్చిరెడ్డి సమర్పణలో కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్నారు. దక్షిణ కొరియా నటి జున్ హ్యున్ జీ కథానాయిక. బుధవారం కె.అచ్చిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఇందులో కథానాయకుడిగా నటిస్తున్న పిడుగు విశ్వనాథ్‌ని మీడియాకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగు సుబ్బారావు, నటుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దర్శకత్వంలో అల్లు అర్జున్


అల్లు అర్జున్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ 23వ సినిమా ఖరారైంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఆ చిత్రం రూపొందనుంది. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూర్చనున్నారు. 'ఏ సే 23...' అంటూ పాటని వినిపిస్తూ ఓ ప్రత్యేకమైన వీడియోతో ఈ సినిమాని భోగి పండగ సందర్భంగా బుధవారం అధికారికంగా ప్రకటించారు. కొంతకాలంగా ప్రచారంలో ఉన్న ఈ కలయికపై అభిమానులు ఎంతో ఉత్సుకతని ప్రదర్శించారు. ఎట్టకేలకి ఈ కలయికలోనే సినిమా ఖరారైంది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాణంలో రూపొందనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. ఇటీవలే లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కి వచ్చి అల్లు అర్జున్‌తో కథా చర్చలు చేశారు. లోకేశ్ చెప్పిన కథ నచ్చడంతో ఆయన పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం అల్లు అర్జున్ తన 22వ చిత్రాన్ని అట్లీ దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. అది పూర్తి కాగానే లోకేశ్ సినిమా పట్టాలెక్కనుంది. గొప్పతనం కోసం పోరాటం... అనే మాటలు వీడియోలో వినిపించాయి.

దెయ్యాలు - హారర్ కథలంటే భయం!


నిధి అగర్వాల్

'ది రాజాసాబ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ప్రశంసలు తనకెంతో ఆనందాన్ని ఇస్తున్నాయి అంది నటి నిధి అగర్వాల్. ఈ సినిమా కోసం తామంతా మూడేళ్లు కష్టపడ్డామని.. ఆ కష్టానికి ప్రేక్షకులు మంచి ఫలితాన్ని ఇచ్చారని.. ఆరంభంలో దీనికి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ఇప్పుడు ప్రతిఒక్కరూ సినిమాని ఆస్వాదిస్తున్నారని తెలిపింది. ప్రభాస్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇది ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో నిధి అగర్వాల్ బుధవారం విలేకర్లతో ముచ్చటించింది.

★ "దర్శకుడు మారుతి నాకీ కథ వినిపించినప్పుడే ఇది కచ్చితంగా ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుందని అర్థమైంది. అన్ని తాంత్రిక విద్యలు తెలిసి.. సైకలాజికల్‌గా మైండ్ గేమ్స్ ఆడే ఓ దుష్టశక్తిని హీరో దైవికంగా ఎలా ఎదుర్కొన్నాడన్నది మారుతి కొత్తగా చూపించారు. స్క్రిప్ట్ విన్నప్పుడు నాకదే వినూత్నంగా అనిపించింది".

★ "ఓ నిర్మాతకు ఎంతో ప్యాషన్ ఉంటేనే ఇంత భారీ బడ్జెట్ సినిమాని నిర్మించడం సాధ్యమవుతుంది. దీనికోసం టి.జి.విశ్వప్రసాద్ ఎక్కడా రాజీ పడలేదు".

"నాకు దెయ్యాలు, హారర్ కథలంటే భయం. అందుకే రాత్రి నిద్రపోయేటప్పుడు లైట్స్ వేసుకుని, హనుమాన్ చాలీసా వింటూ నిద్రపోతా. ప్రస్తుతం నేను తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తున్నా. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్‌లోనే ఇల్లు తీసుకున్నా. నేనెక్కడికి వెళ్లినా నాది తెలుగు సినిమా అనే చెప్పుకుంటాను".

యూనియన్ బ్యాంక్ లాభం రూ.5,073 కోట్లు

ముంబయి: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.5,073 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 9.7 శాతం అధికం. నికర వడ్డీ ఆదాయం 0.95 శాతం పెరిగి రూ.9,328 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 0.15 శాతం తగ్గి 2.76 శాతానికి పరిమితమైంది. డిపాజిట్ల వృద్ధి 3.36 శాతంగా నమోదైంది. వడ్డీయేతర ఆదాయం 2.82 శాతం పెరిగి రూ.4,541 కోట్లకు చేరింది. ఎన్‌పీఏలు రూ.2,199 కోట్ల నుంచి రూ.1,820 కోట్లకు తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తులు 3.29 శాతం నుంచి 3.06 శాతానికి పరిమితమయ్యాయి. మొత్తం కేటాయింపులు రూ.1,599 కోట్ల నుంచి రూ.322.23 కోట్లకు తగ్గాయి.

8 నెలల గరిష్ఠానికి టోకు ధరలు

దిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా రెండో నెలా పెరిగింది. 2025 డిసెంబరులో 0.83 శాతంగా నమోదైంది. ఇది 8 నెలల గరిష్ఠ స్థాయి. ఆహార, ఆహారేతర ఉత్పత్తులు, తయారీ వస్తువులు ప్రియం కావడం ఇందుకు కారణం. అలాగే అంతకుముందు రెండు నెలల్లో ప్రతిద్రవ్యోల్బణ స్థితిలో (మైనస్) ఉన్న డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం.. డిసెంబరులో ప్లస్‌లోకి రావడం గమనార్హం. 2025 అక్టోబరులో -1.02%, నవంబరులో -0.32 శాతంగా ఇది నమోదైన సంగతి తెలిసిందే. అలాగే 2024 డిసెంబరులో టోకు ధరల ద్రవ్యోల్బణం 2.57 శాతంగా ఉంది.

✦ ఆహార పదార్థాల ప్రతిద్రవ్యోల్బణం గతేడాది నవంబరులో -4.16 శాతంగా ఉండగా.. డిసెంబరులో -0.43 శాతానికి పెరిగింది. కూరగాయల ప్రతిద్రవ్యోల్బణం -20.23% నుంచి గణనీయ స్థాయిలో పెరిగి -3.5 శాతానికి చేరింది.

బీఈఎస్ విభాగంలోకి ట్రూజన్

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్ రంగంలో ట్రూజన్ సోలార్ పేరుతో సేవలను అందిస్తోన్న సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వ్యాపార విస్తరణలో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ (బీఈఎస్) విభాగంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంటును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు వేస్తోంది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ సహా అయిదు రాష్ట్రాల్లో ఇళ్లపై సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు సేవలను అందిస్తున్న ఈ సంస్థ రానున్న నాలుగు నెలల కాలంలో ఒడిశా, కర్ణాటక, తమిళనాడులకూ విస్తరించనుంది. రూఫ్‌టాప్ సోలార్‌పై గతంతో పోలిస్తే అవగాహన పెరిగిందని, ప్రభుత్వ పథకాలూ ఇందుకు ప్రోత్సాహిస్తున్నాయని సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ భవానీ సురేష్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.400 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఐపీఓకు వెళ్లే ఆలోచనతో ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం రూ.250 కోట్ల ఆర్డర్లు చేతిలో ఉన్నట్లు వెల్లడించారు.



రెండో రోజూ కొనసాగిన నష్టాలు

సెన్సెక్స్ ▼245	నిఫ్టీ ▼67
83383	25666

వరుసగా రెండో రోజూ దేశీయ సూచీల నష్టాలు కొనసాగాయి. ఐటీ, వినియోగ, కొన్ని బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. టారిఫ్ అనిశ్చితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలు ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 11 పైసలు తగ్గి 90.34 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.99% నష్టంతో 64.82 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.39,000 కోట్లు పెరిగి రూ.468.18 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ నేడు మార్కెట్లకు సెలవు: మహారాష్ట్రలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కారణంగా గురువారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు ప్రకటించారు. ఈక్విటీ, కమొడిటీ సహా ఇతర ప్రధాన మార్కెట్లు కూడా పనిచేయవు.

ఇన్ఫోసిస్ లాభం రూ.6,654 కోట్లు

- కొత్త లేబర్ కోడ్ అమలుకు రూ.1,289 కోట్ల కేటాయింపు
- 2025-26కు ఆదాయ వృద్ధి అంచనాల పెంపు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికానికి (అక్టోబరు- డిసెంబరు) ఇన్ఫోసిస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.6,654 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.6,806 కోట్లతో పోలిస్తే 2.2 శాతం తగ్గింది. కొత్త కార్మిక చట్టాలను (లేబర్ కోడ్) అమలు చేసేందుకు ఉద్యోగుల గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం 143 మి. డాలర్ల(దాదాపు రూ.1,289 కోట్లు)ను కేటాయించడం వల్లే లాభం తగ్గిందని కంపెనీ చెబుతోంది. ఈ కోడ్‌ల వల్ల వార్షికంగానూ సుమారు 15 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడొచ్చని తెలిపింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌లు కూడా వరుసగా రూ.2128 కోట్లు, రూ.718 కోట్ల మేర లేబర్ కోడ్ అమలుకు కేటాయించిన సంగతి విదితమే.

✦ ఇన్ఫీ కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.41,764 కోట్ల నుంచి 8.89 శాతం పెరిగి రూ.45,479 కోట్లకు చేరింది. 2025-26 జులై- సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరు- డిసెంబరులో సంస్థ నికర లాభం 9.6 శాతం తగ్గగా.. ఆదాయం 2.2 శాతం పెరిగింది.



'ఎంటర్‌ప్రైజ్ కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో మేం అనుసరిస్తున్న వ్యూహాలు అధిక మార్కెట్ వాటాను సాధించేందుకు తోడ్పడుతున్నాయి. ప్రస్తుతం 4,600 ఏఐ ప్రాజెక్టులపై పనిచేస్తున్నాం. నైపుణ్య అనుభవం, ఆవిష్కరణల సామర్థ్యం కారణంగా ఇన్ఫోసిస్‌ను తమ ఏఐ భాగస్వామిగా క్లయింట్లు భావిస్తుండటం పెరుగుతోంది. ఏఐ ప్రపంచంలో విజయవంత ప్రయాణం కోసం మా సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుత, రాబోయే ఆర్థిక సంవత్సరాల్లోనూ గిరాకీకి సానుకూల పరిస్థితులు ఉండొచ్చని అనుకుంటున్నాం' - సలీల్ పరేఖ్, సీఈఓ, ఎండీ ఇన్ఫోసిస్

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్థిరకరెన్సీ రూపేణా ఆదాయ వృద్ధి అంచనాను 3- 3.5 శాతానికి పెంచింది. ఇంతకుముందు 2-3 శాతం వృద్ధిని అంచనా వేసింది.

✦ సమీక్షా త్రైమాసికంలో మొత్తంగా 4.8 బిలియన్ డాలర్ల విలువైన పెద్ద కాంట్రాక్టులను దక్కించుకుంది.

'ఫ్రెషర్స్ నియామక లక్ష్యాన్ని చేరతాం'

2025-26 ఆర్థిక సంవత్సరానికి 20,000 మంది తాజా ఉత్తీర్ణులను నియమించుకోవాలన్న లక్ష్యాన్ని అందుకుంటామని, ఇప్పటికే 18,000 మందిని నియమించుకున్నట్లు కంపెనీ సీఎఫ్‌ఓ జయేశ్ సంఘ్రజ్కా పేర్కొన్నారు. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,043 పెరిగి 3,37,034కు చేరడం విశేషం. హెచ్-1బీ వీసా వ్యవహారంలో ఇన్ఫోసిస్ ఉద్యోగిని అమెరికా అధికారులు అరెస్టు చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వడంపై సలీల్ పరేఖ్ స్పష్టతనిస్తూ.. అవి ఊహాగానాలు మాత్రమేనని, అందులో నిజం లేదని తెలిపారు. అయితే కొన్ని నెలల క్రితం ఒక ఉద్యోగికి అమెరికాలో ప్రవేశానికి అనుమతిని ఇవ్వకపోవడంతో తిరిగి భారత్‌కు వచ్చేశారని వెల్లడించారు.

బ్రిటన్‌కు చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్ నుంచి అత్యధికంగా 1.6 బిలియన్ డాలర్ల కాంట్రాక్టును కంపెనీ పొందింది.

✦ కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్‌కు రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ (ఆర్‌ఎస్‌యూ) రూపంలో రూ.3 కోట్ల మార్కెట్ విలువ చేసే స్టాక్ ఇన్సెంటివ్స్‌ను మంజూరు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

✦ అక్టోబరు- డిసెంబరులో రూ.18,000 కోట్ల బైబ్యాక్ ప్రక్రియను పూర్తి చేసింది. కంపెనీ చరిత్రలోనే ఇది అతి పెద్ద బైబ్యాక్.

'సెమాగ్లుటైడ్' పేటెంట్ వివాదంలో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నాం: నాట్కో ఫార్మా

ఈనాడు, హైదరాబాద్: 'సెమాగ్లుటైడ్' ఔషధ పేటెంట్ వివాదంలో న్యాయస్థానం తీర్పు కోసం ఎదురు చూస్తున్నామని నాట్కో ఫార్మా స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ ఔషధానికి మన దేశంలో బహుళజాతి ఫార్మా కంపెనీ నొవో నార్డిస్క్‌కు ఉన్న పేటెంట్‌ను దిల్లీ హైకోర్టులో నాట్కో సవాలు చేసింది. దీనిపై కొంతకాలంగా విచారణ సాగుతోంది. నొవో నార్డిస్క్‌కు ఉన్న పేటెంట్‌ను ఎందుకు వెనక్కి తీసుకోకూడదో సమాధానం ఇవ్వాలని తాజాగా న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ వచ్చే నెలలో ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. సెమాగ్లుటైడ్‌పై నొవో నార్డిస్క్‌కున్న పేటెంట్ గడువు ఈ ఏడాది మార్చిలో తీరిపోతోంది. ఈ మందును టైప్-2 మధుమేహ వ్యాధికి, ఊబకాయ చికిత్సలో వినియోగిస్తున్నారు. ఇందులో కొత్తదనం లేదని, ఎప్పటికప్పుడు స్వల్ప మార్పులు చేసి, పేటెంట్ గడువును పొడిగించుకునేందుకు ఆ సంస్థ ప్రయత్నాలు చేస్తోందని నాట్కో న్యాయస్థానంలో వాదించింది. పేటెంట్ గడువు తీరిపోయిన వెంటనే సెమాగ్లుటైడ్ జనరిక్ మందును విడుదల చేసేందుకు మన దేశంలోని వివిధ ఫార్మా కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కంపెనీలు భాగస్వామ్యాలు కుదుర్చుకొని, ఈ మందును మన దేశంలో ఉత్పత్తి చేసి, పేటెంట్ రక్షణ దేశాలకు ఎగుమతి చేసేందుకు న్యాయస్థానం నుంచి ఆదేశాలు పొందిన సంగతి విదితమే. జీఎల్‌పీ-1 తరగతికి చెందిన ఈ ఔషధం ఇటీవలి కాలంలోనే మన దేశంలో అందుబాటులోకి వచ్చి, భారీగా అమ్మకాలు నమోదు చేస్తున్న విషయం గమనార్హం. దీంతో జనరిక్ ఔషధాలు ఉత్పత్తి చేసే దేశీయ ఫార్మా కంపెనీలు దీనిపై ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. నాట్కో ఫార్మాతో పాటు, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, అరబిందో ఫార్మా, లుపిన్, జైడస్ లైఫ్ సైన్సెస్ తదితర కంపెనీలు వీటిలో ఉన్నాయి.

బీవీఆర్ మోహన్‌రెడ్డికి 'జియోస్పేషియల్ వరల్డ్' పురస్కారం



ఈనాడు, హైదరాబాద్: ఐటీ, ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్‌రెడ్డికి జియోస్పేషియల్ వరల్డ్ నుంచి లివింగ్ లెజెండ్ పురస్కారం లభించింది. మన దేశంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా జియోస్పేషియల్ పరిశ్రమ విస్తరణకు విశేషంగా కృషి చేసినందుకు ఆయనకు ఈ అవార్డును ప్రకటించినట్లు జియోస్పేషియల్ వరల్డ్ వెల్లడించింది. ఇటీవల జరిగిన జియో స్మార్ట్ ఇండియా 25వ సదస్సులో బీవీఆర్ మోహన్‌రెడ్డికి ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ, ప్రతిష్ఠాత్మకమైన జియోస్పేషియల్ వరల్డ్ అవార్డు లభించటం సంతోషంగా ఉందన్నారు. జియో స్పేషియల్ పరిశ్రమ విస్తరణ వల్ల ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయని, ముఖ్యంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు దగ్గరవుతున్నాయని వివరించారు. ఈ విస్తరణకు తన వంతుగా కృషి చేసినట్లు పేర్కొన్నారు.

బి న్యూ మొబైల్స్ సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా వినియోగదార్లకు పలు ఆఫర్లు అందిస్తున్నట్లు బి న్యూ మొబైల్స్ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ వెల్లడించారు. ప్రతి మొబైల్ ఫోన్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. రూ.99 నుంచి యాక్సెసరీస్ ప్రారంభమవుతున్నాయని తెలిపారు. హోమ్ అప్లయెన్సెస్‌లో ఏసీ, కూలర్, స్మార్ట్ టీవీ, వాషింగ్ మెషీన్, స్మార్ట్ కుక్కర్ రూ.3,499 నుంచే ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి స్పెషల్ ఫ్యామిలీ కాంబో రూ.39,999కే పొందవచ్చని వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ కార్డులపై రూ.21,000 వరకు, బజాజ్ ఫిన్‌సర్వ్‌పై రూ.5,000 వరకు, ఎస్‌బీఐ కార్డులపై 10 శాతం క్యాష్‌బ్యాక్‌తో పాటు ఇతర ఫైనాన్స్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మరింత పెరిగిన బంగారం, వెండి ధరలు

ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా వరుసగా నాలుగో రోజూ పసిడి, వెండి ధరలు మరింత పెరిగాయి. ఔన్సు పసిడి ధర 4629 డాలర్ల వద్దకు చేరగా, ఔన్సు వెండి 91 డాలర్లను తొలిసారిగా అధిగమించింది. దీంతో దేశీయంగానూ ఈ లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం రాత్రి 11.55 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,46,350కు చేరగా, కిలో వెండి ధర రూ.2,87,650ను తాకింది. మంగళవారంతో పోలిస్తే బుధవారం పసిడి ధరల్లో పెద్దగా మార్పులేకపోయినా.. వెండి మాత్రం కిలోకు రూ.12,000 పైగా పెరిగింది.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	540
వరంగల్	542
విజయవాడ	575
తూ/ప గోదావరి	550
విశాఖపట్నం	550
చిత్తూరు	583



ప్రకృతి పరవశం.. ఆధ్యాత్మిక సందేశం!

ప్రతీ పండుగలో మన ఆచారం, సంప్రదాయం, ఆరోగ్యం, ఐకమత్యం, సంతోషం, సామాజిక ప్రయోజనం.. అన్నిటినీ మించి ఆధ్యాత్మికత ఇమిడి ఉంటాయి. సూర్యభగవానుడు మకరరాశి లోనికి ప్రవేశించే కాలమే మకర సంక్రాంతి. ఉత్తమోత్తమమైన ఉత్తరాయణ పుణ్యకాలమిది.

సంక్రాంతి పండుగలో ఎన్ని వేడుకలో! ఎన్నెన్ని సంబరాలో! మామిడి తోరణాలు, బంతిమాలలతో ద్వారాలను అలంకరించి, రంగవల్లులతో ముంగిళ్లను తీర్చి, వాటిపై గొబ్బెమ్మలను పేర్చి.. ఇళ్లకు, వీధులకు విశిష్ట శోభను చేకూరుస్తారు. కుంకుమ పసుపులతో గడపలు, పూలగొబ్బెమ్మలతో వాకిళ్లు మెరిసిపోతుంటాయి.

తాబేలు, రథాకారాల్లో ముగ్గులు వేయడం సంక్రాంతి ప్రత్యేకత. తాబేలు- కూర్మావతారుడైన శ్రీమహావిష్ణువు. ఆయన వాహనమే రథం. అందుకే ముగ్గులను తొక్కకుండా పక్కనుంచి నడుస్తారు. ఈ పండుగ రోజుల్లో వచ్చే హరిదాసులకు, గంగిరెద్దుల వారికి ధనధాన్యాలను పిల్లలతో ఇప్పించడం ఆచారం. చిన్నారులకు దానగుణాన్ని నేర్పడమే ఆంతర్యం.

బొమ్మల కొలువు సంక్రాంతి సంబరాల్లో ఒకటి. బొమ్మలను ఆకర్షణీయంగా, వరుసలుగా పేర్చి, అందరినీ పిలిచి ఆనందిస్తారు. మంగళ గీతాలు ఆలపించి భగవంతుని కృపకి పాత్రులౌతారు. ఈ వేడుక పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరికీ ఆహ్లాదాన్ని చేకూర్చేదే. ఈ ఆనందమే ఆరోగ్య ప్రదాయకం.

దేశవ్యాప్తంగా సంక్రాంతి

సంతోషం, సంబరం, దయ, ధర్మాలకు ఆలవాలం సంక్రాంతి. ధాన్యం చేతికందిన శుభ సందర్భంలో విరివిగా దానాలు చేస్తారు. శుభదాయకమైన ఈరోజు పలువురు పితృ తర్పణాలతో పితృ దేవతలకు తృప్తిని కలిగిస్తారు. అందుకే దీనిని పెద్దల పండుగ అంటారు. అలాగే సంక్రాంతినాటి చుక్కలవేళ ఇంటి పెద్దలకు నమస్కరించి ఆశీర్వాదం పొందుతారు. అందువల్ల మొక్కుల పండుగ అని కూడా పిలుస్తారు. తమిళనాడులో పొంగల్, ఒరిస్సాలో పన సంక్రాంతి, బెంగాల్లో పోష్లో బైశాఖి, పంజాబ్‌లో వైశాఖి, అస్సాంలో భోగాలీ బిహూ, ఉత్తరభారతంలో మాఘీ.. మనకు మకర సంక్రాంతి.. ఇలా దేశవ్యాప్తంగా చేసుకునే పండుగ సంక్రాంతి.

ముక్కనుమ.. పొంగలి ప్రసాదం

తమిళులు కనుమను 'మట్టు పొంగల్', ఆ తర్వాతి రోజును 'కానుమ్ పొంగల్' అంటారు. ముక్కనుమ నాడు పొంగలి ప్రసాదాన్ని నివేదిస్తారు. కొన్నిచోట్ల గ్రామదేవతలకు మాంసాన్ని నివేదిస్తారు. అందువల్ల 'ముక్కల కనుమ' అంటారు.

పశువులను పూజిస్తారు..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ. ఈరోజు పశువులను విశేషంగా అలంకరించి, అవి సంతుష్టి చెందేలా గ్రాసం పెడతారు. గోమాతకు ప్రదక్షిణలు చేసి, పూజించి తరిస్తారు. సకల దేవతా స్వరూపిణి కదా గోమాత. ఎడ్లను కూడా అలంకరించి పూజిస్తారు. ఈరోజు వాటితో పని చేయించరు. పాడిపంటలనిచ్చే పశువులతో పాటు పంటనిచ్చిన పొలానికి కూడా పూజ చేస్తారు. సమర్పించిన నైవేద్యంలో కొంతభాగాన్ని పొలంలో చల్లుతారు. ఇంటికొచ్చిన ఆడపడుచులను గౌరవించి, కానుకలిస్తారు. 'కనుమనాడు కాకి కూడా కదలదు' అని లోకోక్తి. అందుకే ఇంటికి సౌభాగ్యాన్ని తెచ్చే ఆడపడుచులను ఇంటిపట్టునే ఉండమంటారు. ఈరోజు వాతావరణం కలుషితంగా ఉంటుందనేది ప్రబల కారణం. అది ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా స్త్రీలకు మంచిది కాదు. అందుకే ఈ నియమాన్ని ఆచారంగా నియంత్రించి పాటిస్తున్నారు.

వాయనాలుగా గొబ్బెమ్మలు

సంక్రాంతి సందర్భంలో కొందరు సావిత్రీ గౌరీ వ్రతం ఆచరిస్తారు. ఇంకొందరు గొబ్బి గౌరీ వ్రతం ఆచరించి, గొబ్బెమ్మలను వాయనాలుగా ఇస్తారు. ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి.. దూర్వాస మహాముని ప్రబోధంతో ద్రోణాచార్యుని భార్య కృపి ఈ వ్రతాన్ని ఆచరించి అపర రుద్రమూర్తి అయిన అశ్వత్థామను పుత్రునిగా పొందింది. యశోదాదేవి ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణపరమాత్ముడికి తల్లి అయ్యింది.

గంగిరెద్దు నందీశ్వరుని రూపం, శివశక్తి. హరిదాసు నారాయణ రూపం, విష్ణుశక్తి. ఆవుపేడలో లక్ష్మీదేవి కొలువుదీరి ఉంటుంది. గొబ్బెమ్మ గౌరీదేవి ప్రతిరూపం. శివ, విష్ణు, గౌరి, లక్ష్మి, గోమాత, వృషభం- ఇలా సకల దేవతలనూ ఆరాధించే పండుగ సంక్రాంతి.

'పరోపకారార్థమిదం శరీరం' అన్నట్లు హరిదాసులు, గంగిరెద్దులవారు- ఇలా అందరికీ ధన ధాన్యాలు సమర్పించి సంతృప్తిని కలుగచేస్తారు. మనతో పాటు తోటివారూ మనుగడ సాగించాలన్న మానవతా ధోరణి ఈ పండుగలో దర్శనమిస్తుంది. పిండితో ముగ్గులు వేసి.. ఆ చారలలో బియ్యం వేస్తారు. క్రిమికీటకాలు, పక్షులకు ఆహారం అందించడమే ఇందులోని ఉద్దేశం. ప్రకృతి పరవశించి సకల వనరులను సమకూరిస్తే.. మనల్ని మనం పరిశీలించుకుని, ప్రక్షాళన చేసుకుని.. అనంత ప్రాణికోటికి అపార అనురాగాన్ని వర్షింపచేయాలన్నది సంక్రాంతి పండుగలోని ఆధ్యాత్మిక సందేశం.

– డా. పి.లలిత వాణి

మకరందం

makarandam@eenadu.in

ముత్యాల ముగ్గులు, రంగురంగుల గాలిపటాలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు.. ఇదీ సంక్రాంతి సందడి. ఈ పర్వదినం రోజున బలిచక్రవర్తి ఆశీర్వదిస్తాడన్నది పౌరాణిక కథనం...

రాక్షసుడిగా జన్మించినా, ప్రహ్లాదుని మనవడిగా భక్తి సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్నవాడు బలిచక్రవర్తి. అజేయమైన శక్తితో ముల్లోకాలనూ జయించి ధర్మబద్ధంగా పరిపాలన సాగించాడు. అయితే లోకాలను జయించినవారికి కొన్నిసార్లు అహంకారం కలుగుతుంది. బలిచక్రవర్తిలో 'నేనే ఇస్తున్నాను' అనే అహంకారభావాన్ని తొలగించి.. తనను తాను దైవానికి అర్పించుకునే స్థితికి చేర్చడానికే విష్ణుమూర్తి వామనుడిగా అవతరించాడు.

మూడడుగుల నేల అడిగిన వామనుడి విశ్వరూపాన్ని చూసి కూడా వెనుకాడకుండా ఇచ్చిన మాట కోసం శుక్రాచార్యుడి హెచ్చరికను సైతం కాదన్నాడు బలి. రెండు అడుగులతో భూమ్యాకాశాలను కొలిచిన స్వామికి, మూడో అడుగు కోసం తన శిరస్సును వంచి సమర్పించాడు. అందుకే బలిచక్రవర్తి భగవంతుని హృదయంలో శాశ్వత స్థానాన్ని పొందాడు.రైతులు పంటను ఇంటికి తెచ్చుకునేటప్పుడు ఆ సిరిని ప్రసాదించిన భగవంతుడితో పాటు దానగుణానికి ప్రతీకగా నిలిచిన బలిని స్మరించుకుంటారు. మకర సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు అక్షయమవుతాయన్నది శాస్త్ర వచనం. దానగుణానికి అగ్రగణ్యుడైన బలిని స్మరించడం వలన మనలో లోభ లక్షణాలు నశించి, త్యాగశీలత పెరుగుతుందని చెబుతారు.

పాతాళం నుంచి పుడమికి..!




బలిని పాతాళలోకానికి పంపిస్తూ, అక్కడ కూడా తాను తోడుగా ఉంటానని వాగ్దానం చేశాడు శ్రీమహావిష్ణువు. సంవత్సరానికోసారి భూలోకానికి వచ్చి, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారో లేదో చూడమన్నాడు. ఈ కారణంగానే సంక్రాంతి పర్వదినాన బలిచక్రవర్తి పాతాళలోకం నుంచి భువిపైకి వచ్చి, తనను ఆరాధించే భక్తులను ఆశీర్వదిస్తాడు. ఇంటి ముందర వేసే రంగవల్లులు, వాటిల్లో గొబ్బెమ్మలు బలిచక్రవర్తికి స్వాగత చిహ్నాలు. ధాన్య రాశులను చూసి సంతృప్తి చెందుతాడు.

ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు గమనాన్ని మార్చుకున్నట్లే మనిషి తనలోని దుర్గుణాలను వదిలి.. సన్మార్గాన్ని అనుసరించాలి. బలి 'నేను' అన్న భావం వదిలి 'నీవే' (భగవంతుడు) అనే స్థితికి చేరాడు. సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు కూడా ఇలాగే ఉండాలి. మానవసేవే మాధవసేవ అనుకోవడమే సంక్రాంతి సందేశం. బలి పాతాళానికి వెళ్లడం అంటే పతనం కాదు, అది అంతర్ముఖ ప్రయాణం. మనలోని అరిషడ్వర్గాలను అణిచేసి భగవంతుడికి పాదాక్రాంతం అవ్వాలి. బలి సత్యనిష్ఠను, వామనుడి చాకచక్యాన్ని స్మరిస్తూ ఈ పుణ్య కాలంలో దైవచింతనతో గడపాలి.

పండుగ అంటే పదిమందికీ పెట్టడం అనే ఉదార స్వభావాన్ని అలవరచుకుందాం. దానం చేసే చెయ్యి, అహంకారాన్ని వీడిన శిరస్సు భగవంతుడికి దగ్గరగా ఉంటాయన్నది పెద్దల మాట. సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు, హరిదాసులకు సమర్పించే బియ్యం, గంగిరెద్దుల వారికిచ్చే కానుకలు.. ఇవన్నీ సామాజిక సమతుల్యతను పెంచుతాయి. పాతాళం నుంచి వచ్చే బలి చక్రవర్తి పాడిపంటలను, దయార్ద్ర హృదయాలను చూసి ఆనందించి ఆశీర్వదిస్తాడు.

– కె.వి.లక్ష్మణ రావు

మౌనం పాటించాల్సిన రోజు



చొల్లంగి అమావాస్య, దర్శ అమావాస్య పేర్లతోనూ ప్రసిద్ధమైన మౌని అమావాస్య రోజున మౌనం పాటించాలి. అంటే మాటల్ని త్యజించి, మనసును నియంత్రించి, ఆత్మతో సంభాషించుకునే స్థితిలో ఉండాలి. ఈ రోజున మౌనం పాటించి, ఉపవాసం, జపం, ధ్యానం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తద్వారా ఆత్మశుద్ధి, అంతర్ముఖత కలుగుతాయి. కోపం, అసహనం తగ్గుతాయి.

ఉత్తరాదిన ఈ మౌని అమావాస్యను అత్యంత విశేషంగా పాటిస్తారు. ఏటా ప్రయాగ త్రివేణీ సంగమంలో జరిగే మాఘ మేళాలో ప్రత్యేకించి ఈ మౌని అమావాస్య రోజున లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. తూర్పుగోదావరిలోని చొల్లంగి వద్ద గోదావరి సముద్రంలో కలుస్తుంది. మౌని అమావాస్య రోజున ఇక్కడ స్నానం చేయడంవల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. పెద్దలకు పిండప్రదానాలు చేస్తారు. ఈ రోజున గంగమ్మ తల్లి ఆకాశం నుంచి అమృతంగా మారి కిందికొస్తుందని నమ్ముతారు. అందుకే ఈ నదీ స్నానం చేయాలి. ఆ అవకాశం లేనివారు ఇంట్లోనే 'గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదా సింధు కావేరి జలేస్మిన్ సన్నిధం కురు' అని పఠిస్తూ స్నానం చేయాలి. ఈ పర్వదినాన పూర్వీకులను స్మరించుకుంటూ పిండప్రదానాలు, పూజలు చేయడం ద్వారా మోక్షాన్ని పొంది, వైకుంఠానికి వెళ్తారని నమ్ముతారు.

– మాపూరు విజయలక్ష్మి

కన్నా... వింటున్నాడా? అమ్మా... అంటున్నాడా?

పిల్లల బారసాల ఘనంగా చేస్తాం...
మొదటి బర్త్‌డే అని సంబరాలు చేస్తాం...
వారి భవిష్యత్తు కోసం ఏర్పాట్లూ మొదలు పెడతాం.
ఇవి మాత్రమే కాదు ముఖ్యం.
బిడ్డ పుట్టినప్పటి నుంచి వాళ్లకు ఊహ వచ్చిందాకా క్షుణ్ణంగా గమనించాలి.
పిలిస్తే పలుకుతున్నారా?
శబ్దాలకు స్పందిస్తున్నారా?
మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారా?
చెక్ చేస్తూ ఉండండి...
ఎందుకంటే,
మనం తొలి దశలో గుర్తిస్తే పిల్లల వినికిడి, పలుకు లోపాలను తేలిగ్గా పరిష్కరించొచ్చు.





- శిశువుల్లో వినికిడి సమస్యలను జాగ్రత్తగా పరిశీలిస్తే గుర్తించొచ్చు. పసిబిడ్డ ఓ మాదిరి లేదా పెద్ద శబ్దాలకు స్పందించకపోతే అనుమానించాల్సిందే. ఆరు నెలల వయసున్నప్పుడు వెనుక నుంచి చప్పట్లు కొట్టినా.. ఏదైనా వయసు బిడ్డను పిలిచినా, టీవీ, మొబైల్ ఫోన్‌లో ఎక్కువ శబ్దాలకు స్పందించకున్నా వినికిడి సమస్య ఉన్నట్లు అంచనాకు రావొచ్చు.
- ఏడాదిన్నర వయసున్న బిడ్డ చిన్నచిన్న పదాలు పలకలేకపోతున్నా, మాటల్లో స్పష్టత లేకున్నా, స్పష్టమైన ఉచ్చారణ లేకుంటే మాటలు సరిగ్గా రావడం లేదని అర్థం చేసుకోవాలి.
- కొందరు తల్లిదండ్రులు చిన్నప్పుడే సమస్యను గుర్తించినా.. పెద్దయితే అదే తగ్గిపోతుందన్న భావనతో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఐదేళ్లలోపు చికిత్స చేయకపోతే ఆ తరువాత కష్టసాధ్యమవుతుందని గుర్తించాలి.
- మాటైనా, శబ్దమైనా చెవిలోని శ్రవణ నాడి (ఆడిటరీ నర్వ్) నుంచి మెదడుకు వెళ్లి అక్కడ విశ్లేషణ అవుతుంది. ఈ నరం దెబ్బ తింటే సందేశం మెదడుకు చేరదు. కొందరికి ఈ సమస్య ఉంటుంది.
- దీన్ని గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే పరిష్కరించుకునే అవకాశం ఉంది. ఆలస్యంగా గుర్తిస్తే అధ్యయనం, ప్రవర్తనపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- రెండేళ్లలోపు శిశువుకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేసే దశల వారీగా థెరపీలు ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావొచ్చు. అదే వయసు పెరిగితే హియరింగ్ ఎయిడ్ ద్వారా మేనేజ్ చేయాల్సి ఉంటుంది.
- ఆడియాలజిస్ట్‌ను సంప్రదిస్తే నొప్పి లేకుండా సాధారణ చికిత్సలతో వినికిడి సమస్యను పరిష్కరిస్తారు. స్పీచ్, లాంగ్వేజ్ పెథాలజిస్ట్ మాట్లాడటం, భాష, కమ్యూనికేషన్ మెరుగుపడేందుకు చికిత్స అందిస్తారు.
- ప్రతి జిల్లా ఆసుపత్రిలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లు (డీఈఐసీ) ఉన్నాయి. ఇక్కడికి వెళ్తే ఆ రంగ వైద్య నిపుణులు సేవలందిస్తారు.

పిల్లలతో జాగ్రత్త..

- ప్రైవేటుగా థెరపీ సెంటర్లు ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటవుతున్నా ప్రభుత్వ పర్యవేక్షణ ఉండట్లేదు. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు రూపొందించాల్సి ఉంది.
- అనుమతులు, అర్హతలు లేకుండా ఏర్పాటయ్యే కేంద్రాల్లో పిల్లలకు చికిత్స చేయించకూడదు. ఏఎస్ఎల్పీ నాలుగేళ్ల కోర్సు చేసినవారే స్పీచ్‌థెరపిస్టులని గుర్తుంచుకోవాలి.
- ఆటిజం ఉన్నవాళ్లకు స్పీచ్ సమస్య కూడా ఉంటుంది. థెరపీ మల్టీ పర్పస్.. బిహేవియర్, క్లినికల్ సైకాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్ పర్యవేక్షణలో చేయాలి. వీరికి వినికిడి సమస్య ఉండదు. బిహేవియరల్ ప్రాబ్లమ్స్ ఉంటాయి. దీనికి కూడా ఆరేళ్లలోపు చికిత్స చేయించడం మేలు.

దేశంలో పుట్టే ప్రతి 100 మందిలో ఆరు నుంచి ఏడుగురు వినికిడి సమస్యతో బాధపడుతున్నారు... 10 నుంచి 15 మంది మాట్లాడలేకపోతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. జనాభాలో 6.3 శాతం మంది వినికిడి, 14 శాతం మంది మాటలు, భాషా సమస్యలతో బాధపడుతున్నారు.

పిల్లల్లో ఈ తరహా సమస్య ఉన్నట్లు అనుమానించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. నిర్ధారణ అయితే వైద్యుల సూచనల మేరకు ఇంటివద్ద వారితో నిత్యం సాధన చేయించడం ద్వారా త్వరగా పురోగతి సాధించవచ్చు.

– పి.మురళి సూర్య, ఆడియాలజిస్ట్

– ఈనాడు, రాజమహేంద్రవరం

పత్రం.. పవిత్రం

'మహాబోధి' పత్రాలకు యూనిక్ ఐడీ నంబరు

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన బుద్ధ గయాలోని 'జ్ఞాన వృక్షం' మహాబోధి విశిష్టతను మరింత పెంచేలా బిహార్‌లోని 'బుద్ధ గయా టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ' (బీటీఎంసీ) ఓ ప్రత్యేక నిర్ణయాన్ని తీసుకుంది. బౌద్ధమతంలో అత్యంత పవిత్రమైన ఈ వృక్షం నుంచి రాలిపడే ప్రతి ఆకుకు ఇకపై ఒక 'యూనిక్ ఐడీ' నంబరు కేటాయించనున్నారు. ఈ ఐడీ ద్వారా ఆయా ఆకుల వివరాలతో రికార్డును కమిటీ నిర్వహిస్తుంది. క్రీ.పూ. 585లో శాక్య వంశ యువరాజు సిద్ధార్థుడు ఈ రావిచెట్టు కిందే ధ్యానం చేసి బుద్ధుడిగా మారాడు. ఈ చెట్టు ఆకులు జ్ఞానం, శాంతి, ఆధ్యాత్మికతలకు ప్రతీకలుగా బౌద్ధ మత విశ్వాసులు భావిస్తారని అఖిల భారత భిక్షు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞా దీప్ తెలిపారు. ఇకపై ఈ ఆకులను శుద్ధి చేసి అందమైన ఫ్రేమ్‌లో అమర్చాక, యూనిక్ నంబరుతో కూడిన ధ్రువీకరణ పత్రంతో అందజేస్తారు. ఈ కొత్త విధానం భక్తులు పొందే ఆకు అసలైన మహాబోధి వృక్షానిదే అనేందుకు రుజువుగా చెప్పవచ్చు. ఇందులో మహాబోధి వృక్షం వివరాలతో క్యూఆర్ కోడ్ ఉంటుంది. శాస్త్రవేత్తల సలహాతో కత్తిరించే ఈ చెట్టు కొమ్మలను చూర్ణం చేసి చిన్న చిన్న పెట్టెల్లో ప్రముఖులకు బహూకరిస్తారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా నీడలో ఉండే ఈ చెట్టుకు ఒక డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో నాలుగు పోలీస్ బెటాలియన్లు 24 గంటలూ కాపలా ఉంటాయి. డెహ్రాడూన్ అటవీ శాస్త్రవేత్తలు ప్రతి నెలా పరిశీలిస్తారు. దీని సంరక్షణకు ఏటా రూ.10 లక్షలకు పైగా బీటీఎంసీ ఖర్చు చేస్తోంది. ఈ చెట్టును సందర్శించేందుకు 30 లక్షలకు పైగా దేశ, విదేశాల పర్యాటకులు ప్రతి సంవత్సరం బుద్ధ గయాకు వస్తారు. బోధి వృక్షపు ఆకులు, కొమ్మలు విదేశాలకు పంపాలంటే భారత హోం మంత్రిత్వ శాఖతోపాటు బిహార్ ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. మంగోలియా, థాయిలాండ్ దేశాలకు ఈ వృక్షం కొమ్మలు ఇటీవల పంపించారు.

– ఈటీవీ భారత్







వరి కాని వరిగె..!

వరిలా కనిపిస్తున్న ఈ క్షేత్రం వరిగె పంటది. అచ్చం వరిలాగే పెరిగి, ధాన్యం కంకి కూడా అలాగే వేస్తుంది. పూర్తిగా మెట్ట పొలాల్లో సాగవుతుంది. తక్కువ పెట్టుబడితో 60 రోజుల్లో చేతికొస్తుంది. పోషకాలూ ఎక్కువే. వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని రైతులు సాగు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం 10 ఎకరాల్లో మొదలై ప్రస్తుతం 300 ఎకరాలకు విస్తరించింది. ప్రొద్దుటూరు వ్యవసాయశాఖ అధికారి హరికుమార్ వరిగెల గురించి వివరిస్తూ.. 'వీటిల్లో పీచుపదార్థం, విటమిన్లు, ప్రొటీన్లతోపాటు కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. అన్నం, కిచిడీ, ఇడ్లీలూ చేసుకోవచ్చు. మధుమేహం, బీపీ ఉన్న వారికి మేలు చేస్తాయి' అని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా వరిగెలు గరిష్ఠంగా రూ.5 వేలు పలుకుతున్నాయని రైతులు తెలిపారు. – ఈనాడు, కడప



రాష్ట్రపతితో విందుకు వెళ్తున్నాం



ఛత్తీస్‌గఢ్ విద్యార్థినులు మ్యాన్‌హోల్స్, మురుగు కాలువల లోపలికి వెళ్లి శుభ్రం చేసి తనిఖీ చేసే రోబోను అభివృద్ధి చేశారు. దుర్గ్ జిల్లాలోని వైశాలి నగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు కవితా సాహు తండ్రి ఆటోడ్రైవరు కాగా, అంజలి చౌహాన్ పారిశుద్ధ్య కార్మికుడి కుమార్తె. నీతి ఆయోగ్ దేశవ్యాప్తంగా నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ఈ విద్యార్థినుల ప్రాజెక్టు టాప్-10లో నిలిచింది. దీంతో జనవరి 26న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి విందులో పాల్గొనే అవకాశం లభించింది. తాము రూపొందించిన రోబో పైపు విషపూరిత వాయువులు ఉన్న ప్రాంతాల్లో పనిచేస్తుందని, ఇరుకైన ప్రదేశాలను కూడా తనిఖీ చేసి శుభ్రపరుస్తుందని విద్యార్థినులు వివరించారు. – ఈటీవీ భారత్

మొక్క కొంచెం.. కాయలు ఘనం



మునగ చెట్టు అంటే అంత ఎత్తున ఉంటుంది. ములక్కాడలు కోయాలంటే ఏదో ఒక ఏర్పాటు చేసుకోవాల్సిందే. కానీ కుండీలో పెరుగుతున్న ఈ మొక్క మాత్రం అప్పుడే పది ములక్కాడలతో అబ్బురపరుస్తోంది. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన పుట్టగుంట సతీశ్ కుమార్ ఇంటి ఆవరణలో ఈ మొక్క ఉంది. ఆకులు తక్కువగా ఉన్నా కాడలు ఎక్కువగా ఉండటం విశేషమేనని బాపులపాడు మండల ఉద్యానాధికారి జోసెఫ్ సుందరం తెలిపారు. – న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

జ్ఞానానికి శత్రువు అదే..



తమకన్నీ తెలుసన్న గర్వంతో ఉండేవారు తమ తప్పులను అంగీకరించడానికిగానీ, వాటిని సరిదిద్దుకోవడానికిగానీ ఏ మాత్రం ఇష్టపడరు. ఫలితంగా వారు కొత్త విషయాలను నేర్చుకోకపోవడం వల్ల వారి జ్ఞానం వృద్ధి చెందదు. దీనివల్ల వారు ఎంత ప్రతిభావంతులైనప్పటికీ జీవితంలో పురోగతి సాధించలేరు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ గర్వాన్ని దరిచేరనీయకండి.

– నావల్ రవికాంత్, ఆంత్రప్రెన్యూర్



పండగ సెలవులని వచ్చా..

నాలుగేళ్ల తర్వాత కవ్వాల్‌లో దర్శనమిచ్చిన గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్

మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం (జన్నారం అడవి)లో నాలుగేళ్ల తర్వాత ఈ పక్షి కనిపించిందని అటవీ డివిజనల్ అధికారి రామ్‌మోహన్ తెలిపారు. దీనిని కెమెరాలో బంధించి దాని వివరాలను వెల్లడించారు. "గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్ అని పిలిచే ఈ పక్షి జాతి మనుగడ ప్రస్తుతం ప్రమాదంలో ఉంది. ఆసియా దేశాల్లో కనిపించే ఈ పక్షుల సంఖ్య పది వేలకు మించి ఉండదని ఒక అంచనా. వీటి ప్రధాన ఆహారం చేపలు. కుంటలు, చెరువులు, చిత్తడి నేలలు ఈ పక్షి ఆవాసాలు. ఏడాదికి కేవలం రెండు గుడ్లను మాత్రమే పెడుతుంది" అని వివరించారు. – న్యూస్‌టుడే, జన్నారం

ఆవకాయ నుంచి అంతరిక్షం దాకా..

- వికీపీడియాలో ఏదైనా రాసేయొచ్చు
- అదో ఆన్‌లైన్ విజ్ఞాన భాండాగారం
- ఆంగ్లంలో 71 లక్షలు, ఇతర భాషల్లో 6.6 కోట్ల వ్యాసాలు
- తెలుగు వికీలో 1.18 లక్షలు



ఆవకాయ గురించి అడిగినా.. అణుబాంబు సమాచారం కావాలన్నా.. సెర్చ్ ఇంజిన్లు మనల్ని తీసుకెళ్లేది వికీపీడియాకే. ఎందుకంటే అదో అంతులేని సమాచార భాండాగారం. దేశ విదేశాల్లోని విశేషాలన్నింటినీ ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచే వేదిక. ఏం కావాలన్నా ఉచితంగా చూసుకోవచ్చు. అవసరమైతే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇదేమీ ఒక్కరోజులో తయారైంది కాదు. పాతికేళ్ల ప్రస్థానం. ఈ కాలంలో ఆంగ్ల వికీపీడియాలో 71 లక్షల వ్యాసాలు, వివిధ దేశాలకు చెందిన 342 భాషల్లో 6.6 కోట్లకు పైగా వ్యాసాలు పొందుపరిచారు. ఇది ఒకరిద్దరి కృషి కాదు.. 2001 జనవరి 15న జిమ్మీవేల్స్, ల్యారీసాంగెర్ వికీపీడియా ప్రారంభించగా.. వివిధ దేశాల్లో లక్షలమంది స్వచ్ఛందంగా రాసేవారు ముందుకొచ్చారు. కాలక్రమంలో ఇతర భాషలకూ విస్తరించింది. అంతా కలిసి మట్టికొట్టుకుపోయిన గదుల్లో.. పాత భోషాణాల్లో, మూలన పెట్టిన పేటికల్లోని సమాచారాన్ని బయటకు తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాలకే, కొందరికే పరిమితమైన సైన్స్ పేపర్లు, పుస్తకాలు, వార్తా పత్రికలు, కంప్యూటర్లు, సర్వర్లలోని విజ్ఞానాన్ని గుదిగుచ్చి ప్రపంచం ముందు ఉంచారు. ప్రస్తుతం 353 భాషల్లో వికీపీడియా ప్రజలకు సమాచారం అందిస్తోంది. గురువారంతో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. తెలుగు వికీపీడియా (తెవికీ) 2003 డిసెంబరులో మొదలైంది. ప్రస్తుతం ఇందులో 1,18,322 వ్యాసాలున్నాయి. వికీ అనేది హవాయి భాషా పదం. వికీ అంటే త్వరగా అని అర్థం. సగటున నెలకు 15వేల వ్యాసాలు వికీపీడియాలో చేరుతున్నాయి. మన ఊరి చరిత్రతోపాటు జనాభా వివరాలూ అందులో ఉంటాయి. తెలుగుదనం, సంస్కృతీ సంప్రదాయాలను ఈ తరానికి అందించే వేదికగా తెవికీ నిలుస్తోంది. భారతీయ భాషల్లో ఒకప్పుడు ఏడో స్థానంలో ఉన్న తెవికీ నాలుగో స్థానానికి చేరింది.

ఎవరైనా రాయొచ్చు.. ఫొటోలు పెట్టొచ్చు

రాయాలనే కోరిక, రాసే అలవాటు, ఆసక్తి ఉంటే వికీలో ప్రవేశించవచ్చు. ఎవరైనా దేని గురించి అయినా రాయొచ్చు. మీ ఊరు గురించి రాయొచ్చు. మీ పల్లె ఫొటో పెట్టొచ్చు. ఈ మధ్య చదివిన పుస్తకం, చూసిన సినిమా గురించీ రాసేయొచ్చు. అంతా స్వచ్ఛందమే. రాసినందుకు డబ్బు ఇవ్వరు. ఉచితంగా చదువుకోవచ్చు. ప్రింట్ తీసుకోవచ్చు. ఎవరికీ పైసా చెల్లించాల్సిన పనిలేదు. వికీమీడియా ఫౌండేషన్ ద్వారా విరాళాలు సేకరించి కార్యక్రమాల నిర్వహణకు ఖర్చుచేస్తారు.

ప్రామాణికత తప్పనిసరి

వికీలో రాసే వ్యాసాలు అన్ని కోణాల్ని నిష్పాక్షికంగా ప్రతిబింబించాలనే నిబంధన ఉంది. విశ్వసనీయ మూలాల ఆధారంగానే రాయాలి. రాసిన సమాచారాన్ని ధ్రువీకరించేందుకు దాన్ని ఎక్కడి నుంచి సేకరించారో వాటి వివరాల్ని పొందుపరచడం తప్పనిసరి. పాఠకులు వీటిని చూసి వ్యాసాల్లోని ప్రామాణికతను నిర్ధారించుకోవచ్చు. ఆరోగ్యంపై రాయాలంటే దానికి సంబంధించిన నిపుణులు రాసిన వ్యాసాల్ని ప్రస్తావించాలి. అధీకృత వెబ్‌సైట్ల నుంచి తీసుకుంటే వాటినీ వివరించాలి. ఏవైనా పత్రికల్లో వచ్చిన వార్తాంశాలైతే లింక్‌లు ఇవ్వాలి. నిర్వాహకులు, సమన్వయకర్తలు, స్వచ్ఛందంగా పనిచేసే వారు ఈ బాధ్యత తీసుకుంటారు. ఎప్పటికప్పుడు చర్చించి వికీ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూస్తారు.

'ఈనాడు' కథనం.. 12 రోజుల్లో సభ్యుల రెట్టింపు

తెలుగులో వికీపీడియా తయారవుతోందనే సంగతే 20 ఏళ్ల కిందట చాలా మందికి తెలియదు. 2006 నవంబరు 5న 'ఈనాడు' ఆదివారం సంచికలో వ్యాసం ప్రచురితమైంది. దీంతో సభ్యుల సంఖ్య 12 రోజుల్లో రెట్టింపు అయింది. తర్వాత వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలతో తెవికీ మరింతమందికి చేరువైంది.

వికీ ఫౌండేషన్ ప్రాజెక్టులు ఇవీ

- **వికీసోర్స్:** కాపీ హక్కులు లేని పుస్తకాల గ్రంథాలయం
- **విక్షనరీ:** ఉచిత నిఘంటువు
- **వికీ వ్యాఖ్య:** ప్రముఖుల వ్యాఖ్యలు చూపించే వేదిక
- **వికీబుక్స్:** కొత్త పుస్తకాలు రాసి ప్రజలకు అందించే చోటు
- **వికీ కామన్స్:** ఉచితంగా ఫొటోలు, వీడియో, ఆడియోలు
- **వికీడేటా:** ప్రపంచ విజ్ఞానాన్ని డేటా రూపంలో ఉంచేది

తెవికీలో విశ్వసనీయ సమాచారమే


– తెవికీ సమన్వయకర్త వి.జానకీ సుశీల



'వికీలో విశ్వసనీయ సమాచారాన్ని అందుబాటులో ఉంచుతాం. ఎవరినైనా తూలనాడే పరిస్థితి ఉంటే తొలగిస్తాం. ఎలాంటి కంటెంట్ ఉండాలో నిబంధనలున్నాయి. రాసే ప్రతి అంశానికీ ఆధారం ఉండాలి. అందులో ఉండేది అధీకృత సమాచారమే. దీన్ని ప్రాథమిక సమాచారంగానే తీసుకోవాలి' అని తెవికీ సమన్వయకర్త, కార్యక్రమాల నిర్వాహకులు వి.జానకీ సుశీల చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పదవీవిరమణ చేసిన ఆమె.. 2020లో వికీతో ప్రయాణం ప్రారంభించారు. వికీకామన్స్, వికీ బుక్స్, వికీ వ్యాఖ్య, వికీసోర్స్, తెవికీ బడి విభాగాల్లో కీలకంగా పనిచేస్తున్నారు. ఎన్ఆర్ఎస్‌సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)లో పనిచేసి పదవీవిరమణ చేసిన భర్త రమేశ్ సహకారం తనకు ఎంతో ఉందని సుశీల వివరించారు. '2024 నుంచి తెలుగు వికీపీడియా బడి నిర్వహిస్తున్నాం. రాయాలనే ఆసక్తి ఉన్న కొత్తవారికి ఇందులో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తాం. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, బుక్ ఫెయిర్ తదితర వేదికల్లో నమోదు చేసుకున్న వారికీ ఇక్కడే శిక్షణ అందిస్తాం. బుక్‌ఫెయిర్ కార్యక్రమాలు విస్తృతం చేశాం. గూగుల్, వికీమీడియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే ప్రాజెక్టుల్లోనూ పనిచేస్తున్నా' అని వివరించారు.

మా ఊరి చరిత్ర నుంచి మొదలై

– యర్రా రామారావు, అడ్మినిస్ట్రేటర్, తెవికీ



'ఒకరోజు వికీపీడియాలో మా గ్రామం (గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు) గురించి వెతుకుతుంటే.. ఒక్క వాక్యమే కనిపించింది. మా ఊరి చరిత్ర, ఆలయాల గురించి రాయాలని, వికీ ద్వారా అందరికీ తెలియజేయాలని నిర్ణయించుకున్నా. 2012 డిసెంబరు 16న లాగిన్ అయ్యా. వికీతో నా ప్రయాణం అలా మొదలైంది' అని పంచాయతీరాజ్ శాఖలో ఈఓపీఆర్‌డీగా పనిచేస్తూ 2009లో పదవీవిరమణ చేసిన యర్రా రామారావు వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రామాలవారీగా జనాభా లెక్కల(2011) సమాచారాన్ని వికీలో ఉంచడంలో కీలకంగా వ్యవహరించారాయన. ఆయన సేవలకు గుర్తింపుగా సీఐఎస్ ఫౌండేషన్ (సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ సొసైటీ) తమ పుస్తకంలో క్షేత్రపాలకుడు అని ప్రత్యేక పేజీ ప్రచురించింది. తెలంగాణలో 95% గ్రామాల వ్యాసాలు ఆయనే రాశారు.

వికీమీడియా కామన్స్‌లో 6వేలకు పైగా ఫొటోలు

– ఇడుపులపాటి మహేశ్, ఆర్కిటెక్ట్, బిల్డింగ్ డిజైనర్, అమరావతి



'నాకు తెలిసిన ఏ విషయమైనా పదిమందికీ చెప్పాలని ఆసక్తి. మన ఊరు బాగుందంటే అందరికీ తెలియాలని కోరుకుంటా. అదే వికీపీడియా వైపు నడిపించింది' అని ఆర్కిటెక్ట్, వికీమీడియా కామన్స్ నిర్వహించే మహేశ్ వివరించారు. సీనియర్ ఇంటర్‌లో ఉన్నప్పుడు 2015లో వికీతో ప్రయాణం ప్రారంభించారు. 'వికీమీడియా కామన్స్‌లో ఇప్పటివరకు 6వేలకు పైగా ఫొటోలు అప్‌లోడ్ చేశాం. ఆంధ్రలో నేను తీసిన మొదటి ఫీచర్డ్ పిక్చర్‌గా ఇంద్రకీలాద్రి, ప్రకాశం బ్యారేజి, పడవ ఫొటో నిలిచింది. తెలంగాణలో రెండో ఫీచర్డ్ పిక్చర్ కూడా నేనే తీశా. అమరావతి పదేళ్ల చరిత్ర పొందుపరిచాం. ఏలూరు చరిత్ర డాక్యుమెంట్ చేయడానికి 15 రోజులు పట్టింది. భద్రాచలం శ్రీరామనవమి సందర్భంగానూ స్వామివారి ఆభరణాలు, ఊరేగింపు సుమారు 800 ఫొటోలు అప్‌లోడ్ చేశాం. సంక్రాంతికి కోనసీమ డాక్యుమెంటరీకి మా బృందం సిద్ధమవుతోంది' అని పేర్కొన్నారు.

– ఈనాడు, అమరావతి

సంక్రాంతిపల్లె.. పేరు వచ్చిందిలా!



ఏడెనిమిది దశాబ్దాల క్రితం అది కోడిపుంజులూరు. అప్పట్లో ఆ గ్రామానికి పరిశీలన నిమిత్తం వచ్చిన అధికారులు.. ఇక్కడ సాధారణ రోజుల్లోనూ సంక్రాంతి పండగను తలపించేలా వీధుల్లో ముగ్గులు ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. ఊరు పేరేంటని గ్రామ పెద్దల్ని అడగ్గా.. కోడిపుంజులూరు అని చెప్పారు. అది విన్న అధికారులు.. మీ ఊళ్లో సంక్రాంతి పండగ వాతావరణం కనిపిస్తోంది.. సంక్రాంతిపల్లె అని పేరు పెట్టుకోండని సూచిస్తే గ్రామస్థులు అంగీకరించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో ఈ గ్రామం ఉంది. ప్రస్తుతం ఏడాదంతా పండగ వాతావరణం కనపడకపోయినా పండగ రోజుల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

– న్యూస్‌టుడే, బంగారుపాళ్యం, చిత్తూరు కలెక్టరేట్



సంక్రాంతిపల్లెలోని ఓ వీధిలో ముగ్గులు

'క్యాట్' పరిధిలోకి బీబీనగర్, మంగళగిరి ఎయిమ్స్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని బీబీనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి ఎయిమ్స్ సహా దేశంలోని 16 అఖిల భారత వైద్య విద్యా సంస్థలను కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (సీఏటీ) పరిధిలోకి తీసుకొస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. క్యాట్ అనేది క్వాసీ జ్యుడిషియల్ వ్యవస్థ. ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన విధినిర్వహణ సమస్యల వివాదాలను సీఏటీ విచారించి పరిష్కరిస్తుంది. ఇప్పుడు 16 ఎయిమ్స్‌లను దీని పరిధిలోకి చేర్చినందున ఈ సంస్థల్లోని నియామకాలు, వ్యవహారాలు, సర్వీసులు, పోస్టుల విషయంలో సమస్యలు ఎదురైనప్పుడు ప్రాథమికంగా సీఏటీను ఆశ్రయించాల్సి ఉంటుంది. క్యాట్ పరిధిలో చేర్చిన మిగతా ఎయిమ్స్‌లో జమ్మూకశ్మీర్‌లోని అవంతిపుర, విజయపుర్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్, రాయబరేలి, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, అస్సాం, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో ఒక్కొక్కటి ఉన్నాయి.

వయా విజయవాడ హైవే.. 5 రోజులు..3 లక్షల వాహనాలు

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వరుసగా ఐదు రోజుల పాటు వాహనాల రద్దీ కొనసాగింది. శనివారం ఒక్కరోజే అత్యధికంగా 71,284 వాహనాలు వెళ్లాయి. శుక్రవారం 53 వేలు, ఆదివారం 62 వేలు, సోమవారం 56 వేలు, మంగళవారం 62 వేలు వెళ్లాయి. ఐదు రోజులు కలిపి పంతంగి టోల్‌ప్లాజా మీదుగా ఇరువైపులా 3.04 లక్షల వాహనాలు రాకపోకలు సాగించాయి. వీటిలో కేవలం విజయవాడ వైపే 2.04 లక్షల వాహనాలు వెళ్లాయి. బుధవారం రోజు వాహనాల రద్దీ సాధారణంగానే ఉంది. నిరుడు పండక్కి 3 రోజుల ముందు 2.07 లక్షల వాహనాలు రాకపోకలు సాగించాయి. ఈసారి కూడా భారీ స్థాయిలో వాహనాలు వెళ్తాయని పోలీసులు అంచనా వేశారు. కానీ ఈ మార్గంలో బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనల నిర్మాణ పనుల మూలంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని రాకపోకలు సాగించినట్లు పోలీసులు చెబుతున్నారు. గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, ప్రకాశం, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నాగార్జునసాగర్ హైవే మీదుగా.. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి మార్గంలో చిట్యాల మీదుగా రాకపోకలు సాగించారు.



పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

‘కట్టలు’ తెంచిన కోళ్లు

- ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో యథేచ్ఛగా పందేల నిర్వహణ
- పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు హాజరు
- ప్రతి బరీ జనజాతర
- మురమళ్లలో నిమిషంలోపే రూ.50 లక్షలు ఆవిరి

పండగ పూట కోడి తొడగొట్టింది..
పందేనికి సై అంటూ తలపడింది..
కాలికి కత్తికట్టి కలబడింది..
ప్రత్యర్థిని పడగొట్టింది..
యజమానికి కాసులు మూటకట్టింది..

ఈనాడు– ఏలూరు, కాకినాడ, ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం: తెలుగువారి పెద్ద పండగ తొలి రోజైన భోగి నాడే కోడి పందేలు మహాజోరుగా సాగాయి. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల్లో క్రికెట్ స్టేడియంలను తలపించేలా వేసిన బరుల్లో పందెం కోడి కాలికి కత్తి కట్టి ఆడింది. వేల మంది కేరింతల నడుమ.. ప్రత్యర్థి కోడిని, పందేనికి పెట్టిన నోట్లకట్టల్ని తెగ్గొట్టింది. ఓ పక్క కోడి పందేలు, మరోవైపు గుండాట, కోతముక్కలాంటి జూదాలు. . వాటిని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేల మందితో ప్రతి బరీ జాతరను తలపించింది. చట్టవిరుద్ధంగా ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న అధికారుల ఆదేశాలు గాలికి పోయాయి. పందేల ధాటికి రూ.కోట్లు చేతులు మారాయి.

ఉమ్మడి పశ్చిమగోదావరిలో బుధవారం కోడి పందేలు భారీస్థాయిలో జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే పందెగాళ్లు పలు చోట్ల వాటికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీగా కార్లలో తరలిరావటంతో బరుల వద్ద ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఏలూరు జిల్లాలో దుగ్గిరాల, మీర్జాపురం, చేబ్రోలు, గొల్లగూడెం, కొయ్యలగూడెం, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, చింతలపూడి, పోలవరం ప్రాంతాలు, డెల్టాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో వందల సంఖ్యలో బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, గంటా శ్రీనివాసరావు, ఎంపీ సానా సతీష్‌బాబు బరుల వద్ద కనిపించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు కనకయ్య, ఆదినారాయణ హాజరై పందేలు తిలకించారు. ఏలూరు జిల్లాలో తొలిసారి ఏర్పాటైన మీర్జాపురం బరికి వేల మంది తరలివచ్చారు. దుగ్గిరాల, పెదఅమిరం, ఐ.భీమవరం, నరసాపురం వీవర్స్ కాలనీ, అన్నవరం, ఈడేపల్లి, భుజబలపట్నం బరుల వద్దా జనజాతరే. డెల్టాలో పలు బరుల వద్ద క్యాసినో నిర్వహణకు సిద్ధమయ్యారన్న సమాచారం గుప్పుమంది. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు మఫ్టీలో ఉండి పరిశీలిస్తున్నారని తెలిసి వాటి నిర్వహణకు వెనకంజ వేసినట్లు తెలిసింది.




పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపుంజులను పట్టుకొని పందేలను ప్రారంభిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి
◆ పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరం బరిలో నగదును యంత్రాలతో లెక్కిస్తూ..



విజయవాడలోని రామవరప్పాడు ఇన్నర్‌రింగురోడ్డు దిగువన విద్యుత్తు వెలుగుల్లో సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో జాతరలా సాగుతున్న కోడి పందేలు

తూర్పులో తొలి రోజే రూ.100 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ కోళ్లు కత్తులు దూశాయి. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం 90కు పైగా బరుల్లో దాదాపు 10 వేల పందేలు జరిగినట్లు అంచనా. కోడి పందేలు, గుండాట, కోతముక్కల్లో రూ.100 కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భారీ బరి వద్ద బుధవారం 25 పందేలు నిర్వహించారు. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పందేలు సాగాయి. రూ.50 లక్షలకు వేసిన ఓ పందెం 39 సెకన్లలోనే విజేతను తేల్చేసింది. తెలంగాణ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కుమారుడు ఓ పందెంలో గెలిచారు. ఇదే ప్రాంగణంలో మరో రెండు బరుల్లో 70కు పైగా జోడీలు అమీతుమీ తేల్చుకున్నాయి. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), రావులపాలెంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ కత్తికట్టని కోళ్లతో పందేలు ప్రారంభించారు. మిగతా చోట్ల నేతల అనుచరులే దగ్గరుండి నిర్వహించారు.

కృష్ణాలో జూదాల జోరు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడి పందేలతో పాటు పెద్దఎత్తున కోతముక్క, గుండాట తదితరాలు నిర్వహించారు. విజయవాడ రూరల్, ఉప్పులూరు, కేసరపల్లి, విస్సన్నపేట, ఈడుపుగల్లు, గొడవర్రు, తిరువూరు, కంకిపాడు, ఆకునూరు, కాటూరు, గుడ్లవల్లేరు, గుడివాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో పందేలు కాశారు. కోడి పందేల కంటే కోతముక్కలు, గుండాట, లోనాబయట, కాయ్‌రాజా కాయ్ వంటి జూద క్రీడల్లోనే రూ.కోట్లు చేతులు మారాయి. గన్నవరం పరిధిలోని కేసరపల్లిలో పందెగాళ్లను ఆకట్టుకునేందుకు మూడు కార్లను బహుమతిగా పెట్టారు.



పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ బరిలో హోరాహోరీగా తలపడుతున్న కోడిపుంజులు



ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని మీర్జాపురం బరిలో కోడిపందేలను తిలకిస్తున్న ప్రజలు

బుల్లెట్లు, కార్లు, బంగారం.. బహుమతుల ఎర

◆ రావులపాలెం, కడియం మండలం వీరవరం బరుల్లో వరుసగా పందేలు గెలిచిన యువకులు బుల్లెట్ బండ్లు దక్కించుకున్నారు.



కృష్ణా జిల్లా పెందూరులో కోడి పందెం విజేతకు కారు బహుమతిగా అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

◆ కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెందూరు, పాశ్చాపురం బరుల్లో బందరుకు చెందిన వారు కార్లు గెలుచుకున్నారు.
◆ ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం గవరవరంలో తొమ్మిది పందేల్లో ఐదు గెలిచినవారికి బుల్లెట్, ముసుగు పందెంలో గెలిచిన పందెం రాయుడికి కాసు బంగారం బహుమతిగా ఇచ్చారు.
◆ ఏలూరు జిల్లా పెదపాలపర్రు, ముదినేపల్లి, ఈడేపల్లి గ్రామాల్లో వేసిన పందేల్లో వరుసగా మూడు గెలిచిన వారికి మొత్తం ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్‌లను బహుమతులుగా ఇచ్చారు.
◆ ముదినేపల్లి బరిలో 11 పందేలు గెలుపొందిన వారికి టాటా నెక్సాన్ కారును బహుమతిగా ఇచ్చేందుకు ప్రదర్శనగా ఉంచారు.



కృష్ణాజిల్లా పెడన మండలం కొంకేపూడిలో విజేతలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచిన స్కూటీలు

సీఎం స్ఫూర్తితో పీ4 సాయం

మండవ ప్రభాకరరావు కుటుంబీకుల దాతృత్వం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో పీ4 కార్యక్రమ భాగస్వాములు తమ దాతృత్వాన్ని ప్రకటిస్తున్నారు. ముఖ్యమంత్రి వెంట మేము సైతం అంటూ.. పేదలకు తమ వంతు సాయం అందించి వారి ఎదుగుదలలో భాగస్వాములవుతున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని బుధవారం నూజివీడు సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ ప్రభాకరరావు కుటుంబసభ్యులు నూజివీడు మండలంలోని తుక్కులూరుకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.లక్షల విలువైన ఆటోలు, గేదెల కొనుగోలుకు పత్రాలు, సౌండ్ సిస్టమ్ తదితరాలను అందించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పటల్స్ సహ వ్యవస్థాపకులు బొల్లినేని కృష్ణయ్య, మండవ, బొల్లినేని కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దురలవాట్లకు దూరంగా ఉండి.. ఉన్నంతలోనే పొదుపు చేసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. ఇప్పటి వరకు పీ4 కార్యక్రమంలో 200 మంది లబ్ధిదారులకు రూ.1.06 కోట్లు అందించినట్లు నూజివీడు పీ4 సమన్వయకర్త బెల్లం సుబ్బారావు తెలిపారు.



పీ4 లబ్ధిదారుకు పాడి గేదె మంజూరు పత్రాన్ని అందిస్తున్న నూజివీడు సీడ్స్ ఎండీ ప్రభాకరరావు, కిమ్స్ హాస్పటల్స్ బొల్లినేని కృష్ణయ్య తదితరులు

జగ్గన్నతోటలో భారీగా ఏర్పాట్లు

రాష్ట్ర పండుగగా తొలిసారి ప్రభల ఉత్సవం నిర్వహణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించింది. దీంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 476 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు దాదాపు 5-6 లక్షల మంది వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాలకు చెందిన 11 ఏకాదశరుద్ర ప్రభలను ఇక్కడికి తీసుకొస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొలువుదీర్చుతారు. అక్కడ భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాలకు తరలివెళతాయి. వీటిల్లో టన్నులకొద్దీ బరువుండే గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలను స్థానిక ఎగువకౌశిక నదిని దాటించి యువకులు భుజాలపై మోసుకుని జగ్గన్నతోట తీసుకొస్తారు. ఈ సన్నివేశాన్ని తిలకించేందుకు జనం వేచి ఉంటారు. మిగతా వాటిని రోడ్డు మార్గం గుండా తీసుకొస్తారు. అన్నింటికంటే ముందుగా మొసలపల్లి భోగేశ్వర స్వామి ప్రభ ఇక్కడికి చేరుకుని మిగిలిన వాటికి ఆహ్వానం పలుకుతుంది. ఈ ఉత్సవం బందోబస్తులో 314 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

రాష్ట్ర రాబడి.. కాస్త పైబడి!

- కిందటి ఆర్థిక సంవత్సరం కన్నా 4% అధికం
- తొలి మూడు త్రైమాసికాల విశ్లేషణ



ఈనాడు, అమరావతి: ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలు గడిచిపోయాయి. ఈ సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గతేడాది కన్నా మెరుగ్గా ఉంది. ఏప్రిల్ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు మూడు త్రైమాసికాల్లో కలిపి కిందటి ఏడాదితో పోలిస్తే రాష్ట్ర సొంత రాబడి 4% పెరిగింది. రాష్ట్ర సొంత రాబడి డిసెంబరు నెలాఖరు వరకు కిందటి ఏడాది రూ.65,102 కోట్లు వస్తే ఈ సంవత్సరం రూ.67,409 కోట్లకు పెరిగింది. ప్రత్యేక మార్జిన్‌తో కలిపి కిందటి ఏడాది రూ.71,097 కోట్లు వస్తే ఈసారి రూ.74,163 కోట్ల మేర రాష్ట్ర సొంత రాబడిని సాధించారు.

లక్ష్యాలు బాగా పెంచేశారు

లక్ష్యాలు ఉన్నతంగా ఉంటే ఫలితాలూ అలా సాధించవచ్చునేది ఒక నమ్మకం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సొంత రాబడి లక్ష్యాలు భారీగా విధించారు. 2023-24తో పోలిస్తే 2024-25లో లక్ష్యాలు 2.8% నుంచి 3% మాత్రమే పెరిగాయి. అదే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలు 29% నుంచి 30% వరకు పెంచేశారు. ప్రస్తుతం 4% అదనపు రాబడి సాధ్యమయింది. చివరి మూడు నెలల ఫలితాలు ఎలా ఉంటాయో చూడాలి.

పెరిగిన గనుల రాబడి

కిందటి ఆర్థిక సంవత్సరం కన్నా స్టాంపులు రిజిస్ట్రేషన్లు, గనుల శాఖల రాబడి అధికంగా ఉంది. రిజిస్ట్రేషన్ల విభాగంలో కిందటి ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో రూ.6,389 కోట్లు వస్తే ప్రస్తుతం రూ.8,082 కోట్లకు పెరిగింది. అంటే 26% అధిక రాబడి వచ్చింది.

◆ గనుల రంగంలో గతేడాది రూ.1,648 కోట్ల రాబడి రాగా ఈ సంవత్సరం అది రూ.2,152 కోట్లకు.. అంటే 31% పెరిగింది.

◆ వాణిజ్య పన్నుల విభాగంలో కిందటి ఆర్థిక సంవత్సరం రూ.37,107 కోట్లు సాధిస్తే ఈసారి రూ.38,233 కోట్ల రాబడి వచ్చింది. 3% మేర అదనపు రాబడి సాధ్యమయింది.

◆ ఎక్సైజ్ రాబడి తగ్గింది. కిందటి ఆర్థిక సంవత్సరం రూ.20,375 కోట్లు వస్తే ప్రస్తుతం అది రూ.19,868 కోట్లకే పరిమితమైంది. రాబడిలో తగ్గుదల 2% ఉంది.

◆ వాహనాల పన్నుల రూపేణా ఆదాయం పెరిగింది. కిందటి ఆర్థిక సంవత్సరంలో రూ.3,361 కోట్లు వస్తే ఈసారి రూ.3,558 కోట్లు వచ్చింది.

లక్ష్యాలు ఇలా అధికం... (అంకెలు రూ.కోట్లలో) (పోలిక శాతాల్లో)

అంశం	2023-24	2024-25	పెరుగుదల	2025-26	పెరుగుదల
పన్ను రాబడి	85,922	89,435	4.1%	1,16,907	31%
పన్నేతర రాబడి	7,432	6,692	-10.0%	8,261	23%
రాష్ట్ర సొంత రాబడి	93,354	96,127	3.0%	1,25,168	30%
ప్రత్యేక మార్జిన్	8,191	8,218	0.3%	9,040	10%
మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత రాబడి	1,01,545	1,04,345	2.8%	1,34,208	29%

కిందటి ఏడాది ఎంత? ఈ ఏడాది ఎంత సాధించామంటే...

అంశం	2024-25 (అంకెలన్నీ రూ.కోట్లలో)	2025-26	తేడా
పన్ను రాబడి	61,564	63,288	3%
పన్నేతర రాబడి	3,539	4,120	16%
రాష్ట్ర సొంత రాబడి	65,102	67,409	4%
ప్రత్యేక మార్జిన్	5,995	6,753	13%
ప్రత్యేక మార్జిన్‌తో కలిపి సొంత రాబడి	71,097	74,163	4%

డిసెంబరు కళకళలు

రాష్ట్ర సొంత రాబడిలో డిసెంబరులో మంచి ఫలితాలు వచ్చాయి. ఎనిమిది విభాగాల రాబడి కలిపి అక్టోబరులో రూ.8,203 కోట్లు, నవంబరులో రూ.8,334 కోట్లు, డిసెంబరులో రూ.8437 కోట్లు వచ్చింది. అక్టోబరులో దసరా, దీపావళి పండుగల దృష్ట్యా వ్యాపార కార్యకలాపాలు ఎక్కువ ఉంటాయని లక్ష్యం ఎక్కువగా ఉంది. ఆ లక్ష్యంతో పోలిస్తే 20% రాబడి తగ్గింది. నవంబరులో లక్ష్యంతో పోలిస్తే 6% రాబడి పెరిగింది. డిసెంబరులో లక్ష్యం కన్నా 10% అధికంగా రాబడి సాధించారు.





తోకలతో చేసిన అల్లరి మరవలేక!

'రైకో నీ కళ్లతో నవ్వావు.. తోక ఊపుతూ అల్లరి చేశావు. మా హృదయాలపై నీ పాదాల ముద్రలు వేశావు. నీ ప్రేమను చాలా మిస్ అవుతున్నాం' ఇలాంటి శోకతప్త వీడ్కోళ్లను చదవాలంటే విశాఖ బీచ్‌రోడ్డు మూలపాలెం తీరంలో ఉన్న శ్మశానానికి వెళ్లాల్సిందే. అక్కడకు వెళ్లి వాటిని పరిశీలిస్తే కానీ తెలియదు. . ఆ శ్మశానం ఏర్పాటు చేసింది పెంపుడు కుక్కల కోసమని. ఏళ్లపాటు ఇంట్లో మనిషిలా కలిసిపోయిన శునకాలు మరణించాక కూడా దానితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడానికి యజమానులు పలువురు వాటికి సమాధులు నిర్మించారు. అక్కడి ఫలకాలపై కుక్క ఫొటోలను, వాటితో తమకున్న అనుబంధాన్ని రాసుకున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం



క్రమశిక్షణను అర్హత పరీక్షలా భావించండి

ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం తప్పనిసరి. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడానికి క్రమశిక్షణ అవసరం. అందుకే ముందు మీరు క్రమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవడంపై దృష్టి పెట్టండి. గొప్ప లక్ష్యాలను విధించుకోవడానికి దాన్నో అర్హత పరీక్షలా భావించండి.

– ఆడమ్, వెబ్‌సైట్ డిజైనర్

EENADU Vol: 52, Issue: 156 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల వీరభద్రుడు!

తెలంగాణలోని కొత్తకొండలో సంక్రాంతి పండుగ నాడు వీరభద్రస్వామి జాతర పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ జాతర సందర్భంగా భక్తులు అసంఖ్యాకంగా వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఉత్సవం కోసం ఎడ్లను అలంకరించి తీసుకురావడం ఆనవాయితీ. వీరభద్రునికి వెండి, బంగారంతో చేసిన కోరమీసాలు సమర్పిస్తారు. పాడిపంటలను చల్లగా చూడమని కోరుకుంటూ ఎడ్లబండ్లతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. గండాలు తీర్చమంటూ గండదీపం వెలిగిస్తారు. స్థలపురాణాన్ని అనుసరించి.. పూర్వం వంట చెరుకు కోసం కొందరు ఎడ్లబండితో కొండపైకి వెళ్లారు. వంట చెరుకు సేకరించిన తర్వాత అలసటతో వారు నిద్రపోయారు. లేచేసరికి ఎద్దు కనిపించలేదు. రాత్రంతా అక్కడే ఉన్నారు. ఆ రాత్రి వారికి వీరభద్రుడు కలలో కనిపించి.. తన విగ్రహాన్ని గుట్టపై నుంచి కిందికి దింపి అక్కడే ఆలయంలో ప్రతిష్ఠించమని, ఎద్దు దొరుకుతుందని చెప్పాడు. స్వామి చెప్పినట్టుగా గుట్ట కింద ఆలయంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాష్ట్రకూటుల భూమి అయినప్పటికీ ఇక్కడ ఐదు కొలనులు నిత్యం నీటితో నిండి ఉండటం వీరభద్రస్వామి మహిమేనని భక్తులు భావిస్తారు. ప్రతి సంవత్సరం పుష్య బహుళ పంచమి నాటి నుంచి ఉత్సవాలు నిర్వహిస్తారు. కళ్యాణోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మహాసరోజు నుంచి హోమం, సూర్యయంత్ర ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రుద్రహోమం, చండీహోమం, వేదపారాయణం, శత రుద్రాభిషేకం, ఉత్తరాయణ పుణ్యకాల పూజ, నాగవెల్లి, వసంతోత్సవం, గణపతి పూజ, స్వామివారి త్రిశూల స్నానం, అగ్నిగుండాలు.. అనంతరం స్వామివారి గ్రామ పర్యటన జాతరలో ముఖ్య ఘట్టాలు. ఇక్కడి స్వామి మహిమాన్వితుడని చెబుతారు. పిల్లలు లేనివారు.. స్వామి వారికి వెండి లేదా బంగారు కోరమీసాలు సమర్పించుకుంటే సంతానం కలుగుతుందని, ఎడ్లబండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తే పాపాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తరాలు, నవగ్రహ పూజలు, ఆంజనేయుడికి ఆకుపూజలు, చందనోత్సవాలు, అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.



ప్రతీ పండుగలో మన ఆచారం, సంప్రదాయం, ఆరోగ్యం, ఐకమత్యం, సంతోషం, సామాజిక ప్రయోజనం.. అన్నిటినీ మించి ఆధ్యాత్మికత ఇమిడి ఉంటాయి. సూర్యభగవానుడు మకరరాశి లోనికి ప్రవేశించే కాలమే మకర సంక్రాంతి. ఉత్తమోత్తమమైన ఉత్తరాయణ పుణ్యకాలమిది.

ప్రకృతి పరవశం.. ఆధ్యాత్మిక సందేశం!



సంక్రాంతి పండుగలో ఎన్ని వేడుకలో! ఎన్నెన్ని సంబరాలో! మామిడి తోరణాలు, బంతిపూలతో ద్వారాలను అలంకరించి, రంగవల్లులతో ముంగిళ్లను తీర్చి, వాటిపై గొబ్బెమ్మలను పేర్చి.. ఇళ్లకు, వీధులకు విశిష్ట శోభను చేకూర్చుతారు. కుంకుమ పసుపులతో గడపలు, పూల గొబ్బెమ్మలతో వాకిళ్లు మెరిసిపోతుంటాయి. పెద్ద గొబ్బెమ్మను మధ్యలో నిలిపి, చుట్టూరా చిన్న గొబ్బెమ్మలను పేరుస్తారు. పెద్ద గొబ్బెమ్మ శ్రీకృష్ణుడని, చిన్నవి ఆ పరమాత్మను పరిచేస్తున్న గోపికలని ప్రతీతి. గోపిక.. గోపియ.. గొబ్బెమ్మగా రూపాంతరం చెందిందని చెబుతారు.

తాబేలు, రథాకారాల్లో ముగ్గులు వేయడం సంక్రాంతి ప్రత్యేకత. తాబేలు- కూర్మావతారుడైన శ్రీమహావిష్ణువు. ఆయన వాహనమే రథం. అందుకే ముగ్గులను తొక్కకుండా పక్కనుంచి నడుస్తారు. ఈ పండుగ రోజుల్లో వచ్చే హరిదాసులకు, గంగిరెద్దుల వారికి ధనధాన్యాలను పిల్లలతో ఇప్పించడం ఆచారం. చిన్నారులకు దానగుణాన్ని నేర్పడమే ఆంతర్యం.

బొమ్మల కొలువు సంక్రాంతి సంబరాల్లో ఒకటి. బొమ్మలను ఆకర్షణీయంగా, వరుసలుగా అమరుస్తారు. పై వరుసలో శివపార్వతులు, దశావతారాలు, గోదాదేవి, శ్రీకృష్ణాది దేవుళ్లు, రెండో వరుసలో ఆదిత్యాది దేవుళ్లు, కామధేనువు, కల్పవృక్షం మొదలైనవి; తరువాతి వరుసలో కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్ప, చేనేత.. ఇలా సకల వృత్తులకు సంబంధించినవి ఉంటాయి. ఆ తరువాతి వరుసలో కొండలు, కోనలు, జలపాతాలు, తోటలు, నదులు, సముద్రాలు, పక్షులు, జంతువులు వంటి ప్రకృతి దృశ్యాలు, నాగరికతను ప్రతిఫలించే చిత్తరువులు ఏర్పాటై ఉంటాయి. ఇలా అన్నిటినీ పేర్చి, అందరినీ పిలిచి ఆనందిస్తారు. మంగళ గీతాలు ఆలపించి భగవంతుని కృపకి పాత్రులౌతారు. ఈ వేడుక పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరికీ ఆహ్లాదాన్ని చేకూర్చేదే. ఈ ఆనందమే ఆరోగ్య ప్రదాయకం.

ముక్కనుమ.. పొంగలి ప్రసాదం

తమిళులు కనుమను 'మట్టు పొంగల్', ఆ తర్వాతి రోజును 'కానుమ్ పొంగల్' అంటారు. ముక్కనుమ నాడు పొంగలి ప్రసాదాన్ని నివేదిస్తారు. కొన్నిచోట్ల గ్రామదేవతలకు మాంసాన్ని నివేదిస్తారు అందువల్ల 'ముక్కల కనుమ' అంటారు.

వాయనాలుగా గొబ్బెమ్మలు

సంక్రాంతి సందర్భంలో కొందరు సావిత్రీ గౌరీ వ్రతం ఆచరిస్తారు. ఇంకొందరు గొబ్బి గౌరీ వ్రతం ఆచరించి, గొబ్బెమ్మలను వాయనాలుగా ఇస్తారు. ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి.. దూర్వాస మహాముని ప్రభావంతో ద్రోణాచార్యుని భార్య కృపి ఈ వ్రతాన్ని ఆచరించి అపర రుద్రమూర్తి అయిన అశ్వత్థామను పుత్రునిగా పొందింది. యశోదాదేవి ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణపరమాత్మకు తల్లి అయ్యింది.

పండుగ అంటే పిండివంటలు సహజమే. భోగినాడు అరిసెలు; సంక్రాంతి నాడు పొంగలి, సజ్జప్పాలు, నువ్వుండలు; కనుమ నాడు గారెలు తింటారు. చలికాలంలో వచ్చే వాతరోగాలకు నువ్వులు, మినుములు, పెసలు మొదలైనవన్నీ ఔషధాలు. మకరరాశి అధిపతి శనిదేవుడు. ఇది వాత ప్రధాన గ్రహం. అందుకే శనిదేవుని స్మరించి, ఈ పదార్థాలను ఆరగిస్తే ఆరోగ్యం చేకూరుతుందని చెబుతారు. గంగిరెద్దు నందీశ్వరుని రూపం, శివశక్తి. హరిదాసు నారాయణ రూపం, విష్ణుశక్తి. ఆవుపేడలో లక్ష్మీదేవి కొలువుదీరి ఉంటుంది. గొబ్బెమ్మ గౌరీదేవి ప్రతిరూపం. శివ, విష్ణు, గౌరి, లక్ష్మీ, గోమాత, వృషభం- ఇలా సకల దేవతలను ఆరాధించే పండుగ సంక్రాంతి. పాతాళానికి అణిచేసిన బలిచక్రవర్తి ఈరోజు భూలోకానికి వస్తుంటాడని పురాణోక్తి. మకర సంక్రాంతి నాడు శబరిమలలో మకరజ్యోతిని దర్శించడాన్ని అయ్యప్ప భక్తులు అదృష్టంగా భావిస్తారు.

'పరోపకారార్థమిదం శరీరం' అన్నట్లు హరిదాసులు, గంగిరెద్దుల వారు, జంగమ దేవరలు- ఇలా అందరికీ ధన ధాన్యాలు సమర్పించి సంతృప్తిని కలుగచేస్తారు. మనతో పాటు తోటివారూ మనుగడ సాగించాలన్న మానవతాధోరణి ఈ పండుగలో దర్శనమిస్తుంది. పిండితో ముగ్గులు వేసి.. చారలలో బియ్యం వేస్తారు. క్రిమికీటకాలకు ఆహారం అందించడమే ఇందులోని ఉద్దేశం. ప్రకృతి పరవశించి సకల వనరులను సమకూరిస్తే.. మనల్ని మనం పరిశీలించుకుని, ప్రక్షాళన చేసుకుని.. అనంత ప్రాణికోటికి అపార అనురాగాన్ని వర్షింపజేయాలన్నది సంక్రాంతి పండుగలోని ఆధ్యాత్మిక సందేశం.

– డా. పి.లలితవాణి

చంద్రుడు మఘ నక్షత్రంతో కూడి ఉన్న పూర్ణిమ వచ్చే మాసం మాఘమాసం. ఈ మాసంలో సూర్యుడు మకరరాశిలో సంచరిస్తాడు. ఈ కాలంలో నదీ స్నానంతో పాపాలు హరిస్తాయని, దానధర్మాలు చేయడం పుణ్యప్రదమని పద్మపురాణం పేర్కొంది. చలికాలం ముగిసి, వసంతం రాకకు ముందు వచ్చే ఈ మాసం శరీరానికి, మనసుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఈ నెలలో నువ్వులు, వస్త్రాలు, అన్నదానం అత్యంత శ్రేష్ఠం.

దేశవ్యాప్తంగా సంక్రాంతి

సంతోషం, సంబరం, దయ, ధర్మాలకు ఆలవాలం సంక్రాంతి. ధాన్యం చేతికందిన శుభ సందర్భంలో విరివిగా దానాలు చేస్తారు. శుభదాయకమైన ఈరోజు పలువురు పితృ తర్పణాలతో పితృ దేవతలకు తృప్తిని కలిగిస్తారు. అందుకే దీనిని పెద్దల పండుగ అంటారు. అలాగే సంక్రాంతినాటి చుక్కలవేళ ఇంటి పెద్దలకు నమస్కరించి ఆశీర్వాదం పొందుతారు. అందువల్ల మొక్కుల పండుగ అని కూడా పిలుస్తారు. తమిళనాడులో పొంగల్, ఒరిస్సాలో పన సంక్రాంతి, బెంగాల్లో పోహ్లా బైశాఖి, పంజాబ్‌లో వైశాఖి, అస్సాంలో భోగాలీ బిహూ, ఉత్తరభారతంలో మాఘీ.. మనకు మకర సంక్రాంతి.. ఇలా దేశవ్యాప్తంగా చేసుకునే పండుగ సంక్రాంతి.

పశువులను పూజిస్తారు..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ. ఈరోజు పశువులను విశేషంగా అలంకరించి, అవి సంతుష్టి చెందేలా గ్రాసం పెడతారు. గోమాతకు ప్రదక్షిణలు చేసి, పూజించి తరిస్తారు. సకల దేవతా స్వరూపిణి కదా గోమాత. ఎడ్లను కూడా అలంకరించి పూజిస్తారు. ఈరోజు వాటితో పని చేయించరు. పాడిపంటలనిచ్చే పశువులతో పాటు పంటనిచ్చిన పొలానికి కూడా పూజ చేస్తారు. సమర్పించిన నైవేద్యంలో కొంతభాగాన్ని పొలంలో చల్లుతారు. ఇంటికొచ్చిన ఆడపడుచులను గౌరవించి, కానుకలిస్తారు. 'కనుమనాడు కాకి కూడా కదలదు' అని లోకోక్తి. అందుకే ఇంటికి సౌభాగ్యాన్ని తెచ్చే ఆడపడుచులను ఇంటిపట్టునే ఉండమంటారు. ఈరోజు వాతావరణం కలుషితంగా ఉంటుందనేది ప్రబల కారణం. అది ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా స్త్రీలకు మంచిది కాదు. అందుకే ఈ నియమాన్ని ఆచారంగా నియంత్రించి పాటిస్తున్నారు.

బౌద్ధంలో సంక్రాంతి




అది సిద్ధార్థుడు జ్ఞానోదయం పొందడానికి ముందు రోజు. సిద్ధార్థుడికి దగ్గరలోని గ్రామానికి చెందిన సేనాని కుమార్తె సుజాత పాయసం సమర్పించింది. తనకు సంతానం కలిగితే దేవునికి పాయసం నివేదిస్తానని మొక్కుకుందామె. సంతానం కలిగిన తర్వాత ధ్యానంలో ఉన్న సిద్ధార్థుడినే దైవంగా తలచి మొక్కు తీర్చుకుంది. అందుకే స్థానికులు సమర్పించే వంటల్లో ఆకలి తీర్చుకుంటున్న సిద్ధార్థుడు సుజాత ఇచ్చిన పాయసం కూడా స్వీకరించాడు. జ్ఞానోదయం పొందిన మీదట బుద్ధుడు అక్కడి నుంచి సారనాథ్ వెళ్లిపోయాడు. అప్పుడే పంటలు చేతికొచ్చిన సంతోషంలో రైతులు బుద్ధుడికి జ్ఞానోదయమైన చోట పాయసం వండుకుని పండుగ చేసుకున్నారు. అదే సంక్రాంతి. ఆ పాయసమే పొంగలి. గౌతమ బుద్ధుని కాలంలో సంక్రాంతిని రుతు మార్పుకు చిహ్నంగా, అంటే పంటల పండుగగా చేసుకునేవారు.

బుద్ధుని అనంతరం కూడా.. పలు దేశాల్లోని బౌద్ధులు వివిధ రూపాల్లో ఈ సంక్రాంతి పండుగ చేసుకుంటున్నారు. థాయిలాండ్‌లో 'సంగ్‌క్రాన్' పేరుతో చేస్తారు. ఇది వాళ్లకి కొత్త సంవత్సరం. శ్రీలంక, మయన్మార్ వంటి దేశాల్లో సూర్యుడు మకరరాశిలోకి మారే సందర్భాన్ని పురస్కరించుకుని బౌద్ధ విహారాల్లో ప్రార్థనలు చేస్తారు. మహారాష్ట్రలోని కన్హేరి గుహల దగ్గర సంక్రాంతి సమయంలో బౌద్ధమేళాలు నిర్వహిస్తారు. ఈ రోజున బౌద్ధులు కన్హేరి గుహలను సందర్శించి బుద్ధుణ్ణి పూజించడం ఆచారంగా వస్తోంది. అనకాపల్లి దగ్గర బుద్ధన్న కొండ మీద నేటికీ మకర సంక్రాంతి రోజున బౌద్ధ ఉత్సవాలు నిర్వహిస్తారు. తూర్పు గోదావరి జిల్లాలోని కొడవలి, కోరుకొండ వద్ద ఉన్న కాపవరం విహారాల్లో సంక్రాంతికి బౌద్ధ ఉత్సవాలు నిర్వహించడాన్ని పునరుద్ధరించారు. బౌద్ధం ప్రకారం సంక్రాంతి పండుగ ఒక సామాజిక ఉత్సవంగా కనిపిస్తుంది.

ముత్యాల ముగ్గులు, రంగురంగుల గాలిపటాలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు.. ఇదీ సంక్రాంతి సందడి. ఈ పర్వదినం రోజున బలిచక్రవర్తి ఆశీర్వదిస్తాడన్నది పౌరాణిక కథనం...

పాతాళం నుంచి పుడమికి..!



రాక్షసుడిగా జన్మించినా, ప్రహ్లాదుని మనవడిగా భక్తి సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్నవాడు బలిచక్రవర్తి. అజేయమైన శక్తితో ముల్లోకాలనూ జయించి ధర్మబద్ధంగా పరిపాలన సాగించాడు. అయితే లోకాలను జయించినవారికి కొన్నిసార్లు అహంకారం కలుగుతుంది. బలిచక్రవర్తిలో 'నేనే ఇస్తున్నాను' అనే అహంకారభావాన్ని తొలగించి.. తనను తాను దైవానికి అర్పించుకునే స్థితికి చేర్చడానికే విష్ణుమూర్తి వామనుడిగా అవతరించాడు.

మూడడుగుల నేల అడిగిన వామనుడి విశ్వరూపాన్ని చూసి కూడా వెనుకాడకుండా ఇచ్చిన మాట కోసం శుక్రాచార్యుడి హెచ్చరికను సైతం కాదన్నాడు బలి. రెండు అడుగులతో భూమ్యాకాశాలను కొలిచిన స్వామికి, మూడో అడుగు కోసం తన శిరస్సును వంచి సమర్పించాడు. అందుకే బలిచక్రవర్తి భగవంతుని హృదయంలో శాశ్వత స్థానాన్ని పొందాడు. రైతులు పంటను ఇంటికి తెచ్చుకునేటప్పుడు ఆ సిరిని ప్రసాదించిన భగవంతుడితో పాటు దానగుణానికి ప్రతీకగా నిలిచిన బలిని స్మరించుకుంటారు. మకర సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు అక్షయమవుతాయన్నది శాస్త్ర వచనం. దానగుణానికి అగ్రగణ్యుడైన బలిని స్మరించడం వలన మనలో లోభ లక్షణాలు నశించి, త్యాగశీలత పెరుగుతుందని చెబుతారు.

బలిని పాతాళలోకానికి పంపిస్తూ, అక్కడ కూడా తాను తోడుగా ఉంటానని వాగ్దానం చేశాడు శ్రీమహావిష్ణువు. సంవత్సరానికోసారి భూలోకానికి వచ్చి, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారో లేదో చూడమన్నాడు. ఈ కారణంగానే సంక్రాంతి పర్వదినాన బలిచక్రవర్తి పాతాళలోకం నుంచి భువిపైకి వచ్చి, తనను ఆరాధించే భక్తులను ఆశీర్వదిస్తాడు. ఇంటి ముందర వేసే రంగవల్లులు, వాటిల్లో గొబ్బెమ్మలు బలిచక్రవర్తికి స్వాగత చిహ్నాలు. ధాన్య రాశులను చూసి సంతృప్తి చెందుతాడు.

ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు గమనాన్ని మార్చుకున్నట్లే మనిషి తనలోని దుర్గుణాలను వదిలి.. సన్మార్గాన్ని అనుసరించాలి. బలి 'నేను' అన్న భావం వదిలి 'నీవే' (భగవంతుడు) అనే స్థితికి చేరాడు. సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు కూడా ఇలాగే ఉండాలి. మానవసేవే మాధవసేవ అనుకోవడమే సంక్రాంతి సందేశం. బలి పాతాళానికి వెళ్లడం అంటే పతనం కాదు, అది అంతర్ముఖ ప్రయాణం. మనలోని అరిషడ్వర్గాలను అణిచేసి భగవంతుడికి పాదాక్రాంతం అవ్వాలి. బలి సత్యనిష్ఠను, వామనుడి చాకచక్యాన్ని స్మరిస్తూ ఈ పుణ్య కాలంలో దైవచింతనతో గడపాలి.


పండుగ అంటే పదిమందికీ పెట్టడం అనే ఉదార స్వభావాన్ని అలవరచుకుందాం. దానం చేసే చెయ్యి, అహంకారాన్ని వీడిన శిరస్సు భగవంతుడికి దగ్గరగా ఉంటాయన్నది పెద్దల మాట. సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు, హరిదాసులకు సమర్పించే బియ్యం, గంగిరెద్దుల వారికిచ్చే కానుకలు.. ఇవన్నీ సామాజిక సమతుల్యతను పెంచుతాయి. పాతాళం నుంచి వచ్చే బలి చక్రవర్తి పాడిపంటలను, దయార్ద్ర హృదయాలను చూసి ఆనందించి ఆశీర్వదిస్తాడు.

– కె.వి.లక్ష్మణ రావు

సత్కర్మలు.. సదాచారాలు..

మాఘమాసం పండుగలకు పెట్టింది పేరు. ముందుగా వసంత పంచమి. విద్యలకు అధిదేవత అయిన సరస్వతీదేవి జన్మించిన ఈ రోజు అక్షరాభ్యాసానికి శుభప్రదమైనది. జ్ఞానాన్ని మించిన సంపద లేదని చాటి చెప్పడమే ఈ పండుగ అంతరార్థం. మాఘ శుద్ధ సప్తమి రథ సప్తమి. సూర్యభగవానుడు జన్మించిన రోజు. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు దిశను మార్చుకుని తన రథాన్ని ఏడు గుర్రాలతో నడిపించే రోజని పురాణాలు పేర్కొన్నాయి. ఈ రోజున జిల్లేడు ఆకులను తలపై పెట్టుకుని స్నానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తొలగిపోతాయి. సూర్యుడికి పాలు పొంగించి నివేదించడం, చిక్కుడాకులు, చిక్కుడు కాయలతో రథాన్ని చేసి సమర్పించడం సంప్రదాయం. మాఘ శుద్ధ ఏకాదశి.. భీష్మ ఏకాదశి. అంపశయ్యపైనున్న భీష్మ పితామహుడు విష్ణువులో లీనమైన రోజు. ఈ రోజునే భీష్ముడు విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని ప్రసాదించాడు. మాఘ పూర్ణిమ నాడు చంద్రుడు మఘ నక్షత్రంలో ఉండటం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మాఘ బహుళ చతుర్దశి మహా శివరాత్రి. శివుడు లింగోద్భవ మూర్తిగా అవతరించిన పవిత్ర సమయం. రాత్రంతా జాగరణ చేసి, 'నమశ్శివాయ' మంత్రాన్ని జపిస్తూ శివుణ్ణి అభిషేకించడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని శివపురాణం తెలియజేసింది. ఈరోజున విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని పారాయణ చేస్తే అనంత పుణ్యఫలం లభిస్తుంది.

మాఘమాస ప్రాశస్త్యాన్ని వివరించే కథలనేకం మన పురాణాల్లో ఉన్నాయి. ఒకసారి గౌతమ మహర్షి ఇంద్రుణ్ణి శపించాడు. ఇంద్రుడు మాఘమాసంలో నదీస్నానం ఆచరించి తన పూర్వ వైభవాన్ని పొందాడు. నదీజలాలు అంత పవిత్రమైనవని ఈ కథ నిరూపిస్తుంది. భీష్ముడు యుద్ధంలో గాయపడి కూడా దక్షిణాయనంలో ప్రాణాలు వదలడానికి ఇష్టపడలేదు. మాఘమాస పుణ్యకాలం కోసం వేచిచూసి, విష్ణు నామస్మరణతో ప్రాణాలు విడిచాడు. ఇది మాఘమాస పవిత్రతను తెలియజేస్తుంది. కశ్యప ప్రజాపతి సంతానం కోసం ఈ మాసంలో కఠిన వ్రతం ఆచరించి సూర్యుణ్ణి మెప్పించి తేజస్సును పొందాడు. మాఘం పండుగలకే పరిమితం కాదు. ఇందులో ఒక గొప్ప జీవన సూత్రం ఉంది. చలికాలంలో తెల్లవారుజామునే నిద్రలేవడం క్రమశిక్షణకు ప్రతీక. చల్లని నీటిలో స్నానం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దానధర్మాలు చేయడం వెనుక అహంకారాన్ని విడిచిపెట్టి సాటి మనిషికి సాయపడాలన్న సందేశముంది. సూర్యారాధనతో చైతన్యం, శివపూజతో ప్రశాంతత, విష్ణు ఆరాధనతో స్థిరత్వం లభిస్తాయి. అందుకే మాఘ మాసాన్ని మోక్ష మాసం అంటారు. ఈ నెలలో ఆచరించే ప్రతి నియమం వెనుక ఆధ్యాత్మికత, శాస్త్రీయ ప్రయోజనం మెండుగా ఉన్నాయి. ఈ పుణ్యకాలాన్ని సత్కర్మలు, సదాచారాలు, క్షేత్ర దర్శనాలతో గడిపితే సకల దేవతల ఆశీస్సులు లభిస్తాయి. మోక్షం ప్రాప్తిస్తుంది.



– సి.హెచ్. లత

సంక్రాంతి పండుగ అనగానే కోనసీమలో జగ్గన్నతోట ప్రభల తీర్థం గుర్తొస్తుంది. ఇతర ప్రాంతాల్లో దైవికపరమైన వేడుకను ఉత్సవంగా పరిగణిస్తే, కోనసీమ ప్రాంతంలో మాత్రం తీర్థంగా పిలుస్తారు. ఈ ఉత్సవ ప్రాంతంలో ఆలయం ఏమీ ఉండదు. కనుమ రోజున అంబాజీపేట మండలం మొసలిపల్లిలో శతాబ్దాలుగా నిర్వహిస్తున్న అద్భుత వేడుక ఇది. స్థానికులేగాక ప్రవాసాంధ్రులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొని, ఏకాదశ రుద్రుల అనుగ్రహానికి పాత్రులవుతారు.

ఘనంగా జగ్గన్నతోట ప్రభల తీర్థం



వెదురు కర్రలు, రంగురంగుల కుసుమాలు, వస్త్రాలతో అలంకరించిన ఉత్సవ విగ్రహాలతో కూడిన వాటిని ప్రభలుగా వర్ణిస్తారు. ఈ జగ్గన్నతోట తీర్థానికి పదకొండు గ్రామాల నుంచి వేంచేసే ప్రభలకు ఏకాదశ రుద్ర ప్రభలని పేరు. ఈ క్రమంలో వ్యాఘ్రేశ్వరం- వ్యాఘ్రేశ్వర స్వామి, గంగలకుర్రు అగ్రహారం- వీరేశ్వర స్వామి, ఇరుసుమండ- ఆనంద రామేశ్వర స్వామి, వక్కలంక- కాశీ విశ్వేశ్వర స్వామి, ముక్కామల- రాఘవేశ్వర స్వామి, నేదునూరు- చెన్నమల్లేశ్వర స్వామి, మొసలపల్లి- మధుమానంత భోగేశ్వర స్వామి, పుల్లేటికుర్రు- అభినవ వ్యాఘ్రేశ్వర స్వామి, పాలగుమ్మి- చెన్నమల్లేశ్వర స్వామి, కె. పెదపూడి- మేనకేశ్వర స్వామి, గంగలకుర్రు- చెన్నమల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించిన ప్రభలపై మంగళ వాయిద్యాలతో జగ్గన్నతోటకు ఊరేగింపుగా తీసుకొస్తారు. ఈ వేడుక జరిగేది మొసలపల్లి గ్రామ శివారులో కాబట్టి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వర స్వామి అన్ని ప్రభల కన్నా ముందుగా జగ్గన్నతోటకు చేరుకొని, మిగిలిన వారికి ఆహ్వానం పలుకుతూ ఆతిథ్యం ఇస్తూ, అవి తిరిగి వెళ్లేవరకూ తీర్థంలోనే ఉండటం సాంప్రదాయం. ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించే వ్యాఘ్రేశ్వరం తాలూకా వ్యాఘ్రేశ్వర స్వామి వారి ప్రభ తీర్థంలోనికి ప్రవేశిస్తున్నప్పుడు.. అంతకుముందే చేరుకుని ఉన్న తక్కిన రుద్ర ప్రభలను పైకి లేపడం ఆనవాయితీ.

జగ్గన్నతోట ప్రభల తీర్థంలో వీరేశ్వర స్వామి, చెన్నమల్లేశ్వర స్వామి వార్ల ప్రభలను సుమారు వందమంది యువకులు 'శరభ శరభ' అంటూ పొలాలను తొక్కుకొని నిండు ప్రవాహంతో సాగుతున్న అప్పర కౌశికను దాటుతూ ఉంటే ఆ దృశ్యం వర్ణనాతీతం. ప్రభలు వరిచేలను తొక్కుకుంటూ వస్తున్నప్పుడు రైతులు బాధపడకపోగా తమకు పాడిపంటలు సమృద్ధిగా కలుగుతాయని భావిస్తారు.

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు దేశవ్యాప్తంగా నిర్వహించే విభిన్న సాంప్రదాయ పండుగల జాబితాలో- జగ్గన్నతోట రుద్రప్రభలకు చోటు కల్పించారు. పదో తరగతి పాఠ్యపుస్తకంలో ఈ తీర్థ ప్రాధాన్యతను వివరిస్తూ పాఠాన్ని పొందుపరిచారు.

– శ్రీగిరి శ్రీకాంత్

మౌనం పాటించాల్సిన రోజు



జనవరి 18 మౌని అమావాస్య

భక్తులు ఎదురుచూసే ఆధ్యాత్మిక పండుగ మౌని అమావాస్య. ఇది చొల్లంగి అమావాస్య, దర్శ అమావాస్య పేర్లతోనూ ప్రసిద్ధం. పేరుకు తగ్గట్టు ఈ రోజున మౌనం పాటించాలి. అంటే మాటల్ని త్యజించి, మనసును నియంత్రించి, ఆత్మతో సంభాషించుకునే స్థితిలో ఉండాలి. ఈ రోజున సాధకులు, యోగులు, భక్తులు మౌనం పాటించి, ఉపవాసం, జపం, ధ్యానం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తద్వారా ప్రశాంతత, ఆత్మశుద్ధి, అంతర్ముఖత, దైవానుభూతి సాధ్యమవుతుంది. కోపం, అసహనం తగ్గుతాయి. ఆలోచనలకు స్పష్టత వస్తుంది. ఆత్మవిమర్శ జరుగుతుంది. దైవ చింతన బలపడుతుంది.

మాటలు మనసును బయటకు లాగుతాయి. మౌనం మనసును లోపలికి తీసుకెళ్తుంది. ఈ సూత్రాన్నే చెబుతుంది మౌని అమావాస్య. అందుకే మౌనం మహా తపస్సు అంటారు పెద్దలు. ఈ రోజున చేసే మౌన దీక్ష వలన స్వీయ నియంత్రణ, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక పురోగతి, మోక్షప్రాప్తి లభిస్తాయి. సాధువుకి ఉండవలసిన ప్రధాన లక్షణాల్లో మౌనం ఒకటని ఆదిశంకరాచార్యులు తెలియజేయగా ఆధ్యాత్మిక సాధనలో మౌనం ముఖ్యమైంది అన్నారు రమణ మహర్షి.

ఉత్తరాదిన ఈ మౌని అమావాస్యను అత్యంత విశేషంగా పాటిస్తారు. ఏటా ప్రయాగ త్రివేణీ సంగమంలో జరిగే మాఘ మేళాలో ప్రత్యేకించి ఈ మౌని అమావాస్య రోజున లక్షలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. తూర్పుగోదావరిలోని చొల్లంగి వద్ద గోదావరి సముద్రంలో కలుస్తుంది. మౌని అమావాస్య రోజున ఇక్కడ స్నానం చేయడంవల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. ఇక్కడ పెద్దలకు పిండప్రదానాలు చేస్తారు. పుష్య బహుళ అమావాస్య అయిన ఈ మౌని అమావాస్య రోజు సింహాచలం నరసింహుని కొండ కింద పుష్కరిణిలో సింహాచల అప్పన్నకు ప్రత్యేక పూజలతో పాటు తెప్పతిరునాళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ.

మౌని అమావాస్య రోజున గంగమ్మ తల్లి ఆకాశం నుంచి అమృతంగా మారి కిందికొస్తుందని నమ్ముతారు. అందుకే ఈ రోజున సూర్యోదయానికి ముందే నదీ స్నానం చేయాలి. ఆ అవకాశం లేనివారు మరేదైనా నదిలో గాని, ప్రవహించే నీటిలోగాని, అదికూడా సాధ్యం కానివారు ఇంట్లోనే 'గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదా సింధు కావేరి జలేస్మిన్ సన్నిధుం కురు' అని పఠిస్తూ స్నానం చేయాలి. ఈ పర్వదినాన పూర్వీకులను స్మరించుకుంటూ పిండప్రదానాలు, పూజలు చేయడం ద్వారా మోక్షాన్ని పొంది, వైకుంఠానికి వెళ్తారని నమ్ముతారు.

పితృకార్యాలకు, ధార్మిక కార్యక్రమాలకు విశిష్టమైంది మౌని అమావాస్య. ఈ రోజున పితృదేవతలకు పిండ ప్రదాన కార్యక్రమాలు నిర్వహించడం వలన వారికి ఉత్తమ గతులు కలుగుతాయి, పితృదోషాలు తొలగిపోతాయని చెబుతారు. ఈ రోజున గోమాతకు పెరుగన్నం తినిపిస్తే చంద్ర దోషాల నుంచి విముక్తి లభించి మానసిక ప్రశాంతత కలుగుతుందని జ్యోతిషశాస్త్రం పేర్కొంది. ఈ రోజున వెండి నాగుపామును పూజించి ప్రవహించే నీటిలో తెల్లని పువ్వులతో పాటు వేయడం వల్ల కాలసర్ప దోషం తొలగుతుందని, నువ్వులనూనెతో శనిదేవునికి అభిషేకం చేస్తే శనిదోషాల నుంచి బయటపడొచ్చని, త్రిమూర్తులకు ప్రతిరూపమైన రావిచెట్టును పూజిస్తే పాపాలు తొలగి, సౌఖ్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. ఈరోజు రావిచెట్టుకి నీళ్లు సమర్పించి అక్కడ దీపం వెలిగించి 108 ప్రదక్షిణలు చేస్తే శుభ ఫలితాలు లభిస్తాయన్నది పండిత వచనం. అన్నిటికంటే ముఖ్యంగా ఈ రోజున మౌన దీక్షతో లక్ష్మీనారాయణులను ఆరాధిస్తే ఆధ్యాత్మిక ఉన్నతి లభిస్తుందని పురాణ కథనాలు చెబుతున్నాయి.

– మావూరు విజయలక్ష్మి

ఈనాడు సినిమా

కొత్త ప్రయాణం

ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ తన సొంత నిర్మాణ సంస్థ పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై వరుసగా సినిమాలు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అందుకోసం ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో చేతులు కలిపారు. ఈ రెండు సంస్థలు కలిసి చేయబోయే సినిమాలకు సంబంధించిన కథా చర్చల కోసం ఇటీవల పవన్‌కల్యాణ్‌ని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కలిశారు. త్వరలోనే ఆ ప్రాజెక్టుల్ని అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.


పవన్ కల్యాణ్

పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ... భోగి సందర్భంగా కొత్త ప్రారంభాలకు సంకేతాలిస్తూ రాబోయే ప్రాజెక్టులపై పవన్‌కల్యాణ్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కలిసి విస్తృతంగా చర్చలు జరిపారని పేర్కొంది. టి.జి.విశ్వప్రసాద్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "కథలపై చర్చించడానికి అవకాశం కల్పించినందుకు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు. ప్రేక్షకులకు బలమైన అర్థవంతమైన కంటెంట్‌ని అందించేందుకు పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఈ కలయిక మాకు ఎంతో ఉత్సాహాన్నిస్తోంది. అద్భుతమైన ఈ ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నాం" అంటూ వ్యాఖ్యలు చేశారు.

నేడు ఈటీవీలో 'హిట్ 3'


నాని

"జనాల మధ్యలో ఉంటే అర్జున్.. మృగాల మధ్య ఉంటే సర్కార్.." అంటూ గతేడాది 'హిట్:ది థర్డ్ కేస్' సినిమాతో తెరపై అదరగొట్టారు హీరో నాని. ఆయన ప్రధాన పాత్రలో శైలేశ్ కొలను తెరకెక్కించిన చిత్రమిది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఒకే తరహాలో జరుగుతున్న హత్యలు.. ఆ కేసు కోసం రంగంలోకి దిగిన ఓ పోలీసు అధికారి చుట్టూ తిరిగే కథతో దీన్ని రూపొందించారు. ఇందులో అర్జున్ సర్కార్ అనే శక్తిమంతమైన పోలీసు అధికారి పాత్రలో తన నటనతో అలరించారు నాని. యాక్షన్ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకున్న ఈ థ్రిల్లర్ చిత్రం ఇప్పుడు మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈరోజు మధ్యాహ్నం ఒంటిగంటకి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఈటీవీలో ప్రసారం కానుందీ చిత్రం. మరి ఇంకెందుకు ఆలస్యం అర్జున్ సర్కార్ యాక్షన్ హంగామాపై మీరూ ఓ లుక్కేయ్యండి.

లోకేశ్ దర్శకత్వంలో అల్లు అర్జున్


అల్లు అర్జున్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ 23వ సినిమా ఖరారైంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఆ చిత్రం రూపొందనుంది. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూర్చనున్నారు. 'ఐ సే 23...' అంటూ పాటని వినిపిస్తూ ఓ ప్రత్యేకమైన వీడియోతో ఈ సినిమాని భోగి పండగ సందర్భంగా బుధవారం అధికారికంగా ప్రకటించారు. కొంతకాలంగా ప్రచారంలో ఉన్న ఈ కలయికపై అభిమానులు ఎంతో ఉత్సుకతని ప్రదర్శించారు. ఎట్టకేలకి ఈ కలయికలోనే సినిమా ఖరారైంది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాణంలో రూపొందనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. ఇటీవలే లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కి వచ్చి అల్లు అర్జున్‌తో కథా చర్చలు చేశారు. లోకేశ్ చెప్పిన కథ నచ్చడంతో ఆయన పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం అల్లు అర్జున్ తన 22వ చిత్రాన్ని అట్లీ దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. అది పూర్తి కాగానే లోకేశ్ సినిమా పట్టాలెక్కనుంది. గొప్పతనం కోసం పోరాటం... అనే మాటలు వీడియోలో వినిపించాయి. అల్లు అర్జున్ ఇదివరకెప్పుడూ చూడని ఓ కొత్త లుక్‌లో కనిపించనున్నట్టు సినీ వర్గాలు చెప్పాయి. లోకేశ్, అనిరుధ్‌తో కలిసి చేయనున్న ఈ సినిమా ప్రయాణం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నానంటూ ఎక్స్‌లో పోస్టుని పంచుకున్నారు అల్లు అర్జున్. ఆయన సినిమాకి తొలిసారి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 'కూలీ' తర్వాత లోకేశ్ తెరకెక్కిస్తున్న సినిమా ఇదే.

ముగ్గుల పండగ ముచ్చట్లెన్నో..





పొగ మంచుల్లో అలరారే పల్లెటూరి అందాలు.. ఇంద్రధనుస్సులా రంగులద్దుకొని రా రమ్మని ఆహ్వానించే అందాల లోగిళ్లు.. నట్టింట బంధుమిత్రుల కోలాహలం.. వంటింట పిండి వంటల ఘుమఘుమలు.. ఆకాశాన రెపరెపలాడుతూ పతంగులు పంచే వినోదం.. ఊరి చివరన పందెం కోళ్ల వీరోచిత విన్యాసాలు.. తెలుగింటి సంక్రాంతి అంటే ఈ సందడంతా కనిపించాల్సిందే. ఇక ఈ సంబరమంతా ఒకెత్తైతే.. పండగ రోజు థియేటర్లలో కొత్త సినిమాలు పంచే వినోదం మరొకెత్తు. కుటుంబ సమేతంగా ఆ వెండితెర వినోదాల్ని ఆస్వాదిస్తే గానీ తెలుగు వాళ్ల సంక్రాంతి సంబరాలు పరిపూర్ణం కావు. అందుకే ముగ్గుల పండగ అనగానే కొత్త సినిమాలన్నీ పోటాపోటీగా ముస్తాబై బాక్సాఫీస్ బరిలో వాలిపోతుంటాయి. ఈసారి పండక్కి ఏకంగా ఐదు చిత్రాలు థియేటర్లలోకి రావడం సినీప్రియుల ఆనందాన్ని రెట్టింపు చేసింది. మరి ఈ పండగ బరిలో వినోదాలు పంచుతున్న కొందరు కథానాయికలు చెప్పిన సంక్రాంతి ముచ్చట్లపై ఓ లుక్కేద్దాం..

ఆ లోటు తీరింది

"మకర సంక్రాంతిని మా కర్ణాటకలో సుగ్గి హబ్బ అనే మరో పేరుతోనూ పిలుస్తారు. సుగ్గి అంటే కోత అని అర్థం. కోతల తర్వాత వచ్చే వ్యవసాయ పండగ కాబట్టి పల్లెటూరి ప్రజలు, రైతులు ఆ పేరుతో పిలుస్తారు. ఈ పండగ రోజు నువ్వులు, బెల్లం, కొబ్బరి, కొన్ని రకాల డ్రైఫ్రూట్స్‌తో ఎళ్లు బెల్ల అనే ప్రత్యేక వంటకాన్ని చేస్తాం. అది మాకు చాలా స్పెషల్. దాన్ని బంధుమిత్రులతో పంచుకుంటూ 'ఎళ్లు బెల్ల తిందు ఒళ్లె మాతాడోణ' ('నువ్వుల బెల్లం తిని మంచి మాటలు మాట్లాడదాం' అని తెలుగులో అర్థం) అని శుభాకాంక్షలు చెప్పుకుంటాం. ఇక పండగ రోజు ఇంట్లో ముగ్గులు వేసే డ్యూటీ పూర్తిగా అమ్మదే. ఈసారి సంక్రాంతి మాత్రం నాకు మరింత ప్రత్యేకం. సినిమాల పరంగా నాకిప్పటి వరకు ఒక్క సంక్రాంతి చిత్రం పడలేదన్న లోటును 'కానిస్టేబుల్ కనకం 2' తీర్చింది. ఇది థియేటర్లలో విడుదల కాకున్నా.. ఈటీవీ విన్ ఓటీటీ వేదికగా ఈ పండక్కి వినోదాలు పంచుతుండటం ఆనందాన్నిస్తోంది. అలా నా సంక్రాంతి సంబరాలు వారం ముందుగానే మొదలైనట్లయింది".

- వర్ష బొల్లమ్మ



కోడి పందేల్ని చూడాలనుంది

"తెలుగు నాట సంక్రాంతికి సినిమాలకు ఉన్న అనుబంధం ఎంత ప్రత్యేకమన్నది ఈ ఇండస్ట్రీకి వచ్చాకే నాకర్థమైంది. తెలుగులోకి అడుగు పెట్టిన ప్రతి కథానాయిక తమకంటూ ఓ సంక్రాంతి రిలీజ్ ఉండాలని ఆశ పడుతుంటారు. నేనూ అలా కోరుకున్న దాన్నే. అలాంటి నాకు మహేశ్‌బాబు 'గుంటూరు కారం'తో తొలిసారి పండగ బరిలో నిలిచే అవకాశం రావడం.. ఆ మరుసటి ఏడాది వెంకటేశ్‌తో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకోవడం.. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి 'అనగనగా ఒక రాజు'తో మళ్లీ ముగ్గుల పండగ బరిలో నిలవడం చాలా సంతోషాన్నిస్తోంది. వీటివల్లే ఈ పండగ సంస్కృతిని బాగా తెలుసుకోగలిగా. అయితే సంక్రాంతికి గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేల్ని చూడాలన్న కోరిక ఒక్కటి అలాగే ఉండిపోయింది. ఒకవేళ మా 'అనగనగా ఒక రాజు' చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అటువైపు వెళ్తే ఆ పందేల్ని చూసే ప్రయత్నం చేయాలి. సంక్రాంతిని మా దగ్గర లోహ్రి పేరుతో చేసుకుంటాం. తెలుగునాట చేసుకున్నట్లే పండక్కి మా దగ్గరా 'బోన్‌ఫైర్' (భోగి మంటలు) వేస్తాం. పూజలు చేసుకుంటాం. పతంగులు ఎగరేస్తాం".

- మీనాక్షి చౌదరి

తెలిసింది ప్రభల తీర్థం ప్రత్యేకత

"సంక్రాంతిని మా ఇంట్లో చాలా సింపుల్‌గానే చేసుకుంటాం. తెలుగు చిత్రసీమలోకి వచ్చాకే ఇక్కడ ఈ పండగని ఇంతలా వేడుకగా చేసుకుంటారన్నది నాకర్థమైంది. తెలుగులో తొలి అడుగులోనే 'నా సామిరంగ' లాంటి ప్రాపర్ సంక్రాంతి సినిమాలో భాగమవ్వడం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. దాని వల్లే సంక్రాంతి సినిమాని ప్రేక్షకులు ఎలా ఆస్వాదిస్తారన్నది తొలిసారి నా అనుభవంలోకి వచ్చింది. అలాగే ఇక్కడి ప్రజలు ఈ పండగని ఎలా చేసుకుంటారు.. గోదావరి జిల్లాల్లో జరిగే ప్రభల తీర్థం ప్రత్యేకతని తెలుసుకోగలిగా. ఇప్పుడు తెలుగులో నేను చేసిన మూడో చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలోనే సందడి చేస్తుండటం నాకీ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. మానస శెట్టిగా అందరి మోముల్లో నవ్వులు పూయించడం.. వాళ్ల పండగ వినోదాల్లో భాగమవ్వడం ఆనందాన్నిస్తోంది".

- ఆషికా రంగనాథ్

పతంగులతో అల్లరి..

"నేను చదువుకున్నదంతా చెన్నైలోనే. చిన్నప్పుడు మా తాతయ్య వాళ్లతో కలిసి అక్కడే పొంగల్ వేడుకలు చేసుకునేదాన్ని. మట్టికుండలో పరమాన్నం చేయడం.. కనుమరోజు రకరకాల వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా కలిసి తినడం.. పిల్లలందరం కలిసి పతంగులు ఎగరేస్తూ అల్లరి చేయడం.. ఇలా పండగ ఇచ్చిన జ్ఞాపకాలు బోలెడన్ని. నేనెక్కువ సిటీలోనే పెరగడం వల్ల పల్లెటూర్లలో సంక్రాంతిని ఎలా చేస్తారన్నది ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోయా. తెలుగు, తమిళ ప్రేక్షకులకి సంక్రాంతి అంటే సినిమానే. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన ఇన్నాళ్లకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో తొలిసారి ముగ్గుల పండగ బరిలో నిలవడం ఆనందంగా ఉంది".

- డింపుల్ హయాతి

ప్రేక్షకుల్ని నవ్వించాలన్న లక్ష్యం నెరవేరింది!


సుధాకర్ చెరుకూరి, ఆషిక, డింపుల్, కిశోర్, భీమ్స్

ప్రేక్షకుల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాని తీశామన్నారు దర్శకుడు కిశోర్ తిరుమల. తాము అనుకున్న లక్ష్యాన్ని వంద శాతం చేరుకున్నామని చెప్పారు. తన సినిమాల్ని కుటుంబ ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడుతుంటారని, ఈ సినిమాతో వాళ్ల సంఖ్య రెట్టింపైందన్నారు. రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రమే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. మంగళవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాకి లభిస్తున్న ఆదరణపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ చిత్రబృందం బుధవారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "రవితేజతో నాకు పదేళ్లుగా పరిచయం ఉంది. ఎప్పట్నుంచో కలిసి పనిచేయాలనుకున్నాం. ఈ సినిమాతో అది కుదిరింది. ఈ కథ ఇంత బాగా రావడానికి కారణం రవితేజనే. కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా ఇది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కుటుంబ ప్రేక్షకులు, చిన్నారులు ఈ సినిమాని బాగా ఆస్వాదిస్తున్నారు" అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయికలు, సంగీత దర్శకుడు భీమ్స్, ఇతర చిత్రబృందం పాల్గొంది.

మా నమ్మకాన్ని నిజం చేశారు!


మారి, నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి, నాగవంశీ

నవ్వించడంతోపాటు... చివర్లో భావోద్వేగాలతో కంటతడి కూడా పెట్టించారంటూ ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తున్నాయని, అసలైన పండగ సినిమాని అందించామనే తృప్తి ఉందన్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. బుధవారమే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాకు లభిస్తున్న ఆదరణపై చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. విలేకర్ల సమావేశంలో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ "నేను ప్రేక్షకులతో కలిసి సినిమా చూశా. ప్రథమార్ధం, ద్వితీయార్ధం అనే తేడా లేకుండా నవ్వుతూనే ఉన్నారు. విదేశాల్లో తొలి ఆట నుంచే సినిమాకి అద్భుతమైన స్పందన లభించింద"న్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ "ఈ సినిమాపై ముందు నుంచీ మేం నమ్మకంగా ఉన్నాం. మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశార"న్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

దెయ్యాలు - హారర్ కథలంటే భయం!

'ది రాజాసాబ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ప్రశంసలు తనకెంతో ఆనందాన్నిస్తోంది అంది నటి నిధి అగర్వాల్. ఈ సినిమా కోసం తామంతా మూడేళ్లు కష్టపడ్డామని.. ఆ కష్టానికి ప్రేక్షకులు మంచి ఫలితాన్ని ఇచ్చారని.. ఆరంభంలో దీనికి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ఇప్పుడు ప్రతిఒక్కరూ సినిమాని ఆస్వాదిస్తున్నారని తెలిపింది. ప్రభాస్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇది ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో నిధి అగర్వాల్ బుధవారం విలేకర్లతో ముచ్చటించింది.

"దర్శకుడు మారుతి నాకీ కథ వినిపించినప్పుడే ఇది కచ్చితంగా ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుందని అర్థమైంది. అన్ని తాంత్రిక విద్యలు తెలిసి.. సైకలాజికల్‌గా మైండ్ గేమ్స్ ఆడే ఓ దుష్టశక్తిని హీరో దైవికంగా ఎలా ఎదుర్కొన్నాడన్నది మారుతి కొత్తగా చూపించారు. స్క్రిప్ట్ విన్నప్పుడు నాకదే వినూత్నంగా అనిపించింది. దీనికి ముందు నేను చేసిన 'హరి హర వీరమల్లు'లో రాకుమారిగా నటించా. ఈ సినిమాలో బెస్సీ అనే నన్ పాత్ర పోషించా. ఈ పాత్రని నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశా. అయితే ఒకే సమయంలో అటు పవన్ కల్యాణ్ చిత్రానికి.. ఇటు ప్రభాస్ సినిమాకి పని చేయాల్సి రావడం వల్ల నాకు సరైన నిద్ర కూడా ఉండేది కాదు. ఆ టైమ్‌లో 'రాజాసాబ్' బృందం నాకెంతో సహకరించింది. సెట్‌లో నన్ను బాగా చూసుకునేవాళ్లు. అందుకే ప్రభాస్ కూడా ప్రీరిలీజ్ వేడుకలో 'నిధి అగర్వాల్ అంటే సెట్‌లో అందరికీ ఇష్టమ'ని చెప్పారు".


నిధి అగర్వాల్

- "ఓ నిర్మాతకు ఎంతో ప్యాషన్ ఉంటేనే ఇంత భారీ బడ్జెట్ సినిమాని నిర్మించడం సాధ్యమవుతుంది. దీనికోసం టి.జి. విశ్వప్రసాద్ ఎక్కడా రాజీ పడలేదు".
- "నాకు దెయ్యాలు, హారర్ కథలంటే భయం. అందుకే రాత్రి నిద్రపోయే టప్పుడు లైట్స్ వేసుకుని, హనుమాన్ చాలీసా లూప్‌లో వింటూ నిద్రపోతా. ప్రస్తుతం నేను తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తున్నా. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్‌లోనే ఇల్లు తీసుకున్నా. నేనెక్కడికి వెళ్లినా నాది తెలుగు సినిమా అనే చెప్పుకుంటాను".

'పల్నాడు' పౌరుషం

రోహిత్ వర్మ కథానాయకుడిగా... క్రేజీ కింగ్స్ స్టూడియోస్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రానికి 'పల్నాడు' అనే పేరుని ఖరారు చేశారు. రియా సుమన్ ఇందులో కథానాయిక. గోవింద రెడ్డి చందా దర్శకత్వం వహిస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం ఈ సినిమా పేరుని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. యాక్షన్ ప్రధానంగా రూపొందుతున్న చిత్రమిదని, పౌరుషం, గాఢత కలగలిసిన పాత్రలో కథానాయకుడు కనిపిస్తాడని సినీ వర్గాలు చెప్పాయి. హరీశ్ ఉత్తమన్, నవీన్ నేని, వినోద్ కుమార్, దేవిప్రసాద్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: రవికుమార్.వి, కూర్పు: ఛోటా కె.ప్రసాద్.


రోహిత్ వర్మ

మన సంస్కృతి గొప్పదనం చాటేలా 'వేదవ్యాస్'


కె.అచ్చిరెడ్డి, సాయికుమార్, విశ్వనాథ్, ఎస్వీ కృష్ణారెడ్డి

భారతీయ సంస్కృతి... సంప్రదాయాల గొప్పదనం చాటే కథతో రూపొందిస్తున్న సినిమానే 'వేదవ్యాస్' అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ఆయన తెరకెక్కిస్తున్న 43వ చిత్రమిది. ప్రముఖ నిర్మాత కె.అచ్చిరెడ్డి సమర్పణలో కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్నారు. దక్షిణ కొరియా నటి జున్ హ్యున్ జీ కథానాయిక. బుధవారం కె.అచ్చిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఇందులో కథానాయకుడిగా నటిస్తున్న పిడుగు విశ్వనాథ్‌ని మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ "భారతీయత గొప్పదనం ఈ సినిమాలో కనిపిస్తుంది. కథానాయకుడు విశ్వనాథ్‌కు ఇదే తొలి సినిమా అయినా ప్రతీ సన్నివేశంలోనూ బాగా నటించారు. ఇందులో సాయికుమార్.. వేద నారాయణ పాత్రలో కనిపిస్తార"న్నారు. ఈ కార్యక్రమంలో పిడుగు సుబ్బారావు, నటుడు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధు జొన్నలగడ్డకు శోభన్‌బాబు పురస్కారం



ఉత్తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న యువ కథానాయకులకు సోగ్గాడు శోభన్‌బాబు పేరిట ఏటా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని, 2026కిగానూ సిద్ధు జొన్నలగడ్డను ఎంపిక చేసినట్టు ఓ ప్రకటనలో తెలిపారు అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి గౌరవ ఛైర్మన్ రాశిమూవీస్ నరసింహారావు. త్వరలో నిర్వహించనున్న ఓ వేడుకలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. "శోభన్‌బాబు భౌతికంగా లేకపోయినా.. ఆయన నటించిన సినిమాలతో ప్రేక్షకుల మనసుల్లో సజీవంగా నిలిచిపోయారు. నేటికీ ఆయన అభిమానులు ఎన్నో సేవా కార్యక్రమాల్ని చేపడుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. శోభన్‌బాబు జయంతిని పురస్కరించుకుని బుధవారం సిద్ధు జొన్నలగడ్డను ఈ పురస్కారానికి ఎంపిక చేశామ"ని తెలిపారు నరసింహారావు.

ప్రేమ మలుపు


ఆకాశ్, భైరవి

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్ కథానాయకుడిగా తథాస్తు క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'కొత్త మలుపు'. భైరవి అర్ధ్య కథానాయిక. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహిస్తున్నారు. తాటి బాలకృష్ణ నిర్మాత. సంక్రాంతి పండగని పురస్కరించుకుని ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని బుధవారం విడుదల చేసింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో ప్రేమ, ఉత్కంఠ భరితమైన అంశాల మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది. హాస్యాన్నీ మేళవించాం. బావ, మరదలు పాత్రల్లో ఆకాశ్, భైరవి జోడీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఓ కొత్త రకమైన గ్రామీణ కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ ఎకానమీ

1. చిన్నతరహా పరిశ్రమ తన ఉత్పత్తిలో 50% కంటే ఎక్కువ ఎగుమతి చేస్తుంటే ఆ యూనిట్ హోదాను కింది విధంగా పేర్కొనవచ్చు.
   1) దిగుమతి ఆధార యూనిట్లు
   2) ఎగుమతి ఆధార యూనిట్లు
   3) దేశీయ యూనిట్ 4) చిన్నతరహా యూనిట్
2. కిందివాటిలో ఏ కమిటీ పరిశ్రమల రంగంలో రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేసి ప్రమోషన్(ప్రోత్సాహం) విధానాన్ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది?
   1) రంగరాజన్ కమిటీ 2) కార్వే కమిటీ
   3) అబిద్ హుస్సేన్ కమిటీ
   4) మహలనోబిస్ కమిటీ
3. భారతదేశంలో చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి, పునరావాసం కోసం ఏర్పాటైన కమిటీలకు సంబంధించి కానిది గుర్తించండి.
   1) పద్మనాభన్ కమిటీ 2) కార్వే కమిటీ
   3) నాయక్ కమిటీ 4) ఎస్ఎస్ కోహ్లీ కమిటీ
4. దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించేలా క్రెడిట్ సౌకర్యాలు అందించే సంస్థను కిందివాటిలో గుర్తించండి.
   1) బంధన్ జీవన్ బ్యాంక్ 2) సిడ్బీ
   3) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4) ఐడీబీఐ
5. ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం క్రెడిట్ గ్యారంటీ ఫండ్స్ ట్రస్ట్ ఏ సంవత్సరంలో ఏర్పడింది?
   1) 2004 2) 2000 3) 2006 4) 2001

సమాధానాలు: 1-2, 2-3, 3-1, 4-2, 5-2.

TENTH Mathematics — SETS

1. If A = {x : x ∈ multiples of 3, x < 20}, B = {x : x ∈ multiples of 2, x < 10} then find A∪B?

Sol: A = {3, 6, 9 12, 15, 18} B = {2, 4, 6, 8}

∴ A∪B = {2, 3, 4, 6, 8, 9, 12, 15, 18}

2. If A = {2, 5, 7, 9, 11} B = {5, 7, 9, 10, 12} then find A – B, B – A.

2 Marks

Sol: A – B = {2, 11}, B – A = {10, 12}

∴ A – B ≠ B – A

3. A = {1, 2, 3} then write all the subsets of A?

Sol: ϕ, {1}, {2}, {3}, {1, 2}, {1, 3}, {2, 3}, {1, 2, 3}

if n(A) = 3 the subsets = 2^3 = 8

4. If A = {x : x ∈ even, x < 10} B = { x : x ∈ odd, x < 10} then find A ∩ B and said about A, B.

Sol: A = {2, 4, 6, 8} B = {1, 3, 5, 7, 9}

∴ A ∩ B = ϕ ∴ A, B are disjoint sets

1. A = {x : x ∈ perfect squares, x < 100}, B = {x : x ∈ multiples of 7x < 50}. Then find i) A∩B ii) n(A∩B) iii) A – B iv) n(A – B).

4 Marks


Sol: A = {1, 4, 9, 16, 25, 36, 49, 64, 81}

B = {7, 14, 21, 28, 35, 42, 49}

i) A∩B = {49} ii) n(A∩B) = 1

iii) A – B = {1, 4, 9, 16, 25, 36, 64, 81} iv) n(A – B) = 8

2.



Final Exams-2026 IMPORTANT Q & A

From venn diagram find A∪B, A∩B, A–B, B–A.

Sol: A = {1, 2, 5, 6}, B = {1, 2, 7, 8},

A∪B = {1, 2, 5, 6, 7, 8}, A∩B = {1, 2}

A – B = {5, 6}, B – A = {7, 8}

1. If A = {x : x ∈ factors of 24} B = {x : x ∈ factors of 16}. Then show that n(A∪B) = n(A) + n(B) – n(A∩B).

Sol: A = {1, 2, 3, 4, 6, 8, 12, 24}

1 × 24 = 24 ⇒ 2 × 12 = 24 ⇒ 3 × 8 = 24 ⇒ 4 × 6 = 24

B = {1, 2, 4, 8, 16} ⇒ 1 × 16 = 16 ⇒ 2 × 8 = 16

4 × 4 = 16 ⇒ A∪B = {1, 2, 3, 4, 6, 8, 12, 16, 24}

∴ n(A∪B) = 9 ⇒ n(A) = 8 ⇒ n(B) = 5

6 Marks

A∩B = {1,2,4,8} ∴ n(A∩B) = 4

∴ LHS = n(A∪B) = 9

RHS = n(A) + n(B) – n(A∩B) = 8 + 5 – 4 = 13 – 4 = 9

∴ LHS = RHS

For more IMP Q & A




Writer: P. Venu Gopal

జనరల్ స్టడీస్ — ఇండియన్ పాలిటీ

పౌరహక్కుల రక్షణలో ప్రజాస్వామ్య అస్త్రం!

భారత ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన అధికార పరిధిని దాటి శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు వ్యవహరిస్తే, తమ విధులను సక్రమంగా నిర్వహించకపోతే పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలు స్వచ్ఛందంగా ముందుకు రావడాన్నే న్యాయవ్యవస్థ క్రియాశీలత అంటారు. ఈ ప్రక్రియ కేవలం చట్టాలను వ్యాఖ్యానించడానికే పరిమితం కాదు. సమాజంలో నెలకొన్న అన్యాయాలను రూపుమాపడంలో, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా సామాన్యులకు న్యాయాన్ని చేరువ చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. రాజ్యాంగ సమగ్రతను కాపాడటంతో పాటు ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంచుతోంది. ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల వైఫల్యాలను సరిచేసేందుకు దోహదపడుతున్న ఈ అంశంపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా సామాన్యులకు న్యాయం, దేశ ప్రజలందరికీ సామాజిక న్యాయం అందుతున్న తీరును, సంబంధిత తీర్పులను తెలుసుకోవాలి.




న్యాయవ్యవస్థ - క్రియాశీలత

దేశ పరిపాలనలో శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తాము నిర్వహించాల్సిన విధులను విస్మరించినప్పుడు న్యాయవ్యవస్థ క్రియాశీలతను సంతరించుకుని రాజ్యాంగబద్ధ పాలనకు తోడ్పాటు అందిస్తుంది. న్యాయవ్యవస్థ సాధారణ కార్యక్రమాలు, చర్యల కంటే న్యాయశాఖ క్రియాశీలత భిన్నమైంది కాదు. న్యాయవ్యవస్థ క్రియాశీలత అనేది ధైర్యమైన చర్యల ద్వారా మౌలిక చట్టాన్ని రూపొందించడమే.


న్యాయవ్యవస్థ క్రియాశీలతకు కారణాలు: ✦ రాజ్యాంగ ఔన్నత్యాన్ని పరిరక్షించడం. ✦ పాలనావ్యవస్థలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంపొందించడం. ✦ దేశ సమాఖ్య వ్యవస్థలో వచ్చే సమస్యల పరిష్కారం. ✦ పౌరహక్కులు, మానవ హక్కులను పరిరక్షించడం. ✦ అణగారినవర్గాల వారికి సమన్యాయపాలన అందించడం.

న్యాయవ్యవస్థ క్రియాశీలత - ప్రయోజనాలు:



❖ శాసన, కార్యనిర్వాహకవ్యవస్థల లోపాలను, వైఫల్యాలను నియంత్రిస్తుంది. ❖ ప్రాథమిక హక్కులపై ప్రభుత్వం విధించే ఆంక్షలను నివారిస్తూ, ప్రాథమిక హక్కులకు విస్తృత వివరణ ఇస్తుంది. ❖ భారత ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతం చేయడానికి, స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు తోడ్పడుతుంది. ❖ న్యాయవ్యవస్థ క్రియాశీలత ద్వారా ప్రాథమిక హక్కుల్లోని ఆర్టికల్ 21లో పేర్కొన్న జీవించే హక్కు పరిధిని పెంచారు. దీనిలో భాగంగానే ఆర్టికల్ 21(ఎ) ద్వారా 6 - 14 ఏళ్ల బాలబాలికలందరికీ 'ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య'ను హక్కుగా మార్పు చేశారు. ❖ పౌరహక్కుల కార్యకర్తలు, బాలల హక్కుల పరిరక్షణ బృందాలు, మహిళాభ్యుదయ బృందాలు, పర్యావరణ పరిరక్షణ వాదులు, సామాజిక కార్యకర్తలు తదితరులు న్యాయవ్యవస్థ క్రియాశీలతను సంతరించుకోవడానికి, ప్రజల సమష్టి ప్రయోజనాల పరిరక్షణకు తోడ్పడుతున్నారు.

ప్రజాప్రయోజన వ్యాజ్యం:



పి.ఎన్.భగవతి

న్యాయశాఖ క్రియాశీలతలో అంతర్భాగంగా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పేర్కొనవచ్చు. ప్రజల సమష్టి ప్రయోజనాలు ఉన్న అంశాలను ఇందులో పరిగణనలోకి తీసుకుంటారు. ☛ దేశంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం అనే భావనకు విస్తృత ప్రాచుర్యం కల్పించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎన్.భగవతి, జస్టిస్ వి.ఆర్.కృష్ణ య్యర్. ''దేశంలో అనేకమంది ప్రజలు సరైన న్యాయానికి నోచుకోవడం లేదు. ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా వారికి తప్పనిసరిగా ఉపశమనం, న్యాయం జరుగుతుంది'' అని జస్టిస్ పి.ఎన్.భగవతి పేర్కొన్నారు. ☛ ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా అనేక ప్రజాసమస్యల పరిష్కారానికి సుప్రీంకోర్టు మార్గం చూపింది. ప్రజలకు న్యాయాన్ని అందించడం తోపాటు పేద, బడుగు వర్గాల హక్కులు కాపాడింది. ☛ శాసన, కార్యనిర్వాహక శాఖల నుంచి ఆశించిన ఫలితాలు అందకపోవడంతో ప్రజాహితాన్ని కాపాడమని అర్థించడం న్యాయవ్యవస్థకు బలాన్ని చేకూర్చినట్లయింది. ఫలితంగా కార్యనిర్వాహక శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం ప్రారంభమైంది.

న్యాయవ్యవస్థ క్రియాశీలతపై విమర్శ: న్యాయవ్యవస్థ క్రియాశీలత ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, శాసన, కార్యనిర్వాహక న్యాయవ్యవస్థల మధ్య అంతరాన్ని పెంచే ప్రమాదం ఉందనే విమర్శ ఉంది. ప్రభుత్వ కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా రాజ్యాంగపరమైన ఉల్లంఘనకు న్యాయవ్యవస్థ కారణం అవుతుందని కొందరు పేర్కొంటున్నారు. అయితే న్యాయవ్యవస్థ క్రియాశీలత ద్వారానే ప్రజలకు ఉపకరించే పలు చట్టాలు రూపొందాయని మరికొందరు సమర్థిస్తున్నారు.

సుప్రీంకోర్టు తీర్పులు: ★ పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఆకలి, పోషకాహార లోపాలను అధిగమించడానికి ఆహారహక్కును చట్టబద్ధంగా అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ★ కునాల్ సాహు వర్సెస్ అడ్వాన్స్‌డ్ మెడికేర్ కోల్‌కతా కేసులో ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యం అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. ★ మేనకా గాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వాక్, భావ ప్రకటనా స్వాతంత్ర్యం అనేవి ఆర్టికల్ 19లో అంతర్భాగమని, భావ ప్రకటనా స్వేచ్ఛకు భౌగోళిక హద్దులు లేవని, ఒక వ్యక్తి తన అభిప్రాయాలను దేశం లోపల లేదా విదేశాల్లో సంచరిస్తున్నప్పుడు స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చని పేర్కొంది. ★ ఉన్నికృష్ణన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఆర్టికల్ 21లో పేర్కొన్న జీవించే హక్కులో అంతర్భాగంగా 'ఉచిత నిర్బంధ ప్రాథమిక హక్కు'ను అందించాలని చెప్పింది. ★ 86వ రాజ్యాంగ సవరణ చట్టం-2002, ఆర్టికల్ 21(ఎ) ద్వారా 'ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు'ను రూపొందించారు.

సామాన్య ప్రజలు, న్యాయపరిజ్ఞానం లేని వారు, అణగారిన వర్గాల వారు తమ హక్కులను పరిరక్షించుకునే అవకాశం లేనప్పుడు, న్యాయం పొందడంలో విఫలమవుతున్నప్పుడు వారి తరఫున వేరొకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించే ప్రక్రియను ప్రజాప్రయోజన వ్యాజ్యం అంటారు.

సుప్రీంకోర్టు తీర్పులు: ◆ జాతీయ న్యాయసేవా ప్రాధికారసంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీంకోర్టు హిజ్రాలకు మూడో జెండర్ (లింగం)గా చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వాలని చెప్పింది (2014 ఏప్రిల్ 15). ◆ మనోజ్ నారులా వేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు అవినీతి, క్రిమినల్ కేసులు ఎదుర్కొన్న వారికి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో పదవులు ఇవ్వకూడదని తీర్పు ఇచ్చింది. ◆ అభయ్ సింగ్ దాఖలు చేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు వాహనాలపై ఎర్రబుగ్గల వాడకం సమంజసం కాదని, అది రాజరిక మనస్తత్వానికి నిదర్శనమని, దేశ గణతంత్ర వ్యవస్థకు తగదని 2013 డిసెంబరు 10న తీర్పు ప్రకటించింది. ◆ బి.పి.సింఘాల్, కొన్ని మతసంస్థలు దాఖలు చేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు మహిళల మధ్య జరిగే స్వలింగ సంపర్కం చట్టవిరుద్ధమని 2013 డిసెంబరు 11న పేర్కొంది. ◆ నాజ్ ఫౌండేషన్, మరికొందరు దాఖలు చేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు మైనార్టీని తీరిన ఇద్దరు స్వలింగసంపర్కంలో పాల్గొనడం నేరం కాదని, స్వలింగసంపర్కం పూర్తిగా సహజమైన ప్రక్రియ అని 2018 సెప్టెంబరు 7న తీర్పు ఇచ్చింది. ◆ స్వరాజ్ అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు జాతీయ ఆహారభద్రతా చట్టం-2013 అమలుపై పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార కమిషన్లు ఏర్పాటు చేయాలని, ఆహారం పొందడం ప్రజల మౌలిక హక్కు అని 2018లో తీర్పునిచ్చింది. ◆ కె.ఎస్.పుట్టుస్వామి దాఖలు చేసిన 'పిల్'ను విచారించిన సుప్రీంకోర్టు దేశంలోని పౌరులందరూ 'ఆధార్ కార్డు' పొందడం కోసం వారి వ్యక్తిగత వివరాలు, వేలిముద్రలు తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొనడం పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కులను ఉల్లంఘించడమేనని తీర్పు ఇచ్చింది.



> న్యాయవ్యవస్థ క్రియాత్మక వైఖరి చట్టవ్యవస్థను సజీవంగా ఉంచుతుంది. సామాజిక, ఆర్థిక మార్పు ప్రక్రియలో కీలక భూమిక పోషిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం తదితర భావనలను ప్రోత్సహిస్తుంది. సామాజిక పరివర్తనకు కృషి చేస్తుంది.



రచయిత: బంగారు సత్యనారాయణ

కర్ణాటకలో గంధపు రంగు చిరుత!

కొత్త సంవత్సరం ప్రారంభంలో మొత్తం ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తూ అమెరికా వెనుజువెలాపై మెరుపు దాడి చేసింది. ఏకంగా ఆ దేశ అధ్యక్షుడిని బంధించి తీసుకెళ్లింది. రష్యా జెండాతో వెళుతున్న ఒక వాణిజ్య నౌకనూ సీజ్ చేసి అట్లాంటిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెంచింది. విద్యార్థులు వార్తాపత్రికలు చదవడాన్ని తప్పనిసరి చేసిన రాష్ట్రాలుగా ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ నిలిచాయి. సముద్ర కాలుష్య నియంత్రణ కోసం భారత్ ప్రత్యేకంగా నౌకను రూపొందించింది. ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా మన దేశం నిలిచింది. రెండే జిల్లాలతో ఉన్న గోవా రాష్ట్రంలో ఇటీవల మూడో జిల్లా ఏర్పాటైంది. కార్బన్ డై ఆక్సైడ్‌ను ఇంధనంగా మార్చే ప్రయోగంలో ఐఐటీ గువాహటి పరిశోధకులు పురోగతి సాధించారు. ఇటీవలి కాలంలో ఈ విధంగా వార్తల్లో నిలిచిన వ్యక్తులు, ప్రాంతాలు, సంఘటనలు, కీలక పరిణామాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వివిధ రంగాల వారీగా ప్రాధాన్యం ఉన్న నివేదికలు, ప్రకటనలు, ఆవిష్కరణలను గుర్తుంచుకోవాలి.



కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు

1. బల్గేరియా తమ జాతీయ కరెన్సీగా 'యూరో'ను గుర్తించింది. అయితే ఇప్పటివరకు బల్గేరియా కరెన్సీ ఏమిటి?
   1) లియు 2) లెవ్
   3) పెసో 4) డాలర్

నోట్: ● యూరో జోన్‌లో 2026, జనవరి 1న 21వ దేశంగా బల్గేరియా చేరింది. బల్గేరియా రాజధాని సోఫియా.
యూరో జోన్ దేశాలు: 1) ఆస్ట్రియా 2) బెల్జియం 3) స్లోవేకియా 4) క్రొయేషియా 5) సైప్రస్ 6) ఎస్టోనియా 7) ఫిన్లాండ్ 8) ఫ్రాన్స్ 9) జర్మనీ 10) గ్రీస్ 11) ఐర్లాండ్ 12) ఇటలీ 13) లాట్వియా 14) లిథువేనియా 15) లక్సెంబర్గ్ 16) మాల్టా 17) నెదర్లాండ్స్ 18) పోర్చుగల్ 19) స్లోవేనియా 20) స్పెయిన్ 21) బల్గేరియా

2. కిందివాటిలో ప్రళయ్ క్షిపణికి సంబంధించి సరైంది?



   ఎ) డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది.
   బి) రష్యా సహాయంతో అభివృద్ధి చేశారు.
   సి) 500 - 1000 కేజీల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు.
   డి) ఈ క్షిపణి పరిధి 150 - 500 కిలోమీటర్లు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి 4) సి, డి
3. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కర్ణాటక తీరంలో ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించారు. ఇప్పటివరకు ఎంతమంది రాష్ట్రపతులు జలాంతర్గామిలో ప్రయాణించారు?
   1) 3 2) 2 3) 1 4) 4

నోట్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 'ఐఎన్ఎస్ సింధురక్షక్'లో ప్రయాణించారు.

4. విద్యార్థుల రోజువారీ కార్యకలాపాల్లో వార్తాపత్రికల పఠనాన్ని తప్పనిసరి చేయాలని ఏ రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ఆదేశించాయి?
   1) అస్సాం, మేఘాలయా 2) బిహార్, కేరళ
   3) ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ 4) గుజరాత్, కర్ణాటక
5. 'అగ్ని సరస్సులో వికసించిన కమలం ద్రౌపది ముర్ము' పుస్తక రచయిత?
   1) అమిత్ షా 2) శశిథరూర్
   3) యండమూరి వీరేంద్రనాథ్
   4) యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
6. వందే భారత్ స్లీపర్ రైలు తొలిసారి ఏయే ప్రాంతాల మధ్య అందుబాటులోకి (2026, జనవరి 17 నుంచి) రానుంది?
   1) గువాహటి - కోల్‌కతా
   2) వారణాసి - ముంబయి
   3) వారణాసి - దిల్లీ 4) కోల్‌కతా - చెన్నై

నోట్: మొదటి వందే భారత్ రైలు 2019, ఫిబ్రవరి 15న వారణాసి నుంచి న్యూదిల్లీ మధ్య నడిచింది.

7. దేశంలో మొదటిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు ఏయే ప్రాంతాల మధ్య నడవనుంది?



   1) అమరావతి - హైదరాబాద్
   2) కోల్‌కతా - దిల్లీ 3) జింద్ - సోనిపట్
   4) చెన్నై - విశాఖపట్టణం

నోట్: ప్రపంచంలో మొదటిసారి హైడ్రోజన్‌తో రైలు 2018లో జర్మనీలో నడిచింది.

8. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించిన ఎన్ని వంగడాలు జాతీయ స్థాయిలో ఇటీవల విడుదలయ్యాయి?
   1) 6 2) 3 3) 4 4) 2

నోట్: కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశవ్యాప్తంగా ఐసీఏఆర్ అభివృద్ధి చేసిన 26 రకాల పంటల్లో అధిక దిగుబడి ఇచ్చే 184 కొత్త వంగడాలను దిల్లీలో విడుదల చేశారు.

9. కర్ణాటకలో ఎక్కువ కాలం సీఎంగా పనిచేసిన వ్యక్తిగా ఇటీవల సిద్ధరామయ్య రికార్డు సృష్టించారు. అయితే సిద్ధరామయ్య ఏ సంవత్సరంలో తొలిసారి కర్ణాటక సీఎం అయ్యారు?
   1) 2006 2) 2013 3) 2008 4) 2017

నోట్: ● గతంలో దేవరాజు అరసు (కాంగ్రెస్) 7 సంవత్సరాల 239 రోజుల రికార్డును సిద్ధరామయ్య అధిగమించారు.
● సిద్ధరామయ్య 2013 -18 మధ్యకాలంలో, తర్వాత 2023 నుంచి సీఎంగా కొనసాగుతున్నారు.

10. ఇటీవల వార్తల్లో నిలిచిన 'గ్రీన్‌లాండ్' ప్రస్తుతం ఏ దేశంలో భాగం?
    1) నార్వే 2) డెన్మార్క్ 3) అమెరికా 4) కెనడా

నోట్: ● గ్రీన్‌లాండ్ ప్రపంచంలో అతి పెద్ద ద్వీపం.
● 1979లో జరిగిన రెఫరెండంలో ఈ ద్వీపానికి స్వతంత్ర ప్రతిపత్తి లభించింది. విదేశీ వ్యవహారాలు, రక్షణ అంశాలను మాత్రమే డెన్మార్క్ పర్యవేక్షిస్తుంది.

11. ఇటీవల మరణించిన మనోజ్ కొఠారీ ఏ క్రీడకు చెందినవారు?
    1) హాకీ 2) బిలియర్డ్స్
    3) క్రికెట్ 4) ఫుట్‌బాల్

నోట్: 1990లో ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ నెగ్గాడు.


12. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ విడుదల చేసిన డేటా ప్రకారం 2025లో భారత్‌లో ఎన్ని పులులు మరణించాయి?



    1) 160 2) 180 3) 149 4) 166

నోట్: ● 2024లో 126 పులులు మరణించాయి.
● 2025లో అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 55, మహారాష్ట్రలో 38, కేరళలో 13 పులులు మరణించాయి.

13. కిందివాటిలో సరైంది?
    ఎ) ఇటీవల చైనా అధునాతన యుద్ధ నౌక లౌడీని అభివృద్ధి చేసింది.
    బి) నొప్పి నివారణి ఔషధమైన నిముసులైడ్ తయారీ, విక్రయాలతో పాటు అధిక డోసులపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆంక్షలు విధించింది.
    సి) కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాపించే హెపటైటిస్ - ఇ వైరస్ నివారణ కోసం హెవాక్సిన్ పేరుతో వ్యాక్సిన్‌ను డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది.
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
14. కిందివాటిలో సరైంది?



    ఎ) సముద్రంలో కాలుష్య నియంత్రణ కోసం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో భారత్ తయారు చేసిన తొలి నౌక సముద్ర ప్రతాప్.
    బి) గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ దీన్ని తయారు చేసింది.
    సి) సముద్ర ప్రతాప్ నౌక పొడవు 114.5 మీటర్లు. బరువు 4,200 టన్నులు.
    1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి
15. 14వ అంతర్జాతీయ పూల ప్రదర్శన ఎక్కడ జరిగింది?
    1) హైదరాబాద్ 2) ముంబయి
    3) యానాం 4) అహ్మదాబాద్
16. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం ఎప్పుడు?
    1) జనవరి 2 2) జనవరి 9
    3) జనవరి 7 4) జనవరి 4
17. 'గంధపు రంగు' చిరుతను ఇటీవల ఏ రాష్ట్రంలో గుర్తించారు?
    1) కర్ణాటక 2) మధ్యప్రదేశ్
    3) ఉత్తరాఖండ్ 4) ఉత్తర్‌ప్రదేశ్
18. భారత సైన్యం 2026ను ఏ విధంగా ప్రకటించింది?
    1) ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ సస్టెయినబుల్ అండ్ రిజిలెంట్ టూరిజం
    2) ఇయర్ ఆఫ్ సోల్జర్స్ 3) ఇయర్ ఆఫ్ మౌంటేన్స్
    4) ఇయర్ ఆఫ్ నెట్‌వర్కింగ్ అండ్ డేటా సెంట్రిసిటీ
19. ఇటీవల 2026, జనవరి 4న న్యూదిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా ప్రకటించారు. అయితే భారతదేశ బియ్యం ఉత్పత్తి ఎంత?
    1) 180.26 మిలియన్ టన్నులు
    2) 150.18 మిలియన్ టన్నులు
    3) 176.49 మిలియన్ టన్నులు
    4) 140.69 మిలియన్ టన్నులు
20. గోవాలో నూతనంగా ఏర్పాటు చేసిన (2025, డిసెంబరు 31న) 3వ జిల్లా పేరు ఏమిటి?
    1) మాండోవి 2) కుషావతి 3) పనాజీ 4) కుసో

నోట్: ● గోవాలో ఇప్పటికే ఉన్న జిల్లాలు 1) నార్త్ గోవా 2) సౌత్ గోవా ● కుషావతి జిల్లాను దక్షిణ గోవా నుంచి ఏర్పాటు చేశారు.

21. 4 – 14 సంవత్సరాల వయసున్న పిల్లలకు విలువ ఆధారిత విద్య కోసం సంస్కారశాల కార్యక్రమం ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
    1) రాజస్థాన్ 2) ఆంధ్రప్రదేశ్ 3) కేరళ 4) అస్సాం
22. ఇటీవల అమెరికా ఏ దేశానికి చెందిన జెండాతో వెళుతున్న మారినెరా అనే నౌకను సీజ్ చేసింది?
    1) ఫ్రాన్స్ 2) రష్యా 3) కెనడా 4) వెనుజువెలా
23. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు ఎంత శాతంగా నమోదవుతుందని గోల్డ్‌మ్యాన్ శాక్స్ అంచనా వేసింది?
    1) 6.8% 2) 7.8% 3) 6.3% 4) 7.2%

నోట్: దేశ జీడీపీ వృద్ధి రేటు 2025-26లో 7.5%గా ఎస్‌బీఐ నివేదిక వెల్లడించింది.

24. కార్బన్ డై ఆక్సైడ్‌ను మిథనాల్ ఇంధనంగా మార్చేందుకు ఉపయోగపడే ఫోటోకెటలిటిక్ పదార్థాన్ని ఏ ఐఐటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు?
    1) ఐఐటీ మద్రాసు 2) ఐఐటీ గువాహటి
    3) ఐఐటీ ఖరగ్‌పుర్ 4) ఐఐటీ హైదరాబాద్
25. ఇటీవల మరణించిన సురేశ్ కల్మాడీ ఏ సంవత్సరాల్లో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు?
    1) 1996 - 2011 2) 2011 - 2014
    3) 2016 - 2020 4) 1996 - 1999

నోట్: 1) 2010లో 19వ కామన్వెల్త్ క్రీడలు ఇండియాలో జరిగినప్పుడు నిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు.

26. కొత్త రెల్లు జాతి పాము (కలమారియా మిజోరమెన్సిస్)ను ఇటీవల ఏ రాష్ట్రంలో గుర్తించారు?



    1) మేఘాలయ 2) మణిపుర్
    3) మిజోరం 4) గోవా
27. కిందివాటిలో సరైంది?
    ఎ) అమెరికా సైన్యం 2026, జనవరి 3న వెనుజువెలాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను బంధించి న్యూయార్క్‌కు తరలించింది.
    బి) 2010 నుంచి మదురో వెనుజువెలా అధ్యక్షుడిగా ఉన్నారు.
    సి) 1990లో దక్షిణ అమెరికా దేశమైన పనామాపై దాడి చేసి అప్పటి అధ్యక్షుడు మాన్యుయెల్ ఆంటోనియో నోరిగాను బంధీ చేసిన 36 ఏళ్ల తర్వాత దక్షిణ అమెరికాలోని వెనుజువెలా అధ్యక్షుడిని బంధీ చేసింది.
    డి) వెనుజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు చేపట్టారు.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి

నోట్: 2013 నుంచి నికోలస్ మదురో వెనుజువెలా అధ్యక్షుడిగా ఉన్నారు.



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-2; 2-2; 3-2; 4-3; 5-4; 6-1; 7-3; 8-3; 9-2; 10-2; 11-2; 12-4; 13-4; 14-1; 15-4; 16-4; 17-1; 18-4; 19-2; 20-2; 21-4; 22-2; 23-1; 24-2; 25-1; 26-3; 27-2.

అపరిమిత వినియోగంతో..
ఎల్లలు దాటుతోన్న కాలుష్యం!





ప్రకృతిలోని వనరులను ఉపయోగించుకుని మానవులు తమకు కావాల్సిన వివిధ వస్తువులను ఉత్పత్తి చేసుకుంటున్నారు. దీన్నే 'ఉత్పత్తి - వినియోగ' ప్రక్రియ అంటారు. ప్రస్తుతం వీటిని అవసరాలకు మించి విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో ఎన్నో వ్యర్థాలు, కాలుష్య కారకాలు విడుదలవుతున్నాయి. వీటిన్నింటినీ పర్యావరణం తనలోనే ఇముడ్చుకుంటుంది. ఈ కారణంగా అది తన సహజ లక్షణాలను కోల్పోతోంది. ఫలితంగా మానవాళికి అందిస్తోన్న పర్యావరణ లేదా సహజ వనరుల పరిమాణం, వాటి నాణ్యత తగ్గుతుంది. దీన్నే 'పర్యావరణ క్షీణత' అంటారు. ప్రస్తుతం ఇది ప్రపంచవ్యాప్త సమస్యగా పరిణమించింది. పర్యావరణ క్షీణత నిర్వచనాలు, దీనివల్ల కలుగుతున్న నష్టాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

భారత ఆర్థిక సమస్యలు - పర్యావరణ క్షీణత

ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో భాగంగా వివిధ దేశాలు అనుసరిస్తున్న కొత్త సాంకేతిక విధానాలు, కార్యక్రమాలు, ప్రజల జీవనశైలి, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన వినియోగాల్లో ఆధునిక పోకడలు మొదలైనవి కాలుష్య కారకాలను పరిమితి లేకుండా పెంచుతున్నాయి. దీంతో పర్యావరణం క్షీణతకు గురవుతోంది.

◆ ఒక ప్రాంతంలో వాతావరణంలోకి విడుదలయ్యే కాలుష్య కారకాలు కేవలం ఆ ప్రదేశంలో మాత్రమే ఉండవు. భౌగోళిక సరిహద్దులు దాటి ఇతర దేశాలకూ అవి వ్యాపిస్తాయి. అందుకే పర్యావరణ మార్పు అనేది అంతర్జాతీయ సమస్యగా మారి, జీవుల సంక్షేమానికి సవాలు విసురుతోంది.

◆ పర్యావరణ క్షీణత కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతారు, పంటల ఉత్పాదకత తగ్గుతుంది, వనరులు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా హాని కలిగిస్తాయి. వీటి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని అంచనా. పారిశ్రామికీకరణ, వ్యవసాయంలో మితిమీరిన ఎరువుల వాడకం మొదలైనవి పర్యావరణానికి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తున్నాయి.

నిర్వచనాలు

❐ ఐక్యరాజ్య సమితి విపత్తు తగ్గుదలకు అంతర్జాతీయ వ్యూహం (యూఎన్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్) ప్రకారం సామాజిక, సహజ వనరుల తగ్గుదలను భరించగల భూమి పరిమితి (Limit of the Earth) తగ్గడాన్ని పర్యావరణ క్షీణతగా పేర్కొంటారు.

❐ వాతావరణం, జలావరణం, ఆశ్మావరణంలోని నాణ్యత, వనరుల పరిమాణం తగ్గడం; జీవావరణంలో విభిన్న మార్పులు రావడం; జీవరాశుల పరిమాణంలో హెచ్చుతగ్గులు, జీవన శైలిలో మార్పులు, కొన్ని జీవులు అంతరించి జీవవైవిధ్యంలో తేడాలు రావడం మొదలైనవన్నీ పర్యావరణ క్షీణతను సూచిస్తాయి.

❐ పర్యావరణ క్షీణత అంటే గాలి, నీరు, నేల లాంటి వనరుల కలుషితం ద్వారా వాతావరణం దెబ్బతినడం; పర్యావరణ వ్యవస్థల నాశనం, వన్యప్రాణుల విలుప్తత.

❐ ఏదైనా హానికరమైన లేదా అవాంఛనీయ ఘటన కారణంగా వాతావరణంలో మార్పు సంభవిస్తే దాన్ని పర్యావరణ క్షీణత అంటారు.

పర్యావరణ క్షీణత - సమస్యలు

పర్యావరణ క్షీణత మానవజాతి మనుగడకే సవాల్‌గా మారింది. వాతావరణ మార్పులు సంభవించి అనేక సమస్యలకు కారణమవుతున్నాయి. వాటిలో ముఖ్యమైనవి పరిశీలిస్తే..

ఆమ్ల వర్షం (Acid Rain): ఆమ్ల వర్షం అనే పదాన్ని తొలిసారి 1872లో రాబర్ట్ అంగస్ స్మిత్ అనే ఆంగ్ల శాస్త్రవేత్త ఉపయోగించాడు. వాతావరణ కాలుష్యానికి, ఆమ్ల వర్షానికి మధ్య సంబంధం గురించి ప్రస్తావించిన మొదటి శాస్త్రవేత్త ఈయనే.

❖ ఆమ్ల అనుఘటకాలు కలిగి ఉన్న మంచు, పొగమంచు, మంచు బిందువులతో కూడిన నీరు ఆమ్ల వర్షంగా కురుస్తుంది. ఆమ్లాన్ని కొలిచే కొలమానం pH స్కేలు. ఇది ఒక లాగరిథమ్ స్కేలు. దీని వ్యాప్తి 0 నుంచి 14 వరకు ఉంటుంది. ❖ pH విలువ 7 వరకు ఉన్న ద్రవం ఏదైనా తటస్థమైందిగా పేర్కొంటారు. 7 కంటే ఎక్కువగా ఉన్న ద్రవానికి క్షార స్వభావం ఉంటుంది. వర్షపు నీటిలో pH విలువ 7 కంటే తక్కువ ఉంటే అది ఆమ్లం వర్షం. ఇందులో ప్రధానంగా గంధక ఆమ్లం, నైట్రిక్ ఆమ్లం ఉంటాయి.

❖ మానవ చర్యల ఫలితంగా గడచిన దశాబ్దాలుగా భూమిపై ఆమ్ల వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. కొన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తి ప్రక్రియలు ఇందుకు కారణం. విద్యుత్ కర్మాగారాల్లో శిలాజ ఇంధనం మండించడం వల్ల నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి అవుతుంది. అలాగే కొన్ని శిలాజ ఇంధనాల దహనం వల్ల సల్ఫర్ డైఆక్సైడ్ విడుదల అవుతుంది.

❖ పరిశ్రమల ఉత్పత్తి ప్రక్రియలోనే కాకుండా కొన్ని సహజ పరిణామాలు కూడా ఆమ్ల వర్షాలకు కారణమవుతున్నాయి. అగ్నిపర్వతాల విస్ఫోటనం వల్ల సల్ఫర్ డైఆక్సైడ్ గాలిలోకి విడుదల అవుతుంది. ఎండిన పంటను కాల్చడం లాంటి చర్యల వల్ల నేలలో ఉండే కొన్ని రకాల సూక్ష్మ జీవులు నైట్రిక్ ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి.

❖ ఈ రెండు వాయువులు వాతావరణంలోకి ప్రవేశించి మేఘాల వద్దకు చేరతాయి. వర్షం పడే సమయంలో అవి ఆ నీటిలో చేరి ఆమ్లత్వానికి కారణమవుతున్నాయి. నేలపైకి చేరి భూమిని కలుషితం చేస్తున్నాయి. భవనాలు, కట్టడాలపై ఈ వర్షం పడినప్పుడు మచ్చలు ఏర్పడతాయి.

ఓజోన్ పొర క్షీణత (Ozone Layer Depletion): అంతర్జాతీయంగా మానవాళికి హాని కలిగిస్తోన్న మరొక పర్యావరణ సమస్య ఓజోన్ పొర క్షీణత. దీన్నే ఓజోన్ పొర పలచబడటం అని కూడా అంటారు.

◗ భూమి నుంచి 25 కి.మీ. ఎత్తులో స్ట్రాటో ఆవరణంలో సూక్ష్మ పరిమాణంలో ఆవరించి ఉన్న ఒక పలచటి నీలి వాయు పొరను ఓజోన్ అంటారు. వాతావరణంలో ఈ వాయువు గాఢత గ్రాముకు పది మిల్లీ గ్రాములు ఉంటుంది. శీతాకాలంతో పోలిస్తే వేసవిలో దీని గాఢత ఎక్కువగా ఉంటుంది.

◗ సూర్యుడి నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాలు భూమిని చేరకుండా రక్షణ కవచంలా ఇది ఉపయోగపడుతుంది. ఆ కిరణాలు నేరుగా భూమిని చేరితే వాటిలో ఉండే రేడియేషన్ కారణంగా జీవరాశులకు నష్టం వాటిల్లుతుంది.

◗ వాతావరణ కాలుష్యం కారణంగా ఓజోన్ పొర క్షీణిస్తోందని శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. 1960లో అంటార్కిటికా దగ్గర ఈ పొరకు రంధ్రం పడినట్లు వారు గుర్తించారు. ◗ మానవ చర్యల ఫలితంగా క్లోరోఫ్లోరో కార్బన్‌లు (CFCs) వాతావరణంలోకి చేరుతున్నాయి. అవి ఓజోన్ పొరతో చర్య జరిపి దాని క్షీణతకు కారణమవుతున్నాయి.

హరిత గృహ ప్రభావం

గత కొన్నేళ్లుగా భూమి ఉష్ణోగ్రతలో పెరుగుదల నమోదవుతోంది. దీన్ని భూతాపంగా పేర్కొంటారు. ఇదే హరిత గృహ ప్రభావానికి కారణం.

▲ సూర్య కిరణాల ద్వారా సౌరశక్తి భూమిపైకి ప్రసరించినప్పుడు, భూ వాతావరణం అందులో కొంత భాగాన్ని అంతరిక్షంలోకి తిరిగి పంపుతుంది. మిగిలిన సౌర శక్తిని తనలోకి శోషించుకుంటుంది. అంటే భూమి ఆవరణం, జలావరణం ఆ సౌర శక్తిని గ్రహిస్తాయి. దీనివల్ల పుడమి వెచ్చగా అవుతుంది. అలాగే భూమి, నీరు కొంత ఉష్ణాన్ని అంతరిక్షంలోకి ప్రసరింపజేస్తాయి.

▲ అయితే వాతావరణంలోని కాలుష్య కారకాలు ఆ వేడిని అంతరిక్షంలోకి ప్రసరించకుండా బంధిస్తాయి. దీనివల్ల ఆ ఉష్ణోగ్రత తిరిగి భూమిపైకి వస్తుంది. తద్వారా భూమి వేడెక్కుతుంది.

▲ కార్బన్ డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రో కార్బన్లు, మీథేన్ మొదలైన వాయువులను గ్రీన్ హౌస్ గ్యాసెస్ అంటారు. భౌమ్యావరణంపై, జీవావరణంపై ఈ వాయువులు కలిగించే నష్టాన్ని హరిత గృహ ప్రభావం అంటారు.

▲ సాధారణ పరిస్థితుల్లో భూమిపై ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటుంది. హరిత గృహ వాయువుల సాంద్రత పెరిగితే భూమిపై ఉష్ణోగ్రత అంతకంటే ఎక్కువ స్థాయికి చేరుతుంది. ఇది జీవరాశికి హానికరం.

▲ ఈ విధంగా భూ ఉష్ణోగ్రత పెరగడాన్ని భూతాపం లేదా గ్లోబల్ వార్మింగ్ అంటారు. ఇది మిగిలిన పర్యావరణ సమస్యల కంటే తీవ్రమైంది, ప్రమాదకరమైంది. ఇది మానవజాతి మనగడకు ముప్పు కలిగిస్తుంది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day

892

Pervasive

Telugu meaning: వ్యాప్తి చెందిన, పాకిన

English meaning: The word pervasive (పర్వేసివ్) is an adjective that describes something that is widespread and present throughout a particular area or system.

Synonyms: Widespread, Prevalent; ***Antonyms:*** Limited, Rare

Usage: **1.** The pervasive use of smartphones has significantly altered communication patterns across society.

2. Corruption remains a pervasive problem affecting various levels of administration.

Current Affairs



On 13 January 2026, External Affairs Minister S Jaishankar launched the website, theme, and logo for BRICS 2026, scheduled to take place under India's chairship. BRICS brings together eleven major emerging markets and developing countries of the world - Brazil, China, Egypt, Ethiopia, India, Indonesia, Iran, Russia, Saudi Arabia, South Africa, and the United Arab Emirates.

The Pension Fund Regulatory and Development Authority (PFRDA) has constituted a high-level committee to formulate guidelines and regulations for enabling a framework for assured payouts under the National Pension System (NPS). The Finance Ministry stated that the move is aligned with the provisions of the PFRDA Act. The 15-member committee will be chaired by Former Chairperson of the Insolvency and Bankruptcy Board of India Dr M. S. Sahoo.

The Union Government has notified the National Sports Governance (National Sports Bodies) Rules, 2026 under the National Sports Governance Act, 2025. The Rules provide the framework for the inclusion of Sportspersons of Outstanding Merit, the composition of the General Body and Executive Committee, election procedures, and disqualification criteria for members of National Sports Bodies and Regional Sports Federations.



India and France reaffirmed their strategic partnership during the 38th India-France Strategic Dialogue, co-chaired by National Security Adviser Ajit Doval and Diplomatic Adviser to French President Emmanuel Bonne in New Delhi on 13 January 2026. During the Strategic Dialogue, India and France discussed ongoing bilateral initiatives spanning the domains of security, defence, technology, space, and civil nuclear cooperation.

For more Current Affairs: **Scan QR code**

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ
రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు

భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.


☛ భారతదేశంలో 70% ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. వ్యవసాయం నుంచి నికరమైన ఆదాయం రాకపోవడంతో ఖర్చులు అధికమై, పొదుపు లేక రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

☛ 1875లో దక్కన్ ప్రాంతంలో జరిగిన అల్లర్లు వ్యవసాయదారుల రుణబాధలను బ్రిటిష్ ప్రభుత్వానికి తెలిసేలా చేశాయి. ప్రభుత్వం 1876లో దక్కన్ వ్యవసాయదారుల ఉపశమన చట్టం చేసింది. 1883లో భూమి అభివృద్ధి రుణాల చట్టం, 1884లో వ్యవసాయదారుల రుణాల చట్టాలను అమల్లోకి తీసుకువచ్చింది.

సహకార వ్యవస్థ:

☛ ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సహకార సంఘాన్ని 1918లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో స్థాపించారు. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన సంఘం.

☛ ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తారు.



సహకార పరపతి వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక సంఘం విధులు - తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

భారత సైనిక దినోత్సవం

జనవరి 15
చరిత్రలో ఈనాడు

ఇండియన్ ఆర్మీ ప్రపంచంలోనే నాలుగో శక్తిమంతమైన సైన్యంగా గుర్తింపు పొందింది. ఇది భారత రక్షణ దళాల భూతల విభాగం. త్రివిధ దళాల్లో (సైన్యం, వైమానిక దళం, నౌకాదళం) భారత సైన్యం అతిపెద్దది. సరిహద్దుల వెంట దేశ భూభాగాలకు రక్షణ కల్పిస్తూ, ఉగ్రమూక చొరబాట్లను అడ్డుకోవడం వీరి బాధ్యత. జాతీయ భద్రతను కాపాడటం వీరి ప్రథమ కర్తవ్యం. భారత సైన్యం అందించే నిస్వార్థమైన సేవలను గుర్తించే లక్ష్యంతో ఏటా **జనవరి 15న భారత సైనిక దినోత్సవం (ఇండియన్ ఆర్మీ డే)గా** నిర్వహిస్తారు. దేశం కోసం సైనికులు చేసిన త్యాగాలను గౌరవించడంతోపాటు వారికి నివాళి అర్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.


స్వాతంత్ర్యానికి ముందు భారత సైన్యం

☛ దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు భారత సైన్యం బ్రిటిష్ వారి అధీనంలోనే ఉండేది. ఇందులో స్థానికులతోపాటు ఆంగ్లేయ అధికారులు ఉండేవారు. ఈస్ట్ ఇండియా కంపెనీ 1776లో కోల్‌కతాలో మొదటిసారి ఒక సైనిక విభాగాన్ని ఏర్పాటు చేసింది.

☛ 1895, ఏప్రిల్ 1న బెంగాల్, బొంబాయి, మద్రాస్ ప్రెసిడెన్సీ సైన్యాలను విలీనం చేసి భారత సైన్యాన్ని ఏర్పాటు చేశారు.

☛ 1947లో దేశానికి స్వాతంత్ర్యంతోపాటు భారత్ నుంచి పాకిస్థాన్ విడిపోయి ప్రత్యేక దేశంగా అవతరించింది. రెండు దేశాల మధ్య బలగాల విభజనను పర్యవేక్షించేందుకు బ్రిటిష్ కమాండర్ ఇన్ చీఫ్ సహా ఇతర అధికారులు కమాండ్‌లో కొనసాగారు.

☛ చివరి బ్రిటిష్ కమాండర్ జనరల్ సర్ ఫ్రాన్సిస్ బుచర్ నుంచి 1949లో భారతదేశానికి చెందిన ఎం.కరియప్ప భారతీయ సైనిక కమాండ్ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.



భారత సైన్యంలోని ప్రధాన విభాగాలు, ఈ రోజును జరుపుకోవడానికి కారణమైన చారిత్రక నేపథ్యం, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Nurse Posts

The Bhabha Atomic Research Centre (BARC), under the Department of Atomic Energy, Mumbai, is conducting interviews for the recruitment of Nurse posts on an ad-hoc basis. The total no. of posts is 12. Eligible candidates can appear for the interview on 27 January 2026.

Graduate and Diploma Apprentice Posts

Hindustan Organic Chemicals Limited (HOCL), Kerala, is inviting applications to recruit Apprentice Trainee posts. The total number of posts is 20. Eligible candidates can apply online before 20 January 2026.

JRF Posts

The Indian Institute of Technology Roorkee (IIT Roorkee) is inviting applications for Junior Research Fellow positions on a contractual basis. The last date for submission of online applications is 20 January 2026.

Did You Apply..?

Today (January 15) is the last date for the following Jobs

☛ 549 Constable (General Duty), Sports Quota posts in BSF. ***Eligibility:*** Matriculation (10th class).

☛ 128 Senior Resident posts in AIIMS Bhopal. ***Eligibility:*** MD/MS/DNB.

☛ 125 Industrial Trainee posts in CIL. Eligibility: CA or CMA.

☛ 51 Trainee Engineer posts in BEL. ***Eligibility:*** BE/B.Tech/B.Sc Engineering.

For more information and other notifications - scan QR code

Situation Reaction Test

Directions: (Qs. 1 - 9): *To each of the following questions, five probable answers have been given. Select the most appropriate alternative as the answer.*

1. While travelling in your car, certain persons stop you on the way asking you to take an injured child to the hospital. You would:
A) Ask them to leave your way and then drive away.
B) Ask them to first call the police.
C) Immediately take the child to hospital.
D) Get out of the car and ask some other person to help them.
E) Ask them to call to ambulance

2. While playing cricket in the school, suddenly when you hit the ball, it strikes your classmate on the forehead and blood starts oozing out. You would:
A) Run away from the field.
B) Start fighting with the boy why he came in the way.
C) Blame somebody else for the accident.
D) Take the boy to the first aid room.
E) Advice him to go to hospital.

3. You are visiting a place for the first time and are travelling in a bus. Suddenly you realize that the driver is taking the bus to a lonely place with no right intentions. You would:
A) With the help of some other passengers, try to baffle the driver and take over the bus.
B) Sit and wait to face the repercussions.
C) Jump out of the running bus.
D) Console the worried passengers.
E) Request the bus driver to take in right way

4. You have gone to enjoy a Diwali Mela organized by a club. Suddenly you come across a lost child crying desperately. You would:
A) Neglect and walk away.
B) Ask the child to find his parents.
C) Ask him to stop crying and wait patiently for his parents.
D) Contact with the club authorities and make an announcement for the parents.
E) Ask the boy about his parent mobile phone number

5. You have made some silly mistakes which have been pointed out to you. You will:
A) Laugh it away B) Get angry
C) Feel miserable D) Feel thankful
E) None of these

Bank Exams
Reasoning

6. You are moving across the road on a scooter when you observe that two boys on a bike snatch a lady's gold chain and ride away. You would:
A) Console the woman
B) Chase the boys to catch hold of them
C) Inform the police about the matter
D) Stand and see what happens next
E) Advice woman to call the police

7. You find a lady's purse dropped on the road and on picking it up, find a thousand rupees inside. You would :
A) Take the purse away.
B) Take out the money and leave the purse there.
C) Give the amount in orphan's home.
D) Stand there and wait for the owner.
E) Deposit it at the nearest police station.

8. On reaching the railway station, you find that the train you wanted to catch is just to start and there is hardly any time for purchasing the ticket. The best thing for you is to:
A) Rush to the train rather than miss it and inform the T.T.I. at the next stoppage about your inability to purchase the ticket.
B) Rush to the train and perform your journey quietly.
C) First purchase the ticket and then catch the train if it is there.
D) Miss the train rather than take the risk of boarding the moving train.
E) None of these.

9. You are returning home from school. On the way, you find a sealed envelope in a street, fully addressed with unused stamps on it. You would:
A) Leave it there as it was and walk away.
B) Remove the stamps and destroy the envelope.
C) Open the envelope, find out who has dropped it by mistake, and send it to him if possible.
D) Post it at the nearest letter box.
E) None of these.

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

అగ్నివీర్ వాయు

భారత వాయుసేన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు ప్రకటన వెలువరించింది.

● అగ్నివీర్ వాయు(01/2027) బ్యాచ్

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2) లేదా ఇతర గ్రూపులతో ఇంటర్మీడియట్ లేదా ఇంటర్ ఒకేషనల్. లేదా మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా(మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)

వయసు: 01-01-2006 - 01-07-2009 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: కనీసం 152 సెం.మీ. అవసరం.

ఎంపిక: ఫేజ్-1 (ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2 (ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలనలతో. **పరీక్ష ఫీజు:** రూ.550+ జీఎస్టీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు తేదీ: 01-02-2026.

వెబ్‌సైట్: https://iafrecruitment.edcil.co.in/agniveervayu/index.html

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: మూడ్‌స్కేల్

నైపుణ్యాలు: కేన్వా, డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, లింక్డ్‌ఇన్ యాడ్స్

స్టైపెండ్: రూ.2,500-3,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/5t3yt5bw

వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: నాన్‌వెజ్ సిటీ

నైపుణ్యాలు: బూట్‌స్ట్రాప్, జావాస్క్రిప్ట్, జేక్వెరీ, పీహెచ్‌పీ **స్టైపెండ్:** రూ.8,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/2kfpm8nk

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఓపెరెంట్ ఫార్మసీ ఫెడరేషన్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, అడోబ్ ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్

స్టైపెండ్: రూ.5,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/5ctk88bw

కమ్యూనిటీ & బ్రాండ్ మార్కెటింగ్

సంస్థ: ఒల్మో ట్రెండ్స్ ప్రై.లి.

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్

స్టైపెండ్: రూ.3,000-7,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/mryns6b4

మొబైల్ డెవలపర్

సంస్థ: ఈసీఎస్

నైపుణ్యాలు: అమెజాన్ ఈసీ2, ఏపీఐస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, మెయిల్‌చింప్ ఓపెన్ కామర్స్, మొబైల్ అప్లికేషన్, డెవలప్‌మెంట్, రియాక్ట్ నేటివ్, రిడక్స్, రెస్ట్ ఏపీఐ

స్టైపెండ్: రూ.5,000-10,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/2zfynahk

మీడియా & పబ్లిక్ రిలేషన్స్

సంస్థ: పీఆర్ వేస్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-పవర్‌పాయింట్

స్టైపెండ్: రూ.5,000-7,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/53sabjes

హైదరాబాద్‌లో

క్రియేటివ్ డిజైన్

సంస్థ: ఆస్క్ ఫస్ట్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ప్రీమియర్ ప్రో, జనరేటివ్ ఏఐ టూల్స్, సోషల్ మీడియా మార్కెటింగ్

స్టైపెండ్: రూ.10,000-15,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 2

☛ https://tinyurl.com/2en3adyj

గో-టు-మార్కెట్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: సినాక్సిస్ ఇన్ఫర్మాటిక్ టెక్ సొల్యూషన్స్

నైపుణ్యాలు: బీటుబీ సేల్స్, బ్రాండింగ్, ఛానెల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, మార్కెట్ రిసెర్చ్, రిటెయిల్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ

స్టైపెండ్: రూ.15,000-18,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/368a4w6x

కస్టమర్ సర్వీస్/ సపోర్ట్

సంస్థ: డ్యాప్‌లాజిక్స్ సాఫ్ట్‌వేర్ ప్రై.లి

నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్

స్టైపెండ్: రూ.10,000-12,000

దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6

☛ https://tinyurl.com/3f3zkacj

కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం అనగానే ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీలు, సమాజంలో గౌరవం, తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవడం మనసుకు స్ఫురిస్తాయి. అయితే విద్యార్థి దశ నుంచి కార్పొరేట్ కార్యాలయాల్లో అడుగుపెట్టిన యువ ఉద్యోగుల్లో ఎక్కువ మంది మేనేజ్‌మెంట్ అంచనాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. కనిపించని కార్పొరేట్ పాలిటిక్స్‌ను ఎదుర్కోలేక పోతున్నారు. విమర్శలను వ్యక్తిగతంగా తీసుకుని, ఆత్మ గౌరవానికి భంగం కలిగిందని నిరాశకు లోనవుతున్నారు. ఈ పరిణామాలన్నీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.



కెరియర్ ఉన్నతికి తీరైన మనోవైఖరి!

కార్పొరేట్ ఉద్యోగాల్లో విజయం సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోవడంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు మనోవైఖరి (ఆటిట్యూడ్) కీలక పాత్ర పోషిస్తుంది. బృంద సమావేశాల్లో టీమ్ లీడర్ విమర్శించినా, సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడినట్లు అనిపించినా కలత చెందకూడదు. వాటిని తుది తీర్పుగా కాకుండా, మెరుగుపడటానికి ఇచ్చే విలువైన సూచనలుగా తీసుకునే మనోవైఖరిని అలవరచుకోవాలి. ఇలాంటి దృక్పథం ఉన్న ఉద్యోగులే దీర్ఘ కాలంలో విజయం సాధించగలరు.

✦ అకడమిక్ మార్కులు, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ లాంటి అదనపు నైపుణ్యాలు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాన్ని పొందగలిగేలా చేస్తాయి. కానీ ఆ కొలువులో విజయం సాధించి, నాయకత్వ స్థాయికి చేరుకోవడంలో మనోవైఖరి కీలక పాత్ర పోషిస్తుంది. సరైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవడం, సవాళ్లను అవకాశాలుగా మలచుకోవడం పనితీరులో భాగం కావాలి.

ప్రతికూల స్పందన

ఒక తయారీ సంస్థ నిర్వహించే ప్రాంగణ నియామకాలకు రజిత పీజీ విద్యార్హతతో హాజరైంది. స్పష్టమైన సమాధానాలతో ఆకట్టుకుని సెలక్షన్ జాబితాలో స్థానం పొందింది. ఇంటర్వ్యూలో భాగంగా చదివిన కాలేజీ, ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థల్లో గమనించిన, నేర్చుకున్న అంశాలపై అభిప్రాయాన్ని అడిగారు. దీనికి సమాధానంగా కాలేజీలో ప్రొఫెసర్లు సబ్జెక్టు సరిగా బోధించలేదని, కష్టపడి స్వయంగా నేర్చుకున్నానని చెప్పింది. ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థలో గ్రూప్ రాజకీయాలున్నాయంది. ఈ వ్యాఖ్యలతో ఇంటర్వ్యూ ప్యానల్‌కు రజిత అభ్యర్థిత్వంపై అనుమానాలు కలిగాయి. ఫలితంగా అప్పటివరకూ అనుకూలంగా ఉన్న నిర్ణయం ఒక్కసారిగా మారిపోయింది.

గతంలో పనిచేసిన సంస్థలు, అధికారులపై ప్రతికూలంగా స్పందించకూడదు. రజితలా మాట్లాడితే తమ యాజమాన్యంపైనా అదే ధోరణి భవిష్యత్తులో కొనసాగించవచ్చన్న ఆందోళన ఇంటర్వ్యూ ప్యానెల్‌కు కలుగుతుంది. ఇలాంటి మనోవైఖరి ఉన్నవారిని సంస్థ వాతావరణానికి సరిపోరని భావిస్తారు. వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తారు.

✦ ఉద్యోగ నియామకాల్లో ధ్రువపత్రాలు, నైపుణ్యాలు పరిశీలించి ఎంపిక చేసుకున్నప్పటికీ, సంస్థలో ఆ ఉద్యోగి ఎదిగే సామర్థ్యాన్ని నిర్ధారించేది అభ్యర్థి మనోవైఖరే.

సానుకూల మనోవైఖరి

ఉద్యోగంలో తొలిసారి చేరిన యువతరానికి సాంకేతిక నైపుణ్యాలు, ఆశావహ దృక్పథంతో పాటు సమస్యా పరిష్కార మార్గాలను సూచించే మనోవైఖరి ఉండాలని యాజమాన్యాలు భావిస్తాయి. పేరున్న బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదివిన అనిల్, సునీతలు వినియోగ వస్తువుల మార్కెటింగ్ సంస్థలో సేల్స్ ట్రెయినీలుగా చేరారు. మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సమాచారం సేకరించి, త్రైమాసిక విక్రయ ప్రణాళిక తయారుచేయడం వీరి ప్రధాన బాధ్యత. కాలపరిమితి దగ్గర పడుతున్నా టీమ్ లీడర్‌కు అవసరమైన సమాచారం పూర్తిగా అందలేదు. సమీక్షా సమావేశంలో సమయానికి సమాచారం ఇవ్వలేదని మార్కెటింగ్ టీమ్‌ను అనిల్ నిందించాడు. అయితే సునీత మాత్రం భిన్నమైన దృక్పథం ప్రదర్శించింది. సమాచారం పూర్తిగా లేనప్పటికీ, స్వయంగా మార్కెటింగ్ టీమ్‌ను సంప్రదించి వీలైనంత ఎక్కువ సమాచారం సేకరించి ఉండాల్సిందని, ఈ విషయంలో సీనియర్స్ మార్గదర్శకత్వం తీసుకోకుండా తప్పు చేశానని సంజాయిషీ ఇచ్చింది.

అనిల్ తన నిర్లక్ష్య వైఖరి వల్ల క్లయింట్‌కు నిర్దేశిత కాల పరిమితిలో అవసరమైన సమాచారం ఇవ్వలేకపోయాడు. దీంతో యాజమాన్య ప్రతిష్ఠకు భంగం కలిగింది. ఫలితంగా ఉద్యోగుల వార్షిక పనితీరు మదింపులో అతడికి తక్కువ రేటింగ్ ఇచ్చి, టీమ్ నుంచి తప్పించారు.

✦ ఉన్నత లక్ష్యాలు, ఆశయాలతో కార్పొరేట్ సంస్థల్లో అడుగుపెట్టే యువ ఉద్యోగార్థులు సరైన మనోవైఖరి (ఆటిట్యూడ్) లేకపోవడంతో కెరియర్‌లో విఫలమవుతుంటారు.

పరిధి దాటి బాధ్యత

కార్పొరేట్ సంస్థల్లో కొన్ని సార్లు ఎవరూ ఏ పనినీ ప్రత్యేకంగా చెప్పకపోవచ్చు. అయినప్పటికీ ఆ బాధ్యత తీసుకోవాలి. సంస్థ ప్రయోజనాలు కాపాడాలి. సమస్యకు సరైన పరిష్కార మార్గాలు చూపగల లక్షణాలు ఉద్యోగి మనోవైఖరిని ప్రతిబింబిస్తాయి. ఇవి అభ్యర్థి రెజ్యూమెలో స్పష్టంగా కనిపించవు, కానీ ఇవే ఉద్యోగి కెరియర్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

రాజేష్, రఘురాం ఇద్దరూ ఒక తయారీ రంగ సంస్థలో ట్రెయినీ అధికారులుగా చేరారు. రాజేష్ ఆఫీస్ సమయాలను కచ్చితంగా పాటించేవాడు. జాబ్ డిస్క్రిప్షన్‌లో పేర్కొన్న పనులు తేడా లేకుండా పూర్తిచేసేవాడు. ఎక్కడా ప్రతికూల విమర్శలకు తావిచ్చేవాడు కాదు. దీంతో అతడు పరిమితులకు లోబడి పనిచేసే ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు. అంతకు మించి పనిచేయడు, అదనంగా ఎలాంటి బాధ్యతలూ తీసుకోడు.

రఘురాం మాత్రం అవసరం ఉన్నప్పుడు ఆఫీస్ సమయాలు దాటిన తర్వాతా పని చేసేవాడు. పని పూర్తయిన తర్వాత టీమ్ లీడర్‌ను సంప్రదించి, అదనంగా చేయగల పనులు ఏమైనా ఉన్నాయా? అని అడిగేవాడు. బృంద సమస్యలు తెలుసుకుని, సాధ్యమైన పరిష్కార మార్గాలను చూపేవాడు. సమస్య ఎవరిదైనప్పటికీ ఇది సంస్థ సమస్య అన్న మనోవైఖరితో పనిచేసేవాడు. దీంతో కాలక్రమంలో అందరి అభిమానాన్నీ, మేనేజ్‌మెంట్ నమ్మకాన్నీ పొంది ఉన్నత స్థాయికి ఎదిగాడు.



– దొరైరాజ్, సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

పదో తరగతి చదువుతున్నాను. సినీ పరిశ్రమలో రాణించాలనుంది. ఇందుకోసం ఏ కోర్సులు చదవాలి? - హరీష్

రంగుల ప్రపంచంలో రాణించేదెలా?

■ పదో తరగతి చదువుతున్నప్పుడే భవిష్యత్తు కెరియర్ గురించి ఆలోచించడం అభినందనీయం. కానీ 15 ఏళ్ల వయస్సులో జీవితం గురించి అవగాహన ఎక్కువగా లేకపోవడం, రంగుల ప్రపంచాన్ని చూసి దాన్నే నిజం అనుకోవడం, ఆ భావనలో ఉండి చదువును అశ్రద్ధ చేయడం, ఆ తర్వాత తప్పు తెలుసుకొని బాధపడటం జరుగుతూ ఉంటుంది. ముందుగా సినిమా రంగం అంటే నిజమైన ఇష్టమా? తాత్కాలిక ఆకర్షణా? అందులో జీవితకాలం కొనసాగగలనన్న నమ్మకం ఉందా? వీటిపై స్పష్టత అవసరం.

▲ సినీ ప్రపంచంలో విపరీతమైన పోటీ ఉంటుంది. కొన్ని వేలమంది ప్రయత్నిస్తే, పదుల సంఖ్యలో మాత్రమే విజయం సాధిస్తారు. అది కూడా శాశ్వతం అని చెప్పలేం. ఈ రంగంలో నిలదొక్కుకోవడానికి నిత్యం కష్టపడుతూనే ఉండాలి. సినిమా రంగం అంటే కేవలం వెలుగులు, కెమెరాలు, నటులకే పరిమితం కాదు. ఇది కథ, భావం, సాంకేతికత, కళాత్మకత, క్రమశిక్షణ అన్నింటి సమ్మేళనం. అందువల్ల ఈ రంగంలోకి రావాలనుకునే వారు ముందుగా ఆసక్తిని గుర్తించి, దానికి అనుగుణంగా విద్యా ప్రయాణాన్ని రూపొందించుకోవాలి.

“ నటనలో రాణించాలనుకునే వారికి ప్రత్యేక శిక్షణ అవసరం. డైలాగులు చెబితేనే సరిపోదు. భావోద్వేగాలను సహజంగా వ్యక్తపరచాలి. ఇందుకోసం నట శిక్షణ, రంగస్థల అనుభవాలు చాలా ఉపయోగపడతాయి. నృత్యం, శరీర భాష, స్వర నియంత్రణ లాంటి అంశాలు నటుడి వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి. చిన్న చిన్న షార్ట్ ఫిల్మ్స్, నాటకాల్లో పాల్గొనడం ద్వారా కెమెరా ముందు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. థియేటర్ ఆర్ట్స్‌లో డిగ్రీ/ పీజీ/ డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సులు చేయాలి. దీంతో నటన, సినిమా రంగానికి సంబంధించిన వివిధ సాంకేతిక విభాగాల గురించి అవగాహన ఏర్పడుతుంది.



▲ పదో తరగతి తర్వాత ఏ కోర్సు చదవాలనే విషయంలో సినీ రంగానికి ప్రత్యేకమైన నియమం లేదు. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూప్ చదివినా ఇబ్బంది లేదు. చదువుతున్న విద్యతో పాటు సినిమాకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ముఖ్యం. చదువు ఆలోచనా శక్తిని, క్రమశిక్షణను, భవిష్యత్తుకు ఒక భద్రతను ఇస్తుంది. అందువల్ల దాన్ని నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించడం అవసరం. ఒకవేళ, మీరు అనుకున్నట్లుగా సినీరంగంలో రాణించలేకపోతే, ప్రత్యామ్నాయ కెరియర్‌కు సంబంధించిన కోర్సుల గురించి ఆలోచించాలి. ఇటీవల కాలంలో చాలామంది సినీ దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణులు, గాయకులు ఇంజినీరింగ్ లేదా పీజీ డిగ్రీ పూర్తయిన తర్వాతే సినీ పరిశ్రమలోకి ప్రవేశిస్తున్నారు.

▲ దర్శకత్వం లేదా కథా రచనపై ఆసక్తి ఉన్నవారికి చదువు మరింత ముఖ్యమైంది. మంచి దర్శకుడు కావాలంటే సమాజాన్ని గమనించే దృష్టి, కథను నిర్మించే నైపుణ్యం, పాత్రలను అర్థం చేసుకునే శక్తి ఉండాలి. కథలు చదవడం, పుస్తకాలు పరిశీలించడం, సినిమాలను విశ్లేషించడం ద్వారా ఈ లక్షణాలు పెరుగుతాయి. దర్శకత్వ శిక్షణ ద్వారా సినిమా నిర్మాణ ప్రక్రియ మొత్తం ఎలా సాగుతుందో అవగాహన కలుగుతుంది. సహాయక దర్శకుడిగా పని చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది.

▲ సినీ పరిశ్రమలో సాంకేతిక విభాగాలకూ విస్తృత అవకాశాలున్నాయి. కెమెరా పనితనం, ఎడిటింగ్, శబ్ద రూపకల్పన, విజువల్ ఎఫెక్ట్స్ లాంటి రంగాల్లో నిపుణుల అవసరం ఎప్పటికీ ఉంటుంది. ఈ రంగాల్లో డిగ్రీ/ డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సులు చేయడం ద్వారా తెర వెనుక కీలక పాత్ర పోషించవచ్చు. సాంకేతిక నైపుణ్యం ఎక్కువగా ఉన్నవారు సినిమా విజయంలో ముఖ్యమైన భాగస్వాములవుతారు.

▲ రంగుల ప్రపంచంలో రాణించడానికి ఒకే కోర్సు లేదా ఒకే మార్గం లేదు. మీ ఆసక్తిని గుర్తించి, చదువుతో పాటు సరైన శిక్షణ తీసుకుంటూ, నిరంతర సాధనతో ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుంది. ఓర్పు, కష్టపడి పనిచేసే తత్వం, నేర్చుకోవాలనే తపన ఉంటే సినిమా రంగం మీకు అవకాశాలను ఇస్తుంది. ఇప్పటి నుంచే మీ కలను నమ్మి, దాని కోసం జాగ్రత్తగా అడుగులు వేయండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ఎక్స్‌పర్ట్/స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఎక్స్‌పర్ట్/ స్పెషలిస్ట్: 10 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 31.12.2025 నాటికి 62 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: విద్యార్హతలు/ ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2026.

వెబ్‌సైట్: https://goashipyard.in/

మల్టీ టాస్కింగ్ స్టాఫ్

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీడీఆర్ఐ), లఖ్‌నవూ.. పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● మల్టీ టాస్కింగ్‌స్టాఫ్: 04 ● హిందీ ఆఫీసర్: 01

అర్హతలు: హిందీ ఆఫీసర్‌కు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు మెట్రిక్యులేషన్/ఐటీఐ, ఇంటర్మీడియట్‌తోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతనం: నెలకు హిందీ ఆఫీసర్‌కు రూ.97,452; మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.35,393. **వయసు:** హిందీ ఆఫీసర్‌కు 35 ఏళ్లు; మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 25 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

ఇంటర్వ్యూ తేదీ: 16.02.2026. **వెబ్‌సైట్:** https://cdri.res.in/

సీనియర్ రెసిడెంట్లు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ), గువాహటి ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● సీనియర్ రెసిడెంట్: 49 పోస్టులు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ)తో పాటు పని అనుభవం ఉండాలి. **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ. **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్లలోపు ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.67,000.- 1,39,462.

దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా. deanbeltolaguwahati@gmail.com కు పంపాలి.

ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 20. **వేదిక:** డీన్ ఛాంబర్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, బెల్టోలా, గువాహటి -781022.

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

అప్రెంటిస్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, కొచ్చి.. ఒప్పంద ప్రాతిపదికన అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ (డిప్లొమా): 03

● గ్రాడ్యుయేట్(నాన్- ఇంజినీరింగ్) అప్రెంటిస్‌షిప్: 11

శిక్షణ వ్యవధి: ఏడాది.

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఓషనోగ్రఫీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీలతో పాటు పని అనుభవం ఉండాలి.

స్టైపెండ్: నెలకు డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8,000. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9,000.

వయసు: డిప్లొమా టెక్నీషియన్లకు 18 నుంచి 24 ఏళ్లు; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 21 నుంచి 26 ఏళ్లు మించకూడదు.

వివరాల నమోదు: ఎన్ఏటీ పోర్టల్‌లో.

ఇంటర్వ్యూ తేదీ: 22-01-2026.


వేదిక: సీఎస్ఐఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, రీజనల్ సెంటర్, డా.సలీమ్ ఆలీ రోడ్, హైకోర్టు జంక్షన్, కొచ్చి, కేరళ.

వెబ్‌సైట్: https://www.nio.res.in/vacancies/temporary

పరీక్షలు దగ్గర పడుతున్నాయి. దాదాపు అందరూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కానీ కొంతమందే నేర్చుకున్నవి గుర్తుంచుకుంటారు. మిగిలినవారు వెంటనే మర్చిపోతుంటారు. దీంతో కొంత ఒత్తిడికీ లోనవుతుంటారు. నేర్చుకున్నది మెదడులో నిక్షిప్తం కావడానికి కొన్ని మెలకువలు పాటించాలి. ఇలా చేస్తే పరీక్షల్లో విజయం సాధించడం సులువే.

చదివింది గుర్తుండాలంటే..

కొంత మంది ఎప్పుడూ చదువుతూనే ఉంటారు. కానీ ఫలితాలు మాత్రం మరో రకంగా వస్తాయి. మరి కొందరు నిర్ణీత వేళల్లోనే పుస్తక పఠనం కొనసాగించినప్పటికీ వీరిలో ఎక్కువ మంది అధిక మార్కులు పొందగలుగుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతోందంటే చదవడం అంటే పోరాటంగా భావించేవాళ్లే ఎక్కువ మంది. ఇష్టంతో కాకుండా, తప్పదు కాబట్టి పుస్తకం తీస్తారు. ఆసక్తి లోపించడం వల్ల చదివింది గుర్తుండటం లేదు. అందుకే ఎంత సమయం చదువుకు కేటాయించారనే దాని కంటే అధ్యయనం ఎంత నాణ్యతతో జరిగిందనేదే ప్రధానం. అలాగే ఏకధాటిగా కాకుండా స్వల్ప విరామాలతో మరింత మేలు జరుగుతుంది.



- చదివింది గుర్తుండాలంటే అందుకు అనువైన పరిసరాలను ఎంచుకోవాలి. దీంతో ఎలాంటి అవాంతరాలూ లేకుండా ఏకాగ్రతతో అధ్యయనం కొనసాగుతుంది.
- నిద్ర నుంచి లేవగానే పుస్తకాలు కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలి. దీంతో చదవాలనే ఆసక్తి కలుగుతుంది. మనసు ఇతర అంశాలవైపు మళ్లకుండా ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది.
- సాధ్యమైనంత వరకు నిశ్శబ్ద ప్రదేశాన్నే ఎంచుకోవాలి. శబ్దాలు మెదడుని పరధ్యానంలోకి నెట్టేస్తాయి. కావాలంటే తక్కువ ధ్వనితో శాస్త్రీయ సంగీతం లాంటివి వినిపించేలా చూసుకోవచ్చు.
- చదవడానికి ఉపయోగించే టేబుల్, కుర్చీ సౌకర్యవంతంగా ఉండాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. వంగి కూర్చోవడం వల్ల త్వరగా అలసట వస్తుంది. చదవాలనే ఆసక్తీ తగ్గుతుంది. చదువుకునే టేబుల్‌పై పుస్తకాలు, అవసరమైన వస్తువులు తప్ప మరేవీ ఉండకూడదు.
- ఎంత చదివినా విశ్రాంతి సమయంలో ఫోన్ ఉపయోగించడం వల్ల నేర్చుకున్నది మర్చిపోయే ఇబ్బంది ఉంది. అందువల్ల అతి తక్కువ సమయాన్నే మొబైల్‌కి కేటాయించాలి.
- నేర్చుకున్నవి గుర్తుండాలంటే తగినంత నిద్ర అవసరం. ఇది తక్కువైతే ఏకాగ్రత కుదరదు, జ్ఞాపకశక్తి బలహీనపడుతుంది. తర్వాతి రోజు చదవాలంటే నిస్తేజంగా అనిపిస్తుంది. అందువల్ల నిద్రను నిర్లక్ష్యం చేయకూడదు.
- మానసిక ప్రశాంతతా ఎంతో ముఖ్యం. ఒత్తిడి, ఆందోళన కారణంగా మెదడు పనితీరు నెమ్మదిస్తుంది. దీంతో విశ్లేషణ, నిర్ణయాలు తీసుకోవడం, గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడతారు. దీర్ఘశ్వాస, ధ్యానం లాంటి వాటితో మెదడుని ప్రశాంతంగా ఉంచుకోవాలి.
- నేర్చుకోవడంలో ఆసక్తి పాత్ర అత్యంత ముఖ్యమైంది. అలాగే సానుకూల దృక్పథమూ అవసరమే. 'నేను దీన్ని నేర్చుకోగలను' అనే నమ్మకం ఉండాలి. ఈ రెండిటి ద్వారా మెదడు కొత్త సమాచారాన్ని సులభంగా స్వీకరిస్తుంది.
- నేర్చుకునే క్రమంలో ఎన్నో సందేహాలు వస్తాయి. వాటిని నివృత్తి చేసుకోవాలి. ఇతరులతో చర్చించాలి. దీంతో ఆ అంశాలు బాగా గుర్తుంటాయి.
- ఇంతకుముందు నేర్చుకున్నదాన్ని ఇప్పుడు నేర్చుకుంటున్న దాన్ని మెదడు అనుసంధానించుకుంటుంది. కాబట్టి ముందు చదివిన వాటిని పునశ్చరణ చేసుకోవడం ముఖ్యం.
- నేర్చుకునే క్రమంలో కష్టమైన అంశాలతో ప్రారంభించవద్దు. ముందు ప్రాథమికాంశాలు చదవడం ద్వారా మెదడు క్రమంగా కొత్త సమాచారాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉంటుంది.
- రోజూ తీసుకునే ఆహారమూ మెదడుపై ప్రభావం చూపుతుంది. అందువల్ల శక్తిని అందించే ఆరోగ్యకరమైన ఆహారాన్నే తీసుకోవాలి. జంక్‌ఫుడ్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండాలి.

చివరిగా.. చదవడాన్ని భారంగా కాకుండా ఆసక్తికరమైన ప్రయాణంగా మలుచుకోవాలి. సానుకూల దృక్పథం, ఆసక్తులతో ఏకాగ్రత కుదురుతుంది. ఫలితంగా నేర్చుకున్నది మెదడులో నిక్షిప్తమవుతుంది. దాంతో పరీక్షలు ఎలాంటి ఒత్తిడీ, ఇబ్బందీ లేకుండా రాయగలుగుతారు.

– ఊటుకూరి నందిని